

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 279

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

శనివారం 22-6-2024



ప్రపంచ శ్రేయస్సుకు యోగా

జమ్మూకశ్మీర్ ఆర్థిక వ్యవస్థను యోగా మార్చగలదన్న ప్రధాని మోదీ -6లో



జైల్లోనే అరవింద్ కేజ్రీవాల్

రెగ్యులర్ బెయిల్ ఉత్తర్వులపై మధ్యంతర స్టే ఇచ్చిన ఢిల్లీ హైకోర్టు -6లో

కొలువుదీరిన కొత్త సభ

సీఎం సహా మంత్రులు, ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

తొలి రోజే ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌ను అగౌరవపర్చిన ప్రభుత్వం

- సీఎం తర్వాత విపక్ష నేత ప్రమాణ స్వీకారం చేయడం సభ సంప్రదాయం
- ఆ సంప్రదాయాన్ని కాదని మంత్రుల తర్వాత విపక్ష నేత జగన్‌కు అవకాశం
- 40 శాతం ఓట్లతో అతి బలమైన పార్టీ వైఎస్సార్‌సీపీ అని కూడా చూడని బాబు సర్కారు
- 2019లో చంద్రబాబుకు సముచిత గౌరవం కల్పించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం..
- అందుకు విరుద్ధంగా వ్యవహరించిన బాబు సర్కారు
- తొలి రోజు 171 మంది సభ్యుల ప్రమాణ స్వీకారం
- వ్యక్తిగత కారణాలతో హాజరుకాని ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలు
- అసెంబ్లీని నేటికి వాయిదా వేసిన ప్రొటెం స్పీకర్





ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కొత్త శాసన సభ కొలువుదీరింది. 16వ శాసన సభ సమావేశాలు శుక్రవారం ఉదయం 9:46 గంటలకు ప్రారంభం అయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ సమావేశాల్లో తొలి రోజు శాసన సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. శనివారం అసెంబ్లీ స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. తొలిరోజే ప్రభుత్వం సభా సంప్రదాయాలను తుంగలో తొక్కింది. ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అగౌరవపర్చింది. వాస్తవంగా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ప్రతిపక్ష నేతకు అవకాశం కల్పించాలి. ఆ తర్వాత ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేయాలి. అయితే, ప్రతిపక్ష నేతకు సముచిత గౌరవం ఇవ్వకుండా మంత్రులందరూ ప్రమాణం చేసిన తర్వాత చివర్లో ప్రమాణం చేయించింది. తద్వారా మున్ముందు ప్రతిపక్షం పట్ల తన వైఖరి ఏ విధంగా ఉండబోతోందో మొదటిరోజే స్పష్టంగా తెలియజెప్పింది. సీట్ల సంఖ్య ఎలా ఉన్నా 40 శాతం ఓట్లతో అత్యంత బలమైన పార్టీగా వైఎస్సార్‌సీపీ ఉంది. ఆ పార్టీకి ఉన్న ప్రజా బలాన్ని కూడా ప్రభుత్వం విస్మరించింది. 2019లో కొత్త అసెంబ్లీ కొలువుదీరినప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పటి విపక్ష నేత

మిగతా 2వ పేజీలో ▶

శాసనసభ స్పీకర్‌గా

అయ్యన్నపాత్రుడు

ఏకగ్రీవంగా ఎన్నిక

నేడు అసెంబ్లీలో ప్రకటన



2లో

స్పెషలిస్ట్ వైద్యానికి మంగళం

- పీహెచ్‌సీల్లో స్పెషలిస్ట్ క్లినిక్‌లకు ఉద్వాసన
- గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం కోసం 152 మంది స్పెషలిస్ట్ వైద్యులను నియమించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం..
- వారిని తొలగిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు

2లో



చీరాలలో హత్యాచారం!

- బహిర్భూమికి వెళ్లిన యువతిపై లైంగిక దాడికి పాల్పడి హత్య
- మృతురాలి కుటుంబానికి హోంమంత్రి అనిత పరామర్శ
- రూ.పది లక్షలు పరిహారం ప్రకటించిన ప్రభుత్వం

- వివరాలు 5లో

క్లుప్తంగా...

నేడు పులివెందుల పర్యటనకు వైఎస్ జగన్

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఈ నెల 22న వైఎస్సార్ జిల్లా పులివెందుల పర్యటనకు వెళ్లనున్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు కడప ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గంలో పులివెందుల వెళతారు. 3 రోజుల పాటు పులివెందులలో జగన్ అందుబాటులో ఉంటారు.

ఉక్కు ఆస్తుల విక్రయాన్ని టీడీపీ, జనసేన వ్యతిరేకించాలి

సీఎంకు విశ్రాంత ఐఏఎస్ ఈఏఎస్ శర్మ లేఖ



సాక్షి, విశాఖపట్నం: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉక్కు ఆస్తుల విక్రయాన్ని టీడీపీ, జనసేన పార్టీ వ్యతిరేకించాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు శుక్రవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. కొత్త పార్లమెంట్ మొదలు కాకుండానే కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యలు వేగంగా చేపడుతుండటంపై ఉత్తరాంధ్ర ప్రజలు తీవ్ర ఆవేదన చెందుతున్నారన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని ప్రజలంతా ముక్త కంఠంతో ఖండిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం టీడీపీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో భాగస్వామి కాబట్టి కేంద్ర ప్రభుత్వ కుట్రను అడ్డుకుని, విశాఖ ఉక్కును నిలబెట్టేందుకు ప్రయత్నిస్తారని ఉత్తరాంధ్ర ప్రజలు ఆశించారనీ, కానీ కేంద్ర వైఖరిలో మార్పు లేకపోవడం బాధాకరమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు తన ఆధీనంలో ఉన్న ఉక్కు గనులను కేంద్రం కేటాయించి ఉంటే ప్లాంట్ ఎప్పుడో లాభాల బాట పట్టేదని, పెద్ద ఎత్తున స్టీల్ ఉత్పత్తులను సరఫరా చేసి ఉండగలిగేదన్నారు. కేవలం కేంద్ర ప్రభుత్వ చర్యల వల్లే స్టీల్‌ప్లాంట్ ఆర్థికంగా బలహీనపడిందని విమర్శించారు. పోరాటాల ద్వారా సాధించుకున్న స్టీల్ ప్లాంటును విక్రయిస్తే బీజేపీ ప్రభుత్వాన్ని కానీ, రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని కాని రాష్ట్ర ప్రజలు క్షమించరని, వారి తరపున తాను హెచ్చరిస్తున్నానని చంద్రబాబుకు రాసిన లేఖలో శర్మ స్పష్టం చేశారు.

స్టీల్‌ప్లాంట్ ఆస్తుల అమ్మకం ఆపాలి

సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్

దాబాగార్డెన్స్ (విశాఖ జిల్లా): విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఆస్తులు విక్రయించేందుకు మరోసారి కేంద్ర ప్రభుత్వం సిద్ధపడడం దారుణమని సిటూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రీయ ఇస్పాత్ నిగం (ఆర్‌ఐఎన్‌ఎల్) హైదరాబాద్, చెన్నై, ముంబై, బెంగళూర్‌లోని భవనాలు, గెస్ట్‌హౌస్‌లు, స్టాక్ యార్డ్‌లు తదితర విలువైన ఆస్తులను కేవలం రూ.475 కోట్లకే అమ్మడం దారుణమని పేర్కొన్నారు. విశాఖ ఉక్కుకు అవసరమైన రూ.5వేల కోట్ల ఆర్థిక వనరులను కేంద్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని స్టీల్‌ప్లాంట్ ఆస్తులు కాపాడాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ రక్షణకు గత 1,227 రోజులుగా కార్మిక వర్గం పోరాడుతున్నదని, ఎలాంటి త్యాగాలకైనా కార్మికులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

గవర్నర్ కార్యదర్శిగా హరి జవహర్ లాల్

ఆర్టీసీ ఎండీగా డీజీపీ ద్వారకా తిరుమలరావుకు అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర గవర్నర్ కార్యదర్శిగా హరి జవహర్‌లాల్‌ను ప్రభుత్వం నియమించింది. అలాగే డీజీపీ ద్వారకా తిరుమల రావుకు ఆర్టీసీ ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

తెలంగాణలోకి మావోయిస్టులు?

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టులు షెల్టర్ జోన్‌గా తిరిగి తెలంగాణ బాట పడుతున్నట్లు తెలుస్తోంది. ఆత్మరక్షణ కోసం మావోయిస్టు పార్టీలో కీలక నేతలు తమ వ్యూహాలను మార్చినట్లు సమాచారం. దళాలుగా సంచరించడం వల్ల పోలీసులు, కేంద్ర బలగాల దాడుల్లో తీవ్రంగా నష్టపోతున్నామనే అభిప్రాయం ఆ పార్టీ నాయకత్వంలో ఏర్పడినట్లు తెలుస్తోంది. దీంతో కీలక నాయకులను కాపాడుకోవడంతో పాటు పార్టీ ఉనికిని చాటుకునేందుకు వీలుగా తెలంగాణ వైపు ఫోకస్ పెట్టినట్లు సమాచారం. ఇదే సమయంలో ఇక్కడి నుంచి కొత్త రిక్రూట్‌మెంట్లపైనా దృష్టి సారించినట్లు తెలిసింది. గోదావరి తీరం వెంబడి ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలతో పాటు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో వివిధ కమిటీల పేర్లతో మావోయిస్టులు తమ ఉనికి చాటేందుకు గత నాలుగైదేళ్లుగా ప్రయత్నించారు. అయితే వీరి ప్రయత్నాలు ఎక్కువగా లేఖలు, పోస్టర్లు, బ్యానర్ల వంటి అంశాలకే పరిమితమయ్యాయి. దీంతో పార్టీ విస్తరణ విషయంలో సానుకూల ఫలితాలు పొందలేక వెనకడుగు వేశారు.

కొలువుదీరిన కొత్త సభ



ప్రమాణస్వీకారం అనంతరం నమస్కరిస్తున్న సీఎం చంద్రబాబు



సభలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్, పార్టీ ఎమ్మెల్యేలు

▶ మొదటి పేజీ తరువాయి

చంద్రబాబును సముచితంగా గౌరవించింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తర్వాత ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబుతో ప్రమాణం చేయించింది. ఆ తర్వాతే ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు, మిగిలిన సభ్యులు ప్రమాణం చేశారు. ప్రతిపక్ష నేతకు గౌరవం ఇవ్వాలనే సదుద్దేశంతో అప్పట్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చంద్రబాబు చేత సీఎం తర్వాత ప్రమాణం చేయించి గౌరవించింది. ఇప్పుడు ప్రతిపక్ష హోదా లేదనే సాకుతో టీడీపీ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మంత్రులందరి తర్వాత ప్రమాణం చేయించి సభా సంప్రదాయాలను కాలరాసింది. నిజానికి ప్రతిపక్ష హోదాకు 10 శాతం సభ్యులు ఉండాలనే నిబంధన ఏ చట్టంలోనూ లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. లోక్‌సభ తొలి స్పీకర్ మావలంకర్ సభలో ఇచ్చిన రూలింగ్‌ను కొన్ని రాజకీయ పార్టీలు అవసరార్థం వాడుకుంటున్నాయి. కానీ చాలా రాష్ట్రాలలో అధికారపార్టీలు మాజీ ముఖ్యమంత్రులకు, ప్రతిపక్ష నేతలకు సముచిత గౌరవం ఇస్తూ సత్సాంప్రదాయాలను పాటిస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వం అలాంటి వాటిని తుంగలో తొక్కింది. 2019లో టీడీపీకి వచ్చిన ఎమ్మెల్యే సీట్లు 23 మాత్రమే. అప్పట్లో ఆ పార్టీకి ఇప్పుడు వైఎస్సార్‌సీపీకి వచ్చిన ఓట్లకన్నా తక్కువ ఓట్లే వచ్చాయి. గెలిచిన 23 మంది సభ్యుల్లోనూ ఐదుగురు టీడీపీని వీడి బయటకు వెళ్లిపోయారు. మిగిలిన కొద్ది మందిలో ఇంకొందరు ఆ పార్టీని వీడేలా చేసి, చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా లేకుండా చేయాలనుకుంటే అప్పటి ప్రభుత్వానికి పెద్ద కష్టం కాదు. కానీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఆ ఆలోచన లేకపోవడంతో టీడీపీ సభ్యుల జోలికి వెళ్లకుండా చంద్రబాబుకు అప్పటి ప్రభుత్వం ప్రతిపక్ష నేత గౌరవం ఇచ్చింది. కానీ ఇప్పుడు అందుకు విరుద్ధంగా సభా సాంప్రదాయాలను పక్కనపెట్టి మాజీ ముఖ్యమంత్రిని అవమానపరిచేలా వ్యవహరించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అక్షరక్రమంలో సభ్యుల ప్రమాణం

శాసన సభ ప్రొటెం స్పీకర్‌గా నియమితులైన రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత సీఎం చంద్రబాబునాయుడు, తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఆ తర్వాత మంత్రులు అక్షర క్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం సభలోని సభ్యులందరికీ వైఎస్ జగన్ అభివాదం చేశారు. ఆ తర్వాత మహిళా ఎమ్మెల్యేలతో, అనంతరం అక్షర క్రమంలో మిగిలిన ఎమ్మెల్యేలందరితో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ సహా వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచిన 11 మంది, జనసేనకు చెందిన 21 మంది, బీజేపీకి చెందిన 8 మంది, టీడీపీకి చెందిన 131 మంది ఎమ్మెల్యేలు మొత్తం 171 మంది ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహా ఏడుగురు సభ్యులు ఆంగ్లంలో, మిగిలిన వారందరూ తెలుగులో ప్రమాణం చేశారు. టీడీపీకి చెందిన ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, వినుకొండ ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు, కాకినాడ ఎమ్మెల్యే వి. వెంకటేశ్వరరావు (కొండబాబు) వ్యక్తిగత కారణాలతో ప్రమాణస్వీకారం చేయలేదు. వీరితో ప్రొటెం స్పీకర్ శనివారం ప్రమాణం చేయిస్తారని తెలిసింది. తొలి రోజు శాసన సభ సమావేశం మొత్తం ప్రమాణ స్వీకారాలతోనే నడిచింది. అనంతరం సభను శనివారానికి ప్రొటెం స్పీకర్ వాయిదా వేశారు.

అసెంబ్లీ మెట్లకు నమస్కరించిన సీఎం చంద్రబాబు

శాసన సభ సమావేశాలకు వచ్చిన సీఎం చంద్రబాబు ముందుగా అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద మెట్లకు దండం పెట్టి లోనికి వెళ్లారు. ఆయన ముఖ్యమంత్రి ఛాంబర్‌లో అడుగు పెట్టే ముందు వేదపండితులు ఆశీర్వచనం అందించారు. అంతకు ముందు ఉండవల్లిలోని తన నివాసం అసెంబ్లీకి వస్తూ వెంకటపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన విష్ణుకుమార్ రాజు

తొలి రోజు శాసన సభ సమావేశాల్లో బీజేపీకి చెందిన విశాఖపట్నం నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మాజీ సీఎం వైఎస్ జగన్ సభలోకి ప్రవేశించిన వెంటనే ఆయన దగ్గరకు విష్ణుకుమార్ రాజు వెళ్లి నమస్కారం చేశారు. కొద్దిసేపు ఆయనతో సంభాషించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేల వద్ద చాలాసేపు కూర్చుని వారితో ముచ్చటించారు.

శాసన సభ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు

సాక్షి, అమరావతి: ఏపీ శాసన సభాపతి (స్పీకర్)గా టీడీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్పీకర్ పదవికి ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. స్పీకర్ ఎన్నికను శనివారం నిర్వహించాలని గవర్నర్ నిర్ణయించారని, నామినేషన్లను కార్యదర్శికి సమర్పించాలని ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి శుక్రవారం సభకు తెలిపారు. ఆ తర్వాత అయ్యన్నపాత్రుడి తరఫున డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, పయ్యావుల కేశవ్ అసెంబ్లీ కార్యదర్శి రామాచార్యులుకి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ పదవికి అయ్యన్న ఒక్కరి నామినేషనే దాఖలవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. శనివారం ఈ విషయాన్ని శాసన సభలో అధికారికంగా ప్రకటిస్తారు. ఆ తర్వాత స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు బాధ్యతలు స్వీకరిస్తారు. సీనియర్ ఎమ్మెల్యే అయిన అయ్యన్నపాత్రుడు అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

చట్ట విరుద్ధంగా వ్యవహరించొద్దు

- తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంపై ప్రభుత్వం, సీఆర్‌డీఏకు హైకోర్టు ఆదేశం

సాక్షి అమరావతి: గుంటూరు జిల్లా తాడేపల్లిలో నిర్మిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం కూల్చివేతకు ప్రభుత్వం చేస్తున్న కుట్రలపై ఆ పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. కూల్చివేత కు చేపట్టిన చర్యలను సవాల్ చేస్తూ లంచ్ మోషన్ రూపంలో అత్యవసరంగా దాఖలు చేసిన ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి విచారణ జరిపారు. పార్టీ తరపున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. వైఎస్సార్‌సీపీ తాడేపల్లిలో నిర్మిస్తున్న పార్టీ జిల్లా కార్యాలయ భవనాన్ని కూల్చివేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని నివేదించారు. చట్ట నిబంధనలను అనుసరించడం లేదన్నారు. సీఆర్‌డీఏ చట్ట నిబంధనల ప్రకారం తుది ఉత్తర్వులివ్వకుండా కూల్చివేతలు చేపట్టడానికి వీల్లేదన్నారు. ప్రభుత్వ న్యాయవాది జోక్యం చేసుకుంటూ చట్ట విరుద్ధంగా ఏమీ చేయబోమని, చట్టానికి అనుగుణంగానే నడుచుకుంటామన్నారు. ఇరుపక్షాల న్యాయవాదుల వాదనలు విన్న అనంతరం భవనం కూల్చివేత విషయంలో చట్టవిరుద్ధంగా వ్యవహరించవద్దని ప్రభుత్వాన్ని, సీఆర్‌డీఏను న్యాయమూర్తి ఆదేశించారు. ఈ ఆదేశాలను పొన్నవోలు సుధాకర్‌రెడ్డి రాతపూర్వకంగా సీఆర్‌డీఏ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. హైకోర్టు ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించాలని, దీనిపై స్పష్టత కావాలనుకుంటే ఏజీ, సీఆర్‌డీఏ న్యాయవాదిని సంప్రదించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతపై టీడీపీ దాడి

పామూరు: ప్రకాశం జిల్లా పామూరు మండలంలోని నర్రమారెళ్లకి చెందిన వైఎస్సార్‌సీపీ నేత పావులూరి ఆదినారాయణపై అదే గ్రామానికి చెందిన ఐదుగురు టీడీపీ నేతలు గురువారం దాడి చేశారు. దీనిపై బాధితుడు నారాయణ శుక్రవారం పామూరు సీఐ రామానాయక్‌కు ఫిర్యాదు చేశారు. బాధితుడు ఏం చెప్పాడంటే..

'నేను గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఉండగా టీడీపీ నాయకుడు గుంటుపల్లి చెంచురామయ్య నాకు ఫోన్‌చేసి 'నీతో మాట్లాడాలి మా ఇంటి దగ్గరకు రా'.. అంటే వెళ్లాను. అక్కడ టీడీపీ నేతలు గుంటుపల్లి శ్రీనివాసులు, గుంటుపల్లి నాగభూషణం, గుంటుపల్లి చిన్న నాగయ్య, గుంటుపల్లి నాగేశ్వరరావు, మంగాపురానికి చెందిన పావులూరి నరసింహులు ఉన్నారు. నన్ను ఎందుకు రమ్మన్నావని చెంచురామయ్యను అడిగితే.. ఇంతలో అక్కడున్న వారు నన్ను దూషిస్తూ.. 'నారాయణా నిన్ను టీడీపీలోకి పిలిచినా రావా ఎంత ధైర్యం అంతుచూస్తాం'.. అంటూ కాళ్లు, చేతులతో కొడుతూ కర్రలతో దాడిచేశారు. 25 ఏళ్లుగా నా అనుభవంలో ఉన్న పొలాన్ని నాలుగేళ్ల క్రితం ఎస్సీలకు విక్రయిస్తే దానిని ఎందుకు అమ్మావని ప్రశ్నిస్తూ తిరిగి దానిని వారికి రిజిస్ట్రేషన్ చేయించాలంటూ దూషిస్తూ కొట్టారు. మా అమ్మ అడ్డొస్తే ఆమెనూ తోసేశారు. ఇంతలో మరికొందరు గ్రామస్తులు రావడంతో వారి నుంచి తప్పించుకుని పారిపోయాను. అనంతరం.. టీడీపీ నాయకుల నుంచి ముప్పు ఉందని, నన్ను కాపాడాలని కోరుతూ సీఐకి ఫిర్యాదు చేశాను'.

ఏపీకి 'హోదా'.. కాపులకు రిజర్వేషన్లు!

- పవన్‌కు ఆ సత్తా ఉందని నమ్ముతున్నా: ముద్రగడ
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవాలని సూచన



కిర్లంపూడి: మీ చెప్పుచేతల్లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఉన్నందున ఏపీకి ప్రత్యేక హోదా సాధన కోసం ఒక అడుగు ముందుకు వేయాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం సూచించారు. గతంలో బీజేపీ ప్రభుత్వానికి కేంద్రంలో సంపూర్ణ మెజార్టీ ఉన్నందున మాజీ సీఎం వైఎస్ జగన్ కోరికను నెరవేర్చలేదన్నారు. కిర్లంపూడిలోని తన నివాసంలో ముద్రగడ శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఈ రోజు కేంద్రం మీ చేతుల్లో కీలుబొమ్మ కాబట్టి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవాలని పవన్‌ను కోరుతున్నట్లు చెప్పారు. మీరు తలుచుకుంటే కాపులకు బీసీ రిజర్వేషన్ కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను ఒప్పించే సత్తా ఉందని భావిస్తున్నట్లు పవన్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. ఎన్టీఆర్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన తరువాత సినిమాలు విరమించుకున్నారని, కోర్టు అనుమతి తీసుకుని కొద్ది చిత్రాల్లో మాత్రమే నటించారని ముద్రగడ తెలిపారు. అదే తరహాలో పవన్ కూడా పూర్తిగా సినిమాలు మానేసి ప్రజా సేవలోకి రావాలని కోరారు. పిఠాపురంలో పవన్ ఎమ్మెల్యేగా గెలిస్తే తన పేరు ముద్రగడ పద్మనాభరెడ్డిగా మార్చుకుంటానని గతంలోనే చెప్పానని గుర్తు చేశారు. ఈమేరకు గెజిట్‌లో తన పేరు మారిందన్నారు. పవన్ అభిమానులు నిత్యం తనను దూషిస్తూ మెస్సేజీలు పెడుతున్నారని, ఇలా ఇబ్బందులకు గురి చేసేకంటే ఏడుగురు సభ్యులున్న తన కుటుంబం మొత్తాన్ని ఒకేసారి చంపేయాలని ఆవేదన వ్యక్తం చేశారు.

■ తెలంగాణ

చొప్పదండి ఎమ్మెల్యే భార్య ఆత్మహత్య

- అనారోగ్య సమస్యలు కారణమంటున్న కుటుంబసభ్యులు
- ఎమ్మెల్యే సత్యంది ప్రేమవివాహం.. దంపతులకు ఇద్దరు పిల్లలు



ఎమ్మెల్యే సత్యం దంపతులు (ఫైల్)

సాక్షిప్రతినిధి, కరీంనగర్/అల్వాల్/గాంధీఆస్పత్రి/మేడ్చల్: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భార్య రూపాదేవి(40) ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. గురువారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇంట్లో తల్లి, ఇద్దరు పిల్లలు ఉండగానే రూపాదేవి గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. ఎంతకూ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన రూపాదేవి తల్లి భూలక్ష్మమ్మ డోర్ తీయడానికి ప్రయత్నించినా రాలేదు. దీంతో స్థానికుల సాయంతో తలుపులు తీయగా, అప్పటికే రూపాదేవి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అనారోగ్య సమస్యలతో తన కూతురు ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని తల్లి భూలక్ష్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. చనిపోవడానికి ముందు తన కూతురు భర్తతో మాట్లాడిందని భూలక్ష్మమ్మ చెప్పింది. విషయంగా తెలియగానే నియోజకవర్గ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే సత్యం హుటాహుటిన తనే కారు నడుపుకుంటూ సిటీకి బయలుదేరారు. విషయం తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమెల్యే సత్యంను మార్గమధ్యలో ఆపి, ఆస్పత్రికి తన కారులో తీసుకొచ్చారు. భార్య మృతదేహాన్ని చూసి ఎమ్మెల్యే బోరున విలపిస్తూ ఒక్కసారిగా కుప్పకూలారు. దీంతో ఆయనకు చికిత్స అందించారు. రూపాదేవి అంత్యక్రియలు శుక్రవారం తిరుమలగిరి ఆర్టీసీ కాలనీలోని స్వర్గధామంలో జరిగాయి. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, సుద్దాల దేవయ్య తదితరులు మేడిపల్లి సత్యంను పరామర్శించారు.

పీజీ చదువుతుండగా ప్రేమలో...

రంగారెడ్డి జిల్లాకు చెందిన రూపాదేవి, సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డి పేట మండలానికి చెందిన మేడిపల్లి సత్యంలది ప్రేమ వివాహం. ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ చదువుతున్న సమయంలో హైదరాబాద్‌లో వీరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. అనంతరం కులాంతర వివాహం చేసుకున్న సత్యం దంపతుల కాపురం అన్యోన్యంగా సాగింది. వీరికి కుమారుడు యోజిత్ (11), కుమార్తె రిషిక (9)లు ఉన్నారు. వృత్తిరీత్యా రూపాదేవి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. వికారాబాద్ నుంచి మేడ్చల్ మండలంలోని రావలకోల్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. రెండు నెలల క్రితం అల్వాల్ పంచశీల కాలనీకి నివాసం మార్చారు. ఇంతలోనే ఆమె ఆత్మహత్య చేసుకోవడం అందర్నీ కలిచివేసింది.

నీట్ పరీక్ష రద్దు చేయాలి

- విద్యార్థులు, ప్రజా సంఘాల డిమాండ్.. తిరిగి ఆన్‌లైన్‌లో నిర్వహించాలని వినతి
- విశాఖ, తిరుపతిలో నిరసన ప్రదర్శనలు
- విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని విజ్ఞప్తి



తిరుపతి ఎస్వీయూలో నిరసన తెలుపుతున్న ఎస్‌ఎస్‌యూఐ నేతలు, విద్యార్థులు

సీతమ్మధార (విశాఖ జిల్లా): నీట్ యూజీ – 2024 పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని విద్యార్థి, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. నీట్ పరీక్షల్లో అక్రమాలపై శుక్రవారం విశాఖ, తిరుపతిలో విద్యార్థులు, ప్రజా సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. ఈ పరీక్షను రద్దు చేయించి, తిరిగి నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని మంత్రులు, రాజకీయ నేతలను కోరాయి. నీట్‌లో అక్రమాలను నిరసిస్తూ విశాఖలోని జీవీఎంసీ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద జన జాగరణ సమితి నేతలు, విద్యార్థులు ప్రదర్శన చేశారు. ఈ పరీక్షలను రద్దు చేసి తిరిగి ఆన్‌లైన్‌లో నిర్వహించేలా రాష్ట్ర మంత్రి సత్యకుమార్ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని జన జాగరణ సమితి విశాఖ నగర కన్వీనర్ చింతపల్లి సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్షల్లో అక్రమాలపై పలు రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుంటే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేసిన రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఆరోగ్య, వైద్య, విద్య శాఖ మంత్రి సత్యకుమార్ ఇక్కడి విద్యార్థులకు కనీసం వివరణ ఇవ్వకుండా మౌనంగా ఉండడం తగదన్నారు. 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయం కాబట్టి నీట్ పరీక్షలో అక్రమాలపై ప్రధాని నరేంద్ర మోదీ తప్పనిసరిగా స్పందించి, స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నీట్‌ను ఆన్‌లైన్‌లో మాత్రమే నిర్వహించేలా కేంద్రం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భార్గవరెడ్డి, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దు

తిరుపతి సిటీ: నీట్ పరీక్ష రద్దు కోరుతూ ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఈ పరీక్షను తిరిగి నిర్వహించాలని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే మల్లికార్జున డిమాండ్ చేశారు. నరేంద్ర మోదీ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని, కనీసం పరీక్ష పేపర్ లీకేజీపై స్పందన లేదని మండిపడ్డారు. కనీసం విద్యార్థులకు భరోసా ఇవ్వకుండా బాధ్యతా రాహిత్యంగా మాట్లాడారని అన్నారు. యుద్ధాలను ఆపగలిగే మోదీ పేపర్ లీకేజీని ఎందుకు ఆపలేకపోయారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సిటీ అధ్యక్షుడు యార్లపల్లి గోపి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జావెద్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేరు మార్పు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకాల పేర్లను రాష్ట్ర ప్రభుత్వం బాల సంజీవనిగా మార్చింది. ప్రత్యేక పోషకాహార పథకంలో 6–72 నెలల వయసు ఉన్న బాలలకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోంది. ఈ పథకానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పెట్టిన పేరును టీడీపీ ప్రభుత్వం మార్చుతూ మహిళా శిశు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులిచ్చారు.

ఐటీఐ పరీక్ష ఫీజు చెల్లింపునకు జూలై 5 వరకు గడువు

సాక్షి, అమరావతి: ఐటీఐ ఫైనల్ పరీక్షలకు సంబంధించి సదరు విద్యార్థులు జూలై 5వ తేదీలోపు ఫీజు చెల్లించాలని డైరెక్టర్ నవ్య శుక్రవారం తెలిపారు. రూ.10 అలస్య రుసుముతో జూలై 11నాటికి పరీక్ష అప్లికేషన్లు సమర్పించాలని పేర్కొన్నారు.

గ్రూప్-2 మెయిన్స్ వాయిదా వేయండి

నిరుద్యోగ జేఏసీ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలను రెండు నెలలు వాయిదా వేయాలని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ శుక్రవారం కోరారు. గ్రూప్–1కు డిప్యూటీ డీఈవో పరీక్ష ఎంపిక విధానం 1:1000 గా నిర్ణయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల హడావుడిలో అభ్యర్థులు సన్నద్ధమయ్యేందుకు పూర్తిస్థాయిలో అవకాశం దొరకలేదని.. పరీక్షలు వాయిదా వేసి మేలు కలిగించాలని కోరారు.

కాంగ్రెస్‌లోకి మాజీ స్పీకర్ పోచారం

- తన నివాసంలో సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి సమక్షంలో చేరిక
- పోచారం కుమారుడు భాస్కర్‌రెడ్డి కూడా..

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర మాజీ స్పీకర్, మాజీ మంత్రి, బాన్సువాడ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పోచారం నివాసానికి వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు.. చర్చల అనంతరం ఆయనకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పోచారంతో పాటు ఆయన కుమారుడు భాస్కర్‌రెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా పోచారంను కలిశామని, పెద్ద నాయకుడిగా తమకు అండగా నిలబడాలని కోరామని చెప్పారు. రైతుల విషయంలో పోచారం సలహాలు, సూచనలు తీసుకుని ముందుకెళతామని, భవిష్యత్తులో అయనకు సముచిత గౌరవం ఇస్తామని పేర్కొన్నారు. కాగా దానం నాగేందర్, తాజాగా పోచారంతో పాటు ఇప్పటికే బీఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరిలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో కంటోన్మెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్ విజయం సాధించారు. దీంతో అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల బలం 64 నుంచి 69కి, మిత్రపక్షమైన సీపీఐతో కలిసి 70కి చేరడం గమనార్హం.

పోచారం ఇంట్లోకి వెళ్లేందుకు బాల్క సుమన్ యత్నం

సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాసానికి వచ్చిన సందర్భంగా అక్కడ ఉద్రిక్తత ఏర్పడింది. శ్రీనివాస్‌రెడ్డి నివాసం నుంచి సీఎం.. తిరిగి వెళ్లిపోతున్న సమయంలో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, నేతలు బాలరాజ్ యాదవ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు అనుచరులతో కలిసి అక్కడకు వచ్చారు. పోచారం ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో అప్రమత్తమైన పోలీసులు బాల్క సుమన్‌ను అడ్డుకుని బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఎం ఉండగానే పోచారం ఇంట్లోకి దూసుకెళ్లేందుకు యత్నించిన బాల్క సుమన్‌తోపాటు మరో 11 మందిని అరెస్టు చేశారు. వారిని అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి అందరికీ బెయిల్ మంజూరు చేశారు.

స్పెషలిస్ట్ వైద్యానికి మంగళం

సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణ కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రవేశపెట్టిన స్పెషలిస్ట్ క్లినిక్‌లకు టీడీపీ ప్రభుత్వం ఉద్వాసన పలికింది. క్లినిక్‌ల నిర్వహణ కోసం 8 స్పెషాలిటీల్లో నియమించిన 152 మంది వైద్యులను ఈ నెలాఖరుకు తొలగించాలని వైద్య శాఖ అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలను ఆదేశించింది. ఎన్‌హెచ్‌ఎం కింద కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ ఈ కార్యక్రమానికి 2024–25లో అనుమతులు ఇవ్వనందున స్పెషలిస్టు వైద్యులను తొలగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. స్పెషలిస్ట్ వైద్య సేవల కోసం గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యయ ప్రయాసలకోర్చి పట్టణాలు, నగరాల్లోని సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గతంలో దీన్ని ప్రవేశపెట్టారు. ఈమేరకు డెర్మటాలజీ, ఈఎన్‌టీ, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, పల్మనాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్ విభాగాల్లో వైద్యులను 2021లో నియమించారు. వీరిలో ఒక్కో వైద్యుడు రోజుకు రెండు పీహెచ్‌సీల్లో రెండేసి గంటల చొప్పున స్పెషలిస్ట్ క్లినిక్‌లు నిర్వహిస్తూ వచ్చారు. ఇలా వారంలో 12 పీహెచ్‌సీల్లో సేవలు అందించేవారు. తద్వారా మధుమేహం, రక్తపోటు లాంటి జీవన శైలి జబ్బులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి అవసరమైన చికిత్స అందించేవారు.



వివిధ వ్యాధిగ్రస్తులపై ప్రభావం

రక్తపోటు, మధుమేహం, ఎముకలు, గైనిక్ సంబంధిత సమస్యలతో బాధపడే గ్రామీణ ప్రజలు స్పెషలిస్ట్ వైద్యులను సంప్రదించాలంటే ఏరియా, జిల్లా ఆస్పత్రులు లేదంటే బోధనాస్పత్రులకు వెళ్లాల్సి ఉంటుంది. వృద్ధులు, మహిళలు, నడవలేని స్థితిలో ఉన్న వారు ప్రయాణాలు చేసి పట్టణాలు, నగరాలకు వెళ్లాలంటే ఇది ఇబ్బందికరంగా మారింది. ఈ అవస్థలను నివారించేందుకు గత వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం స్పెషలిస్టు క్లినిక్‌లను అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే.

టీడీపీ ప్రభుత్వం తొలగించిన స్పెషలిస్టు డాక్టర్లు ఇలా

స్పెషాలిటీ	వైద్యుల సంఖ్య
డెర్మటాలజీ	17
ఈఎన్‌టీ	16
జనరల్ సర్జరీ	18
జనరల్ మెడిసిన్	22
పల్మనాలజీ	10
గైనకాలజీ	22
ఆర్థోపెడిక్స్	29
పీడియాట్రిక్స్	18

క్లుప్తంగా...

వక్ఫ్ ఆస్తులను కాపాడుతాం

మైనారిటీశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వక్ఫ్ బోర్డుకు చెందిన విలువైన ఆస్తులను కాపాడుతామని న్యాయ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రిగా నస్యం మహమ్మద్ ఫరూఖ్ శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వక్ఫ్ బోర్డుకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించి తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలకు ఉపాధి కల్పించి, వారి ఆర్థిక, జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. హజ్ యాత్రికుల కోసం మంచి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్, మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.హర్షవర్ధన్, న్యాయశాఖ కార్యదర్శి ప్రభాకర్‌రావు, వక్ఫ్ బోర్డు సీఈవో అబ్దుల్ ఖాదర్, న్యాయ, మైనారిటీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఉపాధి’ నిధుల మళ్లింపు తగదు

ఉప ముఖ్యమంత్రి పవన్ తొలి సంతకంపై వ్యవసాయ కార్మిక సంఘం అభ్యంతరం

సాక్షి, అమరావతి: జాతీయ ఉపాధి హామీ నిధులను మళ్లించి కూలీలకు అన్యాయం చేయవద్దని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఉపాధి హామీ నిధులతో హార్టికల్చర్ అభివృద్ధి చేపడతామంటూ ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తొలి సంతకం చేయడంపై వ్యవసాయ కార్మికసంఘం తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో కరువు కాటకాల వల్ల ఉపాధి దొరకక సుమారు 20 లక్షల మంది వ్యవసాయ కార్మికులు వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితిలో ఉపాధి హామీకి నిధులు పెంచాల్సింది పోయి ఇతర పనులకు మళ్లించడం వల్ల పేదలకు పనులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఉపాధి నిధుల మళ్లింపు ప్రతిపాదనను విరమించుకోవాలని, అదనపు నిధులను రాబట్టేందుకు ప్రయత్నాలు చేయాలని పవన్‌కు వ్యవసాయ కార్మిక సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు.

ఏజీని సన్మానించిన కేంద్ర న్యాయవాదులు

సాక్షి,అమరావతి: రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ (ఏజీ)గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన దమ్మాలపాటి శ్రీనివాస్‌ను కేంద్ర ప్రభుత్వ న్యాయవాదులు శుక్రవారం సత్కరించారు. హైకోర్టులోని ఏజీ చాంబర్‌లో దమ్మాలపాటిని కేంద్ర ప్రభుత్వ న్యాయవాదులు కలిసి శాలువాతో సన్మానించారు. ఏజీని కలిసిన వారిలో జోస్యుల భాస్కర రావు, మల్లికార్జున రావు, జూపూడి యజ్ఞదత్, బాచిన హనుమంతరావు, సోమశేఖర్, ప్రసాద్ తదితరులున్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) ప్రతినిధులు కూడా ఏజీని కలిసి న్యాయవాదుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

కనెక్ట్ టు ఆంధ్రాకు దేవీ సీఫుడ్స్ విరాళం

సాక్షి, అమరావతి: కనెక్ట్ టు ఆంధ్రాకు దేవీ సీఫుడ్స్ సంస్థ రూ.5 కోట్ల విరాళం ఇచ్చింది. రూ.5 కోట్ల చెక్కును సంస్థ ఎండీ పోట్రు బ్రహ్మానందం శుక్రవారం సచివాలయంలో సీఎం చంద్రబాబుకు అందించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ఈ మొత్తం ఇచ్చారు. గుంటూరుకు చెందిన మర్రిపూడి సుష్మ సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో అందించారు.

పారదర్శకంగా అగ్నిమాపకశాఖ అనుమతులు: డీజీ బాగ్చీ

సాక్షి, అమరావతి: అగ్నిమాపకశాఖ అనుమతుల మంజూరు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తామని ఆ శాఖ అదనపు డీజీ శంఖబ్రత బాగ్చీ చెప్పారు. రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపకశాఖ అదనపు డీజీగా శంఖబత్ర బాగ్చీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు, సర్టిఫికెట్ల కోసం అధికారులుగానీ, దళారులుగానీ లంచాలు అడిగితే తన వ్యక్తిగత ఫోన్ నంబరు 94409 06254కు ఫోన్ చేసిగానీ, వాట్సాప్ ద్వారాగానీ ఫిర్యాదు చేయాలని సూచించారు. లంచాలు అడిగే అధికారులు, సిబ్బంది, దళారులపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఫిర్యాదు చేసినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన చెప్పారు.

పలువురు ఐఏఎస్ అధికారులకు అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులకు అదనపు బాధ్యదలు అప్పగిస్తూ శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వయోజన విద్య డైరెక్టర్ నిధి మీనాకు ఇంటర్ బోర్డు కమిషనర్‌గా, సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావుకు స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు. గనులు, పరిశ్రమలు, వాణిజ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న గోపాలకృష్ణ ద్వివేదిని రిలీవ్ చేస్తూ పరిశ్రమలు, వాణిజ్య విభాగం కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్‌కు అదనపు చార్జి అప్పగించారు. పశుసంవర్ధకశాఖ కార్యదర్శిగా ఇటీవల నియమితులైన ఎం.ఎం.నాయక్‌కు ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ ఎండీగా, ఏపీ అమూల్ ప్రాజెక్టు ప్రత్యేకాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

గతేడాదిని మించి వడగాడ్పులు

ఈ వేసవిలో 18 రోజులు హీట్‌వేవ్స్

- సాధారణం కంటే మూడు రెట్లు అధికం
- ఈ ఏడాది ఏప్రిల్ ఆరంభం నుంచే ప్రతాపం
- ఈ నెలలోనూ ప్రభావం
- ఈ ఏడాది 48 డిగ్రీలకు చేరుకున్న ఉష్ణోగ్రతలు



సాక్షి, విశాఖపట్నం: గతేడాదిని మించి ఈ ఏడాది వడగాడ్పులు హడలెత్తించాయి. గతేడాది వేసవిలో 17 రోజులు వడగాడ్పులు/తీవ్ర వడగాడ్పులు వీచినట్టు నమోదైంది. అయితే ఈసారి వడగాడ్పుల సంఖ్య 18కి పెరిగింది. అంతేకాకుండా గతేడాది ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 47 డిగ్రీల వరకు నమోదు కాగా ఈ ఏడాది 48 డిగ్రీల వరకు చేరుకున్నాయి. గతేడాది వేసవి దడ పుట్టించిందనుకుంటే ఈసారి అంతకు మించి హడలెత్తించింది. సాధారణం కంటే దాదాపు మూడు రెట్ల వడగాడ్పులతో జనాన్ని బెంబేలెత్తించింది. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంతగా ఏప్రిల్ ఆరంభం నుంచే వడగాడ్పులు మొదలయ్యాయి. ఆ నెలలోనే రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు 47 డిగ్రీలకు చేరుకున్నాయి. మే నెల రెండో వారం, మూడో వారంలో అప్పుడప్పుడు వర్షాలు కురుస్తూ ఉష్ణతాపాన్ని కాస్త తగ్గించాయి. ఫలితంగా వడగాడ్పుల తీవ్రత ఒకింత తగ్గినట్టు కనిపించింది. సాధారణంగా ఏప్రిల్, జూన్‌కంటే మే నెలలోనే వేసవి తీవ్రత ఎక్కువగా కనిపిస్తుంది. కానీ ఈ ఏడాది అందుకు భిన్నంగా మే నెలలో వర్షాలు కురవడం వల్ల ఏప్రిల్‌కంటే తక్కువ వడగాడ్పుల రోజులు నమోదయ్యాయి. ఏప్రిల్‌లో రికార్డయిన ఉష్ణోగ్రతలను చూసి మే నెలలో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలకు చేరుకుంటాయని వాతావరణ నిపుణులు అంచనా వేశారు. కానీ మే నెల మధ్య మధ్యలో ఆవర్తనాలు, ద్రోణులు, తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 48 డిగ్రీలకే పరిమితమయ్యాయి. ఇలా ఈ వేసవి మూడు నెలలూ 18 రోజుల పాటు వడగాడ్పులు, తీవ్ర వడగాడ్పులు వీచాయి. ఇందులో ఏప్రిల్‌లో ఎనిమిది రోజులు (5, 6, 7, 8, 24, 28, 29, 30 తేదీలు), మే నెలలో ఏడు రోజులు (1, 2, 3, 4, 5, 28, 31 తేదీలు), జూన్‌లో మూడు రోజులు (1, 17, 18 తేదీలు) వడగాడ్పులు ప్రభావం చూపాయి.

స్తబ్దుగా నైరుతి రుతుపవనాలు

నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది మూడు రోజులు ముందుగా అటు కేరళలోకి, ఇటు రాష్ట్రంలోకి ప్రవేశించినా అవి ఉత్తర కోస్తాలోకి విస్తరించాక దాదాపు పది రోజుల పాటు స్తబ్దుగా ఉండిపోయాయి. దీంతో జూన్ మూడో వారం వర్షాలు కురవాల్సిన సమయంలో రెండు రోజుల (17, 18 తేదీల్లో) పాటు వడగాడ్పులు మళ్లీ చెలరేగాయి. ఈ దఫా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమల్లోని అన్ని ప్రాంతాల్లోనూ వడగాడ్పులు దడ పుట్టించాయి. ప్రధానంగా నంద్యాల, కర్నూలు, తిరుపతి, వైఎస్సార్, అన్నమయ్య, అనంతపురం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, పల్నాడు, కాకినాడ, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలు ఎక్కువగా వడగాడ్పులను ఎదుర్కొన్నాయి.

ఉదారంగా స్పందించండి

- రాష్ట్రంలో రబీ కరువు పరిస్థితులపై కేంద్ర బృందానికి రాష్ట్రం విజ్ఞప్తి
- క్షేత్ర స్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేసిన కేంద్ర బృందం
- పంట నష్టంపై కేంద్ర ప్రభుత్వానికి త్వరలో నివేదిక
- రాష్ట్రంలో 63 తీవ్ర, 24 మధ్యస్థ కరువు మండలాలు..
- రాష్ట్ర విపత్తుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ వినతి

సాక్షి, అమరావతి : రబీ కరువు పరిస్థితులను క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసిన కేంద్ర బృందం సాయం అందించే విషయంలో ఉదారంగా స్పందించాలని రాష్ట్ర విపత్తుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ కోరారు. విజయవాడలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఆయన కేంద్ర కరువు బృందంతో సమావేశమై రాష్ట్రంలో కరువు పరిస్థితులను వివరించారు. నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, ప్రకాశం జిల్లాల్లోని కరువు ప్రభావిత మండలాల్లో నాలుగు రోజులుగా పర్యటించిన కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన సీఈఓ, రైతు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ రితేష్ చౌహాన్ నేతృత్వంలోని సభ్యులు డా.పొన్నుస్వామి, సునీల్ దుబే, చిన్మయ్ పుండ్లికరావు గోత్కరే, ఆశిష్ పాండే, అరవింద్ కుమార్ సోని, మన్నూజీ ఉపాధ్యాయ్, ఎస్ సి కశ్యప్, మదన్ మోహన్ మౌర్య, అనురాధ బట్నాలతో అజయ్ జైన్.. ఎండీ రోణంకి కూర్మనాథ్, ఇతర అధికారులతో కలిసి సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కరువు పరిస్థితులను కేంద్ర బృందానికి వివరించారు. ఆరు జిల్లాల్లో 63 తీవ్ర కరువు మండలాలు, 24 మధ్యస్థ కరువు మండలాలుగా ప్రకటించినట్లు తెలిపారు. సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం, వర్షాభావంతో అత్యధిక డ్రైస్పెల్స్, రిమోట్ సెన్సింగ్, సాయిల్ మోయిశ్చర్, హైడ్రాలజీ, పంట నష్టం 33% అంతకంటే ఎక్కువ ఉన్న మండలాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం కరువు ప్రాంతాలను ప్రకటించిందని చెప్పారు.

అదనంగా ‘ఉపాధి’ కల్పించండి

క్షేత్ర స్థాయిలో కరువు నష్టానికి సంబంధించిన వాస్తవిక వివరాలను అందించామని, రైతులను ఆదుకోవడానికి సత్వరమే రూ.319.77 కోట్లు సాయం చేయాలని అజయ్ జైన్ కేంద్ర బృందాన్ని కోరారు. ఉపాధి హామీ పథకం కింద అదనంగా మరో 50 పని రోజులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన సీఈఓ రితేష్ చౌహాన్ మాట్లాడుతూ.. కరువు కారణంగా నష్టపోయిన పంటల వివరాలపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని చెప్పారు. పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకునేలా చూస్తామన్నారు. జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్లు కరువు పరిస్థితుల వాస్తవికతను తెలియజేశాయని, అలాగే క్షేత్ర స్థాయిలో రైతులు కరువు వల్ల జరిగిన నష్టాన్ని వివరించారని చెప్పారు. కమిటీ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందించి, వీలైనంత మేర ఆదుకోవడానికి తమ వంతు సహకారం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

నరసాపురంలో ఆఖరిదాకా అడ్డుపుల్లలు

- నా అభ్యర్థిత్వాన్ని మారుస్తారంటూ ఎల్లో మీడియా దుష్ప్రచారం
- నామినేషన్ల ఆఖరి రోజు దాకా అదే తీరు..
- పురందేశ్వరి, ఇతర నేతల సమక్షంలో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ వ్యాఖ్యలు
- కూటమి, రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ

సాక్షి, అమరావతి: నరసాపురం ఎంపీ అభ్యర్థిగా తన పేరును బీజేపీ అధిష్ఠానం ఖరారు చేసిన తరువాత కూడా తన అభ్యర్థిత్వాన్ని అడ్డుకునేందుకు ఎల్లో మీడియా, మరి కొందరు చివరి వరకు శతవిధాలా ప్రయత్నించి దుష్ప్రచారం చేసినట్లు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చేసిన వ్యాఖ్యలపై కలకలం రేగుతోంది. నామినేషన్ల ఆఖరి రోజు వరకు తనపై దుష్ప్రచారానికి పాల్పడినట్లు వెల్లడించారు. ఈమేరకు గురువారం విజయవాడలో బీజేపీ ప్రజాప్రతినిధుల అభినందన సభలో ఆయన చేసిన వ్యాఖ్యలపై టీడీపీ – జనసేన– బీజేపీలో కూటమి నేతలతో పాటు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. ‘మొన్నటి ఎన్నికల్లో రాష్ట్రంలో పొత్తులు పెట్టుకోవాలా.. వద్దా? అనే అంశంపై బీజేపీ అధిష్ఠానం ఒక నిర్ణయం తీసుకుంది. కూటమిగా ఏర్పడ్డాక నరసాపురం లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి కేటాయించారు. శ్రీనివాస వర్మను తమ అభ్యర్థిగా పార్టీ పెద్దలు నిర్ణయించాక కూడా ఆయన స్థానంలో మరొకరు రానున్నట్లు కొన్ని ఎల్లో మీడియా సంస్థలు, యూట్యూబ్ ఛానళ్లు, కొందరు వ్యక్తులు నామినేషన్ ఆఖరి రోజు వరకు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. శ్రీనివాస వర్మకు ఎన్నికలను ఎదుర్కొనే సత్తా లేదంటూ ఉద్దేశపూర్వకంగా ప్రచారం సాగించారు. నాకు ఎన్నికలు కొత్త కాదు. 2019లో పొత్తులు లేనప్పుడే నరసాపురంలో పోటీ చేశా. యువకుడిగా ఉండగా 1999లో కృష్ణంరాజుకు ఇన్‌చార్జిగా వ్యవహరించా. 2014లో అభ్యర్థి గోకరాజు గంగరాజు గెలుపు కోసం జిల్లా అధ్యక్షుడిగా కృషి చేశా’ అని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ స్పష్టం చేశారు. ఈ సమయంలో వేదికపై ఆయనకు ఇరువైపులా ఆశీనులైన రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ నోటి మీద వేలు వేసుకొని ఒకరి ముఖాలు మరొకరు చూసుకోవడం గమనార్హం. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేంద్ర మంత్రి వ్యాఖ్యలపై శాసనసభ తొలిరోజు సమావేశాల సందర్భంగా శుక్రవారం కూటమికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఆసక్తికరంగా చర్చించుకున్నారు.

సీబీఐ దృష్టిలో దస్తగిరి ఓ వీఐపీ

వైఎస్ వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్ న్యాయవాది వాదనలు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కిరాయి హంతకుడు దస్తగిరి (ఏ4)ని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఓ నిందితుడిగా కాకుండా వీఐపీలా చూసిందని ఎంపీ అవినాశ్‌రెడ్డి తరపు న్యాయవాది తెలిపారు. ఇలాంటి దర్యాప్తు సంస్థను ఎన్నడూ చూడలేదని చెప్పారు. హత్య కేసులో అప్రూవర్‌గా మారినందున తనను నిందితుల జాబితా నుంచి తొలగించి సాక్షిగా పరిగణించాలని కోరుతూ దస్తగిరి హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి రఘురాం శుక్రవారం వాదనలు చేపట్టారు. సీబీఐ తరపున అనిల్ తల్వార్ వాదనలు వినిపించారు. కోర్టు అనుమతిస్తే దస్తగిరిని నిందితుల జాబితా నుంచి తొలగించి, సాక్షుల జాబితాలో చేర్చడానికి తమకు అభ్యంతరం లేదన్నారు. అనంతరం అవినాశ్ తరపు న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ.. ఓ కరుడుగట్టిన హంతకుడు అప్రూవర్‌గా మారినంత మాత్రాన సాక్షిగా పేర్కొనడం ఎంత మాత్రం సమర్థనీయం కాదన్నారు. ఇలాగైతే భవిష్యత్‌లో హత్యలు చేసిన వారంతా అప్రూవర్‌గా మారి, ఎలాంటి శిక్ష లేకుండా బయటకు వస్తారని చెప్పారు. ఇది సమాజానికి తప్పుడు సంకేతాలు ఇచ్చినట్లు అవుతుందన్నారు. ఈ దశలో దస్తగిరి న్యాయవాది కల్పించుకుని వీఐపీ అనడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ముమ్మాటికీ దస్తగిరిని సీబీఐ ఓ వీఐపీలానే చూసిందని ఉమామహేశ్వర్ రావు పునరుద్ఘాటించారు. ‘హత్య కేసును సీబీఐకి బదిలీ చేసిన తర్వాత నలుగురు నిందితుల్లో ఒక్కరిని కూడా అరెస్టు చేయలేదు. 2021 ఆగస్టు 25న దస్తగిరి నేరుగా ఢిల్లీ సీబీఐ కార్యాలయానికి వెళ్లి తానే వివేకాను చంపాను అని చెప్పాడు. అలా చెప్పిన తర్వాత కూడా అరెస్టు చేయకుండా 161 సీఆర్‌పీసీ కింద స్టేట్‌మెంట్ రికార్డు చేసి ఇంటికి పంపారు. మళ్లీ అదే నెల 30న మరోసారి వెళితే.. మళ్లీ స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. సీబీఐ వేసిన చార్జిషీట్‌లో ఎక్కడా అవినాశ్, భాస్కర్‌రెడ్డిలను నిందితులుగా పేర్కొనలేదు’ అని వివరించారు. నిందితుల న్యాయవాదుల వాదనల సందర్భంగా మధ్య మధ్యలో సీబీఐ న్యాయవాది కలుగజేసుకోవడంపై వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సీబీఐ వాదనల సమయంలో ఎప్పుడూ తాము మధ్యలో జోక్యం చేసుకోలేదన్నారు. తదుపరి విచారణను న్యాయమూర్తి.. వచ్చేనెల 5కు వాయిదా వేశారు. న్యాయవాదులు సాయివంశీ, రవీందర్‌రెడ్డి, టీఎల్ నయన్‌కుమార్‌రెడ్డి పలువురు నిందితుల తరఫున వాదనలు వినిపించారు.

ఫ్యాప్టో చైర్మన్‌గా సాయిశ్రీనివాస్



సాయి శ్రీనివాస్



చిరంజీవి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్టీయూ అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ ఎన్నికయ్యారు. రాష్ట్రంలోని 12 ఉపాధ్యాయ సంఘాల సమావేశం శుక్రవారం విజయవాడలో జరిగింది. ఈ సందర్భంగా రెండేళ్ల కాలపరిమితికి సమాఖ్య కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా సాయిశ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.చిరంజీవి (ఏపీటీఎఫ్), కో చైర్మన్లుగా కె.నరహరి (డీటీఎఫ్), బి.మనోజ్‌కుమార్ (బీటీఏ), చందోలు వెంకటేశ్వర్లు (ఎస్సీ, ఎస్టీ యూఎస్), కె.ప్రకాశ్‌రావు (ఆప్టా), డిప్యూటీ కార్యదర్శులుగా ఎస్.వెంకటేశ్వర్లు (యూటీఎఫ్), కె.భానుమూర్తి (ఏపీటీఎఫ్), వి.శ్రీనివాసరావు (ఏపీహెచ్ఎంఏ), కోశాధికారిగా చింతల సుబ్బారావు (ఎస్‌ఏ అసోసియేషన్), కార్యదర్శులుగా ఎం.ఎస్.ఇమామ్‌బాషా (ఆర్‌యూటీఏ), డి.మధుసూదనరావు (ఏపీఆర్‌ఐటీఏ)గా ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మరో 12 మందిని ఎన్నుకున్నారు.

సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు తీసుకోండి

- ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించండి
- ఉన్నతాధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలు
- మంత్రులు నారాయణ, సత్యకుమార్‌తో కలిసి సమీక్ష
- కేంద్రం నుంచి స్థానిక సంస్థలకు వచ్చే నిధుల వివరాలపైనా ఆరా

సాక్షి, అమరావతి: సాక్షి, అమరావతి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కట్టడి చేసేందుకు సమగ్ర ప్రణాళికను అధికారులు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. ఏటా వర్షాకాలంలో వాతావరణం మారే సమయంలో వచ్చే వ్యాధులు గ్రామీణుల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నాయన్నారు. తాగునీటి కాలుష్యం మూలంగానే అతిసార వ్యాధి, విష జ్వరాలు లాంటివి ప్రబలుతున్నాయని చెప్పారు. పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల కాకినాడ జిల్లా కొమ్మనపల్లి, బెండపూడి, గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్ జిల్లాల్లో అతిసార ప్రబలిన నేపథ్యంలో శుక్రవారం శాసనసభ సమావేశ మందిరంలో అత్యవసరంగా పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా, పురపాలక, వైద్య, ఆరోగ్య శాఖల ఉన్నతాధికారులతో పవన్ కళ్యాణ్ సమీక్ష నిర్వహించారు. ఇందులో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ కూడా పాల్గొన్నారు. నీరు కలుషితమైన చోట నీటి సరఫరా ఆపేసి తగు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను పవన్ ఆదేశించారు.



కార్యాచరణ సిద్ధం చేయాలి

పైపులైన్ల తనిఖీ ఎప్పటికప్పుడు జరిగేలా చొరవ తీసుకోవాలని, మరమ్మతులు అవసరమైతే తక్షణమే చేయాలని మంత్రులు ఆదేశించారు. ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత మంచినీటి సరఫరా విషయంలో ఏ మాత్రం అశ్రద్ధ తగదని, ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధులను అరికట్టేందుకు పంచాయతీరాజ్, పురపాలక, వైద్య ఆరోగ్యశాఖ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. కాగా, కేంద్రం నుంచి స్థానిక సంస్థలకు వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు, స్థానిక సంస్థలకు వివిధ పన్నుల రూపంలో వచ్చే ఆదాయ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అతిసార వ్యాధి నియంత్రణ, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన సంబంధిత శాఖల అధికారులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, మహిళా, శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భారతీయులు.. పర్యావరణ ప్రేమికులు

- హరిత సమస్యలు పరిష్కరించాలని 91% మంది డిమాండ్
- రుతుపవనాలపై 76% మందికిపైగా అవగాహన
- యేల్ ప్రోగ్రామ్ సర్వేలో వెల్లడి



సాక్షి, అమరావతి: భారతీయుల్లో పర్యావరణ స్పృహ అనూహ్యంగా పెరిగింది. మానవ తప్పిదాల వల్లే గ్లోబల్ వార్మింగ్ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది సెప్టెంబర్–అక్టోబర్ మధ్య నిర్వహించిన జాతీయ సర్వేలో 91% మంది వాతావరణ మార్పులపై స్పందించినట్లు అంతర్జాతీయ సంస్థ యేల్ యూనివర్సిటీ తెలిపింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ సర్వేలో వాతావరణ మార్పులపై భారత్‌లో ఆందోళన పెరుగుతున్నట్లు స్పష్టమైందని పేర్కొంది. భూమి విపరీతంగా వేడెక్కుతోందని, అది గ్లోబల్ వార్మింగ్ వల్లే సంభవిస్తుందని చెప్పడమే కాకుండా అది ప్రాథమికంగా మానవ కార్యకలాపాల వల్లే సంభవిస్తుందని నమ్ముతున్నట్లు పేర్కొంది. 38% మంది మాత్రం ప్రాథమికంగా సహజ పర్యావరణ మార్పుల వల్ల సంభవిస్తుందని చెప్పినట్లు నివేదించింది. గతేడాది చివరి దశలో ఈ వర్సిటీకి చెందిన నిపుణులు ‘క్లైమేట్ చేంజ్ ఇన్ ది ఇండియన్ మైండ్’ పేరిట నివేదికను రూపొందించారు. వాతావరణ మార్పులపై అవగాహన, నమ్మకాలు, వైఖరులు, విధానాలు, ప్రజల మద్దతు వంటి అంశాలను తెలుసుకునేందుకు భారత్‌లో పర్యటించి వివరాలు సేకరించినట్లు యూనివర్సిటీ ఆఫ్ క్వీన్స్‌ల్యాండ్‌కు చెందిన జగదీష్ థాకర్, యేల్ ప్రోగ్రామ్ ప్రతినిధి ఆంటోని లైసిరోవిజ్ తెలిపారు.

విధ్వంసకర ప్రమాదంగా నమ్మకం

ప్రజల్లో గ్లోబల్ వార్మింగ్ ప్రమాదాలపై పూర్తి అవగాహన ఉందని నివేదిక పేర్కొంది. దీనివల్ల వృక్ష, జంతుజాలాలకు తీవ్రంగా హాని చేస్తుందని 83% మంది నమ్ముతున్నారు. దేశంలోని ప్రజలకు హాని చేస్తుందని 82% మంది, భవిష్యత్ తరాలకు ప్రమాదమని 81% మంది నమ్ముతున్నారు. ప్రస్తుత సమాజంలోని ప్రజలకు కూడా హాని జరగుతోందని 78% మంది నమ్ముతున్నట్లు ప్రకటించింది. 53% మంది భారతీయులు తాము ఇప్పటికే గ్లోబల్ వార్మింగ్‌కు ప్రభావితమవుతున్నామని చెప్పినట్లు తెలిపింది. విపరీతమైన వేడి, కరువు, సముద్ర మట్టం పెరుగుదల, వరదలు/ఇతర వాతావరణ సంబంధిత విపత్తుల కారణంగా మూడింట ఒక వంతు(సర్వేలో పాల్గొన్నవారు) భారతీయులు (34%) తామున్న ప్రదేశాలను మార్చినట్లు తెలిపారు. గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో కరువు, నీటి కొరత ఏర్పడి వినాశనానికి కారణమై ఆహార కొరతకు దారితీస్తుందని 60% మందికి పైగా నమ్ముతున్నట్లు పేర్కొన్నారు. వాతావరణం, రుతుపవనాలపై గ్లోబల్ వార్మింగ్ ప్రభావం ఏమిటని అడిగినప్పుడు 71% మంది తామున్న స్థానిక వాతావరణాన్ని ప్రభావితం చేసిందని పేర్కొనగా, 76% మంది భారత్‌లో రుతుపవనాలను గ్లోబల్ వార్మింగ్ తీవ్రంగా ప్రభావితం చేసినట్లు పేర్కొన్నారు.

‘జీరో ఉద్గారాల’ లక్ష్యానికి భారీగా మద్దతు

గ్లోబల్ వార్మింగ్‌ను ఎదుర్కోవడానికి చేపట్టాల్సిన చర్యలపైనా భారతీయులకు పూర్తి అవగాహన ఉన్నట్లు ఈ సర్వే తెలిపింది. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు తమ దైనందిన జీవితంలో గణనీయమైన మార్పులు చేయడానికి సిద్ధంగా ఉన్నారా అని అడిగినప్పుడు 79% మంది తాము ‘ఇప్పటికే దీన్ని ఆచరిస్తున్నాం’అని చెప్పడం విశేషం. భారతీయుల అభిప్రాయం ప్రకారం గ్లోబల్ వార్మింగ్ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని 10% మంది పేర్కొనగా, 78% మంది ప్రభుత్వం మరింత కృషి చేయాలని చెప్పారు. ఈ నివేదిక ప్రకారం భారత్‌లో అత్యధిక మంది ప్రజలు పర్యావరణ సమస్యలను పరిష్కరించడానికి రూపొందించిన విధానాలకు మద్దతిచ్చారు. గతంలో గ్లాస్గోలో జరిగిన యునైటెడ్ నేషన్స్ ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్‌లో భాగంగా జరిగిన 26వ కాన్ఫరెన్స్‌లో ‘భారతదేశ పంచామృత డిక్లరేషన్’ ప్రకటనలో ప్రధాని మోదీ ప్రకటించిన దాని ప్రకారం 2070కి ‘జీరో ఉద్గారాల’ లక్ష్యాన్ని సాధించాలనే భారత ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి 86% మంది మద్దతు తెలిపినట్లు పేర్కొంది.

డీజీపీగా ద్వారకా తిరుమలరావు బాధ్యతల స్వీకరణ

సాక్షి, అమరావతి/ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): డీజీపీగా సీహెచ్.ద్వారకా తిరుమలరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయానికి చేరుకున్న ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం డీజీపీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డీజీపీకి పోలీసు ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలిపారు. అదనపు డీజీలు, ఐజీలు, ఇతర పోలీసు ఉన్నతాధికారులతో ద్వారకా తిరుమలరావు కాసేపు సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



పోలీసు అధికారుల సంఘం శుభాకాంక్షలు

డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన ద్వారకా తిరుమలరావుకు రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం శుభాకాంక్షలు తెలిపింది. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీతో పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. సమర్థుడైన పోలీసు అధికారిగా గుర్తింపు పొందిన ఆయన రాష్ట్రంలో డీజీపీగానూ విజయవంతమవుతారని ఆకాంక్షించారు. పోలీసుల సంక్షేమం కోసం కృషి చేయాలని ఆయన్ని కోరారు. కాగా, డీజీపీ ద్వారకా తిరుమలరావు దంపతులు విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు.

ముక్క లేనిదే.. వాళ్లకు ముద్ద దిగదు

- దేశంలోనే మాంసాహారంపై అత్యధికంగా ఖర్చు చేస్తున్నది కేరళీయులే
- ఏపీలో మాంసాహారం కోసం వెచ్చిస్తున్నది 14.8 నుంచి 11.9 శాతం
- 2022–23 జాతీయ గృహ అవసరాల వ్యయ నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: మాంసం.. కోడిగుడ్లు.. చేపలు.. ఇతర మాంసాహారం వినియోగంలో మళయాలీలు దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నారు. ఏపీ, అస్సాం, పశ్చిమ బెంగాల్, తెలంగాణ తదితర రాష్ట్రాలతో పోలిస్తే కేరళీయులు మాంసాహారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. కేరళలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తమ ఆహార బడ్జెట్‌లో 23.5 శాతం మాంసాహారం కోసం ఖర్చు పెడుతుంటే.. అక్కడి పట్టణ వాసులు 19.8 శాతం ఖర్చును మాంసాహారం కోసం వినియోగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జాతీయ గృహ అవసరాల వినియోగ వ్యయ నివేదిక 2022–23లో ఈ అంశాన్ని వెల్లడించింది.

రెండో స్థానంలో అస్సాం

మాంసం వినియోగంలో అస్సాం రెండో స్థానంలోను, పశ్చిమ బెంగాల్ మూడో స్థానంలోనిలిచాయి. పశ్చిమ బెంగాల్‌లోని పట్టణ ప్రాంతాల్లో మొత్తం ఆహార బడ్జెట్‌లో 17 శాతం మాంసాహారం కోసం వినియోగిస్తుంటే.. గ్రామాల్లో 20 శాతం మొత్తాన్ని మాంసాహారం కోసం వెచ్చిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ విషయానికి వస్తే అక్కడ గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే భేదం లేకుండా మొత్తం ఆహార బడ్జెట్‌లో 18.9 శాతాన్ని మాంసాహారం కోసం వెచ్చిస్తున్నారు.

సగటు ఆహార బడ్జెట్ రూ.3,773.. రూ.6,459

దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఆహార పదార్థాల కోసం నెలవారీ కుటుంబ వ్యయం రూ.3,773గా జాతీయ గృహ అవసరాల వినియోగ వ్యయ నివేదిక వెల్లడించింది. పట్టణాల్లో మాత్రం ఆ మొత్తాన్ని రూ.6,459 అని పేర్కొంది. కాగా.. గ్రామీణులు తమ ఆదాయంలో సగటున 46 శాతం ఆహార పదార్థాల కోసం ఖర్చు చేస్తుంటే.. పట్టణాల్లో మాత్రం ఆ ఖర్చు 39 శాతంగా ఉంది. దేశవ్యాప్తంగా పట్టణాల్లో ఆహార బడ్జెట్‌లో 9.1 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 10.6 శాతం మేర మాంసాహారం కోసం ఖర్చు చేస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో ఇదీ పరిస్థితి

మాంసాహార ప్రియులు రెండు తెలుగు రాష్ట్రాల్లో అధికంగానే ఉన్నారు. ఆహార బడ్జెట్‌లో మాంసాహారంపై చేస్తున్న ఖర్చు విషయంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు కొంత ఎక్కువగానే వెచ్చిస్తున్నారు. మొత్తం ఆహార బడ్జెట్‌లో ఏపీలోని గ్రామీణ ప్రాంతాల్లో 14.8 శాతం, పట్టణ ప్రాంతాల్లో 11.9 శాతం ఖర్చు చేస్తున్నాయి. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో 15.8 శాతంగా, పట్టణాల్లో 11.9 శాతం మాంసాహారం కోసం వెచ్చిస్తున్నట్టు జాతీయ గృహ అవసరాల వినియోగ వ్యయ నివేదిక జాతీయ గృహ అవసరాల వినియోగ వ్యయ నివేదిక వివరించింది.



> మనకు కనిపించే, వినిపించే, అర్థమయ్యే, అవకపోయే ఈ సమస్త చరాచర జగత్తంతా ఆ పరబ్రహ్మ పరమేశ్వరుని నుంచి వెలువడి వచ్చినదే! ఆ పరబ్రహ్మ ద్వారా ప్రాణం పోయబడినదే! అంటే ఈ విశ్వం యావత్తూ పరమేశ్వరుని లీలయే!
>
> – కఠోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి

శనివారం, 22 జూన్ 2024

అగ్రరాజ్యాలు కళ్లు తెరుస్తాయా?

తెగేదాకా లాగితే ఏమవుతుందో అమెరికాతోపాటు యూరప్ దేశాలు తెలుసుకోవాల్సిన సందర్భమిది. బుధవారం రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉత్తర కొరియాను సందర్శించి ఆ దేశంతో సైనిక ఒడంబడిక కుదుర్చుకున్నారు. ఆ మర్నాడు వియత్నాం వెళ్లి డజను ఒప్పందాలు చేసుకున్నారు. అందులో అణు పరిశోధనలకు సంబంధించిన అంశం కూడా ఉంది. వియత్నాంతో రక్షణ, భద్రత సహా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకోవటం తమ లక్ష్యమని కూడా పుతిన్ చెప్పారు. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ యుద్ధం ప్రారంభించిన నాటినుంచీ దాన్ని ఆంక్షల చట్రంలో బిగించి ఏకాకిని చేయాలని అమెరికా, యూరప్ దేశాలు తలపోశాయి. ఉత్తర కొరియా ఏనాటినుంచో అలాంటి ఆంక్షల మధ్యే మనుగడ సాగిస్తోంది. ఇరాన్ సరేసరి. ఇలా ఏకాకుల్ని చేయాలన్న దేశాలన్నీ ఏకమవుతున్నాయని, అది ప్రమాద సంకేతమని అమెరికా, పాశ్చాత్య దేశాలు గ్రహిస్తున్న దాఖలా లేదు. ఆసియా–పసిఫిక్ ప్రాంతానికి సరికొత్త భద్రతా వ్యవస్థ ఏర్పడాలన్నదే తన ధ్యేయమని పుతిన్ అనటంలోని ఉద్దేశమేమిటో తెలుస్తూనే ఉంది. ఉత్తర కొరియా ఆవిర్భావానికీ, దాని మనుగడకూ నాటి సోవియెట్ యూనియనే కారణం. జపాన్ వలస పాలనతో సర్వస్వం కోల్పోయి శిథిలావస్థకు చేరుకున్న కొరియా భూభాగంలోకి రెండో ప్రపంచ యుద్ధం ముగింపు దశలో సోవియెట్ సైనిక దళాలు అడుగుపెట్టాయి. ఆ వెంటనే అమెరికా సైతం అప్పటికింకా సోవియెట్ సైన్యం అడుగుపెట్టని దక్షిణ ప్రాంతానికి తన సైన్యాన్ని తరలించింది. పర్యవసానంగా ఆ దేశం ఉత్తర, దక్షిణ కొరియాలుగా విడిపోయింది. సోవియెట్ స్ఫూర్తితో సోషలిస్టు వ్యవస్థ ఏర్పడిందని మొదట్లో ఉత్తర కొరియా ప్రకటించినా అక్కడ అనువంశిక పాలనే నడుస్తోంది. ఆ దేశం గురించి పాశ్చాత్య మీడియా ప్రచారం చేసే వదంతులే తప్ప అక్కడ ఎలాంటి వ్యవస్థలున్నాయో, అవి ఏం సాధించాయో తెలుసుకునే మార్గం లేదు. ఇటు పెట్టుబడిదారీ వ్యవస్థ వేళ్లూనుకున్న దక్షిణ కొరియా, అమెరికా అండదండలతో బహుముఖ అభివృద్ధి సాధించింది. సోవియెట్ యూనియన్ కుప్పకూలి రష్యా ఏర్పడ్డాక ఉత్తర కొరియాతో ఆ దేశానికున్న సంబంధాలు క్రమేపీ కొడిగట్టాయి. ప్రచ్ఛన్న యుద్ధ దశ అంతమైందని, ఇక ప్రపంచం నిశ్చింతగా ఉండొచ్చని అందరూ అనుకున్నారు. అమెరికా, పాశ్చాత్య దేశాలు పేరాశకు పోనట్టయితే ఆ ఆశ సాకారమయ్యేది. అది లేకపోబట్టే ప్రపంచం మళ్లీ గతంలోకి తిరోగమిస్తున్న వైనం కనబడుతోంది. అనునిత్యం సమస్యలతో సతమతమయ్యే ఆ పరిస్థితులు తిరిగి తలెత్తటం ఖాయమన్న అంచనాలు వస్తున్నాయి.

కొన్నేళ్లక్రితం వరకూ ఉత్తర కొరియాపై కారాలు మిరియాలు నూరుతున్న పాశ్చాత్య దేశాలను రష్యా పెద్దగా పట్టించుకునేది కాదు. పొరుగునున్న చైనానుంచే ఆ దేశానికి సమస్త సహకారం లభించేది. 1994లో తనకున్న ఒక అణు రియాక్టర్‌నూ మూసేయడానికి ఉత్తర కొరియా అంగీకరించింది. అందుకు బదులుగా అమెరికా నుంచి రెండు విద్యుదుత్పాదన అణు రియాక్టర్లు స్వీకరించటానికి సిద్ధపడింది. కానీ 2002లో జార్జి డబ్ల్యూ బుష్ అధికారంలోకొచ్చాక ఆ ఒప్పందాన్ని ఏకపక్షంగా రద్దుచేశారు. ఈ పరిణామాల సమయంలోకూడా రష్యా మౌనంగానే ఉంది. శత్రువు శత్రువు తన మిత్రుడని ఎంచి ఇప్పుడు అదే రష్యా తాజాగా ఉత్తర కొరియాతో సైనిక ఒప్పందం కుదుర్చుకుంది. తన నేతృత్వంలోని వార్సా కూటమిని రద్దుచేసుకుని, నాటోలో చేరడానికి రష్యా సిద్ధపడినప్పుడు తిరస్కరించింది నాటోయే. తూర్పు దిశగా విస్తరించే ఉద్దేశం తమకు లేదని, దాని సరిహద్దు దేశాలకు నాటో సభ్యత్వం ఇవ్వబోమని హామీ ఇచ్చిన ఆ సంస్థ అందుకు విరుద్ధంగా ప్రవర్తించింది. పొరుగునున్న చిన్న దేశాలపై పెత్తనం చలాయించాలన్న యావ రష్యాకుంటే దాన్ని ఎలా దారికి తేవాలో ఆ దేశాలు నిర్ణయించుకుంటాయి. కానీ వాటితో అంటకాగి రష్యాను చికాకు పర్చటమే ధ్యేయంగా గత రెండు దశాబ్దాలుగా అమెరికా, పాశ్చాత్య దేశాలు ప్రవర్తించాయి. ఈమధ్య ఇటలీలో జీ–7 సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ శాంతియుతంగా, చర్చలద్వారా ఉక్రెయిన్ సమస్యకు పరిష్కారం అన్వేషించాలని సూచించారు. కానీ వినేదెవరు? విశ్వసనీయతగల అంతర్జాతీయ సంస్థల మధ్యవర్తిత్వంలో రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య చర్చలు జరిగితే, ఒప్పందం కుదిరితే అది ఆ రెండు దేశాలకూ మాత్రమే కాదు, ప్రపంచానికి కూడా మంచి కబురవుతుంది.

ప్రపంచం ఇప్పుడు మూడో ప్రపంచ యుద్ధం అంచుల్లో ఉంది. అమెరికా, దాని ప్రత్యర్థులు రష్యా, చైనాలు ప్రధాన అణ్వస్త్ర దేశాలు. అమెరికా వద్ద దాదాపు 1,700 అణ్వస్త్రాలున్నాయి. అందులో కనీసం సగం నిమిషాల్లో ప్రయోగించేందుకు వీలుగా నిరంతర సంసిద్ధతలో ఉంటాయంటారు. అమెరికాపై ఒక్క అణ్వస్త్రం ప్రయోగించినా క్షణాల్లో యూరప్, ఆసియా దేశాల్లోని దాని స్థావరాలనుంచి పెద్ద సంఖ్యలో అణ్వస్త్రాలు దూసుకెళ్లి శత్రు దేశాలను బూడిద చేస్తాయి. రష్యా, చైనాలపై దాడి జరిగినా ఇదే పరిస్థితి. చిత్రమేమంటే ఒకప్పుడు అణ్వాయుధాలపై బహిరంగ చర్చ జరిగేది. అది ఉద్రిక్తతల నివారణకు తోడ్పడేది. 80వ దశకంలో మధ్యతరహా అణ్వాయుధాల మోహరింపు యత్నాలు జరిగినప్పుడు అమెరికా, యూరప్ దేశాల్లో భారీయెత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఫలితంగా అప్పటి అమెరికా అధ్యక్షుడు రీగన్, నాటి సోవియెట్ అధ్యక్షుడు గోర్బచెవ్ వాటి నిషేధానికి సంసిద్ధులయ్యారు. కానీ సాధారణ ప్రజలకు సైతం యుద్ధోన్మాదం అంటించారు. ఈ పరిస్థితులు మారాలి. అగ్రరాజ్యాలు వివేకంతో మెలిగి శాంతి నెలకొనేందుకు చిత్తశుద్ధితో కృషిచేయాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం **తిథి:** పౌర్ణమి ఉ.6.29 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** మూల రా.6.38 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** సా.5.00 నుండి 6.37 వరకు, తదుపరి తె.4.06 నుండి 5.43 వరకు (తెల్లవారితే ఆదివారం), **దుర్ముహూర్తం:** ఉ.5.37 నుండి 7.14 వరకు, **అమృతఘడియలు:** ప.12.06 నుండి 1.43 వరకు, ఏరువాక పౌర్ణమి.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం: 6.33
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

ఐరాసలో పెరగనున్న పాక్ ప్రభావం

విశ్లేషణ



కేపీ నాయర్

లోక్‌సభ ఎన్నికల హడావిడిలో ఈ వార్త అంతగా దృష్టిలో పడలేదుగానీ, భద్రతా మండలిలో రెండేళ్ల కాలానికి పాకిస్తాన్ ఎన్నిక కావడం భారత్ పట్టించుకోవాల్సిన అంశమే. ఇస్లామిక్ దేశాల సహకార సంస్థ ‘ఓఐసీ’కి చెందిన ఐదు సభ్యదేశాలు భద్రతా మండలిలో ఉండటమూ పాక్‌కు కలిసొచ్చేదే. కశ్మీర్‌పై చర్చను తనకు అనుకూలంగా మార్చడానికి అది ప్రయత్నించవచ్చు. ఉక్రెయిన్‌లో యుద్ధం ప్రారంభమైన తర్వాత ఆహార భద్రత ఐరాస ఎజెండాలో కీలకమైంది. సింధు జలాల ఒప్పందానికి సంబంధించి దృఢమైన యంత్రాంగాలు ఉన్నప్పటికీ, పాక్ తన ఆహార భద్రతకు సంబంధించిన సమస్యగా ఈ అంశాన్ని చర్చలోకి తేగలదు. ఒక భారతీయుడిని ఐరాస నిర్వచించిన ఉగ్రవాది జాబితాలో చేర్చడానికి కూడా పాక్ ప్రయత్నించవచ్చు.

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలోకి పాకిస్తాన్ ఇటీవల ఎన్నికైన విషయాన్ని, భారత్‌లో విస్తృతంగా నివేదించి ఉంటే, అది భారతీయులను కలవరపరిచి ఉండేది. భారత్ లోక్‌సభ ఎన్నికల్లో కూరుకుపోవడంతో, ఐక్యరాజ్య సమితి అత్యున్నత కమిటీలో పాకిస్తాన్ స్థానం గురించిన వార్తలకు దేశంలో పెద్దగా స్పందన లభించలేదు. ఐరాసలోని 193 సభ్య దేశాలలో 182 పాకిస్తాన్‌కు అనుకూలంగా ఓటు వేసిన ఈ ఎన్నిక, మూడవ దఫా అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానానికి పెద్ద సవాలుగా మారనుంది.

2025 జనవరి 1న భద్రతామండలిలో రెండేళ్ల కాలానికి చేరనున్న పాకిస్తాన్, సోమాలియాల ఎంపికతో ఐక్యరాజ్యసమితి అత్యున్నత నిర్ణయాధికార సంస్థలో ‘ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కో ఆపరేషన్’కు చెందిన ఐదు సభ్యదేశాలు ఉంటాయి. మొత్తం ప్రపంచం చట్టబద్ధంగా కట్టుబడి ఉండే నిర్ణయాలు చేసే ఏకైక ఐరాస సంస్థ అయిన భద్రతా మండలి ఎన్నుకున్న సభ్యుల సంఖ్యలో ఇది సగం. అటువంటి నిర్ణయాలను మండలిలోని ఐదు శాశ్వత సభ్యదేశాల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ వీటో ద్వారా తిరస్కరించవచ్చన్నది మరొక విషయం. ఈ సభ్యదేశాలనే పి–5 లేదా బిగ్ ఫైవ్ అంటారు.

ఇప్పుడు ఇస్లామాబాద్‌కు ఐరాస భద్రతామండలి తలుపులు తెరిచినంత మాత్రాన, భారత్ ఏదైనా దౌత్యపరమైన ముప్పును ఎదుర్కొంటుందని అర్థం కాదు. ప్రమాదం ఉండదు, కానీ సవాలు మాత్రం ఉంటుంది. అందువల్ల, భారత్ నిశ్చింతగా ఉండకూడదు. న్యూయార్క్‌లోని ఐరాస కార్యాలయంలో భారత శాశ్వత ప్రతినిధి పదవి ఖాళీగా ఉంది. పాకిస్తాన్ తరఫున గత ఐదేళ్లుగా ఈ పదవిని నిర్వహిస్తున్న మునీర్ అక్రమ్ ఒక ఘోరమైన రాయబారి. ఆయన అంతకుముందు కూడా 2002 నుండి ఆరేళ్ల పాటు అదే పదవిలో ఉన్నారు. 1994లో ఐరాస మానవ హక్కుల సంఘం ఎజెండాలో కశ్మీర్‌ను చేర్చడంలో అక్రమ్ రహస్య దౌత్యం దాదాపుగా విజయం సాధించింది. మరుసటి సంవత్సరం, ఆయన అధికారికంగా జెనీవాలో ఐరాస శాశ్వత ప్రతినిధిగా నియమితులవడమే కాకుండా ఏడేళ్ల ఈ పదవిలో కొనసాగారు. కాబట్టి, లోక్‌సభ ఎన్నికల ప్రచారం మధ్యలో పదవీ విరమణ చేసిన భారత శాశ్వత ప్రతినిధి రుచిరా కాంబోజ్ స్థానాన్ని కొత్తగా అధికారంలోకి వచ్చిన భారత ప్రభుత్వం వెంటనే భర్తీచేయాలి.

వచ్చే ఏడాది ద్వైవార్షిక సమీక్ష కోసం కౌంటర్ టెర్రరిజం డాక్యుమెంట్ ఐక్యరాజ్యసమితి వద్దకు తిరిగి వస్తుంది. ఈ సమీక్షలోని పాతం సరిహద్దు ఉగ్రవాద బాధితురాలిగా భారత్‌కు ముఖ్యమైనది. అనేక దశాబ్దాలుగా ఉగ్రవాదాన్ని రాజ్య విధాన సాధనంగా ఉపయోగించిన పాకిస్తాన్ వంటి మొండి రాజ్యాల కారణంగా, ఉగ్రవాదానికి విశ్వవ్యాప్తంగా ఆమోదయోగ్యమైన నిర్వచనాన్ని ఐక్యరాజ్యసమితి జనరల్



అసెంబ్లీలో రూపొందించలేకపోయారు. అత్యంత కీలకమైన నిర్ణయాలు తీసుకునే ఆ సమావేశంలో సోమాలియాది కూడా సందేహాస్పద వైఖరి కావడంతో, జనరల్ అసెంబ్లీపై ఈ రెండు దేశాల ప్రభావమూ పడుతుంది.

అదే సమయంలో భారత్ మరో ప్రమాదం నుంచి తనను కాపాడుకోవలసి ఉంది. ఇస్లామిక్ దేశాల సహకార సంస్థ ‘ఓఐసీ’కి చెందిన ఐదుగురు భద్రతా మండలి సభ్యులు ఒక భారతీయుడిని ఐక్యరాజ్యసమితి నిర్వచించిన ఉగ్రవాది జాబితాలో చేర్చడానికి కలిసి పని చేసే అవకాశం ఉంది. వాళ్లు కచ్చితంగా భద్రతా మండలి ప్రసిద్ధ తీర్మానం 1267 ప్రకారం, ఒక హిందువును ఉగ్రవాది జాబితాలో చేరడాన్ని చూడాలనుకుంటారు. 1999లో ఆమోదం పొందిన ఈ తీర్మానం ప్రకారం, ఉగ్రవాది జాబితాలో చేరిన అపఖ్యాతి ఒసామా బిన్ లాడెన్‌ది. న్యూఢిల్లీలోని హిందూ జాతీయవాద ప్రభుత్వం ఈ విషయంలో ఓఐసీకి మేత అవగలదనే చెప్పాలి. అయితే 2024లోనూ, వచ్చే ఏడాదిలోనూ మోదీ నేతృత్వంలోని నూతన ప్రభుత్వం భారత్‌లో ఎలా వ్యవహరిస్తుందనే దానిపై ఇది చాలావరకు ఆధారపడి ఉంటుంది.

1267 తీర్మానంతో ఏర్పాటు చేసిన ఆంక్షల కమిటీ ద్వారా అబ్దుల్ రెహ్మాన్ మక్కీని ‘గ్లోబల్ టెర్రరిస్ట్’ జాబితాలో చేర్చడంలో అమెరికాతో కలిసి పనిచేసిన భారత్ సఫలీకృతమైంది. ఆ ఘటన పాక్ రాయబారి అక్రమ్‌ను ఇప్పటికీ గాయపరుస్తూనే ఉంది. జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాద చర్యలకు మక్కీయే కారణమని ఆ తీర్మానం ఇచ్చిన వివరణ పాక్ బాధను మరింత పెంచింది. ఈ మక్కీ లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్‌కు స్వయానా బావ.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని భారత్ రద్దు చేసిన తర్వాత, భద్రతా మండలిలో పాకిస్తాన్ ‘సంప్రదింపులు’ మాత్రమే చేయగలిగింది. ఇటువంటి ప్రక్రియ మండలి సభ్యుల మధ్య అంతర్గత చర్చలను సూచిస్తుంది. ఈ చర్చల గురించి బహిరంగంగా ఎటువంటి రికార్డూ ఉండదు. ఇప్పుడు పాక్ భద్రతా మండలిలోకి ప్రవేశించిన తర్వాత, మిగతా ఓఐసీ సభ్యదేశాల మద్దతుతో కశ్మీర్‌పై చర్చను తనకు అనుకూలంగా మార్చడానికి ప్రయత్నించవచ్చు. అవి ‘బహిరంగ సంప్రదింపుల’ ద్వారా జరిగే అవకాశం ఉంది. అంటే వాటి గురించి మీడియాకు, ప్రజలకు తెలియజేస్తారని అర్థం. సందర్భానుసారంగా ఐక్యరాజ్యసమితి సెక్రటేరియట్ కూడా ఆ చర్చల గురించి ప్రపంచానికి తెలియజేయవచ్చు. భారత్ దృక్కోణం నుండి ప్రమాదం ఏమిటంటే, ఇటువంటి జిత్తులు కొనసాగుతున్నప్పుడు కశ్మీర్ సమస్యపై ఐరాస పూర్తి దృష్టి పడుతుంది. అయినప్పటికీ భద్రతా మండలిలో వీటో కలిగివున్న పి–5 దేశాలపైనే ఏదైనా ఆధారపడి ఉంటుంది.

15 మంది సభ్యులతో కూడిన భద్రతామండలి పనికి ఆటంకం కలగకుండా గతంలో భారత్, పాక్ సహజీవనం చేశాయి. రెండు దేశాలూ చివరిసారిగా 2012లో కలిసి పనిచేశాయి. కానీ తర్వాత రెండు విషయాలు మారిపోయాయి. ఐరాసలో అప్పటి పాకిస్తాన్ మిషన్‌కు ‘డాన్’ మీడియా గ్రూప్‌ను కలిగి ఉన్న హరూన్ కుటుంబానికి చెందిన హుస్సేన్ హరూన్ నాయకత్వం వహించారు. ఆయన చాలామంది పాకిస్తాన్ కెరీర్ దౌత్యవేత్తల మాదిరిగా కాకుండా భారత్‌కు వ్యతిరేకంగా ఎప్పుడూ నోరు జారలేదు. రెండవ మార్పు ఏమిటంటే, అప్పట్లో 2012లో ప్రపంచం చాలా భిన్నమైనదిగానూ, తక్కువ సంక్లిష్టమైనదిగానూ ఉండేది.

ఇటీవలి సంవత్సరాలలో ఐరాసలో దురదృష్టవశాత్తు ప్రత్యర్థులు, శత్రువుల మధ్య రహస్య, బహిరంగ ఘర్షణకు అవకాశాలు పెరిగాయి. అందువల్ల, భారత్‌తో తన ద్వైపాక్షిక సమస్యలను అంతర్జాతీయీకరించడానికి పాకిస్తాన్‌కు మరిన్ని అవకాశాలు ఉన్నాయి. ఉదాహరణకు, ముఖ్యంగా ఉక్రెయిన్‌లో యుద్ధం ప్రారంభమైన తర్వాత ఆహార భద్రత అనేది ఐరాస ఎజెండాలో కీలకంగా ఉంది. వివాదాలను పరిష్కరించడానికి సింధు జలాల ఒప్పందానికి సంబంధించి దృఢమైన యంత్రాంగాలు ఉన్నప్పటికీ, పాకిస్తాన్ తన ఆహార భద్రతకు సంబంధించిన సమస్యగా ఈ అంశాన్ని గట్టిగా చర్చలోకి తీసుకురాగలదు. వారు తమ కుతంత్రాలలో విజయం సాధించకపోవచ్చు కానీ ఇస్లామాబాద్ ప్రయత్నం చేయకుండా మాత్రం ఉండిపోదు. ఐరోపా పార్లమెంట్ ఎన్నికలలో యూరప్ మితవాదం వైపు దూసుకెళ్లిన తర్వాత, ఐరాస చర్చల్లో ఇస్లామోఫోబియా కూడా ఎక్కువగా ఉంటుంది. భద్రతా మండలిలో ఓఐసీ దౌత్యవేత్తల సంఖ్య పెరగడం వారికి దేవుడిచ్చిన వరం. ఐక్యరాజ్యసమితిలో తన ప్రయోజనాలను ముందుకు తీసుకురావడానికి పాకిస్తాన్ దీన్ని ఎక్కువగా ఉపయోగించుకుంటుంది.

వ్యాసకర్త వ్యూహాత్మక అంశాల విశ్లేషకుడు
(‘ద ట్రిబ్యూన్’ సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఆరోగ్య యోగం



ప్రతి ఒక్కరికీ, యోగా దినోత్సవ (జూన్ 21) శుభాకాంక్షలు. శ్వాసించండి, ప్రవహించండి, దృఢంగా, ఆరోగ్యంగా ఉండండి.

– మోహన్ లాల్, నటుడు

రద్దే సరి



ప్రస్తుత నీట్ స్కామ్‌కు న్యాయమైన పరిష్కారం ఏమిటంటే, పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించడమే! ప్రతిసారీ సుప్రీం కోర్టు యథాతథ స్థితి కోసం చూడకూడదు : మోసగాళ్లు తప్పించుకొని, నిజమైన అర్హులు బాధపడాల్సి వచ్చినప్పుడు అది పరిష్కారం కాదు. ఈ దర్యాప్తులన్నీ బూటకం.

– కె.సుజాతా రావు, మాజీ ఉన్నతాధికారి

చక్కెర నీళ్లు ప్రమాదకరం



మొత్తానికి, ఉత్పత్తులను బలపరుస్తున్నప్పుడు అవి వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా, నష్టం కలిగించేలా ఉండకుండా చూసుకునే బాధ్యత సెలబ్రిటీల మీద ఉందని సుప్రీం కోర్టు పేర్కొంది. ముందు కోలాలు, చక్కెర ద్రావకాలతో మొదలెడదాం. ఒకవేళ 10 శాతం మంది భారతీయులకు మధుమేహం ఉంటే, అది ఉన్నట్టు తెలియని మరో 50 శాతం మందిని కలుపుకోవాలి. అందుకే వాటిని ప్రమోట్ చేసేవాళ్లు అవి ఆరోగ్యానికి తీవ్ర ప్రమాదకరమని జతచేయాలి.

– శేఖర్ కపూర్, దర్శకుడు

ఇంత ఈజీనా?



తాను అమెరికా అధ్యక్షుడినైతే, అమెరికా కళాశాలల్లో తమ డిగ్రీ పూర్తవగానే విదేశీ విద్యార్థులకు గ్రీన్ కార్డ్(శాశ్వత నివాస కార్డు) అందుతుందని డోనాల్డ్ ట్రంప్ వాగ్దానం చేశారు. ఆశ్చర్యకరం!

– ఆర్తీ టిక్కూ సింగ్, జర్నలిస్ట్

మూక న్యాయం



సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన ఈ వీడియోలో(షేర్ చేశారు), దైవదూషణ ఆరోపణలతో స్వాత్ లోయలో ఒక పాకిస్తానీ మనిషిని ఒక మూక సజీవంగా తగలబెట్టింది. బాడీని చుట్టుముట్టిన పెద్ద మూకలోని జనాలు ఆ దాడిని చిత్రించేందుకు ఫ్లాష్‌లైట్లు ఉన్న కెమెరాలు వాడుతున్నారు. ఇస్లామిక్ రిపబ్లిక్ పాకిస్తాన్‌కు స్వాగతం!

– తాహా సిద్ధిఖీ, పాక్ కాలమిస్ట్

తోలుబొమ్మ రాకుండా...



తర్వాతి దలై లామాగా ఒక తోలుబొమ్మను ప్రతిష్ఠించాలన్న షీ జిన్‌పింగ్ పథకాన్ని భగ్నం చేయడానికి అమెరికా, ఇండియా కలిసి పనిచేయాలి. అందుకే, మైకేల్ మెక్‌కౌల్, నాన్సీ పెలోసీల నేతృత్వంలోని ఉభయపక్ష అమెరికా కాంగ్రెస్ ప్రతినిధులు ధర్మశాలలోని దలై లామాతో చర్చలు జరిపిన అనంతరం, వారిని మోదీ కలిసి మంచిపని చేశారు.

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల వ్యాఖ్యాత

నవీన రత్నం



నాటుదనపు ఒడిశాను ఆధునికత దిశగా మళ్లించే సుదీర్ఘ కవాతుకు నవీన్ పట్నాయక్ నేతృత్వం వహించి, తన శకాన్ని ఘనంగా ముగించారు. ఆడంబరాలు లేవు, మూలుగులు లేవు, గోల లేదు. దిగిపోతూ, ప్రజాస్వామ్యం నన్ను ఇక్కడికి తెచ్చింది, ప్రజాస్వామ్యం అధికారం తీసుకుని వెళ్లింది అన్న సందేశం ఇచ్చారు. నవీన్ పట్నాయక్ నిజమైన భారత రత్న!

– ఎం.జె.అక్బర్, సంపాదకుడు

ఇన్ బాక్స్

‘నీట్’ను రద్దుచేయాలి!

ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీల్లో ప్రవేశ నిమిత్తం నిర్వహించే ‘నీట్’ పరీక్ష విశ్వసనీయతపై అనుమానాలు, ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఏడాది ఈ పరీక్ష పేపర్ లీక్ అయ్యిందనే వార్త దేశవ్యాప్తంగా సుమారు 24 లక్షల మంది విద్యార్థులకు మనోవేదననే మిగిల్చింది. గ్రామాలూ, చిన్నా చితకా పట్టణాల నుంచి నగరాలకు పంపించి తమ పిల్లలకు కోచింగ్ ఇప్పించిన తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. 2017 నుంచి కేంద్ర విద్యా శాఖ పరిధిలోని ఎన్టీఏ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షలు రోజు రోజుకూ విశ్వసనీయతను కోల్పోతున్నాయి. నీట్ పరీక్షల్లో బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలోనే ఎక్కువగా అవినీతి జరిగింది. ఇందుకు ఆ రాష్ట్రాల్లో రాసిన విద్యార్థులకు మాత్రమే మొదటి ర్యాంక్స్ రావడం సాక్ష్యం. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కేవలం రెండు చోట్ల మాత్రమే అక్రమాలు జరిగాయని ఒప్పుకోవడం ఈ సందర్భంగా గమనార్హం.

పేపర్ లీకేజీ జరిగినట్లు, నడిబజార్లో నీట్ పేపర్ చేతులు మారినట్లు, ఒక్కో పేపర్‌ను రూ. 30 లక్షలకు అమ్ముకున్నట్లు చెబుతున్నారు. ఒకపక్క నీట్ పేపర్ లీకేజీపై గొడ జరుగుతుండగానే యూజీసీ నిర్వహించే ‘నెట్’ (ఎన్ఈటీ) పరీక్షల్లో అవకతవకలు జరిగినట్లు బయటపడటంతో... ఒక్కరోజు వ్యవధిలోనే నెట్ పరీక్షను యూజీసీ రద్దు చేసింది. నీట్ విషయంలో ఇటువంటి నిర్ణయం ఎన్టీఏ ఎందుకు తీసుకోవడంలేదో మరి! ఈ పరీక్షను రద్దు చేసి మళ్లీ పకడ్బందీగా నిర్వహించాలని విద్యార్థులూ, తల్లిదండ్రులూ కోరుతున్నారు.

– డాక్టర్ మండ్ల రవి, హైదరాబాద్

నిజాయితీ లేమిలో పోటాపోటీ



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

‘సిగ్గు లేని వాడు చిరకాల జీవిరా’ అన్నాడు వేమన మహాకవి. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో వాడిన 20 లక్షల ‘ఈవీఎం’ల అతీగతీ ఏమైనట్టు? కనపడకుండా లెక్కకు రాకుండా ఎటుపోయినట్టు? ప్రజల నుంచీ, కమ్యూనిస్టుల నుంచి వస్తున్న ఈ విమర్శలపై తమ ‘విజయా’నికి ఉబ్బితబ్బిబ్బైపోతున్న టీడీపీ నాయకుడు చంద్రబాబు నాయుడు స్పందించి తీరాలి. ఆ మాటే అన్నారు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్. ఆయన టీడీపీ అధినేత చూపే లెక్కల్ని గుచ్చి గుచ్చి అడగడంతో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఎన్నికైన తీరును సర్వత్రా ప్రశ్నించడం మొదలైంది. ఎందుకంటే చంద్రబాబే చెప్పినట్టుగా ఈ ఎన్నికల నిమిత్తం 60 లక్షల ఈవీఎమ్‌లు ఎన్నికల కమిషన్ సిద్ధం చేసుకుంది. వీటిలో 40 లక్షల మెషీన్లనే వాడింది. మరి మిగతా 20 లక్షల మెషీన్లు ఎక్కడో ఉండాలి కదా? ఆ సంగతే సమాచార చట్టం ప్రకారం ఎన్నికల కమిషన్‌ను కోరితే ఆ విషయం తమకేమీ తెలీదని సమాధానం ఇచ్చిందట! ఇది సరికాదు. ప్రభుత్వం తమకిచ్చిన ‘ఈవీఎమ్’లనే వాడామని కమిషన్ చెప్పడం కచ్చితంగా రెటమతమే. లోగడ ఈ విషయం గురించి చంద్రబాబే అనుమానాలను వ్యక్తం చేసి ఉన్నందున... ఇపుడు అదే గోల్‌మాల్ జరిగి ఉన్నందున, విచారణకు బాబు కోరడానికి నిరాకరిస్తున్నట్టున్నారని ఉండవల్లి అభిప్రాయం.

ఇదిలా ఉండగానే, క్షీణ దశలో ఉన్న బీజేపీ ప్రయోజనాల కోసం తంటాలు పడుతున్న మోదీ... అటు చంద్రబాబునీ, ఇటు బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌నూ ఎలా జాతీయ స్థాయిలో తన జేబులో బొమ్మల్లా వాడుకోబోతున్నారో ‘హిందూ’ దినపత్రిక తాను ముద్రించిన ఒక కార్టూన్‌లో ఉదాహరించింది! మోదీ మూడవసారి అధికారానికి రావాలంటే ఇద్దరు తైనాతీ ముఖ్యమంత్రులు– బాబు, నితీశ్‌లు అవసరం. కనుక ఈ ఇరువురి తల మీద పెట్టిన పీఠం మీద నుంచుని మోదీ ‘ఎన్డీఏ’ తరఫున

రెండో మాట



‘ఘనంగా’ ప్రకటన విడుదల చేస్తాడు! తాము రెండు రాష్ట్రాలకు గౌరవ ముఖ్యమంత్రులమన్న స్పృహ మాత్రం ఈ ముఖ్యమంత్రులకు ఏ కోశానా లేదనేది ఈ చిత్ర సారాంశం! ఇలాంటి వాళ్లు ఎన్డీఏకైనా జాతీయ స్థాయిలో ఎలా సేవలందించగలరో బాబు– నితీశ్‌లే చెప్పాలి.

భారత రాజ్యాంగాన్ని ఈ పదేళ్ల పాలనా కాలంలో మోదీ తుంగలో తొక్కారు. ఇజ్రాయెల్ సామ్రాజ్యవాద ప్రభుత్వంతో అంటకాగుతూ ... ఆ దేశం నుంచి కొన్న పెగాసెస్ సాఫ్ట్‌వేర్ ద్వారా భారతదేశ అభ్యుదయ వాదులూ, పౌరహక్కుల ఉద్యమకారులూ... ఒక్క మాటలో చెప్పాలంటే పాలక వర్గ ప్రజా వ్యతిరేక విధానాలను విమర్శిస్తూ, ఆందోళన చేస్తున్న వివిధ ప్రజా సంఘాల కార్యకర్తలూ, ప్రజా నాయకులపై నిఘా పెట్టి వేధింపులకు గురిచేసింది మోదీ సర్కార్. ఆ విధంగా రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన ప్రాథమిక హక్కుల్లో ఒకటైన వాక్ స్వాతంత్ర్యాన్ని హరించింది. అలాగే సమాఖ్య తత్వాన్ని దెబ్బతీసే ప్రకటనలూ మోదీ ప్రభుత్వం చేసింది. మైనారిటీలను ఈ దేశ పౌరులే కాదన్నట్లు చొరబాటుదారులుగా చిత్రించారు మోదీ. బీజేపీ నాయకులు కొందరు బహిరంగంగా తమకు 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చివేస్తామని ప్రకటించారు. చివరికి ఎన్నికల్లో బీజేపీకి సొంత మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగినన్ని సీట్లు కూడా లభించకపోవడంతో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల వెన్నుదన్నుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది ఆ పార్టీ. ఈ నేపథ్యంలో మోదీ రాజ్యాంగాన్ని ‘మార్చబోమ’ని చెప్పడం అనివార్యమయ్యింది.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని సాధించడంలో కేంద్రం ఒత్తిళ్లకు లొంగిపోయి ‘విఫల ముఖ్యమంత్రి’గా ప్రజల దృష్టిలో మిగిలిపోయారు చంద్రబాబు. చివరికి మోదీ పోలవరాన్ని ఏటీఎంగా చంద్రబాబు మలచుకున్నారని విమర్శించినా పట్టించుకోకుండా మళ్లీ ఆయన బీజేపీ పొత్తుపెట్టుకున్నారు. దీని వెనుక మతలబు... జనసేన నేత పవన్‌కల్యాణ్‌కు బాబును అదుపులో ఉంచేపనిని మోదీ అప్పగించడమే! పవన్ ఈ పదవీ కుమ్ములాటలో మోదీ చేతిలో ఓ ‘సత్తరకాయ’; పవన్, చంద్రబాబు బీజేపీ నేత మోదీ చేతి పావులు. ఎన్డీఏ బతుకు జాతీయ స్థాయిలో ‘కుక్కలు చింపిన విస్తరి’ అయితే ఆశ్చర్యం లేదు!

abkprasad2006@yahoo.co.in

ధర్మకార్యాలకు వెచ్చించాలి!

దైవ సంకల్పితంగా అని భావించినా, లేక ప్రకృతి నిర్దేశించిన విధంగా అనుకున్నా ‘శతవర్ష పర్యంతమైన జీవితాన్ని పొందిన మానవుడు, ఆ వందేళ్ళలో ఏం చేస్తూ గడిపితే జీవితం అర్థవంతమైనదిగా పరిగణించబడి అందరి మన్ననలను పొందుతుంది?’ అనే ప్రశ్న మనిషిని మొదటినుంచి ఆలోచింపజేసింది. సూక్ష్మంగా చెప్పాలంటే, కష్టించి పని చేసి ధనాన్ని కూడబెట్టడం, అలా కూడబెట్టిన ధనంలోంచి కొంత భాగాన్ని శాస్త్రసమ్మతమైన సామాన్యమైనవో లేక తాహతుకొలదీ విశేషమైనవో అయిన క్రతువులకు ఖర్చుపెట్టడం జీవితానికి సంతృప్తిని ఇచ్చే



జ్యోతిర్మయం

ఒక సన్మార్గమని పై ప్రశ్నకు సమాధానంగా ఆంధ్ర మహాభారతంలోని శాంతిపర్వం చెప్పింది.

కేవలం డబ్బు సంపాదించడం అనే ఒక్క కర్మతోనే జీవితం గడవకూడదనీ, దానికి తోడుగా క్రతువుల ద్వారా ఖర్చుపెట్టడం కూడా జరిగినప్పుడే దేవతలకూ, తద్వారా దేవతల వంటి మానవులకూ తృప్తి కలగడం జరుగుతుందనీ, అలా కాకుండా దానికి విరుద్ధంగా, కేవలం సంపాదించి కూడబెట్టడంతోనే జీవితాన్ని కొనసాగించాలనుకోవడం వివేకంతో కూడుకున్న పని కాబోదనీ, ధర్మవిరుద్ధంగా అలా చేస్తే అది మిక్కిలి పాపహేతువు అవుతుందనీ, అనుకోని కష్టాలను, ఊహించని అనర్థాలను కలిగించేదిగా పరిణమిస్తుందనీ వేదవిదులు అంటారని శాంతిపర్వంలోని ఈ కందపద్యం స్పష్టం చేసింది.

జతనంబున నర్థము సం
చితముగ గావించి క్రతువిశేషంబుల దే
వతలం దృప్తుల జేయమి
యతికిల్బిషకారి యందు రాగమవేదుల్.

కనుక, కాయకష్టం చేసి కూడబెట్టడమే కాదు, శక్తి కొలది అందులో కొంత భాగాన్ని క్రతువులు అనగా ధర్మకార్యాలకు సంతోషంగా ఖర్చు చేయడం కూడా ఆచరించే ధర్మంలో భాగంగా తలచడం మనిషికి శ్రేయోదాయకం. అలా నడుచుకున్నప్పుడు జీవితం సజావుగా సాగి శాంతిని చేకూరుస్తుంది. నలుగురిలో మనిషి కొనసాగించాల్సిన సుహృద్భావ జీవన విధానానికి అది మార్గమవుతుంది అని సారాంశం.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

జొన్నగిరిలో వజ్రం లభ్యం

తుగ్గలి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరిలో పొలం పనులకు వెళ్లిన ఓ రైతుకు గురువారం వజ్రం దొరికినట్లు సమాచారం. ఈ వజ్రాన్ని శుక్రవారం ఓ వజ్రాల వ్యాపారి రూ.2.90 లక్షలకు కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఏటా తొలకరి వర్షాలకు ఈ ప్రాంతంలో విలువైన వజ్రాలు లభ్యమవుతుంటాయి.

'నారాయణ'లో అక్రమంగా విక్రయిస్తున్న విద్యా సామగ్రి సీజ్

- భీమవరంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళనతో స్పందించిన అధికారులు


విద్యా సామగ్రిని సీజ్ చేస్తున్న ఉప విద్యాశాఖాధికారి

భీమవరం: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని నారాయణ పాఠశాలలో విక్రయిస్తున్న విద్యాసామగ్రిని శుక్రవారం అధికారులు సీజ్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు... భీమవరం పట్టణంలోని వంశీకృష్ణనగర్‌లో ఉన్న నారాయణ స్కూల్లో విద్యార్థుల నుంచి పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేయడమేగాక పుస్తకాలు, యూనిఫాం వంటివి విక్రయించడం పరిపాటిగా మారింది. ఈ ఏడాది తరగతులు ప్రారంభం కాకముందు నుంచే పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తూ విద్యార్థులను తమ వద్దే కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్న పుస్తకాలు, యూనిఫాం వంటివి కొనుగోలు చేయలేని కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి జి.గణేష్ ఆధ్వర్యంలో స్కూల్ వద్ద ఆందోళన చేపట్టారు. దీంతో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి శ్రీరామ్ వచ్చి నారాయణ స్కూల్లో విక్రయిస్తున్న విద్యా సామగ్రిని పరిశీలించి వాటిని సీజ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జి.శ్రీను, బి.సిద్దు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీపద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు

- గరుడ వాహనంపై అమ్మవారి దర్శనం



చంద్రగిరి(తిరుపతి జిల్లా): తిరుచానూరులో ఐదు రోజులుగా జరుగుతున్న శ్రీపద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు శుక్రవారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్ర నామార్చన, నిత్యార్చన నిర్వహించారు. మధ్యాహ్నం నీరాడ మండపంలో శ్రీ పద్మావతి అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు, పసుపు, చందనంతో అభిషేకం జరిపారు. సాయంత్రం 6.30 గంటల నుంచి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. పుష్కరిణిలో తెప్పపై అమ్మవారు ఏడు చుట్లు తిరిగి భక్తులను కటాక్షించారు. అనంతరం శ్రీ పద్మావతి అమ్మవారు గరుడ వాహనాన్ని అధిష్టించి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, ఆలయ అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ శేషగిరి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు సుభాష్, గణేష్ పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూల్లో నాణ్యత పెంచండి

- పోటు కార్మికులకు టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశం



తిరుమల: నాణ్యమైన నెయ్యి, శెనగపిండి, యాలకులు ఉపయోగించి మరింత రుచికరంగా, నాణ్యంగా శ్రీవారి లడ్డూల శాంపిల్స్ తయారు చేయాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు పోటు కార్మికులను ఆదేశించారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి గృహంలో శుక్రవారం లడ్డూ తయారీపై జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్‌వో నరసింహ కిషోర్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు.లడ్డూ తయారీలో ఉన్న సమస్యలు, నాణ్యతా లోపంపై వస్తున్న విమర్శలకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోటు కార్మికులు లడ్డూల తయారీలో వినియోగిస్తున్న శెనగపిండి, నెయ్యి, యాలకుల నాణ్యతను పెంపొందించాలని అభిప్రాయ పడ్డారు. పనిభారం పెరిగిందని..అదనపు సిబ్బందిని నియమించాలని వారు ఈవోకు విన్నవించారు. అనంతరం ఈవో మాట్లాడుతూ అత్యంత నాణ్యమైన నెయ్యి, ఇతర పదార్థాలను ఉపయోగించి రుచికరమైన లడ్డూల నమూనాలను (శాంపిల్స్)తయారు చేసి రుచి, నాణ్యతను పరిశీలించాలని కోరారు.

అపరాలే బెస్ట్

కందులు, మినుములు, పెసలకు మంచి ధరలు వచ్చే అవకాశం.. / పసుపు, వేరుశనగ పంటలకు కూడా..



- ప్రకటించిన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రం
- మిరపలో తేజా రకానికే అవకాశం
- మన వ్యవసాయ ఉత్పత్తులకు ఆసియా, ఆఫ్రికా నుంచి డిమాండ్
- గణనీయంగా పెరగనున్న సన్నబియ్యం ఎగుమతులు
- ఖరీఫ్-2024-25 పంట ఉత్పత్తుల అంచనా ధరల వెల్లడి
- అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్, సాగు, దిగుబడులను బట్టి అంచనా

సాక్షి, అమరావతి: రైతులు విత్తు నాటుకునేటప్పుడే కోత సమయంలో తమ పంట ఉత్పత్తులకు ఎంత ధర లభిస్తుందో తెలిస్తే వారికి చాలా ప్రయోజనం ఉంటుంది. ఏ పంట ఉత్పత్తులకు మంచి ధరలు లభించే అవకాశం ఉందో తెలిస్తే ఆ పంటలనే సాగు చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో ఖరీఫ్ పంటలు కోతకొచ్చే సమయంలో మార్కెట్‌లో ధరలు ఎలా ఉండబోతున్నాయో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పని చేసే వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రం (ఏఎంఐసీ) అంచనా వేస్తోంది. విత్తుకునే సమయంలో ఉండే ధరలు కోతకొచ్చేవేళ ఉండకపోవడంతో రైతులు ఏటా తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2019లో ఏఎంఐసీని ఏర్పాటు చేశారు. దీనిద్వారా సీజన్ల వారీగా నిర్దేశించిన పంటల సాగు లక్ష్యం, సాధారణ వాతావరణ పరిస్థితులు, దిగుబడులు, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ స్థితిగతులు, వివిధ మార్కెట్ సర్వేల సమాచారం, 25–30 ఏళ్ల మార్కెట్ ధరల హెచ్చుతగ్గులను శాస్త్రీయంగా అంచనా వేస్తున్నారు. సమగ్ర కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ప్యాకేజీల ద్వారా శాస్త్రీయంగా మూల్యాంకనం చేస్తున్నారు. వీటితో పాటు విశ్వవిద్యాలయ గణాంక విభాగ నిపుణులు లోతైన అధ్యయనం చేశాక ఖచ్చితమైన ప్రమాణాల ఆధారంగా పంట ఉత్పత్తులకు ముందస్తు మార్కెట్ ధరలను ఏఎంఐసీ అంచనా వేస్తోంది.

తేజా మిరపకే విదేశాల్లో గిరాకీ

ఖరీఫ్‌లో ఎక్కువగా సాగయ్యే మిర్చి విషయానికి వస్తే అధిక ఉత్పత్తి ఫలితంగా ధరలు తగ్గే అవకాశం ఉందని ఏఎంఐసీ అంచనా వేసింది. తేజా రకం మిరపకు మాత్రమే ఎగుమతి రకంగా డిమాండ్ ఉంది. మిగిలిన రకాలకు పెద్దగా ధర లభించే అవకాశాలు ఉండవని అంచనా. ప్రస్తుతం అంచనా వేసిన ముందస్తు ధరలు పంట కోత సమయంలో మద్దతు ధరకు దగ్గరగా లేదా హెచ్చుగా ఉంటాయని ఏఐఎంసీ తెలిపింది. ఇప్పటివరకు విడుదల చేసిన అంచనా ధరల వివరాలను www.angrau.ac.in లో పొందుపర్చింది. వీటిపై విశ్వవిద్యాలయ పరిశోధన, విస్తరణ విభాగాలతో పాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మరింత సమాచారం కోసం ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రంలోనూ సంప్రదించొచ్చు. అయితే వాతావరణంలో అసాధారణ మార్పులు, వరదలు, అకాల వర్షాలు, తుపాన్‌లు వంటి ప్రకృతి వైపరీత్యాల ప్రభావం దిగుబడులపై ప్రభావం చూపుతుంది. ఫలితంగా అంచనా ధరల హెచ్చుతగ్గుల్లో కూడా మార్పులు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదని ఏఎంఐసీ ప్రకటించింది.

ఈ ఉత్పత్తులకు మంచి ధరలు

ఖరీఫ్–2024–25 సీజన్ ఊపందుకుంటోంది. 149.32 లక్షల ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటల సాగవుతాయని అంచనా వేశారు. ఏఎంఐసీ అంచనా ప్రకారం.. ఈసారి వరి, మొక్కజొన్న, పత్తితో పోలిస్తే అపరాలు, మిరప, పసుపు, వేరుశనగ పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి ధరలు లభిస్తాయి. ముఖ్యంగా కందులు, మినుములు, పెసలు రైతులకు మార్కెట్‌లో మంచి ధరలు దక్కుతాయి. తక్కువ ఉత్పత్తి ఖర్చు, స్థిరమైన దేశీయ గిరాకీ, డిమాండ్ కారణంగా ఈ పంటల రైతులు మంచి రాబడిని పొందే వీలుంది. ఆసియా, ఆఫ్రికా దేశాల నుంచి మన వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతోంది. ముఖ్యంగా సన్నబియ్యం ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయి. ఫలితంగా ఈ రకాలు సాగు చేసే రైతులకు మంచి ధర లభిస్తుంది. మిగిలిన వరి రకాల ధరలు కూడా స్థిరంగానే ఉండనున్నాయని ఏఎంఐసీ అంచనా వేసింది. అలాగే బంగ్లాదేశ్, చైనా, వియత్నాం దేశాలకు గణనీయంగా మెరుగుపడిన ఎగుమతుల ద్వారా పత్తి ధరలు లాభదాయకంగా ఉంటాయని అంచనా. ఎగుమతులు పెరగడం, తక్కువ ఉత్పత్తి కారణంగా పసుపు ధరలు కూడా ఆశాజనకంగా ఉండబోతున్నాయి.

పంటల రకాలు, కనీస మద్దతు ధర, అంచనా ధరల వివరాలు ఇలా..

పంట రకం	కనీస మద్దతు ధర (2024-25) రూ.ల్లో	అంచనా ధర (రూ.ల్లో)	వర్తించే కాలం (2024-25)
వరి సాధారణ రకం	2,300	2,200-2,350	నవంబర్-డిసెంబర్
వరి ఏ గ్రేడ్ రకం	2,320	2,300-2,575	నవంబర్-ఫిబ్రవరి
పత్తి	7,121-7,521	6,800-7,250	నవంబర్-ఫిబ్రవరి
మిర్చి సాధారణ రకం	--	13,500-17,000	జనవరి-ఏప్రిల్
మిర్చి ప్రత్యేక రకం	--	16,500-19,500	జనవరి-ఏప్రిల్
పసుపు కాయలు	--	9,500-10,250	ఫిబ్రవరి-ఏప్రిల్
పసుపు కొమ్ములు	--	10,000-11,100	ఫిబ్రవరి-ఏప్రిల్
మొక్కజొన్న	2,225	1,970-2,175	అక్టోబర్-డిసెంబర్
జొన్న (హైబ్రిడ్)	3,371	2,800-3,200	అక్టోబర్-నవంబర్
కందులు	7,550	8,600-9,300	జనవరి-మార్చి
మినుములు	7,400	8,400-9,000	సెప్టెంబర్-నవంబర్
పెసలు	8,682	8,600-9,250	సెప్టెంబర్-నవంబర్
వేరుశనగ	6,783	6,800-7,350	డిసెంబర్-జనవరి

విత్తుకునే ముందు రైతులకు సమాచారం



ప్రధాన పంట ఉత్పత్తులకు ముందస్తు ధరలను నిర్ణయించేటప్పుడు పంట నిల్వలు, సాగు విస్తీర్ణం, ఎగుమతులు, దిగుమతులు, వ్యాపారుల అంచనాలు మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకుంటున్నాం. ఏటా రాష్ట్రంలో సాగయ్యే ప్రధాన పంట ఉత్పత్తుల ముందస్తు అంచనా ధరలను అంచనా వేసి విత్తుకునే ముందు రైతులకు స్పష్టమైన సమాచారం అందిస్తున్నాం. విశ్వవిద్యాలయ పరిశోధన, విస్తరణ విభాగాలను సంప్రదించి పంటసాగు నిర్ణయాలను తీసుకునేలా ఏఎంఐసీ రైతులకు అవసరమైన తోడ్పాటునందిస్తోంది.

– డాక్టర్ జి.రఘునాథ్‌రెడ్డి, ప్రధాన పరిశోధకులు, వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్ సెంటర్

కచ్చితమైన సమాచారంతోనే రైతుకు మేలు



ప్రస్తుతం పంటల మార్కెట్ ధరలు.. డిమాండ్ సరఫరా సూత్రంతో పాటు స్థానికత, దేశ అవసరాలు, విదేశాలకు ఎగుమతులపైనే ఆధారపడి ఉన్నాయి. రైతులకు సకాలంలో ఖచ్చితమైన మార్కెట్ సమాచారాన్ని అందించడం కీలకం. పంటల ఉత్పత్తి సరఫరా కంటే మార్కెట్ ఆధారిత డిమాండ్‌ను గుర్తించడం చాలా ముఖ్యం. స్వాతంత్ర్యం వచ్చాక ఆహార ధాన్యాల ఉత్పత్తి ఆరు రెట్లు పెరిగినప్పటికీ.. మెజార్టీ రైతులకు నేటికీ నికర ఆదాయం దక్కని పరిస్థితి నెలకొంది. ఏపీ తరహాలోనే ప్రతి రాష్ట్రం తప్పనిసరిగా అగ్రికల్చర్ మార్కెట్ ఇంటెలిజెన్స్ సెంటర్‌ను కలిగి ఉండాలి. ఖచ్చితమైన సమాచారంతో పంటల సాగు ప్రణాళిక రూపొందించుకోవడం వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీతత్వం పెరుగుతుంది.. రైతుల ఆదాయం రెట్టింపు అవుతుంది.

– డాక్టర్ శారద జయలక్ష్మీదేవి, వీసీ, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

అర్ధరాత్రి దోపిడీ దొంగల స్వైరవిహారం

- రోడ్డుపక్కన ఆపిన మినీ బస్సులపై రాళ్ల దాడి
- ముగ్గురు డ్రైవర్లకు తీవ్ర గాయాలు
- శ్రీసత్యసాయి జిల్లాలో ఘటన


రాళ్ల దాడిలో ధ్వంసం అయిన బస్సు అద్దాలు

చెన్నేకొత్తపల్లి: శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని చెన్నేకొత్తపల్లి మండలం ఎన్‌ఎస్‌గేట్ సమీపంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి దోపిడీ దొంగలు స్వైర విహారం చేశారు. ఆపి ఉన్న మూడు బస్సులపై రాళ్ల దాడి చేయడంతో వాటిలో నిద్రిస్తున్న ముగ్గురు డ్రైవర్లు తీవ్రంగా గాయపడగా.. వారి వద్ద నుంచి రూ. 15వేలు దోచుకుని దుండగులు పరారయ్యారు. పోలీసులు, బాధితుల కథనం మేరకు..హైదరాబాద్‌లో కొనుగోలు చేసిన మూడు మినీ స్కూల్ బస్సులను డ్రైవర్లు శ్రీనివాస్, మహేష్, రవి తీసుకుని కేరళ రాష్ట్రానికి బయలుదేరారు. అప్పటికే చాలాదూరం ప్రయాణించడంతో అలసిపోయిన డ్రైవర్లు గురువారం రాత్రి మార్గమధ్యంలోని చెన్నేకొత్తపల్లి మండలం ఎన్‌ఎస్‌గేట్ సమీపంలోని 44వ నంబరు జాతీయ రహదారి పక్కన బస్సులను ఆపి నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో కొందరు దుండగులు బస్సుల వద్దకు చేరుకుని రాళ్లు విసిరారు. దీంతో బస్సుల అద్దాలు పగలడంతో పాటు ముగ్గురు డ్రైవర్లూ తీవ్రంగా గాయపడ్డారు. ఇదే క్రమంలో ఒకరి వద్ద రూ.5 వేలు, మరో డ్రైవర్ వద్ద నుంచి రూ.10 వేల నగదు లాక్కున్నారు. గమనించిన సమీపంలోని దాబా సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకునే లోపే దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. గాయపడిన డ్రైవర్లను 108 వాహనంలో చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు.

తిరుమలలో ముగిసిన జ్యేష్ఠాభిషేకం

వేడుకగా శ్రీవారికి స్వర్ణ కవచ సమర్పణ



తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న జ్యేష్ఠాభిషేకం శుక్రవారం ముగిసింది. చివరిరోజు ఉభయదేవేరులతో కలిసి శ్రీమలయప్పస్వామి బంగారు కవచంలో పునర్దర్శనమిచ్చారు. మళ్లీ జ్యేష్ఠాభిషేకం వరకు సంవత్సరం పొడవునా స్వామి, అమ్మవార్లు ఈ బంగారు కవచంతో ఉంటారు. ఈ సందర్భంగా ఉదయం మలయప్ప స్వామివారు ఉభయదేవేరులతో కలిసి శ్రీవారి ఆలయంలోని సంపంగి ప్రాకారానికి వేంచేపు చేశారు. ఆలయ అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా మహాశాంతి హోమం నిర్వహించారు. శ్రీమలయప్ప స్వామికి, దేవేరులకు శతకలశ తిరుమంజనం జరిపారు. అనంతరం స్వర్ణ కవచాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి స్వర్ణ కవచ సమర్పణ వేడుకగా జరిగింది. సహస్రదీపాలంకరణ సేవ అనంతరం స్వామి, అమ్మవార్లు ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, జేఈవో వీరబ్రహ్మం పాల్గొన్నారు.

నేడు పౌర్ణమి గరుడసేవ: తిరుమలలో పౌర్ణమి సందర్భంగా శనివారం గరుడ సేవ జరుగనుంది. రాత్రి ఏడు నుంచి తొమ్మిది గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామి వారు గరుడ వాహనాన్ని అధిరోహించి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు న్యాయమూర్తికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్నవారిలో తెలంగాణ ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి ఉన్నారు.


ఆలయం వెలుపల కుటుంబ సభ్యులతో జస్టిస్ ఏవీ రవీంద్రబాబు

విహారం.. విషాదం

- సముద్రంలో నలుగురు యువకులు గల్లంతు
- తీరానికి కొట్టుకొచ్చిన ఇద్దరి మృతదేహాలు
- మరో ఇద్దరి కోసం గాలింపు
- బాపట్ల జిల్లా వేటపాలెం వద్ద ఘటన


తీరానికి కొట్టుకొచ్చిన తేజ, కిశోర్ మృతదేహాలు

వేటపాలెం: సరదాగా గడిపేందుకు విహారయాత్రకు వచ్చిన నలుగురు యువకులు సముద్రంలో గల్లంతయ్యారు. బాపట్ల జిల్లా, వేటపాలెం మండలం, రామాపురం బీచ్ వద్ద శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఏలూరు జిల్లా పెదవేగి మండలం, దుగ్గిరాలకు చెందిన 12 మంది స్నేహితులు రామాపురం బీచ్‌కు విహారయాత్ర నిమిత్తం వచ్చారు. వీరంతా సముద్రంలో స్నానాల కోసం దిగారు. వారిలో గోటికల తేజ (18), జాల కిశోర్ (18), చక్కమాల నితిన్ (18), కోరు అమలరాజు (19) సముద్రం నీటిలో లోతుగా ఉన్న ప్రదేశానికి వెళ్లారు. అదే సమయంలో వేగంగా అలలు రావడంతో ఆ తాకిడికి మునిగి గల్లంతయ్యారు. వీరిలో జాల కిశోర్, గోటికల తేజ మృతదేహాలు తీరానికి కొట్టుకొచ్చాయి. చక్కమాల నితిన్, అమలరాజు ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. వీరి కోసం మెరైన్ పోలీస్‌లు, మత్స్యకారులు గాలిస్తున్నారు. గోటికల తేజ ఐటీఐ చదువుతుండగా, జాల కిశోర్ పెళ్లిళ్లకు డెకరేషన్ చేస్తుంటాడు. చక్కమాల నితిన్ పాలిటెక్నిక్ చదువుతుండగా, కోరు అమలరాజు ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఘటనా స్థలాన్ని ఈపురుపాలెం ఏఎస్సై శివకుమారి పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

చీరాలలో హత్యాచారం!

- బహిర్భూమికి వెళ్లిన యువతిపై లైంగిక దాడికి పాల్పడి హత్య
- మృతురాలి కుటుంబానికి హోంమంత్రి అనిత పరామర్శ
- రూ.పది లక్షలు పరిహారం ప్రకటించిన ప్రభుత్వం


మీడియాతో మాట్లాడుతున్న హోంమంత్రి అనిత

చీరాల: బహిర్భూమికి వెళ్లిన యువతి(21)పై లైంగిక దాడికి పాల్పడి పాశవికంగా హతమార్చిన ఘటన బాపట్ల జిల్లాలో చోటు చేసుకుంది. కొన్నేళ్ల క్రితం నెల్లూరు జిల్లా గూడూరు నుంచి వలస వచ్చిన బాధితురాలి కుటుంబం చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెంలోని సీతారామపురంలో నివసిస్తోంది. ఇంటర్ పూర్తి చేసిన బాధితురాలు రెండేళ్లుగా ఇంటి వద్ద టైలరింగ్ పనులతో కుటుంబానికి ఆసరాగా ఉంటోంది. ఆమె తల్లిదండ్రులు చేనేత మగ్గం పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలున్నారు. బాధితురాలు పెద్ద కుమార్తె. శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో ఇంటి సమీపంలోని రైల్వే ట్రాక్ వద్దకు బహిర్భూమికి వెళ్లిన బాధితురాలు ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో అనుమానంతో తండ్రి వెళ్లి చూడగా శరీరంపై దుస్తులు లేకుండా నిర్జీవంగా పడి ఉండటం చూసి భీతిల్లిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి హత్య కేసు నమోదు చేశారు. దర్యాప్తును ముమ్మరం చేసేందుకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. త్వరలోనే నిందితులను అరెస్ట్ చేస్తామన్నారు. కొందరు యువకులు మద్యం తాగుతూ బహిర్భూమికి వెళ్లే మహిళల పట్ల ఆ ప్రాంతంలో అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

గంజాయి ముఠా పనే!

సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు హోంమంత్రి వంగలపూడి అనిత సాయంత్రం ఘటనా స్థలానికి చేరుకుని కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోయిన ప్రాణాన్ని తీసుకురాలేమని, బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని మృతురాలి తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. అనంతరం చీరాల ఏరియా వైద్యశాలలో యువతి మృతదేహాన్ని పరిశీలించారు. బాధితురాలిపై గంజాయి ముఠా అత్యాచారం చేసి దారుణంగా హతమార్చిన ఘటన కలిచివేసిందన్నారు. చేనేత మగ్గం పనులపై ఆధారపడి జీవనం సాగించే కుటుంబంలో యువతి హత్యకు గురికావడం దారుణమన్నారు. 48 గంటల్లో నిందితులను అరెస్ట్ చేస్తామని ప్రకటించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా గంజాయిపై ఉక్కుపాదం మోపేందుకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. రాష్ట్రంలో నార్కోటిక్ సెల్ ఏర్పాటుకు పోలీసు ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు. గంజాయి ఆగడాలను అడ్డుకట్ట వేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తామన్నారు. కాగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అందజేశారు.

సర్పంచ్ కుమారుడి కారు ధ్వంసం


- కృష్ణుడి బాల ఆలయంలో విగ్రహాలూ మాయం
- వరుస ఘటనలతో రామవరప్పాడు ప్రజల్లో భయాందోళనలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత వరి శ్రీదేవి కుమారుడి కారును గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం స్థానికంగా కలకలం రేపింది. ఈనెల 5వ తేదీరాత్రి ప్రసాదంపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కొమ్మా కోట్లు కారు ధ్వంసం చేసిన ఘటన మరువక ముందే మళ్లీ అలాంటి ఘటన చోటు చేసుకోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులను టార్గెట్ చేస్తూ టీడీపీ నాయకులు ఇటువంటి దాడులకు తెగబడుతున్నారని ఆరోపిస్తున్నారు. సేకరించిన వివరాల ప్రకారం.. వైఎస్సార్ సీపీకి చెందిన రామవరప్పాడు గ్రామ సర్పంచ్ వరి శ్రీదేవి కుమారుడు గణేష్ ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఇటీవల రామవరప్పాడుకు తన కుటుంబంతో కలిసి కారులో వచ్చారు. తన కారును రైవస్ కాలువ వంతెన సమీపంలోని కృష్ణుడి బాల ఆలయం (కోర్టులో వేయడంతో నిర్మాణం ఆగింది) వద్ద పార్కింగ్ చేశాడు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలు ధ్వంసం చేశారు. ఇంతటితో ఆగకుండా కృష్ణుడి బాల ఆలయంలోని రాధాకృష్ణుల విగ్రహాలను దొంగిలించారు. తెల్లారిన తర్వాత కారుపై దాడి విషయాన్ని గమనించి పటమట పోలీసులకు సమాచారం అందించారు. ఘటనలు బయటకు రాకుండా పోలీసులు గోప్యంగా ఉంచడానికి గల కారణాలు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పటమట సీఐ మోహన్‌రెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్‌కు అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.


ధ్వంసమైన కారు అద్దాలు (ఇన్‌సెట్‌లో) విగ్రహాలు లేని బాల ఆలయం

'గుట్ట'కాయస్వాహా

చంద్రగిరిలో 4 రోజులుగా టీడీపీ నేతల మట్టి తరలింపు


ఇందిరమ్మ కాలనీ గుట్టలోని మట్టిని చదును చేసిన దృశ్యం

చంద్రగిరి (తిరుపతి జిల్లా): చంద్రగిరి ఇందిరమ్మ కాలనీలోని గుట్టను కొంతమంది టీడీపీ నాయకులు స్వాహా చేశారు. ఆ పార్టీ అధికారంలోకి రావడంతో ఒక్కసారిగా చెలరేగిపోతున్నారు. ప్రభుత్వ భూమి కబ్జాలు, గుట్టలను చదును చేసి అక్రమంగా గ్రావెల్ తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గత నాలుగు రోజులుగా ఇందిరమ్మ కాలనీ వెనుకనున్న ఈ గుట్టను కొంతమంది టీడీపీ నేతలు జేసీబీ సాయంతో చదును చేశారు. వందలాది ట్రిప్పుల మట్టిని అక్రమంగా తరలించేశారు. చంద్రగిరి పట్టణంలో సైతం మట్టి తరలిస్తున్నా.. సంబంధిత రెవెన్యూ, పోలీసు అధికారులు అడ్డుకున్న దాఖలాల్లేవు. గతంలో ఎన్నడూలేని సంస్కృతి ఐదేళ్ల తర్వాత మళ్లీ చూడాల్సి వస్తోందంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలు, గుట్టలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఇన్‌చార్జి వీఆర్‌ఓ అశోక్‌ను వివరణ కోరగా.. అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందని, ఘటన స్థలానికి చేరుకుని మట్టి రవాణాను అడ్డుకున్నామన్నారు. మళ్లీ ఇది పునరావృతమైతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.






అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో యోగాభ్యాసం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. సియాచిన్‌లో ఆర్మీ సిబ్బంది, న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌లో ఔత్సాహికులు, శ్రీనగర్‌లో ప్రధాని మోదీ యోగాసనాలు

జైల్లోనే కేజ్రీవాల్

- బెయిల్ ఉత్తర్వులపై ఢిల్లీ హైకోర్టు మధ్యంతర స్టే
- రెండు మూడు రోజుల్లో స్పష్టత ఇస్తామని వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మరికొన్ని రోజులు తీహార్ జైల్లోనే ఉండనున్నారు. ఈ కేసులో ఆయనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేస్తూ ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై ఢిల్లీ హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. రెగ్యులర్ బెయిల్ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సుధీర్‌కుమార్ జైన్, జస్టిస్ రవీందర్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఈడీ తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు వాదనలు వినిపించారు. ట్రయల్ కోర్టులో వాదనలు వినిపించడానికి సరైన అవకాశం లభించలేదన్నారు. తమ వాదనల సమయంలో రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి తొందరపెట్టారని హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అలాగే ఈ కేసులో వాస్తవాలను న్యాయమూర్తి పరిగణనలోకి తీసుకోలేదన్నారు. బెయిల్‌ను రద్దు చేయడానికి ఇంతకంటే మంచి కేసు ఇంకొకటి ఉండదన్నారు. అనంతరం ట్రయల్ కోర్టు తీర్పుపై మధ్యంతర స్టే విధిస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. ''ట్రయల్ కోర్టు ఆర్డర్‌పై స్టే కోరుతూ దాఖలైన పిటిషన్‌పై వివరణాత్మక ఆదేశాల నిమిత్తం తీర్పు రిజర్వ్ చేస్తున్నాం. మొత్తం రికార్డులను పరిశీలించాల్సి ఉంది కాబట్టి మరో రెండు మూడు రోజుల్లో స్పష్టత ఇస్తాం. అప్పటివరకూ ట్రయల్ కోర్టు ఆదేశాల అమలుపై మధ్యంతర స్టే విధిస్తున్నాం'' అని వెల్లడించింది. ఈడీ పిటిషన్‌పై స్పందించాలంటూ కేజ్రీవాల్‌కు నోటీసు జారీ చేసింది.

నీట్ కౌన్సెలింగ్ వాయిదాకు సుప్రీం నో

సాక్షి, న్యూఢిల్లీ: జూలై 6 నుంచి జరగాల్సిన నీట్ యూజీ కౌన్సెలింగ్‌ను వాయిదా వేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. నీట్ పరీక్షలో అక్రమాలపై దర్యాప్తు కోరుతూ దాఖలైన ప్రధాన పిటిషన్లపై విచారణను కోర్టు ఇప్పటికే జూలై 8కి వాయిదా వేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కౌన్సెలింగ్‌ను కూడా ఆ తేదీ దాకా వాయిదా వేయాలని పిటిషనర్లు కోరారు. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టీతో కూడిన వెకేషన్ బెంచ్ శుక్రవారం అందుకు నిరాకరించింది. విచారణను జూలై 8వ తేదీకి వాయిదా వేసింది.

ఏడేళ్లు.. 70 లీకేజీలు

ప్రహసనంగా మారిన పరీక్షలు | దేశవ్యాప్తంగా 1.7 కోట్ల బాధితులు

నీట్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రవేశ పరీక్ష పేపర్ లీకేజీ ఉదంతం నానాటికీ పెరిగి పెద్దదవుతోంది. రోజుకోటి చొప్పున సంచలనాత్మక విషయాలు బయట పడుతూ దేశమంతటినీ కుదిపేస్తున్నాయి. మరోవైపు యూజీసీ–నెట్ ప్రశ్నపత్రం లీకైనట్టు తేలడంతో ఆ పరీక్షే రద్దయింది. వీటి దెబ్బతో దేశవ్యాప్తంగా ప్రవేశ, పోటీ పరీక్షల సమగ్రత, విశ్వసనీయతపై మరోసారి నీలినీడలు కమ్ముకున్న దుస్థితి! నిజానికి ప్రశ్నపత్రాల లీకేజీ మన దేశాన్ని ఎన్నో ఏళ్లుగా పట్టి పీడిస్తున్న జాడ్యమే. గత ఏడేళ్లలో 15 రాష్ట్రాల పరిధిలో ఏకంగా పలురకాలైన 70 పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు లీకవడం సమస్య తీవ్రతకు, భారత్‌లో పరీక్షలపై పేపర్ లీకేజీ మాఫియాకు ఉన్న తిరుగులేని పట్టుకు అద్దం పడుతోంది. ఇవన్నీ అధికారికంగా వెలుగులోకి వచ్చినవి, దర్యాప్తు జరిగిన, జరుగుతున్న కేసులు మాత్రమే. అసలు వెలుగులోకే రాకుండా పకడ్బందీగా జరిగిపోయిన ప్రవేశ, పోటీ పరీక్షల లీకేజీ ఉదంతాలు ఇంకా ఎన్నో రెట్లుంటాయని విద్యా రంగ నిపుణులే అంటున్నారు! వాటి ద్వారా ఉన్నత విద్యా సంస్థల్లో సీట్లు, ప్రభుత్వోద్యోగాలు కొట్టేసిన అనర్హులు వేలు, లక్షల్లో ఉంటారంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వైద్య విద్యలో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్–యూజీ పేపర్ లీక్ కావడంతో 24 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం అయోమయంలో పడింది. ఇలా గత ఏడేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా 70 పరీక్షల పేపర్లు లీకయ్యాయి. వాటికి 1.7 కోట్ల మందికి పైగా ఉన్నత విద్యార్థులు, ఉద్యోగార్థుల కలలు కల్లలైపోయాయి. రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, బిహార్, గుజరాత్, కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణ వంటి పలు పెద్ద రాష్ట్రాలతో పాటు హరియాణా వంటి చిన్న రాష్ట్రాల్లో కూడా తరచూ పలు ప్రవేశ, పోటీ పరీక్షల పేపర్లు లీకవుతున్నాయి. ఈ లీకేజీ భూతం ఉన్నత విద్యకు, భారీ స్థాయి నియామక పరీక్షలకే పరిమితం కాలేదు. పదో తరగతి వంటి స్కూలు పరీక్షలకు కూడా పాకి కలవరపెడుతోంది. బిహార్‌లో పదో తరగతి ప్రశ్నపత్రాలు గత ఏడేళ్లలో ఆరుసార్లు లీకయ్యాయి. పశ్చిమ బెంగాల్లోనైతే స్టేట్ బోర్డు పరీక్ష పత్రాలు గత ఏడేళ్లలో ఏకంగా పదిసార్లు లీకయ్యాయి. తమిళనాడులో 2022లో 10, 12 తరగతుల ప్రశ్నపత్రాలు లీకై కలకలం రేపాయి.

ఆ రాష్ట్రాల్లో అంతే...!

రాజస్తాన్, గుజరాత్ వంటి రాష్ట్రాలు కొన్నేళ్లుగా పరీక్షల లీకేజీకి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయాయంటే అతిశయోక్తి కాదు. 2015–23 మధ్య రాజస్తాన్‌లో పలు పోటీ పరీక్షలకు సంబంధించి 14కు పైగా పేపర్లు లీకేజీ బారిన పడ్డాయి. 2022 డిసెంబర్లో సీనియర్ గవర్నమెంట్ స్కూల్ టీచర్ల నియామకానికి సంబంధించి జనరల్ నాలెడ్జ్ ప్రశ్నపత్రం లీకవడంతో ఆ పరీక్షనే రద్దు చేయాల్సి వచ్చింది. యూజీసీ నెట్, పోలీస్ రిక్రూట్‌మెంట్ గత రెండేళ్లు వరుసగా లీకయ్యాయి. గుజరాత్‌లోనూ గత ఏడేళ్లలో 14 లీకేజీ ఉదంతాలు నమోదయ్యాయి. సీపీఎస్సెస్సీ చీఫ్ ఆఫీసర్ పరీక్ష (2014), తలటీ పరీక్షలు (2015, 2016), టీచర్స్ యాప్టిట్యూడ్ టెస్ట్ (2018), ముఖ్య సేవిక, నాయబ్ చిట్నిస్, డెక్ లోక్ రక్షక్ దళ్, నాన్ సచివాలయ క్లర్క్స్, హెడ్ క్లర్క్, సీఎస్ఎస్సెస్సీ (2021), సబ్ ఆడిటర్ (2021), ఫారెస్ట్ గార్డ్ (2022), జూనియర్ క్లర్క్ (2023), వంటి పలు పరీక్షలు ఈ జాబితాలో ఉన్నాయి. యూపీలో కూడా 2017–24 మధ్య కనీసం 9 లీకేజీ కేసులు వెలుగు చూశాయి. ఇన్‌స్పెక్టర్ ఆన్‌లైన్ రిక్రూట్‌మెంట్‌పరీక్ష (2017), యూపీ టెట్ (2021), 12వ తరగతి బోర్డు పరీక్ష వంటివి వీటిలో ముఖ్యమైనవి. తాజాగా ఈ ఏడాది జరిగిన కానిస్టేబుల్ పేపర్ లీకేజీ ఏకంగా 48 లక్షల మంది దరఖాస్తుదారులను ఉసూరుమనిపించింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

అమల్లోకి పేపర్ లీక్ నిషేధ చట్టం

నోటిఫై చేసిన కేంద్రం

న్యూఢిల్లీ: పేపర్ లీకేజీల కట్టడికి ఉద్దేశించిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (అనైతిక కార్యకలాపాల నిరోధ) చట్టం, 2024ను అమల్లోకి తెస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నీట్, యూజీసీ–నెట్ పేపర్ల లీకేజీ వివాదాలు దేశవ్యాప్తంగా కాక రేపుతున్న నేపథ్యంలో ఈ చట్టాన్ని నోటిఫై చేస్తూ శుక్రవారం అర్ధరాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. పేపర్ల లీకేజీ ఉదంతాల్లో శిక్షలను కఠినతరం చేస్తూ గత ఫిబ్రవరిలో పార్లమెంటు ఈ చట్టం చేయడం తెలిసిందే. దీని ప్రకారం లీకేజీ కేసుల్లో మూడు నుంచి పదేళ్ల జైలు, రూ.కోటి దాకా జరిమానా విధించవచ్చు. యూపీఎస్సీ, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, రైల్వేలు, బ్యాంకింగ్ పరీక్షలతో పాటు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే అన్ని కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు ఈ చట్టం వర్తిస్తుంది.

ప్రపంచ శ్రేయస్సుకు యోగా శక్తివంతమైన సాధనం: మోదీ

శ్రీనగర్: యోగాను ప్రపంచ శ్రేయస్సుకు పనిచేసే శక్తివంతమైన ఉపకరణంగా నేడు అందరూ భావిస్తున్నా రని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. మరింత మంది పర్యాటకులను ఆకర్షించడం ద్వారా జమ్మూకశ్మీర్ ఆర్థిక వ్యవస్థను మార్చే సామర్థ్యం యోగాకు ఉందన్నారు. ఈ కేంద్ర పాలిత ప్రాంతంలో యోగాను 50 వేల నుంచి 60 వేల మంది వరకు సాధన చేస్తుండటం సాధారణ విషయం కాదని తెలిపారు. 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీనగర్‌లోని షేర్–ఇ–కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్(ఎస్‌కేఐసీసీ)లో జరిగిన కార్యక్రమంలో మోదీ పాల్గొని ప్రసంగించారు. 'దేవుడు, ఈశ్వరుడు లేదా అల్లాను చేరుకునే ఆధ్యాత్మిక ప్రయాణంగా యోగా గురించి సాధారణంగా చెబుతుంటారు. ఆధ్యాత్మిక కోణాన్ని వదిలేసి ప్రస్తుతానికి, మనం వ్యక్తిగత అభివృద్ధి కోసం యోగాపై దృష్టి పెట్టి, దానిని జీవితంలో ఒక భాగంగా ఆచరించవచ్చు. అలా చేస్తే ఎన్నో లాభాలు ఉన్నాయి. వ్యక్తిగత అభివృద్ధి సమాజ శ్రేయస్సుకు..అంతిమంగా అది మానవాళి శ్రేయస్సుకు దారితీస్తుంది'' అని చెప్పారు.

సియాచిన్‌లోనూ యోగా డే

రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, అధికారులు యోగా చేశారు. పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, ఎస్.జైశంకర్, రాజ్‌నాథ్ సింగ్ తదితరులు దేశవ్యాప్తంగా పలుచోట్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. సియాచిన్‌లో, రాజస్తాన్‌లోని థార్ ఎడారిలో, సముద్రంలో విమానవాహక యుద్ధ నౌక ఐఎన్ఎస్ విక్రమాదిత్యపై సైనికులు యోగా చేశారు. తమిళనాడులోని రామేశ్వరంలో సాయుధ సిబ్బంది జల యోగ చేశారు. ఈ ఏడాది యోగా డే ఇతివృత్తం 'యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ'.

ప్రపంచ దేశాల్లో యోగా దినోత్సవం

న్యూఢిల్లీ/న్యూయార్క్/టెల్‌అవీవ్: అంతర్జాతీయ యోగ దినోత్సవంలో ప్రపంచవ్యాప్తంగా ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీతోపాటు న్యూయార్క్‌లో పలు కార్యక్రమాలు జరిగాయి. న్యూయార్క్‌లోని ప్రఖ్యాత టైమ్స్ స్క్వేర్‌లో ప్రత్యేక యోగా కార్యక్రమాలు జరిగాయి. అత్యధిక ఉష్ణోగ్రతలను లెక్క చేయకుండా జనం వేలాదిగా పాల్గొన్నారు. అదేవిధంగా ఇజ్రాయెల్‌లోని టెల్‌అవీవ్‌లో జరిగిన కార్యక్రమంలో 300 మంది పాల్గొన్నారు. సింగపూర్‌లో ఆరోగ్య శాఖ మంత్రి రహయు మహజం ఆధర్యంలో జరిగిన కార్యక్రమంలో 200 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. నేపాల్‌లోని పొఖారా, బుద్ధుడి జన్మస్థలం లుంబినిలో యోగా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. శ్రీలంక రాజధాని కొలంబో, చైనా రాజధాని బీజింగ్, ఫ్రాన్సు రాజధాని పారిస్, మాల్దీవులు రాజధాని మాలె, ఇటలీ రాజధాని రోమ్, సౌదీ రాజధాని రియాద్, కువైట్, మలేసియా, ఇండోనేసియాలో, స్వీడన్ రాజధాని స్టాక్‌హోం, లండన్‌లోని ట్రఫాల్గర్ స్క్వేర్‌లోనూ యోగా కార్యక్రమాలు జరిగాయి.

సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ పరీక్ష వాయిదా

పరీక్ష పత్రం లీకేజీ ఆరోపణలతో నిర్ణయం

న్యూఢిల్లీ: సీఎస్ఐఆర్–యూజీసీ–నెట్ ఉమ్మడి పరీక్ష వాయిదా పడింది. వచ్చే వారం జరగాల్సిన ఈ పరీక్షను అనివార్య పరిస్థితులు, రవాణాపరమైన ఇబ్బందుల దృష్ట్యా వాయిదా వేస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) శుక్రవారం తెలిపింది. పరీక్ష తదుపరి తేదీని వెబ్‌సైట్‌లో ప్రకటిస్తామని వివరించింది. అయితే, పేపర్ లీకైందంటూ వస్తున్న ఆరోపణల నేపథ్యంలోనే పరీక్షను వాయిదా వేసినట్లు తెలుస్తోంది. సీఎస్ఐఆర్–యూజీసీ–నీట్ పరీక్షను జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, లెక్చరర్‌షిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నిర్వహిస్తారు. మంగళవారం నిర్వహించిన యూజీసీ నెట్‌ను కూడా అవకతవకల ఆరోపణల నేపథ్యంలో రద్దు చేయడం తెల్సిందే.

కెనడాలో ఖలిస్తానీల 'సిటిజన్స్ కోర్ట్'

తీవ్ర అభ్యంతరం తెలిపిన భారత్

న్యూఢిల్లీ: కెనడాలో ఖలిస్తానీ వేర్పాటువాదులు మరోసారి రెచ్చిపోయారు.వాంకోవర్‌లో ఉన్న భారత కాన్సులేట్ ఎదురుగా రెండు రోజుల క్రితం ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేయడంతోపాటు 'సిటిజన్స్ కోర్ట్'ను నిర్వహించారు. ఈ వ్యవహారంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. భారత్‌లోని కెనడా హై కమిషన్‌కు డిప్లొమాటిక్ నోట్ ద్వారా అభ్యంతరం తెలిపింది. ఖలిస్తానీ శక్తుల చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ట్రూడో ప్రభుత్వం వేర్పాటువాదులకు దన్నుగా నిలుస్తోందని ఆరోపించింది. గతేడాది జరిగిన నిజ్జర్ హత్యకు భారత్ ఏజెంట్లే కారణమన్న కెనడా ప్రధాని ట్రూడో తీవ్ర ఆరోపణలతో రెండు దేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

హజ్ యాత్ర మృతుల్లో... 98 మంది భారతీయులు

న్యూఢిల్లీ: సౌదీ అరేబియాలోని మక్కాకు హజ్ యాత్రకు వెళ్లిన భారతీయుల్లో 98 మంది చనిపోయినట్లు విదేశాంగ శాఖ శుక్రవారం తెలిపింది. గత ఏడాది హజ్ యాత్ర సమయంలో మొత్తం 187 మంది భారతీయులు చనిపోయినట్లు విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ వివరించారు. 'ఈ ఏడాది మే 9 నుంచి జూలై 22వ తేదీ వరకు జరగాల్సిన హజ్ యాత్రలో 1.75 లక్షల మందికి గాను ఇప్పటి వరకు 98 మరణాలు నమోదయ్యాయి. ఈ మరణాలన్నీ దీర్ఘకాలిక అనారోగ్యం, వృద్ధాప్యం వంటి సహజ కారణాలతో సంభవించినవే. అరాఫత్ రోజున ఆరుగురు మరణించారు. ప్రమాదాల్లో మరో నలుగురు చనిపోయారు'' అని జైస్వాల్ మీడియాకు వివరించారు.

ఢిల్లీలో ఆప్ జలదీక్ష

నిరాహార దీక్షకు దిగిన మంత్రి ఆతిశీ సింగ్

న్యూఢిల్లీ: నీటి ఎద్దడిని తీవ్రంగా ఎదుర్కొంటున్న ఢిల్లీ వాసుల కష్టాలు తీర్చాలంటూ ఆప్ నేత, ఢిల్లీ మంత్రి ఆతిశీ సింగ్ శుక్రవారం నిరాహార దీక్ష చేపట్టారు. యమునా నది అదనపు జలాలను హరియాణా తక్షణం ఢిల్లీకి విడుదల చేయాలంటూ డిమాండ్ చేశారు. రాజ్‌ఘాట్‌లో గాంధీజీకి నివాళులర్పించి దీక్ష మొదలెట్టారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీత, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ తదితరులు ఆమెకు మద్దతుగా దీక్షలో కూర్చున్నారు. దీక్షకు మద్దతుగా తిహార్ జైలు నుంచి కేజ్రీవాల్ పంపిన సందేశాన్ని సునీత చదివి వినిపించారు. ''ఆతిశి తపస్సు విజయవంతమవుతుంది. గొంతెండుతున్న వారి దప్పిక తీర్చడం మన సంప్రదాయం. తీవ్రమైన ఎండకాలంలో పొరుగు రాష్ట్రాలు నీళ్లిచ్చి ఆదుకోవాలి. హరియాణాలోని బీజేపీ ప్రభుత్వం నీటిని విడుదలచేయకుండా ఆపి ఢిల్లీ ప్రజలు ఆప్ ప్రభుత్వాన్ని తిట్టుకునేలా చేయాలని మోదీ సర్కారు కుట్ర పన్నింది'' అని అందులో కేజ్రీవాల్ ఆరోపించారు. ''నీటి సమస్యపై మోదీకి లేఖ రాశా. హరియాణా ప్రభుత్వాన్ని వేడుకున్నా. ఢిల్లీ ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు, మహిళల నీటి సమస్యలు చూడలేక నీటి సత్యాగ్రహానికి సిద్ధపడ్డా'' అని ఆతిశి ప్రకటించారు. రోజూ 613 లక్షల గ్యాలెన్ల నీటిని విడుదలచేసే హరియాణా గత రెండు వారాలుగా కేవలం 513 లక్షల గ్యాలెన్ల నీటినే రోజూ విడుదలచేస్తోంది. గత రెండు రోజులుగా మరో 120 లక్షల గ్యాలెన్ల మేర కోత పెట్టింది.

విమర్శించిన బీజేపీ

దీక్షను రాజకీయ నాటకంగా బీజేపీ అభివర్ణించింది. ''ఆతిశి విఫల మంత్రి. నీటి కష్టాలు తప్పవని ఫిబ్రవరిలోనే సూచనలు కనిపించినా ముందస్తు ఏర్పాట్లు చేయలేదు. ఎగువ హిమాచల్ ప్రదేశ్ నుంచో, ఆప్ పాలిత పంజాబ్ నుంచి ఎందుకు నీళ్లు అడగటం లేదు? ఢిల్లీ నీటి ట్యాంకర్ మాఫియాతో ఆప్ నేతలకు సంబంధముంది'' అని ఆరోపించింది.



నిరాహార దీక్షలో ఆతిశీ సింగ్, పక్కన సునీతా కేజ్రీవాల్, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్

నా భర్త ఏమన్నా మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదా: సునీతా కేజ్రీవాల్

తన భర్త ఇండియాలోనే మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది అన్నట్లుగా ఈడీ వ్యవహరిస్తోందని కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్ మండిపడ్డారు. ఆయన బెయిల్‌ను హైకోర్టులో సవాలు చేపడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ''బెయిల్ ఉత్తర్వు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ కూడా కాకముందే తెల్లవారుజామునే ఈడీ హైకోర్టును ఆశ్రయించిందని ఆక్షేపించారు. కేజ్రీవాల్ ఏమైనా ఉగ్రవాదా?'' అంటూ దీక్షా స్థలి వద్ద మండిపడ్డారు.

తమిళనాట 50కి చేరిన మద్యం మృతులు

సాక్షి, చెన్నై: తమిళనాడులోని కళ్లకురిచ్చి జిల్లాలో కల్తీ మద్యం తాగి చనిపోయిన వారి సంఖ్య పెరుగుతోంది. శుక్రవారం మరో 10 మంది చనిపోవడంతో మొత్తం మరణాలు 50కి చేరాయి. అలాగే, సారా తాగి అస్వస్థతకు గురై ఆస్పత్రికి వెళ్లకుండా ఇంట్లోనే ఉన్న మరో ఇద్దరు కూడా మరణించడంతో ఆ సంఖ్య 50ని దాటింది. అయితే, వీరి మరణంపై అధికారులు విచారణ చేపట్టారు. దీంతోపాటు, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల్లో 30 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. మరోవైపు కల్తీ సారా మరణాల ఘటనపై సీబీఐతో విచారణ చేయించాలంటూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం మద్రాసు హైకోర్టు విచారణ చేపట్టింది.

దద్దరిల్లిన అసెంబ్లీ

కళ్లకురిచ్చి ఉదంతంపై శుక్రవారం అసెంబ్లీ దద్దరిల్లింది. విపక్ష ఏఐఏడీఎంకే సభ్యులు నినాదాలు చేశారు. కల్తీ మద్యం తాగి 50 మంది వరకు మృతి చెందడంపై సభలో చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించారంటూ స్పీకర్ అప్పావు వారిని మార్షల్స్‌తో బయటకు పంపించి వేశారు. ఈ ఆందోళనల్లో ఏఐఏడీఎంకేలోని మాజీ సీఎం పన్నీరు సెల్వం వర్గం సభ్యులు పాల్గొనక పోవడం గమనార్హం.

గ్రాడ్యుయేట్లకు అమెరికా గ్రీన్ కార్డు: ట్రంప్

వాషింగ్టన్: జాతీయవాదిగా, వలసలను వ్యతిరేకించే నాయకుడిగా పేరుగాంచిన అమెరికా రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తన ధోరణి మార్చుకున్నారు. అమెరికాలో చదువుకొనే విదేశీ విద్యార్థులకు తీపి కబురు చెప్పారు. తాజాగా ఆల్–ఇన్ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు. అమెరికా కాలేజీల్లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన విదేశీ విద్యార్థులకు ఆటోమేటిక్‌గా గ్రీన్ కార్డులు అందించే విధానం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. గ్రాడ్యుయేషన్ చదివిన తర్వాత సొంత దేశాలకు తిరిగి వెళ్లిపోవాల్సిన అవసరం ఉండదని, అమెరికాలోనే ఉండొచ్చని వెల్లడించారు. జూనియర్ కాలేజీల్లో చదువుకున్నవారికి సైతం గ్రీన్‌కార్డులు ఇస్తామన్నారు. ఇండియా, చైనా దేశాల విద్యార్థులు అమెరికా కాలేజీల్లో చదువుకొని, స్వదేశాలకు తిరిగివెళ్లి మల్టీ బిలియనీర్లుగా పైకి ఎదుగుతున్నారని, పరిశ్రమలు స్థాపించి, వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారని చెప్పారు. వారు ఇక్కడే ఉండేలా చేస్తే అమెరికాకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా ట్రంప్ మరోసారి బరిలోకి దిగుతుండటం తెలిసిందే.

రేణుకస్వామి కేసులో ఏ1గా పవిత్ర!

హత్య కేసులో కొత్త మలుపు

బెంగళూరు: కన్నడ నటి పవిత్ర గౌడను ఆన్‌లైన్‌లో వేధించాడన్న పట్టరాని కోపంతో రేణుకస్వామి అనే చిరుద్యోగిని నటుడు దర్శన్ తూగుదీప, అతని అనుచరులు హతమార్చారన్న కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. దర్శన్ సన్నిహిత నటి పవిత్ర గౌడను ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా పేర్కొంటూ పోలీసులు గురువారం బెంగళూరులో 24వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట రిమాండ్ రిపోర్ట్‌ను సమర్పించారు. స్వామికి కరెంట్ షాక్ ఇచ్చి హింసించామని ఇప్పటికే అరెస్టయిన ఒక నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. ఈ వివరాలను రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు ప్రస్తావించారు. హత్య తర్వాత అరెస్ట్, కేసు నుంచి తప్పించుకునేందుకు, మృతదేహాన్ని మాయం చేసి ఆధారాలను ధ్వంసంచేసేందుకు దర్శన్ భారీగా ఖర్చుచేశారని, అందుకోసం స్నేహితుడు మోహన్ రాజ్ నుంచి రూ.40 లక్షల అప్పు తీసుకున్నారని పోలీసులు వెల్లడించారు. షాక్ ఇచ్చేందుకు వాడిన ఎలక్ట్రిక్ షాక్ టార్చ్‌ను, ఆ రూ.40 లక్షల నగదును పోలీసులు ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారు. దర్శన్, మరో ముగ్గురిని పోలీస్ కస్టడీకి, పవిత్ర గౌడను జ్యుడీషియల్ కస్టడీకి పంపాలని కోర్టును పోలీసులు కోరారు.



ఘటనాస్థలిలో చెప్పులతో కొట్టిన పవిత్ర

చిత్రదుర్గ ప్రాంతంలో రేణుకస్వామిని కిడ్నాప్ చేసి 200 కి.మీ.ల దూరంలోని బెంగళూరుకు తీసుకొచ్చి షెడ్‌లో కట్టేసి కొట్టేటపుడు నటి పవిత్ర గౌడ అక్కడే ఉన్నారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఆమె కూడా రేణుకస్వామిని తన చెప్పులతో కొట్టారని పోలీసులు పేర్కొన్నారు. అసభ్య సందేశాలు పంపిన స్వామికి బుద్ధి చెప్పాలని అక్కడే ఉన్న దర్శన్‌ను పవిత్ర ఉసిగొల్పిందని ఆయా వర్గాలు వెల్లడించాయి. రేణుకస్వామి పోస్ట్‌మార్టమ్‌లో కొత్త విషయాలు వెల్లడయ్యాయి. సున్నిత అవయవాలపై దాడితో వృషణాలు చితికిపోయాయని, ఒక చెవి కనిపించలేదని నివేదిక పేర్కొంది. రేణుకస్వామి గతంలో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసి డిలీట్‌చేసిన మెసేజ్‌లను వెలికి తీసివ్వాలని దాని మాతృ సంస్థ 'మెటా'ను పోలీసులు కోరారు.

ఉక్రెయిన్‌కు ఆయుధాలిస్తే ఊరుకోం

దక్షిణ కొరియాకు రష్యా అధినేత పుతిన్ హెచ్చరిక



హనోయి: తమ శత్రు దేశమైన ఉక్రెయిన్‌కు ఆయుధాలు అందజేసే ఆలోచన ఉంటే వెంటనే మానుకోవాలని రష్యా అధినేత పుతిన్ దక్షిణ కొరియాకు హెచ్చరికలు జారీ చేశారు. ''ఉక్రెయిన్‌కు ఆయుధాలిస్తే అది అతి పెద్ద తప్పిదం అవుతుంది. రష్యాపై దాడులకు ఉక్రెయిన్‌కు సహకరిస్తే తీవ్ర పరిణామాలుంటాయి. దక్షిణ కొరియాకు మింగుడు పడని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది'' అని వియత్నాం పర్యటనలో ఉన్న పుతిన్ మీడియాతో అన్నారు.


కొత్త నేర చట్టాల అమలును ఆపండి

పార్లమెంట్‌లో మళ్లీ సమీక్షించండి ● మోదీకి మమత లేఖ




న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో హడావిడిగా ప్రవేశపెట్టి ఆమోదించిన మూడు కొత్త నేర చట్టాలను జూలై ఒకటో తేదీ నుంచి అమల్లోకిరాకుండా ఆపాలని ప్రధాని మోదీకి తృణమూల్ కాంగ్రెస్ చీఫ్, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత చట్టాలపై మోదీకి ఆమె లేఖ రాశారు.

మరో ఆర్నెల్లు నడ్డాయే బీజేపీ చీఫ్?



సాక్షి, న్యూఢిల్లీ: భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా మరో ఆరు నెలలు కొనసాగనున్నారు. ఈ ఏడాది మహారాష్ట్ర, జార్ఖండ్, హరియాణా, జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలున్న విషయం తెలిసిందే. వాటి నిర్వహణ ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. అవి ముగిసేదాకా నడ్డాను కొనసాగించాలని బీజేపీ అధిష్టానం నిర్ణయించినట్టు తెలుస్తోంది. కేంద్రంలో నరేంద్ర మోదీ 3.0 ప్రభుత్వంలో నడ్డా కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టడం తెలిసిందే. పార్టీ రోజువారీ వ్యవహారాలు చూసేందుకు జాతీయ ప్రధాన కార్యదర్శులు సునీల్ బన్సల్, వినోద్ తావ్డేల్లో ఒకరిని వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తారంటున్నారు.

రాజీనామా వార్తలు అబద్ధం: అధీర్



కోల్‌కతా: పశ్చిమబెంగాల్ పీసీసీ చీఫ్ పదవికి రాజీనామా చేసినట్లుగా వస్తున్న వార్తలను అధీర్ రంజన్ చౌదరి ఖండించారు. 'కాంగ్రెస్ నియమావళి ప్రకారం పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నేత పీసీసీ చీఫ్‌లను నియమిస్తారు. అప్పటి దాకా మేమంతా తాత్కాలిక చీఫ్‌లమే. బెంగాల్ పీసీసీకి కొత్త చీఫ్‌ను నియమించేదాకా కొనసాగుతా'' అని తెలిపారు. బెంగాల్ సహా అన్ని రాష్ట్రాలకు కొత్త పీసీసీ చీఫ్‌లు రావచ్చని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి గులాం అహ్మద్ మిర్ అన్నారు.

తజికిస్తాన్‌లో హిజాబ్‌పై నిషేధం

దుషాంబె: 96 శాతం ముస్లిం జనాభా ఉన్న మధ్య ఆసియా దేశం తజికిస్తాన్‌లో మహిళలు హిజాబ్ ధరించడాన్ని నిషేధిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. హిజాబ్ ధరిస్తే రూ.5 లక్షల వరకు జరిమానా తప్పదని రంజాన్ మాసంలో పెద్దల నుంచి చిన్నారులు డబ్బులు తీసుకొనే సంప్రదాయాన్ని కూడా నిషేధించింది. దీనికి కూడా భారీ జరిమానా తప్పదని హెచ్చరించింది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం : 22 : జూన్ : 2024


విధానసౌధ ఎదుట యోగాసనాలు వేస్తున్న గవర్నర్ గెహ్లోత్, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

యోగా గురు భారత్


మైసూరు ప్యాలెస్ ఆవరణలో యోగాను ఆచరిస్తున్న నగరవాసులు


విధానసౌధ ఎదుట యోగా చేస్తున్న సాధకులు

- గవర్నర్ గెహ్లోట్

శివాజీనగర: భారతదేశం ప్రపంచానికి యోగాను పరిచయం చేసి యోగా గురువుగా ఆవిర్భవించిందని గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయుష్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ శుక్రవారం బెంగళూరులోని విధానసౌధ ముందు ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమాన్ని గవర్నర్ ప్రారంభించి మాట్లాడారు. దేహం, మనస్సును సమతుల్యం చేసేది యోగా అని అన్నారు. భారతీయ సంస్కృతికి యోగానే మూలమన్నారు. యోగా విశిష్టతను స్వామి వివేకానంద చికాగోలోని సభలో ప్రస్తావించారని గుర్తు చేశారు. యోగాను పాటించాలని 2018 సెప్టెంబర్ 27న ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచదేశాలకు పిలుపునివ్వగా 179 దేశాలు స్పందించాయన్నారు. అప్పటి నుంచి ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విధానపరిషత్ సభాపతి బసవరాజ్ హొరట్టి, ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దినేశ్ గుండూరావు, ఎమ్మెల్సీ శరవణ, క్రీడాకారిణి అశ్విని నాచప్ప, క్రికెట్ క్రీడాకారుడు మనీశ్ పాండే, సినీ నటులు శరణ్, అను ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


ధ్యానంలో సీఎం సిద్దరామయ్య



ఆసనంలో బాలిక, మైసూరు ప్యాలెస్ ఆవరణలో యోగాసనాలు

శ్వాస మీద ధ్యాస

శారీరక, మానసిక ఆరోగ్యానికి ఉపకరించే యోగాను ప్రతి ఒక్కరికీ చేరువ చేయడంలో భాగంగా శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం రాష్ట్ర వ్యాప్తంగా ఉత్సాహంగా సాగింది. ధ్యానం, ఆసనాల ఆవశ్యకతను యోగా గురువులు వివరించారు. లక్షలాది మంది ప్రజలు మైదానాలకు వెళ్లి ఆసనాలు వేసి శ్వాసపై మనస్సును లగ్నం చేశారు.

మైసూరు: మైసూరు ప్యాలెస్ ఆవరణలో ఆయూష్, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో యోగా దినోత్సవం జరిగింది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి హెచ్.సీ.మహాదేవప్ప హాజరై మాట్లాడారు. భారతీయ సంస్కృతికి యోగా నిలువెత్తు నిదర్శనమన్నారు. యోగాను జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

ప్రధాని కృషితో విశ్వవ్యాప్తంగా యోగా


యోగా శిబిరంలో కేంద్ర మంత్రి వీ.సోమన్న

తుమకూరు: భారత దేశ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన యోగాకు ప్రపంచ వ్యాప్తంగా గొప్పపేరు రావడానికి ప్రధాని మోదీ కృషి చేశారని కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి వి.సోమన్న అన్నారు. శుక్రవారం తుమకూరు నగరంలో పోలీసు కవాతు మైదానంలో ఏర్పాటు చేసిన యోగా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ యోగాను ఆచరించి ఆరోగ్యంగా ఉండాలన్నారు.

ఐఏఎస్ రోహిణి భర్తపై లోకాయుక్తకు ఫిర్యాదు

బనశంకరి: ప్రముఖ గాయకుడు లక్కీఅలీ, ఐఏఎస్ అధికారిణి రోహిణి సింధూరి భర్త సుధీర్‌రెడ్డి, బావమరిదిపై కర్ణాటక లోకాయుక్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రోహిణి సింధూరి మరోసారి చిక్కుల్లో పడ్డారు. లోకాయుక్త పోలీసులకు ఫిర్యాదు చేసిన కాపీని తన ఎక్స్ ఖాతాలో లక్కీఅలీ పోస్ట్‌పెట్టారు. యలహంక న్యూటౌన్ పరిధిలోని తమ ట్రస్ట్‌కు సంబంధించిన భూమిని రోహిణి భర్త సుధీర్‌రెడ్డి, బావమరిది మధుసూదన రెడ్డి కబ్జాకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇదే విషయంపై గాయకుడు లక్కీఅలీ 2022లో ఫిర్యాదు చేశారు. యలహంక న్యూటౌన్ పోలీస్‌స్టేషన్ ఏసీపీ మంజునాథ్, తాలూకా సర్వే అధికారి మనోహర్ కబ్జాలో భాగస్వాములయ్యారని తీవ్ర ఆరోపణలు చేశారు.

భట్కల్‌లో ఏటీఎస్ అధికారులు

బనశంకరి: భట్కళ తాలూకా నవాయత్‌కాలనీ హాజీమంజిల్ నివాసి అబ్దుల్‌కబీర్ సుల్తాన్ అలియాస్ మౌలానాసుల్తాన్ అనే అనుమానిత ఉగ్రవాది ఆచూకీ కోసం మహారాష్ట్ర ఉగ్రవాద నియంత్రణ దళం (ఏటీఎస్) అధికారులు శుక్రవారం ఉత్తర కన్నడ జిల్లా భట్కళకు విచ్చేశారు. ఈ సందర్భంగా సదరు వ్యక్తి ఇంటికి నోటీస్ అంటించారు. పూణేలో జరిగిన ఉగ్ర కార్యకలాపాల కేసులో ఇతను ఆరోపి. ఏడాది నుంచి అదృశ్యమయ్యాడు. ఇతను సిరియా లేదా అఫ్ఘనిస్థాన్, అమెరికా బాంబు పేలుడులో మృతిచెందినట్లు అమెరికా మీడియాలో ప్రసారమైంది. కానీ ఇతడి మృతిపట్ల ఎలాంటి ఆధారాలు భారత్‌కు లభించలేదు. అతని అరెస్టుకు మహారాష్ట్ర కోర్టు అనుమతి ఇవ్వడంతో ఉత్తరకన్నడ పోలీసుల సహాయం కోరారు. ఒకవేళ అతను మృతిచెందినట్లయితే కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంకోసం నోటీస్ అంటించారు. ఇతడి గురించి కుటుంబ సభ్యులకు సైతం ఎలాంటి సమాచారంలేదని పోలీసుల విచారణలో తెలిసింది.

విదేశీ కన్సల్టెన్సీ నియామకానికి విజయేంద్ర అభ్యంతరం

శివాజీనగర: రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ నిర్వహణకు విదేశీ కన్సల్టెన్సీ నియామకాన్ని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర తప్పుబట్టారు. శుక్రవారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన ఆయన, ఆర్థిక నిర్వహణకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య వద్ద నిపుణులైన అధికారులు ఉన్నా కూడా విదేశీ కన్సల్టెన్సీ అవసరం ఏముందని, ఒక సంవత్సరంగా రాష్ట్రంలో ఎలాంటి పెట్టుబడులు రాలేదు. అభివృద్ధి కూడా జరగలేదన్నారు.

హోటల్‌లో పేలిన సిలిండర్

- పదిమందికిపైగా కార్మికులకు గాయాలు


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

యశవంతపుర: వంటగ్యాస్ సిలిండర్ పేలి పదిమందికి పైగా హోటల్ కార్మికులు గాయపడ్డారు. ఈఘటన కలబురగి నగరంలో జరిగింది. అప్పాకెరె సమీపంలోని హోటల్‌లో శుక్రవారం ఉదయం ఉదయం 6:30 గంటలకు అల్పాహారం తయారు చేస్తుండగా గ్యాస్ లీక్ అయ్యి సిలిండర్ పేలింది. దీంతో వంట గదిలో ఉన్న 10 మందికిపైగా కార్మికులు గాయపడ్డారు. మిగిలిన కార్మికులు భయంతో బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక, పోలీసులు వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని కలబురిగిలోని ట్రామా కేర్ సెంటర్‌కు, మిగిలినవారిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. పేలుడు తీవ్రతకు భవనంలో పగుళ్లు ఏర్పడాయి. టేబుల్స్, కుర్చీలు ధ్వంసమయ్యాయి. పేలుడు శబ్దం కిలోమీటర్ దూరం వరకు వినపడింది. దీంతో నగరప్రజలు భయాందోళనకు గురయ్యారు.

బైక్‌ను ఢీకొన్న లారీ.. చిన్నారి మృతి

దొడ్డబళ్లాపురం: బైక్‌ను లారీ ఢీకొని మూడేళ్ల చిన్నారి మృతిచెందింది. ఈ ఘటన దొడ్డ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆంజనేయ, మమత దంపతులు తమ మూడేళ్ల ధ్వనిత్‌తో కలిసి బైక్‌పై వెళ్తుండగా దొడ్డబళ్లాపురం –దాబస్‌పేట మార్గంలోని కెస్తూరు గేట్ వద్ద లారీ ఒకటి వెనుకనుంచి వేగంగా ఢీకొంది. ధన్విత్ అక్కడికక్కడే మృతిచెందగా దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని దొడ్డబళ్లాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారవడానికి ప్రయత్నించగా దొడ్డబళ్లాపురం రూరల్ పోలీసులు వెంటాడి పట్టుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

జేడీఎస్‌తో చర్చించి అభ్యర్థిని ప్రకటిస్తాం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

దొడ్డబళ్లాపురం: చెన్నపట్టణ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో ఎవరిని బరిలోకి దించాలనే విషయాన్ని జేడీఎస్‌తో చర్చించాక ప్రకటిస్తామని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన యోగాడే కార్యక్రమంలో ఆయన పాల్గొని యోగా సాధన చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కనకపుర ఎమ్మెల్యేగా ఉన్నారని, అయినా చెన్నపట్టణ నుండి పోటీ చేసే ఆలోచనలో ఉన్నారన్నారు. అయితే అది వారి పార్టీ వ్యక్తిగత విషయమన్నారు. బెంగళూరు గ్రామీణ లోక్‌సభ స్థానంలో తమకు తిరుగులేదని భావించిన డీకే బ్రదర్స్‌కు ప్రజలు ఎలా బుద్ధి చెప్పారో అందరికీ తెలుసన్నారు. దావణగెరెలో పార్టీ అభ్యర్థి ఓటమికి యడియూరప్ప, విజయేంద్ర కారణమని ఎమ్మెల్యే హరీష్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ బహిరంగంగా ప్రకటనలు ఇవ్వడం ద్వారా సమస్య పరిష్కారం కాదన్నారు. పార్టీలో ఎటువంటి భిన్నాభిప్రాయాలు లేవన్నారు. కొత్త ఎంపీలకు, కొత్తగా కేంద్రమంత్రులుగా ఎన్నికైన వారికి శనివారం ప్యాలెస్ గ్రౌండ్‌లో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

పక్కాగా సాక్ష్యాల సేకరణ

- రేణుకాస్వామి హత్య కేసులో పోలీసుల దర్యాప్తు ముమ్మరం
- 28 చోట్ల మహజర్
- 139 వస్తువుల సేకరణ


హీరో దర్శన్, నటి పవిత్ర గౌడ (ఫైల్)

దొడ్డబళ్లాపురం: రాష్ట్రంలో సంచలనం రేపిన చిత్రదుర్గకు చెందిన ఆటోడ్రైవర్ రేణుకాస్వామి హత్య కేసులో నటుడు దర్శన్ అండ్ గ్యాంగ్ సంచరించిన 28 ప్రాంతాల్లో మహజర్ నిర్వహించిన పోలీసులు.. ఏకంగా 139 వస్తువులను సాక్ష్యాలుగా సేకరించారు. నిందితులు ధరించిన దుస్తులు, షూస్, చెప్పులు, దాడికి ఉపయోగించిన వస్తువులు, హోటల్ లెడ్జర్ బుక్, సీసీటీవీ కెమెరా పేటీజీలు, వాహనాలు, నగదు, మృతదేహంపై నుంచి దోచిన నగలు ఇలా ఒక్కటీ వదలకుండా పోలీసులు సాక్ష్యాలుగా తీసుకువచ్చారు. అన్నిటి కంటే ముఖ్యంగా దర్శన్ అనుచరుడు వినయ్ ఫోన్‌లో చాటింగ్ చేసిన మెసేజ్‌లు కేసులో కీలకంగా మారనున్నాయి. దర్శన్ రేణుకాస్వామిపై దాడి చేసిన దృశ్యాన్ని ముగ్గురు యువకులు మొబైల్‌లో వీడియో తీసుకున్నారు. వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వీడియోలను సేకరించారు.

పవిత్రగౌడ పాత్రనే కీలకం

రేణుకాస్వామి హత్య జరగడానికి నటి పవిత్రగౌడ ముఖ్య కారణమని పోలీసుల రిమాండ్ కాపీలో పోలీసులు స్పష్టం చేశారు. ఈ కేసులో ఏ1గా ఉన్న పవిత్ర ఏ3 నుంచి మొదలుకుని ఏ7, ఏ11, ఏ12, ఏ13, ఏ16 నిందితులు హత్యలో నేరుగా పాల్గొన్నారని, వీరందరికీ చట్టంపై కనీసం గౌరవం లేదని లభించిన సాక్ష్యాధారాలను బట్టి తెలుస్తోందని రిమాండ్ కాపీలో పేర్కొన్నారు. ఏ1 ముద్దాయి పవిత్ర,రేణుకాస్వామి హత్యకు అందరినీ ప్రేరేపించినట్లు తెలిపారు.

బెయిల్‌కు దర్శన్ ప్రయత్నాలు

రేణుకాస్వామి హత్య కేసులో ఏ2గా ఉన్న దర్శన్ బెయిల్ పిటిషన్ పెట్టుకోనున్నారు. దర్శన్ కేసు వాదించడానికి అనిల్, బాబు, రంగనాథ్‌రెడ్డి అనే లాయర్‌లను నియమించుకున్నారు. అదేవిధంగా సీనియర్ లాయర్ సీవీ నాగేశ్‌ను కూడా దర్శన్ నియమించుకున్నారు. ఇటీవల జైలుపాలైన మాజీ మంత్రి రేవన్న కేసును నాగేశ్ వాదించి బెయిలు ఇప్పించారు. అనేక క్రిమినల్ కేసులు వాదించిన అనుభవం ఆయనకు ఉంది. దర్శన్‌కు కూడా బెయిల్ ఇప్పించే ప్రయత్నంలో భాగంగా లాయర్ నాగేశ్, అసిస్టెంట్ లాయర్ రాఘవేంద్ర ఇప్పటికే అన్నపూర్ణేశ్వరి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కేసుకు సంబంధించి పూర్తి సమాచారం తీసుకున్నారు.

బీరు.. తెగ తాగేశారు!

- రికార్డు స్థాయిలో విక్రయాలు
- మే నెలలో 50.71 లక్షల బాక్సుల బీర్ల విక్రయాలు
- వాటి విలువ రూ.3,185 కోట్లు
- వేసవి ఎండలు, సార్వత్రిక ఎన్నికలే కారణం !



బనశంకరి: రాష్ట్రంలో ఈ ఏడాది ఎండలు రికార్డులు బద్దలు కొట్టాయి. వేడిమి తాళలేక మద్యం ప్రియులు చల్లదనం కోసం తాగేశారేమో కాని బీరు విక్రయాలు కూడా అంతే స్థాయిలో రికార్డు సృష్టించాయి. దీంతో అబ్కారీ శాఖ ఖుషీగా ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో అబ్కారీ శాఖ చరిత్రలో రికార్డుస్థాయిలో బీర్ల విక్రయాలు జరగ్గా మేనెలలో కూడా విక్రయాలు ఆ రికార్డులను కూడా బద్దలు కొట్టాయి. ఏప్రిల్ నెలలో 3.80 కోట్ల లీటర్ల బీరు (48.72 లక్షల బాక్సులు, ఒక బాక్సులో 7.8 లీటర్లు) విక్రయాలు జరిగాయి. ఒకేనెలలో ఇంత భారీమొత్తంలో బీర్ల విక్రయాలు జరగడం ఇదే మొదటిసారి. కానీ మేనెలలో 3.95 కోట్ల లీటర్ల బీరు (50.71 లక్షల బాక్సులు) విక్రయం కావడంతో ఏప్రిల్ నెల రికార్డు బద్దలైంది. 2023 ఏప్రిల్ నెలలో 115.25 లక్షల బాక్సుల ఐఎంఎల్ మద్యం,(ఒక బాక్సులో 8.64 లీటర్లు), 76.88 లక్షల బాక్సుల బీర్లు విక్రయాలు జరగ్గా అబ్కారీ శాఖకు రూ.4915.59 కోట్ల ఆదాయం లభించింది. 2024 ఏప్రిల్–మే నెలలో 118.27 లక్షల బాక్సు ఐఎంఎల్ మద్యం, 100.43 లక్షల బాక్సుల బీర్ల విక్రయం కాగా రూ.5449.80 కోట్ల ఆదాయం లభించింది. గత ఏడాది ఇదే అవధితో పోలిస్తే రూ.534.21 కోట్ల అధిక ఆదాయం లభించింది. బీర్ల విక్రయాల్లో 30.63 శాతం పెరిగింది. బీర్లు మాత్రమే కాకుండా ఐఎంఎల్ మద్యం విక్రయాలు గత ఏప్రిల్–మేనెలలతో పోలిస్తే ఈ ఏడాది పెరిగింది. 2023 ఏప్రిల్‌లో 52.90 లక్షల బాక్సులు ఐఎంఎల్ మద్యం విక్రయం కాగా 2024 ఏప్రిల్‌లో 54.46 లక్షల బాక్సుల విక్రయాలు(2.95శాతం అధికం) జరిగాయి. 2023 మేనెలలో 62.35 లక్షల బాక్సుల ఐఎంఎల్ మద్యం విక్రయాలు జరగ్గా 2024 మే నెలలో 63.81 లక్షల బాక్సుల విక్రయాలు జరిగాయి. రాష్ట్రంలో మండు వేసవితో ఉష్ణోగ్రతలు పెరగడం మేనెలలో బీర్లు విక్రయాలు పెరగడానికి కారణం కాగా మరో పక్క లోక్‌సభకు మే 7తేదీన రాష్ట్రంలో రెండోదశ ఎన్నికలు జరిగిన నేపథ్యంలో బీర్ల విక్రయాల పెరగడానికి మరో కారణం అని చెప్పవచ్చు.

సంవత్సరం	ఆదాయం రూ.కోట్లలో (మే నెల)
2012	రూ. 951.23
2013	రూ.1039.97
2014	రూ.1381.83
2015	రూ.1469.18
2016	రూ.1404.05
2017	రూ.1470.53
2018	రూ.1703.46
2019	రూ.2052.54
2020	రూ.1403.02
2021	రూ.1474
2022	రూ.2339.09
2023	రూ.2607.41
2024	రూ.3185.57

వివిధ బ్రాండ్ల బీర్లు



మళ్లీ వానల జోరు


బెంగళూరులో శుక్రవారం వర్షం కురవడంతో హడ్సన్ సర్కిల్‌లో బస్ షెల్టర్ కింద నగరవాసులు

బనశంకరి: రాష్ట్రంలో నైరుతీ రుతుపవనాలు మళ్లీ జోరందుకోగా వీకెండ్ నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. కరావళి, మలెనాడుతో పాటు ఇతర ప్రాంతాల్లో నాలుగురోజుల పాటు రెడ్‌అలర్ట్ ప్రకటించారు. ఉత్తర, దక్షిణ ఒళనాడులో వర్షాలు అధికమయ్యే అవకాశం ఉందని, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని, ఉరుములు పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. రాష్ట్రంలో మూడురోజుల పాటు మబ్బులతో కూడిన వాతావరణం ఉంటుందని, రాత్రిసమయంలో వర్షం కురుస్తుందని పేర్కొంది. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో సాధారణం కంటే 9 శాతం అధికంగా వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది. అయితే అధికవర్షాలు కురిసే కరావళి, మలెనాడులో తక్కువ వర్షపాతం నమోదైంది. ఉత్తర, దక్షిణ ఒళనాడులో క్రమంగా 78 శాతం నుంచి 84 శాతం అధికవర్షం కురిసింది. రానున్న నాలుగురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో నదులు సమీపప్రాంతాల్లో నివసించే ప్రజలు ముందుజాగ్రత్తలు పాటించాలని తెలిపింది. బెంగళూరులో మబ్బులతో కూడిన వాతావరణం ఉంటుందని, మధ్యాహ్నం అనంతరం కొన్ని ప్రాంతాల్లో సాధారణ వర్షం కురుస్తుందని వాతావరణశాఖ పేర్కొంది.

రవాణా ఉద్యోగులపై ఎస్మా అస్త్రం ?

శివాజీనగర: రవాణా శాఖ ఉద్యోగులు ఆరు నెలలపాటు ఎటువంటి కారణానికి సమ్మె, ధర్నా, ఆందోళనలు చేయటానికి లేదని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. గత బీజేపీ పాలనలో కార్మికులు కొన్ని రోజుల పాటు సమ్మె చేశారు. ఆ సమయంలో కార్మికులతో చర్చలు జరిపిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వస్తే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చింది. ప్రస్తుతం శక్తి పథకంతో సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ సమస్యను పరిష్కరించకపోగా ధర్నాలు చేయరాదని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంపై వారు తీవ్రంగా మండిపడుతున్నారు.

చాముండి బెట్టపై భక్తులకు ఏర్పాట్లు చేయండి

మైసూరు: చాముండేశ్వరి దేవి కొండపై ఆషాఢ మాసంలో నిర్వహించే పూజలు, ఇతర ధార్మిక కార్యక్రమాలకు హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ డాక్టర్ కే.వీ. రాజేంద్ర అధికారులను ఆదేశించారు. జెడ్పీ సమావేశపు హాలులో శుక్రవారం ఆయన అధికారులతో మాట్లాడారు. జూలై 12 మొదటి శుక్రవారం, 19న రెండో శుక్రవారం, 26న మూడో శుక్రవారం, 27న అమ్మవారి జయంతికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి వేలాది మంది భక్తులు వస్తారన్నారు. వారికి అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.

విత్తనాలు, ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు

- అధికారులకు సీఎం సిద్దరామయ్య హెచ్చరిక


సమావేశంలో మాట్లాడుతున్న సీఎం సిద్దరామయ్య, చిత్రంలో మంత్రి జమీర్‌అహ్మద్

హొసపేటె: రైతులకు ఎక్కడైనా విత్తనాలు, ఎరువుల కొరత ఏర్పడితే చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య వ్యవసాయ శాఖ అధికారులను హెచ్చరించారు. ఆయన శుక్రవారం విజయనగర జిల్లా ప్రగతి సమీక్ష సమావేశంలో మాట్లాడారు. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు నిల్వ ఉన్నాయన్నారు. రైతులకు కావాల్సిన విత్తనం, ఎరువులను ఎక్కడైనా ఒకసారి ఇచ్చిన విత్తనం మొలకెత్తకపోతే రెండో దఫా కూడా విత్తనాలను రైతులకు తప్పనిసరిగా పంపిణీ చేయాలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు అందితే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.130 కోట్ల కరువు సాయం పూర్తిగా రైతులకు అందజేశారా? అని సీఎం ప్రశ్నించారు. పంట నష్టం సర్వే శాస్త్రీయంగా నిర్వహించి ఎవరికీ అన్యాయం జరగకుండా డీబీటీ ద్వారా ప్రతి రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేశామని జిల్లాధికారి ముఖ్యమంత్రికి వివరించారు. పంట కోత సమయంలో కూడా భారీ వర్షాల వల్ల జరిగిన నష్టానికి గురైన రైతులందరికీ పంటల బీమా పంపిణీ చేసినట్లు అధికారులు తెలియజేశారు. 2023–24లో మొత్తం 34 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోగా ఆ రైతు కుటుంబాలకు పరిహారం అందించారా? లేదా? అని ముఖ్యమంత్రి నిలదీశారు.

డీడీపీఐ, బీఈఓల సస్పెన్షన్‌కు సీఎం సూచన

మానవాభివృద్ధి సూచీలో విద్యారంగంలో జిల్లా 10వ స్థానం నుంచి 27వ స్థానానికి పడిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం దీనికి మీరెందుకు బాధ్యత వహించరని డీడీపీఐని ప్రశ్నించారు. ఎస్ఎస్ఎల్‌సీలో గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం ఉత్తీర్ణత తగ్గడానికి కారణం మీరే. మీ బీఈఓలు, ఉపాధ్యాయులు కృషి ఏమిటి? ఈ దిశలో మీపై ఎలాంటి చర్యలు తీసుకోవాలని డీడీపీఐని సీఎం ప్రశ్నించారు. ఈ సారి 20 శాతం గ్రేస్ మార్కులు ఇచ్చినా ఈ స్థాయికి పడిపోయారు, ఓవరాల్ పని తీరుతో సంతృప్తిగా ఉన్నారా? అని అడిగారు. సమావేశంలో మధ్యలో విద్యాశాఖ కార్యదర్శి రితేష్‌ను సీఎం ఫోన్‌లో సంప్రదించారు. వారి పని తీరును ప్రశ్నిస్తూ డీడీపీఐ, బీఈఓ ఇద్దరిని వెంటనే సస్పెండ్ చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్, ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి గోవిందరాజు, ముఖ్యమంత్రి ఆర్థిక సలహాదారు బసవరాజ రాయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యంపై అబ్కారీ పన్నుల తగ్గింపు!

యశవంతపుర: అధిక విలువగల మద్యంపై జులై 1 నుంచి అబ్కారీ పన్నును తగ్గించాలని ప్రభుత్వం యోచిస్తుంది. సరిహద్దు రాష్ట్రాల్లోని ధరలకు అనుగుణంగా రాష్ట్రంలో సెమీ ప్రీమియం, ప్రీమియం బ్రాండ్లపై మద్యం ధరలను సమీక్షించాలని ప్రభుత్వం గత ఫిబ్రవరిలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ప్రకటించింది. 2023 జులైలో భారత్‌లో తయారవుతున్న మద్యంపై ఉన్న పన్నులు పెంచారు. 2024 జనవరిలో బీర్ విక్రయాలపై పన్నులను పెంచారు. అయితే మొదటి సారిగా కాంగ్రెస్ ప్రభుత్వం మద్యం విక్రయాలపై అబ్కారీ పన్ను తగ్గించాలని నిర్ణయించింది. ఇతర రాష్ట్రాలతో పోల్చితే మద్యంపై అబ్కారీ పన్నులు రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నాయి. దీంతో సరిహద్దు రాష్ట్రాల నుంచి కర్ణాటకలోకి మద్యం అక్రమంగా సరఫరా అవుతోంది. సరిహద్దు జిల్లాల ప్రజలు పక్కరాష్ట్రానికి వెళ్లి మద్యం తాగిరావటంతో రాష్ట్ర ఆదాయానికి గండి పడుతోందని భావించిన ప్రభుత్వం అబ్కారీ పన్నులను తగ్గించాలని నిర్ణయించారు.

అవినీతిలో నా పాత్ర శూన్యం



మాట్లాడుతున్న బసన గౌడ దద్దల్

రాయచూరు రూరల్: మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన రూ.187 కోట్ల అవినీతిలో తన పాత్ర ఏమీ లేదని గ్రామీణ శాసన సభ్యుడు బసనగౌడ దద్దల్ వెల్లడించారు. శుక్రవారం పాత్రికేయులతో ఆయన మాట్లాడారు. మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన నిధుల దుర్వినియోగంపై సిట్ అధికారులు సమగ్ర విచారణను జరుపుతున్నట్లు వివరించారు.

కేంద్ర మంత్రితో భేటీ



కేంద్ర మంత్రిని కలిసిన వెంకటరెడ్డి

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలో ఫుడ్ హబ్ పార్క్‌ను స్థాపించడానికి చర్యలు చేపట్టాలని లోక్ జనశక్తి పార్టీ రాష్ట్రాధ్యక్షుడు వెంకటరెడ్డి కేంద్ర ఆహార సంస్కరణల పరిశ్రమల శాఖా మంత్రి చిరాగ్ పాశ్వాన్‌కు విన్న వించారు. ఆయన న్యూఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి చర్చించారు. రాయచూరు, యాదగిరి జిల్లాల్లో ఫుడ్ పార్కును ప్రారంభిస్తే వలసలను నివారించవచ్చని తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడిని తొలగించాలని ధర్నా



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు

రాయచూరు రూరల్: జిల్లాలోని లింగసూగూరు తాలూకాలో ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించాలని గత రెండు రోజుల నుంచి పాఠశాల ముందు ధర్నా చేపట్టారు. శుక్రవారం ప్రభుత్వ హైస్కూలు ముందు ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేసిన కార్యక్రమంలో సంచాలకుడు రమేష్ మాట్లాడారు. యలగట్ట ప్రభుత్వ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు నాగనగౌడ పాఠశాలకు గైర్హాజరు అవుతున్నారని ఆరోపించారు. గత మూడు నెలల నుంచి విధులకు గైర్హాజరైన నాగనగౌడను సస్పెండ్ చేయాలని కోరుతూ జిల్లా, తాలుకా విద్యాశాఖాధికారులకు వినతిపత్రం సమర్పించారు.

పర్యావరణంతో మమేకం కావాలి

హుబ్లీ: 30 వేల సంవత్సరాల క్రితం నుంచే నాగరికత ప్రారంభమై దశల వారీగా వికసించిందని సీనియర్ పర్యావరణ వేత డాక్టర్ సంజీవ్ కులకర్ణి ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని అన్వేషణ కూటమి ఆధ్వర్యంలో సాధనకేరి చైత్ర మీటింగ్ హాల్‌లో నిర్వహించిన మట్టి నుంచి దూరం, ఆరోగ్యం నుంచి దూరం అనే విషయంపై ఆయన ప్రత్యేకంగా ప్రసంగించారు. పెంటతో నిర్మించుకున్న చిన్న చిన్న ఇళ్లలోనే సుఖమయమైన జీవితాన్ని అనుభవించిన నాటి మనుషులు ప్రస్తుతం మేమే టైల్స్, కాంక్రీట్‌లతో అంతస్తుల భవనాలను నిర్మించుకున్నా ఆనాటి సుఖ శాంతులు నేడు కరువయ్యాయన్నారు. మట్టితోనే అవినాభావ సంబంధాన్ని కోల్పోతున్నామన్నారు. ప్రస్తుతం అరికాళ్లకు కూడా మట్టి అంటకుండా బతుకు సాగిస్తున్నామన్నారు. ప్రస్తుతం అధ్వాన దశలో జీవనశైలిలో పర్యావరణంతో మమేకమై తగిన మార్పులతో మనుగడ సాగించడం మంచిదని మరో పర్యావరణవేత్త డాక్టర్ ప్రకాష్ భట్ తెలిపారు. కూటమి అధ్యక్షులు నరసింహా పరంజపే, వెంకటేష్ దేశాయి, అనిల్ కాకండకి, ప్రొఫెసర్ దుష్యంత్ నాడగౌడ, అనంతసిద్దేశ్వర, సత్య ధీరకట్టి, శ్రీధర్ గాంవకర్ పాల్గొన్నారు.



ప్రపంచ యోగా దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య



కోలారులో యోగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ మల్లేష్‌బాబు



మైసూరులో యోగా ఆసనాలు వేస్తున్న ఎంపీ యదువీర్

యోగా ..ఆరోగ్యానికి మంచిదేగా

- ఒత్తిడి నివారణకు యోగా అనివార్యం
- ప్రపంచ యోగా దినోత్సవంలో వక్తలు

సాక్షి,బళ్లారి: బళ్లారి జిల్లాలోని జిందాల్ స్టీల్ కర్మాగారం విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన యోగా శిబిరంలో సీఎం సిద్దరామయ్య పాల్గొని యోగా చేశారు. మంత్రి సంతోష్‌లాడ్, జిల్లాధికారి తదితరులు శిబిరంలో వివిధ ఆసనాలు, ప్రాణాయామాలు చేశారు. దైనందిన జీవితంలో యోగా తప్పనిసరని గురువులు సూచించారు.

రాయచూరు రూరల్ : యోగా, ధ్యానంతో మనిషికి ఆయు వృద్ధి చెందుతుందని, ప్రతి ఒక్కరూ నిరంతరం యోగా, ధ్యానం చేయాలని ఆర్డీఏ అధ్యక్షుడు రాజశేఖర్ రామస్వామి సూచించారు. శుక్రవారం మహాత్మా గాంధీ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ప్రపంచ యోగా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి రోజుల్లో పిల్లలు, పెద్దలు ఎండ, వానలోకి వెళ్లాలంటే భయపడుతున్నారన్నారు. గొడుగు పట్టడం, క్యాప్ ధరించడం లేదా వర్షం పడని చోటకు పరుగున వెళ్లి రక్షించుకోవడం చేస్తున్నారన్నారు. వర్షపు నీరు ఎంతో శ్రేష్టమైనవని, వాటి వల్ల శరీరంపై భాగంలో ఉన్న చర్మానికి మంచిదన్నారు. యోగాసనాలు చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండేందుకు వీలవుతుందన్నారు. శిబిరంలో అదనపు జిల్లాధికారి దురుగేష్, జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండే, జిల్లా ఆయుష్ అధికారి శంకర గౌడ పాటిల్, విద్యాశాఖాధికారులు బడిగేర్, చంద్రశేఖర్, తిమ్మప్పలున్నారు.

హొసపేటిలో..

హొసపేటి: టీబీ డ్యాం పీఎల్‌సీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు యోగాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యం బాగుంటే ఏదైనా సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి రోజూ యోగా సాధన చేయాలన్నారు. రోజూ యోగా, ధ్యాన్యం, ప్రాణాయామం చేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

హుబ్లీ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జంట నగరాలతో పాటు జిల్లాలోని అన్ని తాలూకా కేంద్రాల్లో విద్యాసంస్థలు, సంఘ సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం వివిధ యోగాసనాల ద్వారా ఘనంగా ఆచరించారు. కార్పొరేషన్ పరిధిలో కొన్ని చోట్ల ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రధాని మోదీ పాల్గొనే కార్యక్రమాన్ని ప్రత్యేక ప్రసారంతో పాటు యోగాదినోత్సవాన్ని ఆచరించారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత యోగా గురువు, శిక్షకులు పాల్గొని యోగాభ్యాసాలను ప్రజలకు నేర్పించారు. స్థానిక నృపతుంగ బెట్ట తదితర చోట్ల ఉదయం 6.30 గంటలకు స్థానిక ఎమ్మెల్యే మహేష్ టెంగినకాయి నేతృత్వంలో దినోత్సవాన్ని ఆచరించారు. ఈ కార్యక్రమాల్లో మహిళలు, యువకులు, ప్రముఖులు యోగా శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు. నృపతుంగ బెట్ట వద్ద హుబ్లీ పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ఈ సాయంత్రం కూడా ఉచిత సామూహిక ధ్యానం, ప్రత్యేక వర్క్‌షాపును ఏర్పాటు చేశారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ విశాలాక్షి ఎస్.ఆకళవాడి నేతృత్వంలో సాయంత్రం ప్రత్యేక వర్క్‌షాపు నిర్వహించారు. మొత్తానికి జంట నగరాలలోనే కాకుండా తాలూకాలోని నవలగుంద, కుందగోళ, కలఘటిగి తదితర ప్రాంతాల్లో అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని ప్రజలు, ప్రముఖులు కలిసి ఘనంగా జరుపుకున్నారు.

కోలారులో...

కోలారు: యోగాతో ఉత్తమ ఆరోగ్యం కలుగుతుందని లోక్‌సభ సభ్యుడు ఎం.మల్లేష్‌బాబు తెలిపారు. ఆయన శుక్రవారం నగరంలోని విశ్వేశరయ్య స్టేడియంలో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ రాకతో నేడు యోగా విశ్వవ్యాప్తమైందన్నారు. నరేంద్ర మోదీ యోగాను దేశానికి మాత్రమే కాదు యావత్ ప్రపంచానికి పరిచయం చేశారన్నారు. యోగా మహత్యాన్ని తెలుసుకున్న ప్రపంచ దేశాలు అన్నీ నేడు యోగా వైపు మొగ్గు చూపుతున్నాయన్నారు. విద్యార్థి దశ నుంచే యోగాను పాటించడం ద్వారా మానవులు అనేక రోగాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. నిరంతర ఒత్తిడి మధ్య జీవిస్తున్న వారికి యోగా దివ్యౌషధం అన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం యోగా చేయడం ద్వారా ఒత్తిడి నుంచి దూరం కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇంచర గోవిందరాజులు, సమాజ సేవకుడు సీఎంఆర్ శ్రీనాథ్, తహసీల్దార్ హర్షవర్ధన్, నగరసభ కమిషనర్ శివానంద, జిల్లా ఆస్పత్రి సర్జన్ డాక్టర్ విజయకుమార్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.

మాలూరులో...

మాలూరు : యోగాతో రోగాలు దూరమై ఉత్తమ ఆరోగ్యం కలుగుతుందని ఎమ్మెల్యే కె వై నంజేగౌడ తెలిపారు. శుక్రవారం నగరంలోని హోండా స్టేడియంలో నిర్వహించిన విశ్వ యోగా దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. నిత్యం యోగా చేయడం ద్వారా మానవుడు ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. అందుకే నేడు యోగా విశ్వవ్యాప్తమైందన్నారు. యోగా మనసు, దేహాన్ని సుస్థితిలో ఉంచుతుందన్నారు. ఈ మధ్య మానవుడు అనేక ఒత్తిళ్ల మధ్య జీవిస్తున్నాడన్నారు. ఒత్తిడి నుంచి దూరం కావడానికి యోగా ఒక్కటే మార్గమన్నారు. ప్రతినిత్యం యోగా చేయడం ద్వారా ఆరోగ్యవంతంగా జీవించవచ్చన్నారు. తహసీల్దార్ కె రమేష్, పురసభ ముఖ్యాధికారి ప్రదీప్ కుమార్, టీపీ ఈఓ కృష్ణప్ప, బీఈఓ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

కేజీఎఫ్‌లో...

కేజీఎఫ్: ఒత్తిడి నుంచి దూరం కావడానికి నేడు యోగా అనివార్యమని న్యాయమూర్తి గణపతి గురుసిద్ధ బాదామి తెలిపారు. శుక్రవారం విశ్వ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పతంజలి యోగా కేంద్రం ఆధ్వర్యంలో నగరంలోని మునిసిపల్ మైదానంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. యోగా మనసు, దేహాన్ని సుస్థితిలో ఉంచుతుందన్నారు. నేడు అనేక ఒత్తిళ్ల మధ్య జీవిస్తున్న మానవుడికి దీని నుంచి దూరం కావడానికి యోగా ఒక్కటే మార్గమన్నారు. ప్రతినిత్యం యోగా చేయడం ద్వారా ఆరోగ్యకర జీవితం అలవడుతుందన్నారు. ఈ సందర్భంగా కేజీఎఫ్ న్యాయమూర్తులు ముజఫర్ ఎ మాంజరి, వినోద్ కుమార్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రాజగోపాలగౌడ తదితరులు పాల్గొన్నారు.



కోలారులో యోగా నిర్వహిస్తున్న ఎంపీ మల్లేష్‌బాబు తదితరులు



మాలూరులో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు



కేజీఎఫ్‌లో యోగా శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

రైల్వే సిబ్బంది యోగా



ఆసనాలు వేస్తున్న సిబ్బంది

బొమ్మనహళ్లి : బెంగళూరు సిటీ సెంట్రల్ రైల్వే స్టేషన్ పరిధిలోని ఎస్‌టీసీ ట్రైనింగ్ సెంటర్‌లో శుక్రవారం యోగా దినం నిర్వహించారు. రైల్వే అధికారులు, శిక్షణ పొందుతున్న సిబ్బంది హాజరై యోగాసనాలు వేశారు. యోగా గురువు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రితో వీడియో కాన్ఫరెన్స్

బనశంకరి: రాష్ట్ర వ్యవసాయ పథకాలకు సహకారం అందించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి చెలువరాయస్వామి, కేంద్ర వ్యవసాయ గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి శివరాజ్ చౌహాన్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వివిధ రాష్ట్రాల వ్యవసాయశాఖ మంత్రులతో కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ మంత్రి చెలువరాయస్వామి పాల్గొని సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వర్షాలు, పంటలు, రైతుల సమస్యలు గురించి ప్రస్తావించారు. కర్ణాటక దేశంలోని ద్విదళ ధాన్య పంటలకు 11 శాతంలో 8 శాతం ఉత్పత్తి అవుతుంది. రాష్ట్రంలో 31.6 లక్షలు హెక్టార్లలో 19.83 టన్నులు ద్విదళ ధాన్యం పండిస్తారని కేంద్రమంత్రికి తెలిపారు. కందిపప్పు ఉత్పత్తిలో కర్ణాటక దేశంలోనే రెండో స్థానంలో ఉంది. కర్ణాటక రాష్ట్రంలో ఉత్పత్తి, ఉత్పాదన రెండింటిని పెంచడానికి పథకాలు రూపొందిస్తున్నామన్నారు.

రోడ్డు పక్కన నవజాత శిశువు లభ్యం



నవజాత శిశువుతో అధికారులు

బాగేపల్లి: అప్పుడే పుట్టిన నవజాత శిశువును రోడ్డు పక్కన పడేసిన ఘటన బాగేపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. ఈనెల 18న చెత్తకుప్పలో శిశువు కనిపించడంతో ఓ ఆటో డ్రైవర్ బాలరెడ్డి, వెంకటేశ్‌లు చిన్నారిని చేరదీసి ఇంటికి తీసుకెళ్లి సపర్యలు చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న బాలల రక్షణ విభాగం, శిశు అభివృద్ధి అధికారులు శుక్రవారం చిన్నారిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చిన్నారిని బాలల రక్షణ కేంద్రంలో అప్పగించారు. బాగేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశామని, వారు విచారణ చేస్తున్నారని శిశు అభివృద్ధి అధికారి రామచంద్ర తెలిపారు.

ముంగారు సాంస్కృతిక ఉత్సవాలు షురూ



రాతిదూలాన్ని లాగుతున్న కర్ణాటక ఎద్దులు

రాయచూరు రూరల్: గ్రామీణ సంస్కృతిని మరపించేలా ముంగారు ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్, నగర ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ పేర్కొన్నారు. వారు శుక్రవారం నగరంలోని ఏపీఎంసీ ఆవరణలో మున్నూరు కాపు సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముంగారు ఉత్సవాల్లో భాగంగా కర్ణాటక ఎద్దులకు ఏర్పాటు చేసిన ఒకటిన్నర టన్నుల బరువుగల రాతి దూలం లాగే పోటీలను ప్రారంభించి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే, మున్నూరు కాపు సమాజం అధ్యక్షుడు పాపారెడ్డి ఆధ్వర్యంలో ఏరువాక పున్నమి సందర్భంగా జరిగే పోటీలు ప్రజలకు కనువిందు చేయడం హర్షణీయమన్నారు.

రాహుల్‌పై దుష్ప్రచారం.. యూట్యూబర్‌కు నోటీసు

శివాజీనగర: కాంగ్రెస్ నాయకుడు, ఎంపీ రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో వివాదాస్పద వీడియో పోస్టు చేసిన నేపథ్యంలో విచారణకు హాజరు కావాలని నోయిడాకు చెందిన రచయిత, యూట్యూబర్ అజిత్ భారతికి బెంగళూరు నగరంలోని హైగ్రౌండ్స్ పోలీసులు గురువారం నోటీస్ జారీ చేశారు. ఈ నోటీసు స్వీకరించిన వారం రోజుల్లోగా అధికారుల ముందు విచారణకు హాజరుకావాలని పేర్కొన్నారు.

కేసు నేపథ్యం..

ఈ నెల 6న తన అధికారిక ఎక్స్ ఖాతాలో నోయిడాకు చెందిన రచయిత, యూట్యూబర్ అజిత్ భారతి.. రాహుల్ వ్యాఖ్యలతో కూడిన ఓ వీడియోను పోస్టు చేశారు. అందులో శ్రీరామ మందిరం కాకుండా బాబ్రీ మసీదును మళ్లీ తీసుకొచ్చేందుకు ఉద్దేశించారని రాహుల్ పేర్కొన్నారని సారాంశం. దీనిపై కేపీసీసీ న్యాయ విభాగం న్యాయవాది బీకే బోపణ్ణ హైగ్రౌండ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాహుల్ గాంధీ తన ఏ ప్రసంగంలోనూ ఇలాంటి వ్యాఖ్యలు చేయలేదని, రెండు వర్గాల మధ్య రెచ్చగొట్టే ఉద్దేశంతోనే అజిత్ భారతి అవాస్తవాలు చూపించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. 153 ఏ యాక్ట్ కింద అజిత్ భారతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం విచారణకు హాజరుకావాలని నోటీస్ ఇచ్చారు.

రామేశ్వరం రైలు సేవలు పొడిగింపు

హుబ్లీ: హుబ్లీ–రామేశ్వరం మధ్య సంచరించే వీక్లీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సంచార సేవలను డిసెంబర్ వరకు పొడిగించాలని నైరుతి రైల్వే నిర్ణయించింది. ఈ మేరకు ప్రస్తుతం ఉన్న సమయం, నిలుపుదల ఎప్పటిలానే కొనసాగనుంది. ఈ సేవల కొనసాగింపు గురించి నైరుతి రైల్వే సమర్పించిన ప్రతిపాదనకు రైల్వే మండలి అనుమతి ఇచ్చింది.



బెంగళూరులో ఆందోళన నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నీట్ అక్రమాలపై కన్నెర్ర

నీట్ పరీక్షల్లో అక్రమాలను నిరసిస్తూ శుక్రవారం రాష్ట్రంలో ఆందోళనలు కొనసాగాయి. బెంగళూరులోని కాంగ్రెస్ భవన్ వద్ద పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించి కేంద్రం తీరుపై దుమ్మెత్తి పోశాయి. నీట్‌ను రద్దు చేసి మళ్లీ పరీక్షలు నిర్వహించాలని నాయకులు డిమాండ్ చేశారు. అదేవిధంగా నీట్ అక్రమాలపై చిక్కమగళూరులో ఎన్ఎస్‌యూఐ నాయకులు, విద్యార్థులు ఆందోళన నిర్వహించారు.

కోలారు వార్తలు...

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం



పాఠశాలలకు కంప్యూటర్లను అందించిన దృశ్యం

కేజీఎఫ్ : నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని సమాజ సేవకుడు, మాజీ జీపీ సభ్యుడు విజయ్ తెలిపారు. బుధవారం తాలూకాలోని 6 పాఠశాలలకు ఈఎస్ఐ కంప్యూటర్ కంపెనీ అధికారులు అందించిన ఉచిత కంప్యూటర్లను అందించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా కంప్యూటర్ విద్యను విద్యార్థులకు అందించాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉత్తమ విద్యను బోధించాలన్నారు. పెద్ద పరిశ్రమల వారు తమ లాభంలో 1 శాతాన్ని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిపుణులైన ఉపాధ్యాయులు ఉంటారనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఈఎస్ఐ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ కంపెనీ ఎండీ వేణుగోపాల్, మారికుప్పం జీపీ మాజీ అధ్యక్షుడు ప్రసాదరెడ్డి, బాణగెరె తదితరులు పాల్గొన్నారు.

చెరువులో వృద్ధుడి మృతదేహం లభ్యం



చెరువులో లభ్యమైన వృద్ధుడి మృతదేహం

శ్రీనివాసపురం : తాలూకాలోని యలువనహళ్లి గ్రామ సమీపంలోని చెరువులో వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. వృద్ధుడి మృతదేహాన్ని చెరువులో చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థలానికి డీఎస్పీ నందకుమార్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం బీ గొరవనకొళ్ల, ఎస్ఐ జయరాం తదితర సిబ్బంది చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని తమిళనాడుకు చెందిన మణికంఠ కృష్ణస్వామి(60)గా గుర్తించారు. వృద్ధుడి మరణానికి కారణం తెలియరాలేదు. శరీరంపై అక్కడక్కడ గాయం గుర్తులు ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న శ్రీనివాసపుర పోలీసులు దర్యాప్తును ప్రారంభించారు.

ఈ-ఖాతా సమస్యకు త్వరలో పరిష్కారం



మాట్లాడుతున్న మంత్రి రహీంఖాన్

కోలారు : నగరసభ ఈ-ఖాతా సమస్యను త్వరలో పరిష్కరిస్తామని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి రహీంఖాన్ తెలిపారు. శుక్రవారం నగరంలోని కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తల నుంచి సన్మానం స్వీకరించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీబీఎంపీ మినహాయించి నగరపాలక, నగరసభ, పురసభ వ్యాప్తిలోని అక్రమ కాలనీల్లో ప్లాన్ మంజూరు కాకుండా భవనాలు నిర్మించి సౌకర్యాలు పొందుతున్న యజమానులకు నిర్వహణ శుల్కం విధించాలని కేబినెట్‌లో తీర్మానించారన్నారు. మూడు నెలల్లోగా అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. రాష్ట్రంలో కార్యకర్తల శ్రమ వల్లనే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. కార్యకర్తలను గుర్తించి వారికి సముచిత స్థానం ఇస్తామన్నారు. అన్ని సముదాయాలను కలుపుకుని పోవడం కేవలం కాంగ్రెస్ పార్టీ వల్లనే సాధ్యమవుతుందన్నారు. ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ మాట్లాడుతూ కోలారు జిల్లా బెంగళూరుకు సమీపంలో ఉన్నా ఇంకా సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదన్నారు. ఎంతో అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి ఉందన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఊరుబాగిలు శ్రీనివాస్, నగర బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రసాద్ బాబు, జయదేవ్, యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇకపై పుష్కలంగా తాగునీరు



పైప్‌లైన్ ద్వారా వచ్చిన యరగోళ నీటిని చూస్తున్న ఎమ్మెల్యే నంజేగౌడ

మాలూరు: పట్టణంలోని ఓవర్ హెడ్ ట్యాంకుకు పైప్ లైన్ ద్వారా యరగోళ తాగునీటి పథకం నుంచి నీరు వస్తున్నందున ఇకపై ప్రతినిత్యం పట్టణ ప్రజలకు 3.2 దశలక్ష లీటర్ల తాగునీటిని అందిస్తామని ఎమ్మెల్యే కేవై నంజేగౌడ తెలిపారు. శుక్రవారం మారుతీ కాలనీలో నగర నీటి సరఫరా మండలి నుంచి రక్షిత తాగునీటి సరఫరా కోసం నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకుకు తాగునీటి సరఫరా కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. పట్టణ ప్రజలకు ఇదొక ప్రత్యేకమైన రోజన్నారు. యరగోళ తాగునీరు ద్వారా పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. యరగోళ తాగునీటి ప్రాజెక్టును 6 నెలల క్రితం ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రారంభించారన్నారు. సోమవారం నుంచి పట్టణంలోని 12 వార్డులకు మొదటి దశలో తాగునీటిని అందిస్తామన్నారు. పైప్‌లైన్ శుభ్రం కావాల్సి ఉన్నందున పట్టణ ప్రజలు మొదటి 15 రోజుల పాటు ఈ నీటిని గృహ అవసరాలకు వినియోగించుకుని అనంతరం తాగడానికి ఉపయోగించుకోవాలన్నారు. తహసీల్దార్ కె రమేష్, పురసభ సభ్యుడు ఇంతియాజ్ ఖాన్, ఎ రాజప్ప, తదితరులు ఉన్నారు.

7న శ్రీనివాసగౌడకు సన్మానం



శ్రీనివాసగౌడను కలిసి ఆహ్వానిస్తున్న సభ్యులు

కోలారు : జిల్లాకు చెందిన సీనియర్ సహకార దురంధరుడు, మాజీ మంత్రి శ్రీనివాసగౌడను జూలై 7న ఆయన అభిమాన సంఘం తరఫున ఘనంగా సన్మానిస్తున్నారు. శుక్రవారం తన నివాసంలో ఆయనను కలిసి కార్యక్రమానికి రావాల్సిందిగా సంఘం సభ్యులు ఆహ్వానం పలికారు. జిల్లా కాంగ్రెస్ కార్యాధ్యక్షుడు ఊరు బాగిలు శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా కీర్తిని శ్రీనివాసగౌడ దేశ విదేశాల్లో వ్యాపింపజేశారన్నారు. అబ్బిహళ్లి సొసైటీ ద్వారా రాజకీయ రంగ ప్రవేశం చేసిన శ్రీనివాసగౌడ తాలూకా బోర్డు సభ్యుడిగా, జెడ్పీ సభ్యుడిగా, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎంతో సేవ చేశారన్నారు. సహకార రంగానికి ఆయన అందించిన సేవలు అపారమన్నారు. ఆయన సాధనను గుర్తించి రాబోయే తరాల వారికి శ్రీనివాసగౌడ సాధనను తెలియజేయడానికి పౌర సన్మానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 40 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఆయన చేసిన సామాజిక సేవ అపారమన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు శ్రీకృష్ణ, హొళలి ప్రకాష్, కెంబోడి నారాయణగౌడ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీటీ వాహనం బోల్తా



బోల్తాపడిన వాహనం

దొడ్డబళ్లాపురం: బైక్‌ను తప్పించబోయి టీటీ వాహనం బోల్తాపడ్డ ఘటన యలహంక–దొడ్డ బళ్లాపురం మార్గంలోని రాజానుకుంట వద్ద చోటుచేసుకుంది. శుక్రవారం తెల్లవారుజామున టీటీ వాహనం దొడ్డబళ్లాపురంలోని ఫ్యాక్టరీకి కార్మికులను పికప్ చేసుకోవడానికి వస్తుండగా రాజానుకుంట వద్ద హఠాత్తుగా బైక్ అడ్డంగా వచ్చింది. దీంతో బైక్‌ను తప్పించబోయి టీటీ వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టింది. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణా పాయం సంభవించలేదు. టీటీ వాహనం డ్రైవర్, బైక్ చోదకుడికి స్వల్ప గాయాలయ్యాయి. రాజానుకుంట పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నలుగురు బాల కార్మికులకు విముక్తి

గౌరిబిదనూరు: పాన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కార్మిక శాఖ అధికారి సతీష్‌తో కలిసి జిమ్మా బాల కార్మికుల నిషేధ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీఆర్ రమేశ్ శుక్రవారం వివిధ వర్క్ షాపులు, బేకరీలు, హోటళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నలుగురు బాల కార్మికులను గుర్తించి విముకల్పించారు. ఇకపై ఎవరైనా బాలలను పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలలను పనులకు కాకుండా బడులకు పంపాలన్నారు. తనిఖీల్లో అధికారిణులు మంజుల, కళావాణి, విజయలక్ష్మి, సీడీపీఓ రవికుమార్, అమ్మాజాన్, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా భారీ వృక్షం



తుమకూరు: తుమకూరు నగరంలో బీహెచ్ రోడ్డులోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో ఓ భారీ వృక్షం కూలిపోయే స్థితికి చేరుకుంది. భారీ వర్షాలు, ఈదురు గాలులు తరచూ వస్తుండటంతో ప్రజలు భయపడిపోతున్నారు. ఏళ్ల నాటి ఈ చెట్టు ఇప్పుడు పూర్తిగా ఎండిపోయింది. అధికారులు ఇప్పటికేనా ప్రమాదం జరగక ముందే చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మమదాపుర చెరువుకు పునరుజ్జీవం

శివాజీనగర: విజయపుర జిల్లా బబలేశ్వర తాలూకాలో ఉన్న చారిత్రక మమదాపుర చెరువును రూ. కోటి వ్యయంతో పునఃశ్చేతనకు కోకాకోలా కంపెనీ ముందుకు వచ్చిందని జిల్లా ఇన్‌చార్జి, పరిశ్రమల మంత్రి ఎం.బీ. పాటిల్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు కంపెనీ ఉన్నతాధికారులు హిమాంశు ప్రియదర్శి, ముకుంద్ త్రివేది మంత్రిని భేటీ చేసి చర్చించారు. 16వ శతాబ్దంలో అదిల్ షాహి సుల్తానుల కాలంలో నిర్మితమైన మమదాపుర చెరువు రాష్ట్రంలో అతిపెద్ద చెరువుల్లో ఒకటి. 674 ఎకరాల ఆయకట్టు ప్రాంతానికి నీరు అందిస్తుందని ఆయన తెలిపారు. చెరువు పునఃశ్చేతన తరువాత ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రమవుతుందని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

నీట్‌లో భారీ కుంభకోణం



తుమకూరు: వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం చేపట్టిన నీట్ యూజీ పెద్ద కుంభకోణమని కేపీసీసీ ప్రధాన కార్యదర్శి మురళీధర్ హాలప్ప ఆరోపించారు. నీట్ అక్రమాలపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తాజా ఫలితాల్లో పదుల సంఖ్యలో ర్యాంకులు రావడం అనుమానంగా ఉందన్నారు. నీట్ అక్రమాలపై కేంద్ర ప్రభుత్వంలోని మంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు.

హాసనకు ప్రజ్వల్

బనశంకరి: సీఐడీలో నమోదైన అత్యాచారం కేసుకు సంబంధించి మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను హాసన్‌లోని ఆర్‌సీ.రోడ్డులోని ఆయన నివాసానికి తీసుకెళ్లి విచారణ చేశారు. శుక్రవారం సిట్ అధికారులు, ఎఫ్‌ఎస్‌ఎల్ బృందం ప్రజ్వల్ రేవణ్ణను హాసన్ ఆర్ సీ.రోడ్డులోని ఇంటికి తరలించి మహిళపై అత్యాచారానికి పాల్పడిన స్థలాన్ని పరిశీలించారు. శుక్రవారం బెంగళూరు నుంచి ఆయన్ను నేరుగా సిట్ బృందం హాసన్‌కు తీసుకెళ్లి మహజర్ చేశారు.

పాఠశాలలో యోగా

బాగేపల్లి: ప్రతి ఒక్కరూ నిత్యం ఏదో ఒక సమయంలో యోగా సాధన చేయాలని బీఆర్‌సీ సమన్వయ అధికారి వెంకటరామ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో యోగా దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేడు యోగాను ప్రపంచ వ్యాప్తంగా ఆచరిస్తున్నారని, ప్రతి ఒక్కరూ యోగా సాధన చేసి ఆరోగ్యంగా ఉండాలన్నారు.

యోగాతో ఆరోగ్యకర జీవనం

ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖులు, ప్రజలు యోగాసనాలు ఆచరించారు. ఆరోగ్య పరిరక్షణకు, అనేక రుగ్మతలను దూరం చేసే సత్తా యోగాకు ఉంది. దీంతో నేడు గ్రామ గ్రామాన యోగా విస్తరించింది.

- రాష్ట్ర వ్యాప్తంగా వేడుకగా యోగా దినోత్సవం



మైసూరులో యోగాసనాలు వేస్తున్న దృశ్యం



మండ్యలో యోగా కార్యక్రమ దృశ్యం



బొమ్మనహళ్లిలో సామూహికంగా యోగా సాధన



దత్తపీఠంలో విద్యార్థులతో స్వామీజీ ధ్యానం

బొమ్మనహళ్లి: యోగా భారతీయ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అని, నేడు ప్రజలందరూ ఆరోగ్య సాధన కోసం యోగా చేయాలని బొమ్మనహళ్లి ఎమ్మెల్యే సతీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఇక్కడి హెచ్‌ఎస్ ఆర్ లేఔట్‌లో అటల్ బిహారి వాజ్‌పేయి క్రీడా మైదానంలో స్థానిక హెచ్‌ఎస్‌ఆర్ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని ప్రారంభించి ఆయన కూడా యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు, స్థానికులు పాల్గొని యోగా సాధన చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గురుమూర్తి రెడ్డి, శ్రీసాయి రామ్ విద్యాసంస్థల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, బొమ్మనహళ్లి బీజేపీ యువ మోర్చ అధ్యక్షుడు లక్ష్మణ్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండ్య: శారీరక రుగ్మతలను రూపమాపేది యోగా అని, యోగా సాధన చేస్తే ఉత్తమ ఆరోగ్య సిద్ధిస్తుందని మండ్య జిల్లా కలెక్టర్ కుమార్ అన్నారు. మండ్య జిల్లా పరిపాలన విభాగం ఆధ్వర్యంలో ఆయన యోగా దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి రోజు గంట సమయం యోగా సాధనకు కేటాయించాలని అన్నారు.

గౌరిబిదనూరులో...

గౌరిబిదనూరు: విశ్వ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని హీరేబిదనూరులోని బ్రైట్ పాఠశాల విద్యార్థులు రామలింగేశ్వర దేవాలయం ఆవరణంలో యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కార్యదర్శి ఎన్ రంగనాథ్ మాట్లాడుతూ.... ప్రపంచానికి యోగాను పరిచయం చేసింది భారత దేశమని, నేడు యోగా విశ్వవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుల్తానా, జుగాన, రషియా తదితరులు పాల్గొన్నారు.

మండ్యలో...

మండ్య: ఆత్మ, పరమాత్మను జోడించడంతో పాటు మనసును, ఆరోగ్యంగాను సంతోషంగా ఉండేలా చేసేదే యోగా అని ఉపాధ్యాయురాలు పూర్ణిమా రవి శంకర్ అన్నారు. మండ్య తాలూకా కెరెగోడు సమీపంలో ఉన్న మాధవ పాఠశాల ఆవరణలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలన్నారు.

మైసూరులో యోగా దినోత్సవం

మైసూరు: మైసూరు నగరంలోని వాణి విలాస్ ఆరసు బాలికల పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని కేంద్ర సంవహన శాఖ డైరెక్టర్ బెంగళూరు విభాగం పల్లవి చిన్న ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి యోగా సాధన చేశారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో విద్యార్థులకు యోగా తరగతులు నిర్వహించాలన్నారు.

దత్తపీఠంలో...

మైసూరు: ప్రతి రోజూ యోగా సాధన చేస్తే ఉత్తమ ఆరోగ్యం సిద్ధిస్తుందని దత్తపీఠం అవదూత శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి అన్నారు. మైసూరు నగరంలోని దత్తపీఠంలో యోగా దినోత్సవం సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి 40 నిమిషాల పాటు యోగాసనాలు వేశారు.

చిక్కబళ్లాపురంలో..

చిక్కబళ్లాపురం: అంతర్జాయతీ యోగా దినోత్సవం పురస్కరించుకుని నగరంలోని అగలగుర్కి బీజీఎస్ పాఠశాలలో యోగా కార్యక్రమం నిర్వహించారు. యోగ గురువు కుమారి గిరిజా విద్యార్థులు, ఉపాధ్యాయులతో యోగా సాధన చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

గౌరిబిదనూరు: పతంజలి యోగ శిక్షణ సంస్థ ఆవరణలో శుక్రవారం బ్యాంక్ ఉద్యోగుల క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా ఉపాధ్యాయుడు గంగరాజు యోగా ఆవశ్యకతను వివరించారు. యోగాతో క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవరచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ లాయర్ మల్లికార్జున, యూనియన్ బ్యాంకు చంద్రశేఖర్, తీర్థ పాఠశాల ప్రకాశ్, శోభ, కోటక్ బ్యాంకు గౌతమ్, గ్రామీణ బ్యాంకు కమల్, అశోక్, కెనరా బ్యాంకు లాల్ సింగ్ పాల్గొన్నారు.

చింతామణిలో..

చింతామణి: నగరంలోని కోర్టు ఆవరణలో విశ్వ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు నాగవేణి, శైలజ లాయర్ల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిక్కబళ్లాపురంలో:

చిక్కబళ్లాపురం: జిల్లా కేంద్రంలోని సర్ ఎం విశ్వేశ్వరయ్య క్రీడా మైదానంలో యోగా దినోత్సవాన్ని మంత్రి సుధాకర్, ఎంపీ సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున స్థానికులతో కలిసి యోగా సాధన చేశారు. ప్రతి ఒక్కరూ నిత్యం ఏదో ఒక సమయంలో యోగా సాధన చేయాలని మంత్రి, ఎంపీ సూచించారు. యోగాతో ఉత్తమ ఆరోగ్యం సాధ్యమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రవీంద్ర, జెడ్పీ సీఈఓ ప్రకాశ్ నిట్టాలి, జిల్లా అధికారులు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పతంజలి యోగ సమితి లోకనాథ్ వీణా తదితరులు పాల్గొన్నారు.



యోగా అసోసియేషన్ సభ్యులతో ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న యోగా సాధకులు

విజయపురలో...

విజయపుర (బెంగళూరు గ్రామీణ): విజయపుర పట్టణంలో ఉన్న ప్రభుత్వ కళాశాల ఆవరణంలో అంతర్జాయతీ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కర్ణాటక పతంజలి యోగా సమితి రాష్ట్ర సంచాలకులు దీపా రమేశ్ పాల్గొని విద్యార్థులతో యోగా సాధన చేయించారు.



మండ్యలో యోగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం



గౌరిబిదనూరులో యోగా చేస్తున్న విద్యార్థులు



చిక్కలో యోగాభ్యాసంలో మంత్రి సుధాకర్, ఎంపీ తదితరులు

భారతీయ సంస్కృతి ప్రాచీనమైనది



భక్తులను ఆశీర్వదిస్తున్న స్వామీజీ

బనశంకరి: భారతీయ సంస్కృతి అత్యంత ప్రాచీనమైనది సామూహిక పూజ, లలితసహస్ర నామపఠనంతో దేశానికి మంచి జరుగుతుందని హరిహరిపుర శ్రీ స్వయంప్రకాశ సచ్చిదానంద సరస్వతి మహాస్వామి తెలిపారు. శుక్రవారం జయనగర ఐదోబ్లాక్ శాలినీ మైదానంలో రక్షా ఫౌండేషన్ ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం 5 వేల మంది మహిళలతో ఏర్పాటు చేసిన లలిత సహస్ర నామపూజ కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీవై.విజయేంద్ర, విపక్షనేత ఆర్.అశోక్, ఎంపీ మంజునాథ్, సచ్చిదానందసరస్వతి స్వామీజీ ప్రారంభించి మాట్లాడారు. మనందరం ఒకే కుటుంబం అనే సేవాభావనతో జీవనం సంస్కారవంతంగా ఉండాలన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలు, భక్తిశ్రద్ధలతో ఆచరించాలని తారతమ్యం చూపకుండా ఇతరమతాలను గౌరవించాలని తెలిపారు. బీవై.విజయేంద్ర మాట్లాడుతూ... తల్లిని ఎవరూ పూజిస్తారో, మహిళలను ఎవరూ గౌరవిస్తారో వారికి జీవితంలో విజయం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో విపక్షనేత ఆర్.అశోక్, ఫౌండేషన్ అధ్యక్షుడు ఎమ్మెల్యే సీకే. రామమూర్తి, రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి, లక్ష్మీనటరాజ్, మాలతి సోమశేఖర్, దీపికా ఎల్. మంజునాథ్‌రెడ్డి, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

కెలమంగలం: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని డెంకణీకోట పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... డెంకణీకోట పోలీసులు గురువారం రాత్రి అటవీశాఖ చెక్‌పోస్ట్ ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఆ మార్గంలో వచ్చిన ఓ ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా 30 కర్ణాటక మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. నిందితుడు డి.జి.దొడ్డి ప్రాంతానికి చెందిన ప్రభాకర్ (44)గా గుర్తించారు. అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

మైసూరు: కరెంటు వైర్ తగిలి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చామరాజనగర జిల్లాలోని హనూరు తాలూకా కణ్నూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సురేష్ (52) మృతుడు. ఇతను ఇంటి ముందు పునాదికి నీరు పోస్తుండగా అక్కడే ఉన్న కరెంట్ వైర్ తొక్కడంతో షాక్ తగిలింది. వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగ్గురు దొంగలు అరెస్టు



అరెస్టయిన దొంగలు

చింతామణి: రహదారుల్లో దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం రాత్రి ఆంధ్రప్రదేశ్ మాచర్లకు చెందిన లారీని బెంగళూరు వెళ్తుండగా నలుగురు దొంగలు ఆపి డ్రైవర్ వద్దనున్న 2 వేలు నగదును లాక్కొన్నారు. దీంతో డ్రైవర్ తక్షణమే చింతామణి పోలీసులకు సమాచారం అందించగా వారు విచారణ చేసి తాలూకాలోని నల్లగుట్టహళ్లి గ్రామానికి చెందిన సుబ్రమణిని, మల్లికాపుర గ్రామానికి చెందిన అరుణ్‌ను బెంగళూరు కుండ్లహళ్లికి చెందిన శివ కుమార్‌ను అరెస్టు చేశారు. మరొక దొంగ కోసం గాలిస్తున్నారు.

అధిక లాభం అంటూ లక్షలు దోచేశారు

మైసూరు: మైసూరు నగరంలో ఆన్‌లైన్ మోసాలు పెరిగి పోతున్నాయి. కొంత పెట్టుబడి పెడితే అధిక లాభం వస్తుందని చెప్పి సైబర్ కేటుగాళ్లు లక్షలు దోచేశారు. మైసూరు నగరంలోని నేతాజీ నగర్‌కు చెందిన సాగర్ అనే వ్యక్తి సామాజిక మాధ్యమాల్లో ఒక ప్రకటన చూసి అందులో ఉన్న ఫోన్ నంబర్‌కు సంప్రదించగా తమమ కంపెనీలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని కేటుగాళ్లు ఆశ పెట్టారు. దీంతో వారు సూచించిన బ్యాంకు ఖాతాకు రూ.10.28లక్షలు పంపాడు. మళ్లీ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని సమాధానం వచ్చింది. దీంతో మోసం జరిగినట్లు గుర్తించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నా రాజకీయ జీవితాన్ని నిర్ణయించేది ప్రజలే

శివాజీనగర: చెన్నపట్టణ నుండి డీ.కే.శివకుమార్ పోటీ చేస్తే రాజకీయంగా మనుగడ కోల్పోతారని సీ.పీ.యోగేశ్వర్ వ్యాఖ్యలకు డీసీఎం డీ.కే.శివకుమార్ తన రాజకీయ జీవితాన్ని తీర్మానించేది ప్రజలు. వారు చూసుకొంటారని ఎదురుదాడికి దిగారు. 10వ అంతర్జాతీయ యోగా దినాచరణ నిమిత్తం శుక్రవారం విధానసౌధ ముందు భాగంలో జరిగిన యోగోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న తరువాత మీడియాతో మాట్లాడిన ఆయన, పెద్దవారి గురించి తాను మాట్లాడేందుకు సాహసించను, తనకు సమయం లేదు. తనకు శక్తి ఇవ్వండని తాను ఓటర్లను కోరుకొన్నాను. తన వెనుక ఒక శక్తి ఉంది. ప్రజలు ఉన్నారు. తన జీవితాన్ని రాసేవారు ప్రజలు. విశ్వాసముంటే ఓటు వేస్తారని తెలిపారు. కనకపురలో ఉప ఎన్నికలు వస్తే దేశ సంపద నాశనమవుతుందన్న ఎమ్మెల్యే సురేశ్‌కుమార్ వ్యాఖ్యలకు స్పందించిన డీకేశి, తాను కనకపుర ఎమ్మెల్యే, పార్టీ అధ్యక్షుడి అవకాశం కూడా తనకు బాధ్యత ఉంది. తన నియోజకవర్గంలో తనదే బాధ్యత. తాను సీఎం సిద్దరామయ్యతో కలసి ఎన్నికలకు వెళ్తానన్నారు.

హోసూరు వార్తలు..

దివ్యాంగులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఆస్పత్రి డైరెక్టర్ అంబికాపారి

హోసూరు: హోసూరు ప్రాంతంలో ఉంటున్న దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలను అందజేసేందుకు నిధుల సేకరణ కోసం నేడు శనివారం మీరామల్టి స్పెషాలిటీ ఆస్పత్రి, వివిధ స్వచ్ఛంద సంస్థలు కలిసి సాంస్కృతిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని, స్థానిక ప్రజలు సహకరించాలని శుక్రవారం ఆస్పత్రిలో జరిగిన సమావేశంలో డైరెక్టర్ అంబికాపారి కోరారు. హోసూరు–బెంగళూరు జాతీయ రహదారిలోని చెన్నైసిల్క్స్ వద్ద ఉన్న ఏటీఎస్ మైదానంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విజయ్ టీవీ సెలబ్రిటీలు పాల్గొననున్నారని, దివ్యాంగులకు ద్విచక్రవాహనాలు అందజేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమాన్ని ఆర్థి డెవలప్స్, టవీఎస్ వివస్ ఏజెన్సీ, విజయ్ ఆస్పత్రి తదితర స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే సాంస్కృతిక కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్థానికులు పాల్గొనాలని కోరారు.

కారు బోల్తా, వ్యక్తి మృతి

క్రిష్ణగిరి: క్రిష్ణగిరి – చెన్నై జాతీయ రహదారిపై అతివేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన మైలు రాయిని ఢీకొనడంతో ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి మృతి చెందిన ఘటన క్రిష్ణగిరి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... కోయంబత్తూరు జిల్లా రామక్రిష్ణాపురం ప్రాంతానికి చెందిన గణేష్ మల్లయ్య (56) గురువారం సాయంత్రం సొంత పనిపై కారులో క్రిష్ణగిరికి వెళ్లాడు. కోయంబత్తూరుకు చెందిన మణిగంటన్ డ్రైవర్‌గా వెళ్లాడు. చెన్నై జాతీయ రహదారిపై కారును నడుపుకొంటూ వెళ్తుండగా అకస్మాత్తుగా అదుపుతప్పి రోడ్డు పక్కన మైలురాయిని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సేలంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. గణేష్ మల్లయ్య మృతి చెందాడు. క్రిష్ణగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

పశువుల దొంగలు అరెస్ట్

కెలమంగలం: కొట్టంలో కట్టివేసిన పశువులను దొంగలిస్తున్న ముగ్గురిని డెంకణీకోట పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... డెంకణీకోట సమీపంలోని బజ్జీపల్లి గ్రామానికి చెందిన రైతు ముత్తప్ప (54) పశువులను పోషిస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి అతను తన మూడు పశువులను పొలంలోని కొట్టంలో కట్టి ఉంచాడు. శుక్రవారం వేకువజామున కొట్టంలో అలికిడి కావడంతో ముత్తప్ప అక్కడికి చేరుకున్నాడు. పశువులను దొంగలిస్తున్నట్లు గుర్తించి స్థానికులను సమాచారం ఇచ్చి వారు రాగానే నిందితులు మునిరాజ్, రమేశ్, రామక్రిష్ణన్‌లను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

వేడుకగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



మహర్షి విద్యామందిర్‌లో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు



బేదరపల్లి ప్రభుత్వ పాఠశాలలో యోగా ఆచరిస్తున్న చిన్నారులు

హోసూరు: ప్రతి ఒక్కరూ రోజు యోగా సాధన చేయాలని సేలం ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి కర్నల్ సూరజ్ తెలిపారు. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా హోసూరు ఆర్.వి. ప్రభుత్వ ఉన్నతోన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు, హోసూరు మహర్షి విద్యామందిర్ సంయుక్తంగా నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమానికి పాఠశాల నిర్వాహకులు శైల అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా సేలం కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కర్నల్ సూరాజ్ పాల్గొని యోగా ప్రయోజనాలు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి వెంకటరమణ, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్.టి.రాజు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా హోసూరు పారిశ్రామికవాడ బేదరపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పాన్నాగేష్ అధ్యక్షతన పిల్లలకు యోగా శిక్షణ ఇచ్చారు. యోగా ఉపాధ్యాయుడు అరుణ్, ఉపాధ్యాయినులు గాయత్రీ, శ్యామల తదితరులు పాల్గొని పిల్లలచే యోగా సాధన చేయించారు. కెలమంగలం సమీపంలోని కాడుద్దనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్ అధ్యక్షతన యోగా దినోత్సవాన్ని ఆచరించారు. ఈ సందర్భంగా పిల్లలచే యోగాసనాలు చేయించారు.

కార్యాలయంలో యోగా సాధన

కెలమంగలం: యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కెలమంగలం బీడీవో కార్యాలయంలో యోగా సాధన చేశారు. యూనియన్ చైర్మన్ కేశవమూర్తి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, బీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొని యోగాసనాలను వేశారు.



కాడుద్దనపల్లి పాఠశాలలో యోగాసనాలు



యోగా సాధన

పంటల సాగుపై రైతులకు శిక్షణ

హోసూరు: ఖరీఫ్ సీజన్ పంటల సాగుపై శుక్రవారం హోసూరు తాలూకా బేగేపల్లి గ్రామంలో హోసూరు వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు ఒక్క రోజు శిక్షణా శిబిరం నిర్వహించారు. ఉపడైరెక్టర్ భువనేశ్వరి అధ్యక్షత వహించి మాట్లాడుతూ... గత కొద్ది రోజులుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో రైతులు పొలాలను దుక్కి చేసుకొన్నారని, ఖరీఫ్ సీజన్ పంటలుగా కంది, కారామణి, ఇతర పంటలను సాగు చేస్తున్నారని, పంట సాగులో రైతులు పాటించవలసిన మెలకువలపైవివరించారు. ముఖ్యమంత్రి సంయుక్త వ్యవసాయ పథకం ద్వారా మట్టి సంరక్షణ ఉపయోగాలను, మట్టి పరీక్షల వల్ల ఉపయోగాలపై రైతులకు వివరించారు. పొలాల్లో వెలువడే వ్యర్థాలతో సేంద్రియ ఎరువుల తయారీ విధానంపై రైతులకు శిక్షణ అందజేశారు. కార్యక్రమంలో ఆదియమ్మాన్ వ్యవసాయ కళాశాల అధ్యాపకులు గోవిందరాజ్, వ్యవసాయ శాఖాధికార్లు మురుగేషన్, ఆర్ముగం, ఆత్మా పథక అధికారిణి సుగుణ, షణ్ముగం తదితరులు పాల్గొని రైతులకు శిక్షణ ఇచ్చారు.

హోటల్ కార్మికుడు ఆత్మహత్య

హోసూరు: హోటల్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన హోసూరు కార్పొరేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకొంది. వివరాలు... కర్ణాటక రాష్ట్రం హాసన్ జిల్లాకు చెందిన రవికుమార్ (39). హోసూరు రెండవ పారిశ్రామికవాడ గాంధీనగర్ ప్రాంతంలో నివాసముంటూ అదే ప్రాంతంలోని ఓ హోటల్లో కార్మికుడిగా పనిచేస్తున్నారు. గురువారం ఉంట్లో ఉరివేసుకొన్న విషయం గమనించిన స్థానికులు హడ్కో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చైన్ స్నాచర్ల కోసం గాలింపు

హోసూరు: మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లిన దొంగల కోసం హడ్కో పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు... కార్పొరేషన్ పరిధిలోని బాగలూరు రోడ్డు ప్రాంతానికి చెందిన రీనా (48). గురువారం సాయంత్రం దుకాణం నుంచి వంట సరకులు తీసుకొని నడుచుకుంటు వెళ్తుండగా అదే మార్గంలో హెల్మెట్లు పెట్టుకుని బైక్‌పై వచ్చిన ఇద్దరు ఆమె మెడలో ఉన్న ఏడు పౌన్ల బంగారు గొలుసు లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు హడ్కో పోలీసులు కేసు నమోదు చేసుకొని దొంగల కోసం గాలిస్తున్నారు.

క్లుప్తంగా...

మహిళపై టీడీపీ కార్యకర్త దాడి

తలకు తీవ్ర గాయం.. పరిస్థితి విషమం


గాయపడిన చెంగమ్మ

వెంకటాచలం: పంచాయతీ నిధులతో నిర్మించిన రచ్చబండను టీడీపీ కార్యకర్త ధ్వంసం చేస్తుండగా అడ్డుకున్న మహిళపై ఇనుప రాడ్డుతో దాడికి తెగబడిన ఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం కసుమూరులో శుక్రవారం జరిగింది. కసుమూరు గంగమిట్ట ప్రాంతంలో గతంలో పంచాయతీ నిధులతో రచ్చబండను నిర్మించారు. అయితే, స్థానిక టీడీపీ కార్యకర్త షేక్ మస్తాన్ జేసీబీతో రచ్చబండను ధ్వంసంచేసి ఇంటి నిర్మాణాన్ని చేస్తున్నాడు. ఈ విషయమై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. పది మందికి ఉపయోగపడే రచ్చబండను ధ్వంసం చేసి ఇంటి నిర్మాణం చేసుకోవడం ఏమిటని స్థానికంగా నివాసం ఉంటున్న ఉప్పు చెంగమ్మ ప్రశ్నించడంతో షేక్ మస్తాన్ ఆమె తలపై రాడ్డుతో దాడిచేశాడు. చుట్టు పక్కల నివాసాల్లోని ప్రజలు వచ్చి అడ్డుకుని వెంటనే చెంగమ్మను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చెంగమ్మ తలకు తీవ్రగాయం కావడంతో ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. మహిళపై జరిగిన దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

‘చుడా’ మాజీ చైర్మన్ కారుపై దాడి ఘటనపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్: చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా) మాజీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి కారుపై జరిగిన దాడి ఘటనలో చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మూడు రోజుల క్రితం కట్టమంచిలోని ద్వారకనగర్ వద్ద ఉన్న పురుషోత్తంరెడ్డి ఇంటి వద్దకు వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు స్కార్పియో వాహనంపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో వాహనం పూర్తిగా ధ్వంసమయ్యింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు.

టీడీపీ-జనసేన మధ్య భగ్గుమన్న విభేదాలు

- ఫ్లెక్సీల ఏర్పాటులో ఇరు పార్టీ నేతల మధ్య మాటల యుద్ధం


జీలుగుమిల్లిలో రెండు వర్గాల వాగ్వాదం

బుట్టాయగూడెం: ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలంలోని కూటమి నేతల మధ్య శుక్రవారం ఒక్కసారిగా విభేదాలు భగ్గుమన్నాయి. జీలుగుమిల్లి సెంటర్‌లో ఫ్లెక్సీల ఏర్పాటుపై టీడీపీ, జనసేన నేతల మధ్య వివాదం నెలకొంది. గత పదేళ్లుగా సీఎం చంద్రబాబు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాస్‌తో పాటు మాజీ ఎంపీటీసీ సిర్రి వెంకటేశ్వరరావు తన ఫొటోను వేసి ఏటా పర్వదినాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటుచేస్తారని టీడీపీ నేతలు చెబుతున్నారు. ఇటీవల ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉండడంతో అధికారులు ఫ్లెక్సీని కప్పేశారు. తాజాగా దానిని తొలగించి కొత్తది పెట్టే ప్రయత్నం చేస్తుండగా జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు ఫొటోతో పాటు కూటమి నేతల ఫొటోలున్న ఫ్లెక్సీని ఏర్పాటుచేసి టీడీపీ ఫ్లెక్సీని తొలగించేందుకు యత్నించారు. దీంతో టీడీపీ నాయకులు అక్కడికి చేరుకుని జనసేన ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. తాము ఎప్పటి నుంచో ఫ్లెక్సీ ఇక్కడ ఏర్పాటుచేసుకుంటున్నామని, వారు వేరేచోట పెట్టుకోవాలని టీడీపీ నాయకులు చెప్పడంతో వారి మధ్య మాటల యుద్ధం నడిచింది. టీడీపీ నేతలు గట్టిగానే అడ్డుకునే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఇరువర్గాల వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ, ఎవ్వరూ పట్టు విడవకపోవడంతో రెండు వర్గాల వారినీ ఫ్లెక్సీలు కట్టవద్దని పోలీసులు చెప్పారు. దీంతో కూటమి నేతలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఏపీ కాంగ్రెస్ కమిటీలు రద్దు

- త్వరలో కొత్త కమిటీలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అన్ని కమిటీలను పూర్తిగా రద్దు చేసినట్లు ఏపీసీసీ చీఫ్ షర్మిల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. త్వరలోనే నూతన కమిటీలను నియమిస్తామని షర్మిల వివరించారు.

నీట్ పేపర్ లీక్‌పై సీబీఐతో విచారణ చేయించాలి: షర్మిల

‘నీట్’ పేపర్ లీక్ వ్యవహారంపై సీబీఐ చేత విచారణ జరిపించాలని ఏపీసీసీ చీఫ్ షర్మిల డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ఏపీసీసీ ఆధ్వర్యాన శుక్రవారం విజయవాడ లెనిన్ సెంటర్‌లో నిరసన తెలిపారు. షర్మిల మాట్లాడుతూ 24లక్షల మంది విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటం ఆడుతోందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో పేపర్ లీక్ అయిందని ఆరోపించారు.

విగ్రహాలు, శిలాఫలకాలు ధ్వంసం

- గోపాలపురం, వేల్పూరుల్లో వైఎస్సార్ విగ్రహాలు ధ్వంసం
- తెనాలి, ద్వారకాతిరుమల, అహోబిలంలో ముక్కలైన శిలాఫలకాలు
- పెన్నగడం ఎస్సీ కాలనీలో వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మె కూల్చివేత
- కొనసాగుతున్న టీడీపీ నేతలు, కార్యకర్తల అరాచకం


తిరుపతి జిల్లా పెన్నగడం ఎస్సీ కాలనీలో టీడీపీ నేతలు నేలమట్టం చేసిన వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మె


అహోబిలంలో కూల్చివేసిన శిలాఫలకం


చినరావూరు పార్కు వద్ద ధ్వంసం చేసిన శిలాఫలకం


ద్వారకా తిరుమలలో పగలగొట్టిన శిలాఫలకం

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలోని పలుచోట్ల టీడీపీ నేతలు, కార్యకర్తలు విధ్వంసకాండను కొనసాగిస్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను, అభివృద్ధి పనుల శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారు.

- ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు మండలం గోపాలపురంలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. విగ్రహం తలభాగాన్ని ఛిద్రం చేసి విగ్రహాన్ని పడగొట్టే ప్రయత్నం చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు ధ్వంసమైన వైఎస్ విగ్రహాన్ని శుక్రవారం పరిశీలించారు. అనంతరం స్వామిదాసు విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ క్యాడర్‌ను భయభ్రాంతులకు గురిచేయడానికి దుండగులు ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. పోలీసులు, అధికారులు నిందితుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం నాయకులు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు పాల్పడుతూ ఉద్రిక్త పరిస్థితులు సృష్టిస్తున్నారని చెప్పారు. ఏ.కొండూరు మండలం రేపూడిలో టీడీపీ కార్యకర్తలు ఎంపీటీసీ సభ్యురాలి పొలం ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి తోటలోని మొక్కలను పాడుచేశారని చెప్పారు. వెంకట్ తండాలో భూక్యా వెంకట్ పొలంలో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ధ్వంసం చేసి రూ.లక్షకు పైగా నష్టం కలిగించారని తెలిపారు. తునికిపాడులో గంపలగూడెం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిని గ్రామ బహిష్కరణ చేస్తున్నట్లు టీడీపీ నాయకులు ప్రకటించడం సభ్యసమాజం సిగ్గుతో తలదించుకునేలా ఉందని పేర్కొన్నారు. పోలీసులు ఇటువంటి సంఘటనలపై సత్వరం చర్యలు తీసుకుని నిందితులను శిక్షించకపోతే తాము ఉపేక్షించబోమని హెచ్చరించారు. గ్రామ సచివాలయాలపై శిలాఫలకాలను ధ్వంసం చేయడం ఉన్మాదచర్యగా ఆయన అభివర్ణించారు. తిరువూరు, ఏకొండూరు, విస్సన్నపేట జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, భూక్యా గన్యా, లోకేశ్వరరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు ఈ ఘటనలను ఖండించారు.
- గుంటూరు జిల్లా తెనాలి 14వ వార్డులోని శ్రీ గంగానమ్మ తల్లి దేవస్థానం వద్ద అప్పటి మున్సిపల్ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు తన సొంత నిధులు రూ.లక్షతో దేవస్థాన ప్రాంగణాన్ని అభివృద్ధి చేశారు. అనంతరం అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో శిలాఫలకాన్ని ఆవిష్కరింపజేశారు. శిలాఫలకంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, వైస్ చైర్మన్ ఫొటోలు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి కొందరు టీడీపీ నాయకులు శిలాఫలకంపై ఉన్న మూడు ఫొటోలను ధ్వంసం చేశారు.
- తెనాలి 15వ వార్డు చినరావూరు పార్కు వద్ద వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మెను ఏర్పాటు చేసి అక్కడ శిలాఫలకాన్ని అప్పటి ఎమ్మెల్యే శివకుమార్ ఆవిష్కరించారు. అక్కడ కూడా సీఎం జగన్, ఎమ్మెల్యే శివకుమార్, వైస్ చైర్మన్ కోటేశ్వరరావు ఫొటోలు ఏర్పాటు చేశారు. వాటిని కొందరు టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు.
- నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ రూరల్ మండలం అహోబిలంలో మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తుతెలియని దుండగులు గురువారం రాత్రి ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ శివారు నుంచి దేవాలయం వరకు సీసీ రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డును ప్రారంభించిన అప్పటి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇది జీర్ణించుకోలేని టీడీపీ కార్యకర్తలే ధ్వంసం చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజే అహోబిలం గ్రామ శివారులోని దొరకొట్టాల వద్ద ఓ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు.
- ఏలూరు జిల్లాలోని మండల కేంద్రమైన ద్వారకాతిరుమలలో శుక్రవారం కొందరు వ్యక్తులు ఒక శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. స్థానిక శివాలయానికి వెళ్లే ఘాట్ రోడ్డులో మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన మంచినీటి బోరు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని పగులగొట్టారు. టీడీపీ వర్గీయులు రెచ్చిపోయి దౌర్జన్యాలు, దాడులకు దిగడం, ప్రభుత్వ ఆస్తులు, శిలాఫలకాలను ధ్వంసం చేయడం సరికాదంటూ గ్రామస్తులు పేర్కొంటున్నారు.
- తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం పెన్నగడం ఎస్సీ కాలనీలో పదేళ్లుగా ఉన్న వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మెను శుక్రవారం టీడీపీ నాయకులు జేసీబీతో ధ్వంసం చేశారు. టీడీపీ నాయకులు ఇలాంటి అరాచకాలు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు.


తెనాలిలో గంగానమ్మ తల్లి గుడి వద్ద ధ్వంసమైన శిలాఫలకం

- పశ్చిమగోదావరి జిల్లా తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గురువారం రాత్రి గ్రామానికి చెందిన వంగవోలు విజయ్‌కుమార్ ధ్వంసం చేశాడు. స్థానిక బండా పట్టాభి రైస్‌మిల్లు వీధిలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాల వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి జాతర సందర్భంగా గురువారం రాత్రి ఊరేగింపు నిర్వహించారు. ఈ సమయంలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం ఉదయం అక్కడ పరిశీలించారు. తణుకు రూరల్ సీఐ జి.వి.వి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ కె.చంద్రశేఖర్, ఇతర పోలీసు సిబ్బంది విచారణ చేపట్టారు. గ్రామంలో అల్లర్లు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకుని నిందితుల కోసం గాలింపు చేపట్టారు. సమీపంలో సీసీ కెమెరాల పుటేజీ పరిశీలించి విగ్రహాన్ని ధ్వంసం చేసిన విజయ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు విజయ్‌కుమార్ అంగీకరించాడని సీఐ నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. పగలగొట్టిన విగ్రహం స్థానంలో వైఎస్సార్ కొత్త విగ్రహాన్ని శుక్రవారం సాయంత్రానికి స్థానిక పోలీసులు ఏర్పాటు చేశారు. స్థానిక నాయకులే దీన్ని ఏర్పాటు చేయించారని తెలుస్తోంది. ఎవరు ఏర్పాటు చేయించారనే విషయాన్ని పోలీసులు చెప్పలేదు.


వేల్పూరులో ధ్వంసమైన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం


ధ్వంసం చేసిన ప్రదేశంలోనే కొత్తగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహం


ఏ.కొండూరు మండలం గోపాలపురంలో ధ్వంసమైన వైఎస్సార్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న స్వామిదాసు, నాయకులు

పోలీస్ స్టేషన్‌లోనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

- పోలీసుల ఎదుటే చితకబాదిన టీడీపీ నేతలు
- పైగా బాధితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు
- అంతకు ముందు నయనంపల్లిలో కత్తితో వీరంగం.. బైకు ధ్వంసం


ధ్వంసమైన ఉమాపతి నాయుడి బైక్

చిత్తూరు టాస్క్‌ఫోర్స్: పోలీస్ స్టేషన్‌లోనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ నేతలు దాడి చేసిన ఘటన పూతలపట్టులో శుక్రవారం కలకలం రేపింది. బాధితుడి కథనం మేరకు.. పూతలపట్టు మండలం వావిల్‌తోట పంచాయతీ వీర్లగుడిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఉమాపతి నాయుడు శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంలో నయనంపల్లి గ్రామానికి వెళ్లాడు. అక్కడ ఓ వ్యక్తి ఇంటి వద్ద బైకును ఆపగా, అదే గ్రామానికి చెందిన ఓ టీడీపీ కార్యకర్త కత్తితో వీరంగం సృష్టించి ఉమాపతినాయుడుపై దాడికి పాల్పడ్డాడు. మరికొందరితో కలిసి బాధితుడి ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశారు. భయభ్రాంతులకు గురైన ఉమాపతి నాయుడు పరుగెత్తి ఓ ఇంట్లో తలదాచుకున్నాడు. ఈ విషయం గురించి స్థానిక పోలీసులకు సమాచారం అందించినా, వారు పట్టించుకోలేదు. దీంతో అతడు 1002 నంబర్‌కు కాల్ చేశాడు. ఈ మేరకు పూతలపట్టు పోలీసులు గ్రామానికి చేరుకుని ఉమాపతి నాయుడుని భద్రత పేరుతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న టీడీపీ నాయకులు.. పోలీసుల ఎదుటే బాధితుడిని దుర్భాషలాడారు. అనంతరం కొందరు టీడీపీ నాయకులు స్టేషన్ లోపలికి వెళ్లి ఉమాపతిపై దాడి చేశారు. కాళ్లతో విచక్షణా రహితంగా చితకబాదారు. దీంతో ఉమాపతి నాయుడు కేకలు వేయగా, బయట ఉన్న పోలీసులు లోపలికి వచ్చారు. అనంతరం టీడీపీ నాయకుల ఆదేశాలతో ఉమాపతి నాయుడుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని బయట చెబితే తమ ఉద్యోగాలు ఊడుతాయని, నీపై మరిన్ని కేసులు పెడతామని బాధితుడిని పోలీసులు భయపెట్టారు. కాగా, పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ నేతల దాడికి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదై ఉంటాయని, అయితే రాత్రికి రాత్రే పోలీసులు పుటేజీని మాయం చేయొచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

జగన్ సీఎం కాలేదనే మనోవేదనతో ఇద్దరు మృతి


నరసింహులు (ఫైల్)


జగ్గారావు (ఫైల్)

పెద్దతిప్పసముద్రం/నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కాలేదని తీవ్ర మనోవేదనకు గురైన ఓ మాజీ ఉప సర్పంచ్ మృతిచెందారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గం పెద్దతిప్పసముద్రం మండలంలోని రాపూరివాండ్లపల్లి పంచాయతి డి.మారాయణపల్లిలో ఈ విషాద ఘటన గురువారం రాత్రి జరిగింది. డి.మారాయణపల్లికి చెందిన కోసువారిపల్లి నరసింహులు (54) గతంలో ఉప సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని, వైఎస్ జగన్ రెండోసారి ముఖ్యమంత్రి అవుతారని బలంగా నమ్మేవారు. ఫలితాలు తారుమారు కావడంతో నరసింహులు తీవ్ర మనోవేదనకు గురయ్యాడని స్థానికులు తెలిపారు. ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి నరసింహులు ఇంట్లోనే ఉంటూ బాధపడేవాడని, ఈ క్రమంలో గురువారం రాత్రి గుండెపోటుకు గురై ఆకస్మికంగా మృతిచెందాడని ఆయన బంధువులు చెప్పారు. నరసింహులు అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ ఓటమితో కుమిలిపోతున్న అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని గవరవీధికి చెందిన మళ్ల జగ్గారావు (74) శుక్రవారం మృతి చెందారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజు నుంచి జగ్గారావు డిప్రెషన్‌కు గురవడంతో కుటుంబ సభ్యులు విశాఖలోని ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించారు. అయినా మనోవేదనతో శుక్రవారం మృతి చెందారు.

వైఎస్సార్‌సీపీ నేత ప్రహరీ ధ్వంసం


కూల్చివేసిన ప్రహరీ

కోవూరు: వైఎస్సార్‌సీపీ నేత, కోవూరు ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి స్థలానికి నిర్మించిన ప్రహరీని స్థానిక టీడీపీ నేత జక్కంరెడ్డి భాస్కర్‌రెడ్డి ధ్వంసం చేశాడని బాధిత కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు.. పూనూరు రత్నావతి దగ్గర రాధాకృష్ణారెడ్డి స్థలం కొనుగోలు చేశారు. 2023 సంవత్సరం మే 5వ తేదీన కోవూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్థలం రిజిస్టర్ అయ్యింది. ఆ స్థలంలో పనులు చేయిస్తుంటే అప్పట్లోనే భాస్కర్‌రెడ్డి కూలీలను బెదిరించగా.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. తాజాగా టీడీపీ అధికారంలోకి రావడంతో రెచ్చిపోయిన భాస్కర్‌రెడ్డి జేసీబీతో ప్రహరీని ధ్వంసం చేశాడని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది.

ట్రాక్టర్, వ్యవసాయ పరికరాలకు నిప్పు

- వైఎస్సార్‌సీపీ నేత ఆస్తులు ధ్వంసం
- టీడీపీ నేతల దుశ్చర్య.. రూ.50 లక్షల ఆస్తి నష్టం
- దాడులు ఆపకపోతే మూల్యం తప్పదు: మాజీ మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తోటపల్లిగూడూరు మండలం కోడూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత కావల్‌రెడ్డి రంగారెడ్డికి చెందిన ట్రాక్టర్, ఏయిరేటర్లు, ఆక్వా సామగ్రికి టీడీపీ నేతలు గురువారం రాత్రి నిప్పంటించారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి సమీప బంధువైన రంగారెడ్డి ఇటీవలి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కోసం పనిచేశారు. ఇది గిట్టని స్థానిక టీడీపీ నాయకులు అధికారం అండతో ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని, ఈ ఘటనలో రూ.50 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు రంగారెడ్డి చెప్పారు. శుక్రవారం రాత్రి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఘటన స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో మంచి పాలన అందిస్తారని ప్రజలు అధికారం ఇచ్చారని, దానిని విస్మరించి టీడీపీ గూండాలు ఇలా ఆటవిక దాడులు చేయడం దుర్మార్గమన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకొని సాగుతున్న ఈ దాడులను ఉపేక్షించేది లేదన్నారు. పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తామన్నారు. దాడులు ఆపనిపక్షంలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. పోలీసులు దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు చిల్లకూరు సుధీర్‌రెడ్డి, ఉప్పల శంకరయ్య గౌడ్, కావల్‌రెడ్డి రవీంద్రరెడ్డి, కావల్‌రెడ్డి రంగారెడ్డి, కొడూరు దిలీప్‌రెడ్డి, కాల్తిరెడ్డి సుబ్రహ్మణ్యం, తూపిలి ఉదయకుమార్‌రెడ్డి, చెరుకూరు శ్రీనివాసులనాయుడు, మన్నె చిరంజీవులగౌడ్, విశ్వనాథ్‌రెడ్డి, ఆగాల శ్రీనివాసులరెడ్డి, దగ్గ సతీష్, పామంజి దుర్గ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌పై కక్షసాధింపు

- ఇంటికి దారిలేకుండా చేసేందుకు కుట్ర
- పట్టా స్థలం ఆక్రమించి ఆలయ నిర్మాణం పేరుతో దురాక్రమణకు యత్నం
- చంద్రగిరిలో బరితెగిస్తున్న టీడీపీ నేతలు


కూచువారిపల్లిలో సర్పంచ్ ఇంటికి దారి లేకుండా ఆలయం పేరుతో అక్రమంగా పనులను చేపడుతున్న దృశ్యం

చంద్రగిరి (తిరుపతి జిల్లా): చంద్రగిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులను టార్గెట్ చేస్తూ టీడీపీ శ్రేణులు దాడులకు తెగబడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేస్తూ ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నారు. ఇందులో భాగంగా చంద్రగిరి మండలం కూచువారిపల్లికి చెందిన టీడీపీ నేతలు రామిరెడ్డిపల్లి వైఎస్సార్‌సీపీ సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డిపై కక్ష సాధింపు శృతిమించుతోంది. ఎన్నికల రోజు చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిపై టీడీపీ నాయకులు దాడిచేసి ధ్వంసం చేయడంతో పాటు ఇంటికి నిప్పంటించారు. దీంతో ఆ కుటుంబం కట్టుబట్టలతో ఊరు వదిలి వెళ్లిపోయింది. అయినా వారు సర్పంచ్‌పై ఇంకా కక్ష సాధింపులకు పాల్పడుతూనే ఉన్నారు. సర్పంచ్ ఇంటికి దారిలేకుండా చేయాలనే కుట్రతో ఆలయం పేరుతో నాటకానికి తెరలేపారు. సర్పంచ్ ఇంటి ముందు 10 అడుగుల దారి ఉంది. ఆ పక్కనే ప్రైవేటు ఇంటి స్థలాలూ ఉన్నాయి. దీంతో శుక్రవారం టీడీపీ నేతలు ప్రైవేటు స్థలాన్ని ఆక్రమించుకుని ఆలయం ముసుగులో అక్రమ నిర్మాణాలను ప్రారంభించారు. దీంతో స్థలాల యజమానులు తమ స్థలాలను కొనుగోలు చేసి తమకు డబ్బులిస్తే వెళ్లిపోతామన్నారు. రిజిస్ట్రేషన్ అయిన స్థలాలను సైతం ఆక్రమించుకోవడం దారుణమంటూ స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సర్పంచ్ ఇంటికి దారిలేకుండా చేసి ఆయన్ను గ్రామంలోకి రానీయకూడదన్నదే వీరి లక్ష్యమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు.. కూచువారిపల్లిలో ఇన్ని దారుణాలు జరుగుతున్నప్పటికీ పోలీసు, రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల ప్రజలు మండిపడుతున్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకూ యత్నం..

ఇదిలా ఉంటే.. కూచువారిపల్లికి చెందిన టీడీపీ నేతలు ప్రభుత్వ భూముల కబ్జాకూ పాల్పడుతున్నారు. అడ్డొచ్చిన మహిళలను అసభ్య పదజాలంతో దూషిస్తూ.. మీకు దిక్కున్నచోట చెప్పుకోండంటూ శుక్రవారం బెదిరింపులకు పాల్పడ్డారు. గ్రామస్తుల వివరాల మేరకు.. రామిరెడ్డిపల్లి సర్వే నంబరు 413, 414లో సుమారు 2.77 ఎకరాల కుంట పోరంబోకు స్థలం ఉంది. ఇందులో పాడి రైతులు కొందరు పశువుల కోసం తాత్కాలిక షెడ్లు వేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. అయితే, కూచువారిపల్లికి చెందిన టీడీపీ నేతలు మురళీనాయుడు, సునీల్ మరికొంత మంది శుక్రవారం జేసీబీ తీసుకొచ్చి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడానికి పనులు ప్రారంభించారు. సమాచారం తెలుసుకున్న రైతులు, గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. దీంతో చెలరేగిపోయిన టీడీపీ నేతలు మహిళలపట్ల అసభ్య పదజాలంతో దూషించారు. అడ్డుకోబోయిన వీఆర్‌ఓపైన విరుచుకుపడ్డారు. ఇక్కడే ఉంటే కొడతామని బెదిరించడంతో రైతులు, మహిళలు వెనుదిరిగారు. ‘ఇది మా ప్రభుత్వం.. మా ఇష్టమొచ్చినట్లు మేం చేస్తాం.. మీవల్ల ఏమికాదు’.. అంటూ బెదిరించారు. ఇక్కడకు పోలీసు, రెవెన్యూ అధికారులు వచ్చినప్పటికీ ప్రేక్షక పాత్ర వహించడం విమర్శలకు తావిచ్చింది.

మాకు అనుకూలంగానే పనిచేయాలి

- మా ఆదేశాలు లేకుండా ఒక్క పనీ చేయకూడదు
- కార్యాలయంలోకి ఒక్క వైఎస్సార్‌సీపీ కుక్కా రావడానికి వీల్లేదు
- వైఎస్సార్ జిల్లాలో పంచాయతీ కార్యదర్శికి టీడీపీ నేతల హుకుం


కార్యదర్శిని హెచ్చరిస్తున్న టీడీపీ నేతలు

ఖాజీపేట: ‘పంచాయతీ కార్యాలయంలోకి ఒక్క వైఎస్సార్‌సీపీ కుక్కా రాకూడదు. గతంలో నువ్వు ఆ పార్టీకి అనుకూలంగా పనిచేశావు. ఇప్పుడు అంతకంటే ఎక్కువగా మాకు అనుకూలంగా పనిచేయాలి. మా ఆదేశాలు లేకుండా ఒక్క పనీ చేయడానికి వీలు లేదు. ఇక నుంచి వార్ వన్‌సైడే’ అంటూ టీడీపీ నాయకులు పంచాయతీ కార్యదర్శికి హెచ్చరికలు జారీ చేశారు. ఈ ఘటన వైఎస్సార్ జిల్లా ఖాజీపేట మండలం పుల్లూరులో శుక్రవారం తీవ్ర చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే.. పుల్లూరు పంచాయతీ కార్యదర్శిగా శ్రీనివాసులు పనిచేస్తున్నారు. గ్రామ టీడీపీ నేతలు ఆయనను కార్యాలయంలో కలిశారు. గతంలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేశారని, ఇక నుంచి అలా కుదరదని హెచ్చరించారు. ఎవరైనా సరే ఏ పని కోసం వచ్చినా తమకు తెలియకుండా చేయొద్దన్నారు. పంచాయతీ పాలన అంతా తమ కనుసన్నల్లోనే జరగాలని ఆదేశించారు. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీకి చెందిన ఒక్క కుక్క కూడా పంచాయతీ కార్యాలయం వద్ద కనిపించకుండా చూసుకోవాలన్నారు. గతంలో తమను కొందరు చాలా ఇబ్బందికి గురి చేశారని, ఇప్పుడు అంతకు మించి ఉంటుందని హెచ్చరించారు. కాగా ఒక్క పుల్లూరు పంచాయతీలోనే కాకుండా చాలా పంచాయతీల్లో ఇప్పటికే అధికారులకు టీడీపీ నేతలు తీవ్ర హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది. ప్రజాస్వామ్యంలో ప్రజలకు మంచి చేసి వారి మన్ననలు పొందాలి తప్ప ఇలా దౌర్జన్యం చేయడం ఏమిటని ప్రజలు మండిపడుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పనిచేయనని చెప్పా..

టీడీపీ నాయకులు వచ్చి తనను కలసిన మాట నిజమేనని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. వారి సమస్యలు వారు చెప్పారని, ప్రభుత్వ నిబంధనలు ఎలా ఉంటే అలా పనిచేస్తానని చెప్పానన్నారు. అందుకు విరుద్ధంగా పనిచేయలేనని స్పష్టం చేశానని వెల్లడించారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శనివారం ॥ 22-6-2024

రీల్స్ ఎడిక్షన్







ఈ వ్యసనం ప్రాణాంతకం

15 సెకన్ల రీల్స్ కోసం నూరేళ్ల జీవితాన్ని పణంగా పెడుతోంది నేటి యువత.
రీల్స్‌ను ప్రవేశపెట్టిన ఇన్‌స్టాగ్రామ్‌కు నేడు మన దేశంలో
24 కోట్ల మంది ఖాతాదార్లు ఉన్నారు.
వీరిలో యువతీ యువకులే ఎక్కువ.
ఆన్‌లైన్ ఫేమ్ కోసం చిత్ర విచిత్రమైన రీల్స్ చేయడానికి ప్రాణాలతో రిస్క్ చేస్తున్నారు.
గొడవలు, మర్డర్లు జరుగుతున్నాయి.
మంచి ఫోన్ల కోసం దొంగలుగా మారుతున్నారు.
తల్లిదండ్రులు, సమాజం ఈ వ్యసనాన్ని ఇలాగే వదిలేయాలా?

పూణెలో పోలీసులు వెంటనే స్పందించారు. మిహిర్ గాంధీ (27), మీనాక్షి సలూంఖే (23) లను అరెస్ట్ చేశారు. వీరి మీద ఐ.పి.సి 336 సెక్షన్ కింద కేసు పెట్టారు. దీని ప్రకారం ఆరు నెలలకు తగ్గకుండా జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ ఉంటాయి. ఎందుకు వీరిని అరెస్ట్ చేశారు. ప్రాణాంతకమైన రీల్ చేశారు కనుక.

ఏం జరిగింది?

పూణెకు చెందిన మిహిర్ గాంధీ, మీనాక్షి వారం క్రితం ఒక రీల్ విడుదల చేశారు. అందులో ఎత్తయిన భవంతి మీద మిహిర్ ఉంటే అతని చేయి ఆధారంగా మీనాక్షి గాల్లో వేలాడింది. అతను వదిలేసినా ఆమె చేయి జారినా మీనాక్షి కచ్చితంగా చనిపోయి ఉండేది. ఈ రీల్ బయటకు రాగానే అందరూ మండి పడ్డారు. ఈ రీల్స్ పిచ్చికి శిక్ష పడాలని డిమాండ్ చేశారు. వెంటనే పోలీసులు స్పందించారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి...

ఇటీవల లక్నోలోని వాటర్ ట్యాంక్ ఎక్కి రీల్ చేయబోయిన శివాంశ్ అనే కుర్రాడు కాలు జారి పడి మరణించాడు. దాంతో లక్నోలో పెద్ద ఎత్తున రీల్స్ అడిక్షన్ మీద చర్చ జరిగింది. ఇలా రీల్స్ చేస్తున్న వారికి గౌరవ మర్యాదలు ఇవ్వడం మానేయాలని తల్లిదండ్రులు, సమాజం అందరూ కోరారు. ఇలాగే రాజస్థాన్‌లోని పాలిలో ఒక యువకుడు తన తల్లిదండ్రులతో కలిసి ఒక రీల్ చేయాలనుకున్నాడు. తల్లిదండ్రులు వారించే సరికి కోపమొచ్చి వారిని చంపేశాడు. టీనేజ్ యువతీ యువకులు ఇలా మతిలేని పనులు చేస్తున్నారనుకున్నా వైవాహిక జీవితంలో ఉన్న స్త్రీలు, పురుషులు కూడా రీల్స్‌కు బలవుతున్నారు. చత్తీస్‌గఢ్‌లోని భిలాయ్‌కి చెందిన ఒక మహిళ రీల్స్ చేయడానికి అడిక్ట్ అయ్యి భర్త వారించాడని ఆత్మహత్య చేసుకుంది. కర్నాటకలో ఒక భార్య రీల్ కోసం కన్నడ గీతానికి గంతులేసిందని మనసు నొచ్చుకున్న భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. బిహార్‌లో రీల్స్ వద్దన్నందుకు భర్తనే చంపేసింది మరో మహిళ. రీల్స్ కోసం యువతీ యువకులు రకరకాల డ్రస్సులు వేసుకోవడం, ప్రాంక్‌లు చేయడం, ట్రాఫిక్‌లో ప్రమాదకరమైన ఫీట్లు చేయడం చివాట్లు తినడం ఆనవాయితీగా ఉంది. సమర్థమైన మంచి కంటెంట్‌తో కొందరు గుర్తింపు పొంది లాభపడుతున్నా మరెందరో ఈ రీల్స్ అనే వధ్యశిలపై తలలు తెగిపడుతున్నారు.

ఏం చేయాలి?

- కుటుంబం కూచుని సోషల్ మీడియా అడిక్షన్ గురించి మాట్లాడుకోవాలి.
- మనం చేసే రీల్స్ వల్ల కుటుంబానికి మంచిదా చెడ్డదా చర్చించుకోవాలి.
- ఇతరులు తమ గురించి ఏమనుకుంటున్నారో నిజాయితీగా చెప్పే మిత్రుల సలహా అడగాలి.
- పిల్లలు చేసే ప్రతి పనికీ అంగీకారం ఉండదని తల్లిదండ్రులు వారిని ఒప్పించేలా చెప్పాలి.
- సైకియాట్రీ సాయం పొందాలి.
- విలువలతో కూడిన గుర్తింపు, గౌరవం మాత్రమే శాశ్వతమని తెలుసుకోవాలి.

గుర్తింపు కోసం పోరాటం...

గతంలో డార్విన్ మనుగడ కోసం పోరాటం అన్నాడు. ఇవాళ ప్రభుత్వ పథకాల వల్ల మనుగడకు ఢోకా లేదు. ఇక మిగిలింది గుర్తింపు. టీనేజ్‌లో ఉన్న యువతీ యువకులకు గుర్తింప బడాలన్న కోరిక విపరీతంగా ఉంటుంది. గతంలో బాగా చదివి, ర్యాంక్ తెచ్చుకుని, మంచి ఉద్యోగం తెచ్చుకుంటే గుర్తింపు వచ్చేది. ఇప్పుడు ఒక్క రీల్‌తో గుర్తింపు వస్తోంది. ఫాలోయెర్ల వల్ల ఇదంతా 'తమ కుటుంబం' అనే భావన వారిలో కలుగుతుంది. ఎప్పుడూ కల్పిత ప్రపంచంలో ముక్కూ మొహం ఎరగని వారి కామెంట్ల ద్వారా వారు సంతృప్తి పొందుతుంటారు. మరిన్ని కామెంట్ల కోసం మరిన్ని రీల్స్ చేయాలి. మరిన్ని రీల్స్ కోసం మరిన్ని రిస్కులు తీసుకోవాలి అనే భావన బలపడుతుంది.

253 కోట్ల మంది...

ప్రపంచ వ్యాప్తంగా రోజూ 253 కోట్ల మంది రీల్స్ చూస్తున్నారని ఒక అంచనా. 2020లో టిక్‌టాక్ బ్యాన్ అయ్యాక ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌ను ప్రవేశ పెట్టింది. 15 నుంచి 30 సెకండ్ల వీడియోలు పోస్ట్ చేసుకునే అవకాశం ఇచ్చింది. దాంతో ఇన్‌స్టా ఇన్‌ఫ్లూయెన్సర్ల పేరుతో కంటెంట్ క్రియేటర్ల పేరుతో గుర్తింపు కోసం అందరూ రంగంలో దిగారు. మన దేశంలో 8 కోట్ల మంది కంటెంట్ క్రియేటర్లు ఉన్నారంటే (కంటెంట్ ద్వారా ఆదాయం పొందాలని చూస్తున్నారంటే) అంతమందికి మంచి కంటెంట్ దొరికే అవకాశం లేదు. అందుకే పిచ్చి స్టంట్స్ చేయడానికి కూడా వెనుకాడటం లేదు. ఒకప్పుడు సెల్ఫీ పిచ్చితో చాలామంది ప్రాణాలు కోల్పోతే ఇప్పుడు రీల్స్ వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు.

సిసలు ప్రపంచంలో...

యువతీ యువకులు సిసలైన ప్రపంచంలో ఉండేలా చేస్తే వారిని ఈ రీల్స్ నుంచి బయటకు తేవచ్చు. 'సోషల్ మీడియా అడిక్షన్ వల్ల ఆత్మహత్య ఆలోచనలతో ఉన్న వారు పెరుగుతున్నారు' అని సైకియాట్రిస్ట్‌లు హెచ్చరిస్తున్నారు. తల్లిదండ్రులతో దూరం, నిరుద్యోగం, ఈజీ మనీ కోసం వెంపర్లాట, క్షణిక గుర్తింపుతో వస్తున్న మానసికానందం, విలువల శూన్యత ఇవన్నీ యువతను రీల్స్ వైపు నెడుతున్నాయి. స్నేహితులతో ఆటలు, మాటలు కూడా లేనంతగా (అవతలివారు కూడా ఫోన్లతో బిజీగా ఉండటం వల్ల) ఒంటరితనానికి విరుగుడును సోషల్ మీడియాలో వెతుక్కుంటూ మరింత ఒంటరి ఔతున్నారు. తల్లిదండ్రులు.

స్ఫూర్తి

కర్నాటకకు చెందిన 'బజ్ ఉమెన్' అనే స్వచ్ఛంద సంస్థ గ్రామీణ ప్రాంత మహిళలను దృష్టిలో పెట్టుకొని ఇంటింటికి వెళ్లి ఫైనాన్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, లీడర్‌షిప్ లాంటి అంశాలలో శిక్షణ ఇస్తోంది. అలా బజ్ ఉమెన్ గ్రామీణ ప్రాంతాల ప్రజలలో చైతన్యాన్ని తీసుకువచ్చింది.

మార్పు దిశగా బజ్ ఉమెన్



గ్రామీణ మహిళలతో ఉతార నారాయణ్

సురక్షితం కాని మాంసం తినడం వల్ల అనారోగ్యానికి గురైంది కర్నాటకలోని కదరిపుర గ్రామానికి చెందిన కాంతలక్ష్మి. ఇలాంటి మహిళల కోసం ఆరోగ్యకరమైన, నాణ్యమైన ఆహారం గురించి అవగాహన కలిగించడంలో విజయం సాధించింది బజ్ ఉమెన్ స్వచ్ఛంద సంస్థ.

'బజ్ గ్రీన్ ప్రోగ్రాం' ద్వారా దేశీ పౌల్ట్రీ నుంచి ఆర్గానిక్ ఫామింగ్ వరకు ఎన్నో విషయాలు తెలుసుకోగలిగారు గ్రామీణప్రాంత మహిళలు.

'బజ్ గ్రీన్ ప్రోగ్రాం' ద్వారా తాను తెలుసుకున్న విషయాలను ఆచరణలోకి తీసుకువచ్చింది కాంతలక్ష్మి. యాభై వేలు అప్పు చేసి ఫామ్ మొదలుపెట్టింది. ఆ తరువాత బంగాళదుంప, మునగకాయలు, ఉల్లిపాయలు, బీన్స్... వంటి వాటితో కిచెన్ గార్డెన్ కూడా మొదలుపెట్టింది.

సొంతంగా కూరగాయలు పండించడం ద్వారా కాంతలక్ష్మి డబ్బును ఆదా చేస్తోంది.

పౌల్ట్రీ ఉత్పత్తులను అమ్మడం ద్వారా మరి కొంత ఆదాయాన్ని ఆర్జిస్తోంది.

'యాక్టివ్ క్లైమేట్ ఛేంజ్ ఏజెంట్'గా కూడా తన ప్రయాణాన్ని మొదలుపెట్టిన కాంతలక్ష్మి తన ఇంటి చుట్టుపక్కల ప్రదేశాలలో మామిడితో సహా రకరకాల మొక్కలు నాటింది. నీటిని రీసైక్లింగ్ చేసే పద్ధతుల గురించి కూడా నేర్చుకుంది.

'బజ్ గ్రీన్' ద్వారా తాను నేర్చుకున్న విషయాలను తనలాంటి మహిళలకు చెబుతూ వారిని చైతన్యవంతులను చేస్తోంది కాంతలక్ష్మి.

'బజ్ ఉమెన్' ద్వారా పర్యావరణం నుంచి నీటి పొదుపు వరకు ఎన్నో విషయాలు తెలుసుకున్న ఆరు లక్షలమంది మహిళలలో కాంతలక్ష్మి ఒకరు.

'లింగ వివక్షతను అధిగమించడానికి, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడానికి. పేదరికం నుంచి బయట పడడానికి, వాతావరణ మార్పుల గురించి తెలుసుకోవడానికి గ్రామీణ ప్రాంత మహిళలకు మా సంస్థ సహాయపడుతుంది. సాధికారత దిశగా అడుగులు వేసే శక్తి వారిలో ఉంది' అంటుంది 'బజ్ ఉమెన్' వ్యవస్థాపకులలో ఒకరైన ఉతార నారాయణ్.

కాస్ట్ మేనేజ్‌మెంట్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన ఉతార నారాయణ్ 'జనగ్రహ' అనే స్వచ్ఛంద సంస్థలో పని చేసింది. ఎన్నో కార్యక్రమాల్లో భాగం అయింది. ఆ అనుభవం జ్ఞానం 'బజ్ ఉమెన్'ను ముందుకు నడిపించడానికి ఉపయోగపడింది.

ఆడపిల్లలు, మగపిల్లలను సమానంగా చూసే కుటుంబ వాతావరణంలో పెరిగింది నారాయణ్. అయితే చుట్టుపక్కల మాత్రం ఆడపిల్లల పట్ల చాలా వివక్ష కనిపించేది. ఆర్థికంగా భర్త మీద ఆధారపడే మహిళలే ఎక్కువగా కనిపించేవారు. ఈ నేపథ్యంలో గ్రామీణ మహిళలను చైతన్యవంతం చేసే కార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్ణయించుకుంది.

'బజ్ ఉమెన్' సంస్థ కార్యక్రమాలలో భాగంగా ఎన్నో గ్రామాలకు వెళ్లి, ఎంతోమంది మహిళలతో మాట్లాడింది ఉతార నారాయణ్. ఆ అనుభవాలు సంస్థను మరింత ముందుకు నడిపించడానికి ఉపయోగపడుతున్నాయి.

స్టాండ్‌అప్ కమెడియన్‌గా ఎదిగింది

చీపురు పట్టిన చేత్తోనే మైక్ అందుకుంది..!



దీపికా మహత్రే

ఇంటి పెద్ద అనారోగ్యంతో మంచం పట్టాడు.
ఐదుగురు వ్యక్తులు ఉన్న ఆ ఇల్లు నిలబడాలంటే ఇంటి ఇల్లాలు ఏదో ఒక పని వెతుక్కోవాలి.
గృహిణిగా ఇంటి పనులు చేయగలగడం తప్ప మరే నైపుణ్యాలు లేవు.
అలాంటి దిక్కుతోచని వాతావరణం నుంచి దీపికా మహత్రే ఓ కొత్త మార్గంవైపు నడిచింది.
భర్త, ముగ్గురు పిల్లల పోషణ కోసం ఇళ్లలో పనిమనిషిగా చేరింది.
ముంబయ్ లోకల్ రైళ్లలో ఇమిటేషన్ జ్యువెలరీని అమ్మేది.
అక్కడ నుంచి స్టాండ్ అప్ కమెడియన్‌గా ఆమె జీవితం ఓ గొప్ప మలుపు తీసుకుంది.
వెబ్‌సిరీస్‌లో నటించే అవకాశం పొందింది. పనిమనిషి నుంచి స్టాండ్ అప్ కమెడియన్‌గా ఎదిగిన ఆమె కథ ఎంతో మంది జీవితాలను ఉత్సాహపరుస్తుంది.

"నా భర్త ఆరోగ్యం బాగోలేనప్పుడు ఐదుగురు సభ్యులతో కూడిన నా కుటుంబానికి ఏకైక జీవనోపాధిని అయ్యాను. మా ప్రాథమిక అవసరాలు తీర్చడానికి ఊరగాయలు, పాపడ్‌లను అమ్మడం మొదలు పెట్టాను. పేషెంట్ కేర్ సర్వీస్‌లో పనిచేశాను. ఐదు ఇళ్లలో వంటపని చేయడం ప్రారంభించాను. అంతేకాదు, ముంబై లోకల్ ట్రైన్‌లో ఇమిటేషన్ జ్యువెలరీని అమ్మడం ప్రారంభించాను. ఇన్ని పనులు చేయడం కష్టమయ్యేది. కానీ, కష్టసమయాల్లో నా కుటుంబాన్ని నిలబెట్టాలి, నా పిల్లలకు మెరుగైన విద్యను అందించాలి. ఈ తపనతోనే అన్ని పనులూ ఓర్పుగా చేసేదాన్ని.

మలుపు తిప్పిన కామెడీ..

అయితే, అన్ని పనుల్లో ఒక ప్రత్యేకత ఉందన్న విషయం నాకే తెలియదు. నలుగురిని నవ్విస్తూ, సరదాగా మాట్లాడుతుంటాను. నేను పని చేసేచోట యజమాని ఫ్రెండ్ ఒకరు నా టాలెంట్‌ను ప్రదర్శించమని ప్రోత్సహించాడు. సంపన్నుల కుటుంబాల్లో వ్యక్తుల ద్వంద్వ ప్రమాణాలను ఎగతాళి చేస్తూ, నేను గమనించిన అసమానతలను హాస్యంగా హైలైట్ చేస్తూ చెప్పాను. చాలా మెచ్చుకున్నారు. కామెడీ అనేది ఒక అద్దంలా పనిచేస్తుంది, మార్పును కలిగిస్తుంది. ఒక రిపోర్టర్ నా వినోద భరితమైన స్టోరీని పత్రికలో వేశారు. హాస్యనటుడు అదితి మిట్టల్ నా స్టోరీ చూసి, నన్ను కలవడానికి వచ్చారు. నా కామెడీని కొనసాగించమని ప్రోత్సహించారు. నేను దానిని అనుసరించాను.

పరిశీలనే కంటెంట్..

నాలాంటి మహిళలకు ఆర్థికంగా సొంతకాళ్లపై నిలబడే అవకాశం రావడం నిజంగా అదృష్టమే. వేదికపైన అందరి దృష్టిని ఆకర్షించాలంటే నాదైన ప్రత్యేకత చూపించాలి. నేను ఎక్కడ పనిచేసినా ఆ ఇంటి యజమానుల పనులను గమనించేదాన్ని. అదే నా కంటెంట్‌గా మారింది. నాలాగా పని చేస్తున్నవారు ఎదుర్కొంటున్న వాస్తవాలను వెలుగులోకి తేవడం మొదలుపెట్టాను. పనిమనిషికి కూర్చునేందుకు ఎక్కడా సరైన స్థలం కూడా ఉండదు. ఎంత కష్టంగా అనిపించినా అన్నీ పెదవి చాటున బిగపట్టుకొని పనులు చేస్తూ ఉండాలి. నా పరిశీలనలే నా హాస్య కచేరీలకు సరైన కథనాలను అందించాయి. వెబ్‌సిరీస్ 'బ్యాడ్ గర్ల్' వంటి ప్రాజెక్ట్‌లలో కూడా పాల్గొన్నాను. సామాజిక అసమానతలను హాస్యంలో మేళవించి నిర్భయంగా ప్రస్తావిస్తూ రావడంతో పాల్గొన్న వేదికలన్నీ వినోదానికే కాదు న్యాయం వైపుగా కూడా ఆలోచింపజేసేవి.

పెరిగిన ఆదరణ

జనాదరణ పెరగడంతో టెలివిజన్ ఛానెల్స్ నుండి ఆఫర్లు రావడం పెరిగాయి. పేరు, డబ్బు రావడంతో కుటుంబం కూడా ఆర్థికంగా నిలదొక్కుకుంది. 'స్మైల్ ఈజ్ మై సూపర్ పవర్' అని నమ్మకంగా చెబుతాను. ఎందుకంటే, నా జీవితంలో ఒడిదొడుకులను చిరునవ్వుతోనే ఎదుర్కొంటున్నాను. జీవితాన్ని సంపూర్ణంగా ఆస్వాదించాలనే నమ్మకాన్ని ఏ ఒక్కరూ కోల్పోనక్కర్లేదు. అందుకు వయసుతో, పరిస్థితులతో కూడా సంబంధం లేదు. ఇప్పుడు నేను నడివయసు మహిళను. ఎవరైనా సరే 40, 50 లేదా వందేళ్లయినా సరే జీవితం పట్ల అభిరుచిని కోల్పోవాల్సిన అవసరం లేదు. మనం వృద్ధాప్యానికి దగ్గర కావచ్చు. కానీ, మనలో ఎప్పటికీ ఒక చిన్న అమ్మాయి ఉంటుంది. ఆమె ఎప్పటిలాగే ఉత్సాహంగా ఉంటుంది. మనం కూడా అలాగే ఉండాలి. ఏదైనా సమస్య మన తలుపు తడితే భయపడకుండా, విచారంగా లేకుండా చిరునవ్వుతో స్వాగతించాలి. ఎలాంటి సవాళ్లు వచ్చినా సానుకూల దృక్పథంతో ఎదుర్కోవడం మొదలుపెడితే మన మార్గం కూడా సులువు అవుతుంది.

స్టాండ్ అప్ కామెడీ పురుష ఆధిపత్య ప్రపంచానిదే. అలాంటి రంగంలో నాకంటూ ఓ సముచిత స్థానాన్ని సంపాదించుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. నిరాశావాదంతో కొట్టుమిట్టాడేవారికి నా జీవితమే ఓ గొప్ప ఉదాహరణ. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక గొప్పదనం ఉంటుంది. దానిని వెలికి తీసేందుకు ఎవరికి వారు ప్రయత్నం చేస్తూనే ఉండాలి' అంటోంది ఈ స్టాండప్ కమెడియన్.

త్రినేత్రం

ఈ ఛాయాచిత్రాలు... కన్నీటి కథలు... పోరాట రూపాలు

వన్యప్రాణులపై ఆసక్తితో సరదాగా కెమెరాను చేతపట్టింది నాన్కీ సింగ్. అయితే ఇప్పుడు ఆమె దృష్టి కోణం మారింది. తన కెమెరా ఇప్పుడు బాధితుల చేతిలో ఆయుధం. వారి పోరాట పటిమకు నిదర్శనం.

సరదాగా 'రీల్స్' చేసే వయసులో సామాజిక విషయాలపై దృష్టి పెట్టింది 22 సంవత్సరాల నాన్కీ సింగ్.

దిల్లీకి చెందిన నాన్కీ సింగ్ యాసిడ్-ఎటాక్ సర్వైవర్‌ల జీవితాలను 'ఏ జర్నీ టు ది మిర్రర్' పేరుతో డాక్యుమెంటేషన్ చేసింది.

ఈ ఛాయాచిత్ర ప్రదర్శన దిల్లీలోని స్టెయిన్లెస్ గ్యాలరీలో జరుగుతోంది.

అమ్మాయిపై యాసిడ్ దాడి జరిగింది... అనే వార్త చదివి 'అయ్యో' అనుకుంటాం. దాడి చేసిన దుర్మార్గుడిని తిట్టుకుంటాం. వాడిని కఠినంగా శిక్షించాలని కోరుకుంటాం.

ఎవరి పనుల్లో వారు బిజీ కావడం వల్ల, ఎవరి లోకంలో వారు ఉండిపోవడం వల్ల 'ఘటన తరువాత యాసిడ్ బాధితురాలి పరిస్థితి ఏమిటి?' అనేదానిపై దృష్టి మళ్లదు.

'సర్వైవర్' అన్న సానుకూల మాటేగానీ యాసిడ్-సర్వైవర్‌లలో చాలామంది జీవితాలు నరకప్రాయంగా ఉంటాయి. సానుభూతికే పరిమితమైనవారు సహాయానికి ముందుకు రాకపోవచ్చు. అంతకు ముందు వరకు ఆత్మీయులుగా ఉన్న వారు అందనంత దూరం జరగవచ్చు.

'బతికాను సరే, ఎలా బతకాలి' అనేది వారికి ప్రధాన సమస్య అవుతుంది. ఉద్యోగం చేయడం నుంచి సొంతంగా చిన్నపాటి వ్యాపారం మొదలు పెట్టడం వరకు ఏదీ సులభం కాదు.

యాసిడ్ దాడి బాధితుల గురించి ఎన్నో ఆర్టికల్స్ చదివిన నాన్కీసింగ్ తన కాలేజీ అసైన్‌మెంట్‌లో భాగంగా వారి కష్టాలు, కన్నీళ్లు, పోరాటాలను ప్రపంచానికి చూపించాలనుకుంది. అలా 'ఏ జర్నీ టు ది మిర్రర్' ప్రాజెక్ట్ పట్టాలకెక్కింది. ఈ ప్రాజెక్ట్ కోసం నోయిడాలోని ఛాన్స్ అనే ఫౌండేషన్ ప్రతినిధులను సంప్రదించింది. యాసిడ్ దాడి బాధితులకు వైద్య, ఆర్థిక సహాయాలు అందించడంతో పాటు పునరావాసం కలిగించే సంస్థ ఇది.

నాన్కీ ఎంతోమంది సర్వైవర్స్‌తో మాట్లాడింది. మొదట్లో మాట్లాడడానికి ఇబ్బంది పడ్డారు.

అయితే పరిచయం స్నేహంగా మారిన తరువాత మనసు విప్పారు.





యాసిడ్ దాడి బాధితురాలికి బర్త్‌డే సెలబ్రేషన్స్

ఒక్కొక్కరిది ఒక్కో కథ. కన్నీళ్లు తెప్పించే కథ. చుట్టూ చీకటి కమ్ముకున్న క్లిష్ట సమయంలోనూ వెలుగు దారుల వైపు అడుగులు వేసిన కథ.

సబ్జెక్ట్‌తో ఫొటోగ్రాఫర్ మమేకం అయినప్పుడు చిత్రం ప్రేక్షకుల దగ్గరికి వేగంగా వెళుతుంది. తాను ఎంచుకున్న సబ్జెక్ట్‌కు అనుగుణంగా సాంకేతిక జ్ఞానాన్ని వాడుకుంది నాన్కీ.

ఉద్దేశపూర్వకంగానే బ్లాక్ అండ్ వైట్‌లో ఫొటోలు తీసింది. దీనికి కారణం కలర్ ఫొటోలు సబ్జెక్ట్‌కు అతీతంగా వేరే అంశాలపై దృష్టి మళ్లిస్తాయి.

బ్లాక్ అండ్ వైట్ ఫొటోలు మాత్రం నేరుగా సబ్జెక్ట్‌పై దృష్టి పడేలా చేస్తాయి.

'అద్దంలో నా ముఖం చూసుకోవాలంటే అంతకుమించిన నరకం లేదు అని చాలా మంది అమ్మాయిలు నాతో పదేపదే చెప్పారు' అంటుంది నాన్కీ సింగ్.

అలాంటి వారిలో ధైర్యం నింపింది నాన్కీ. 'మీరేమీ తప్పు చేయలేదు. కష్టాలను తట్టుకొని మీరు చేస్తున్న జీవన పోరాటం సాధారణమైనదేమీ కాదు' అని చెప్పింది.

కాలేజి ప్రాజెక్ట్‌లో భాగంగా యాసిడ్ దాడి బాధితుల దగ్గరికి వచ్చిన నాన్కీ వారితో కలిసి ప్రయాణం చేస్తోంది. వారి కష్టాలను పంచుకుంటోంది.

'ఫొటోగ్రాఫర్లు, డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్‌లు వారి దగ్గర రావడం కొత్తేమీ కాదు. అయితే నేను మాత్రం ప్రాజెక్ట్‌కు అతీతంగా వారితో అనుబంధం పెంచుకోవాలనుకున్నాను. వారికి ఏది నచ్చుతుందో, నచ్చదో తెలుసుకోవాలనుకున్నాను. వారిని కేవలం బాధితులుగా చూడడం నాకు ఇష్టం లేదు' అంటుంది నాన్కీ సింగ్.

తనకు ఎప్పుడు వీలైతే అప్పుడు వారి దగ్గరకు వెళ్లి మాట్లాడి వస్తుంది. వారి బర్త్‌డేకు కేక్ కట్ చేయించి ఫొటోలు దిగుతుంది.

తన ఫొటో ఎగ్జిబిషన్‌ల ద్వారా యాసిడ్ దాడి బాధితుల కోసం నిధుల సేకరణ చేస్తోంది.

వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా తన ప్రయాణం మొదలు పెట్టింది నాన్కీ. ఇందులో భాగంగా దక్షిణాఫ్రికాకు వెళ్లింది. అక్కడినుంచి తిరిగి వచ్చిన తరువాత దిల్లీలోని చాందిని చౌక్ లాంటి ప్రాంతాల్లో స్ట్రీట్ ఫొటోగ్రఫీ చేసింది. ఫొటోగ్రఫీలోని సాంకేతిక విషయాలపై పట్టు కోసం న్యూయార్క్‌లోని 'స్కూల్ ఆఫ్ విజువల్ ఆర్ట్స్'లో చేరింది.

నాన్కీ సింగ్ ఇప్పుడు సామాజిక విషయాలపై దృష్టి పెట్టింది. మహిళల హక్కుల నుంచి వారిపై జరుగుతున్న హింస వరకు ఎన్నో అంశాలపై ఫొటో ప్రాజెక్ట్‌లు చేస్తోంది.

వారి కుటుంబంలో భాగం అయింది...

'ఏ జర్నీ టు ది మిర్రర్' ప్రాజెక్ట్ పూర్తికాగానే 'ఇక సెలవు' అనే మాట నాన్కీసింగ్ నోట వినిపించలేదు. 'మళ్లీ మళ్లీ కలుస్తుంటాను' అన్నది నాన్కీ. అనడమే కాదు తనకు సమయం దొరికినప్పుడల్లా యాసిడ్ దాడి బాధితుల దగ్గరికి వెళుతుంది. వారితో సరదాగా కబుర్లు చెబుతుంది. వారి కష్టసుఖాల్లో భాగం పంచుకుంటుంది. 'నాన్కీతో మాట్లాడుతుంటే కుటుంబ సభ్యులతో మాట్లాడినట్లుగానే ఉంటుంది. ఆమెతో మాట్లాడితే సంతోషమే కాదు ఆత్మస్థైర్యం కూడా వస్తుంది' అంటారు యాసిడ్ దాడి బాధితులు.



ఆరోగ్యానికి శుభయోగం

ఆధునిక జీవితంలో ఒత్తిడి వల్ల ఎంతోమంది కష్టపడుతున్నారు. ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను ఎక్కువగా ఉపయోగించడం, ఎక్కువసేపు కూర్చుని పని చేయడం వంటి వాటి వల్ల శారీరక, మానసిక సమస్యలు వస్తున్నాయి. వాటికి చెక్ పెట్టే శక్తి యోగాకు ఉంది. ఎందుకంటే ఇది శారీరక వ్యాయామం మాత్రమే కాదు... మానసిక, ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడి ఉంటుంది. ప్రశాంతతను అందిస్తుంది. అయితే యోగాను ఎప్పుడు చేయాలి, ఎలా చేయాలి, ఎవరెవరు చేయవచ్చు, యోగా చేసేవారు తీసుకోవాల్సిన ఆహారం ఏమిటి... వంటి వివరాలు తెలుసుకుందాం.

తీసుకోవాల్సిన ఆహారం

యోగా చేసేవారికోసం కొత్త ఆహార మార్గదర్శకాలను విడుదల చేసింది. ఆ మార్గదర్శకాల ప్రకారం శరీరానికి, మనసుకు అనువైన ఆహారాన్ని తినాలని చెబుతోంది. శాకాహారం తినడమే యోగా సాధనకు మంచిదని వివరిస్తోంది. ముప్పై ఏళ్ల వయసు దాటిన వ్యక్తి లేదా అనారోగ్యం, అధిక శారీరక శ్రమ వంటివి పడుతున్న వ్యక్తులు తప్ప మిగతా వారంతా రోజుకు రెండు పూటలా తింటే సరిపోతుందని, అది కూడా శాకాహారం తింటే మంచిదని చెబుతోంది ఆయుష్.

యోగా వల్ల ఈ రోగాలన్నీ పరార్

ప్రతిరోజూ యోగా చేస్తే శారీరక, మానసిక ప్రయోజనాలు ఎన్నో కలుగుతాయి. వైద్య పరిశోధనలు కూడా యోగా అనేక రోగాలను దూరం పెడుతుందని చెబుతున్నాయి. ప్రతిరోజూ పావుగంట నుంచి అరగంట పాటు యోగా చేస్తే చాలు శారీరక దృఢత్వంతో పాటు కార్డియోవాస్కులర్ అనారోగ్యాలు వచ్చే అవకాశం చాలా వరకు తగ్గుతుంది. మధుమేహం, అధిక రక్తపోటు, శ్వాసకోశ వ్యాధులు వంటివాటిని అదుపు చేయడంలో యోగా ఎంతో సాయపడుతుంది.

జీవనశైలి సంబంధిత రుగ్మతలను తట్టుకోవడంలో యోగా ముందుంటుంది. ఎవరైతే డిప్రెషన్, మానసిక ఒత్తిడి, అలసట వంటి వాటితో బాధపడుతున్నారో వారు ప్రతిరోజు యోగా చేయడం చాలా అవసరం. ఇక మహిళలు ప్రతిరోజు యోగా చేయడం వల్ల నెలసరి సమస్యలు తగ్గుతాయి. యోగా అనేది ఆరోగ్యమైన శరీరాన్ని అందించడమే కాదు, మనసును స్థిరంగా ఉంచే ప్రక్రియ. ఇది సంతృప్తికరమైన జీవితాన్ని గడపడానికి ఒక దారి చూపిస్తుంది.

యోగా చేసే ముందు...

ఒక ప్రశాంతమైన వాతావరణాన్ని ఎంచుకోండి. యోగాభ్యాసాన్ని ఖాళీ పొట్టతో చేయాలి లేదా తేలికపాటి ఆహారాన్ని తిన్నాక చేయాలి. మరీ బలహీనంగా అనిపిస్తే గోరువెచ్చని నీటిలో కాస్త తేనె వేసుకొని తాగి యోగా చేయవచ్చు.

యోగాభ్యాసాన్ని చేసే ముందు మూత్రాశయం, పేగులు ఖాళీగా ఉండాలి. అంటే ముందుగానే కాలకృత్యాలు తీర్చుకుంటే మంచిది. తేలికైన, సౌకర్యవంతమైన కాటన్ దుస్తులను ధరించి చేయడం మంచిది. ఎవరైతే తీవ్ర అలసటతో, అనారోగ్యాలతో బాధపడుతున్నారో అలాంటివారు యోగా చేయకూడదు. అలాగే దీర్ఘకాలిక వ్యాధులు గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు కూడా యోగాభ్యాసాలను చేసేముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. గర్భం ధరించిన వారు, నెలసరిలో ఉన్నవారు కూడా యోగా చేసే ముందు యోగా నిపుణులను సంప్రదించడం ఉత్తమం.

ఇవి కలిపితే ఆరోగ్యం పెరుగుతుంది



పెరుగు ఆరోగ్యానికి మంచిదని తెలిసిందే. పెరుగులో కొందరు పంచదార కలిపి తింటే, ఉప్పు కలిపి మరికొందరు తింటుంటారు. గతవారం మనం పెరుగుతో కలిపి తినకూడని పదార్థాలేమిటో చెప్పుకున్నాం. పెరుగులో ఏయే పదార్థాలు కలిపి తింటే ఏయే ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయో ఈ వారం చూద్దాం.



జీలకర్రతో...

పెరుగు, జీలకర్ర ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఒకవేళ మీరు అధిక బరువు సమస్యతో బాధపడుతుంటే, పెరుగుతో జీలకర్ర పొడిని కలిపి తింటే, దాని నుంచి మంచి ప్రయోజనం పొందుతారు. దీని కోసం ముందు జీలకర్రను కాస్త వేయించి, ఆ తర్వాత దానిని పెరుగులో కలుపుకుని తినాలి.



సైంధవ లవణంతో...

పెరుగు, సైంధవ లవణం కలిపి తింటే ఎసిడిటీ తగ్గుతుంది.

కోడి గుడ్డుతో...

పెరుగు, కోడిగుడ్డు కలిపి తినడం వల్ల అనేక అనారోగ్య సమస్యల నుంచి మేలు జరుగుతుంది. మీకు పంటి నొప్పి ఉంటే, ఈ రెండు పదార్థాలను కలిపి తినండి. ఇది నోటి అల్సర్ల నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుంది.

నల్ల ఉప్పుతో...

నల్ల ఉప్పును పెరుగు లో కలిపి తీసుకుంటే జీర్ణ సమస్యలు, కడుపునొప్పి తగ్గుతాయి.

వాముతో...

కొంత వాము తీసుకుని ఓ కప్పు పెరుగులో కలిపి తినాలి. దీనివల్ల నోటిపూత, పంటి నొప్పి, ఇతర దంత సంబంధ సమస్య లు తొలగుతాయి.

చక్కెరతో కలిపితే...

పెరుగు చక్కెర... ఈ రెండింటిని కలిపి తినడం వల్ల దగ్గు తగ్గుతుంది. వంటికి తక్షణ శక్తి లభిస్తుంది.

మిరియాల పొడితో...

ఈ రెండింటినీ కలిపి తీసుకుంటే మలబద్ధకం పోతుంది.

పండ్ల ముక్కలతో కలిపితే...

పెరుగులో తాజా పండ్లముక్కలు కలిపి తింటే వ్యాధి నిరోధకత పెరుగుతుంది.



తేనెతో...

పెరుగులో ప్రొటీన్, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. తేనెలో రోగనిరోధక శక్తి సమృద్ధిగా ఉంటుంది. ఈ రెండు పోషకాలు కలిసి ఎముకలను దృఢపరుస్తాయి కాబట్టి ఎముకల నొప్పులు ఉన్న వారు పెరుగు, తేనె కలిపి తినడం వల్ల ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు. ఇంకా బోలు ఎముకల వ్యాధి, రక్తం గడ్డకట్టడం, అతిసార, ఊబకాయం, కీళ్లనొప్పులు, గుండె, రక్త సంబంధిత వ్యాధులు నయం అవుతాయి.



పచ్చిబఠానీలతో ప్రయోజనాలు



పచ్చి బఠానీలు ఆహారానికి రుచిని ఇస్తాయి. ఆరోగ్యాన్ని పెంచుతాయి. పచ్చి బఠానీల తింటుంటే కలిగే ఇతర ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో తెలుసుకుందాము. బఠానీలు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి, దీనివల్ల గుండెపోటు, రక్తపోటు వంటి వ్యాధులను నివారించవచ్చు. పచ్చి బఠానీలు తీసుకోవడం వల్ల షుగర్ లెవెల్ కూడా అదుపులో ఉంటుంది.

బఠానీలలో ప్రోటీన్, ఫైబర్ అధికంగా ఉంటాయి, దీని కారణంగా ఆకలి తగ్గుతుంది. ఇది జింక్, రాగి, మాంగనీస్, ఇనుము కలిగి ఉంటుంది. దానివల్ల వ్యాధుల బారిన పడకుండా ఉంటారు. వీటిని రెగ్యులర్‌గా తినడం వల్ల క్యాన్సర్ రిస్క్ తగ్గుతుంది. ముఖ్యంగా కడుపు క్యాన్సర్ నిరోధిస్తాయి. పచ్చి బఠానీలను తినడం వల్ల యవ్వనంగా కనిపిస్తారు, వృద్ధాప్య ప్రభావం త్వరగా కనిపించదు.

పచ్చి బఠానీలో ప్రోటీన్‌తోపాటు ఉండే విటమిన్ కె బోలు ఎముకల వ్యాధిని నివారించడంలో సహాయపడుతుంది. పచ్చి బఠానీలను తినడం జ్ఞాపకశక్తిని పెంచడంలో సహాయపడుతుంది. గర్భిణులకు పచ్చి బఠానీలు మేలు చేస్తాయి. ఇది గర్భస్థ శిశువుకు తగిన పోషణను కూడా అందిస్తుంది. ఇంకా ఇవి రుతుక్రమ సమస్యలలో కూడా సాయం చేస్తాయి.

మీకు తెలుసా?

- సూర్యోదయానికి ముందే నిద్ర లేవాలి. ఉదయం నిద్ర లేవగానే ఒక లీటర్ గోరువెచ్చని నీళ్లు లేదా రాగి పాత్రలో నీళ్లు తాగాలి.
- నీళ్లు ఎప్పుడు తాగినా గటగటా తాగకూడదు. గుటక, గుటక మింగుతూ నిదానంగా సిప్ చేస్తూ తాగాలి.
- నీళ్లు ఎప్పుడు తాగినా కూర్చొని తాగాలి. వాష్ రూమ్‌కు వెళ్లి వచ్చిన తర్వాత నీళ్లు తాగితే మూత్ర సంబంధ వ్యాధులు వస్తాయి.
- ఉదయం పరగడుపున గ్లాసు నీళ్లలో ఒక చెక్క నిమ్మరసం పిండుకొని తాగడం చాలా మంచిది.
- అన్నం తిన్న తర్వాత 500 అడుగుల నడవడం వల్ల పొట్ట రాదు. తిన్న ఆహారం తొందరగా అరుగుతుంది.
- రోజుకు పదివేల అడుగులు కనీసం నడవాలి. వాకింగ్ చేయడం ఆరోగ్యానికి మంచిది
- ఆహారంలో అయోడిన్ సాల్ట్ బదులు సైంధవ లవణం వాడటం ఆరోగ్యకరం.
- వంటకు సన్‌ఫ్లవర్ ఆయిల్, రిఫైండ్ ఆయిల్‌కు బదులు నువ్వుల నూనె, వేరుశనగ నూనె, కుసుమ నూనె వాడడం మంచిది.
- రాత్రి భోజనంలో అన్నము పెరుగు, రాజమా కర్రీ తినకూడదు
- రాత్రి హెవీగా తినడం వల్ల మధుమేహం, బీపీ, ఒబేసిటీ, మలబద్ధకం లాంటి సమస్యలు వస్తాయి.
- ఉదయం పూట పండ్ల రసాలు; మధ్యాహ్నం మజ్జిగ; రాత్రిళ్లు పాలూ తాగడం ఆరోగ్యకరం.

సినిమా



ప్రేక్షకుల గుర్తింపే పెద్ద అవార్డుతో సమానం

- నటుడు ఆనంద చక్రపాణి

"ఒక నటుడికి తాను సంపాదించే డబ్బు ముఖ్యం కాదు. జనాలు గుర్తుపట్టి పలకరించినప్పుడు, నటించిన సినిమాల్లోని పాత్రల పేరుతో పిలిచినప్పుడు ఎంతో సంతృప్తిగా ఉంటుంది. ప్రేక్షకుల గుర్తింపే పెద్ద అవార్డుతో సమానం" అని నటుడు ఆనంద చక్రపాణి అన్నారు. 'దాసి' (1988) సినిమాతో నటుడిగా పరిచయమయ్యారు ఆనంద చక్రపాణి. ఆ తర్వాత సరైన అవకాశాలు లేక ఇండస్ట్రీ నుంచి వ్యాపారం వైపు వెళ్లిన ఆయన 'మల్లేశం' (2019) సినిమాతో సెకండ్ ఇన్నింగ్స్‌ని ప్రారంభించారు. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉంటున్న ఆనంద చక్రపాణి 'సాక్షి'తో పంచుకున్న విశేషాలు.

● నా తొలి చిత్రం 'దాసి'. ఆ తర్వాత ఐదారు సినిమాల్లో నటించినప్పటికీ సరైన గుర్తింపు రాలేదు. పైగా కొత్త అవకాశాలేవీ రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడ్డాను. దీంతో ఇండస్ట్రీని వదిలి అడ్వర్టైజింగ్ ఫీల్డ్‌కి వెళ్లి, కొన్ని యాడ్ ఫిలింస్‌కి స్క్రిప్ట్ రాయడంతో పాటు దర్శకత్వం వహించాను. 'మల్లేశం' సినిమాకు ప్రొడక్షన్ డిజైనర్‌గా చేసిన లక్ష్మణ్ యేలేగారి ద్వారా ఆ సినిమాలో నటించే చాన్స్ వచ్చింది. అందులో హీరో ప్రియదర్శి తండ్రి పాత్ర చేశాను. నా పాత్రకు అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. నా నటన సినీ ప్రముఖులను, సినీ విమర్శకులను, సాధారణ ప్రేక్షకుడిని సైతం భావోద్వేగానికి గురి చేసింది. నా కెరీర్‌కి ఆ మూవీ ఓ మలుపులా ఉపయోగపడింది. నా జీవితం 'మల్లేశం'కు ముందు.. 'మలేశం'కు తర్వాత అని చెప్పుకోవాలి. నాకు ఆ సినిమాలో అవకాశం ఇచ్చిన దర్శకుడు, నిర్మాత రాజ్ రాచకొండకు రుణపడి ఉంటా. ● 'మల్లేశం' తర్వాత 'వరల్డ్ ఫేమస్ లవర్, అనగనగా ఓ అతిథి, విరాట పర్వం, లవ్ స్టోరీ, నాంది, వకీల్ సాబ్, టైగర్ నాగేశ్వరరావు... ఇలా దాదాపు 45 సినిమాల్లో నటించాను. 'గెటప్' శీను హీరోగా నటించిన 'రాజు యాదవ్' చిత్రం మే 24న విడుదలైంది. ఈ సినిమాలో హీరో తండ్రిగా ట్యాక్సీ డ్రైవర్ రాములు పాత్ర చేశాను. ఇందులోని భావోద్వేగ సన్నివేశాల్లో నా నటన ప్రేక్షకుల చేత కన్నీళ్లు పెట్టించింది. నా కెరీర్‌లో 'మల్లేశం, అనగనగా ఓ అతిథి, రాజు యాదవ్' చిత్రాలు ఎంతో ప్రత్యేకం. 'మల్లేశం, అనగనగా ఓ అతిథి' చిత్రాలకు మించిన గుర్తింపు 'రాజు యాదవ్'తో వచ్చింది.

● ఒకే తరహా పాత్రలు కాకుండా ఎప్పటికప్పుడు వైవిధ్యమైన క్యారెక్టర్స్ చేయాలని ఉంది. 'ఆనంద చక్రపాణి మంచి నటుడు. ఏ పాత్రకి అయినా న్యాయం చేయగలడు' అని ప్రేక్షకులు, ఇండస్ట్రీ వర్గాల వారి నుంచి అనిపించుకోవాలన్నదే నా లక్ష్యం. ప్రస్తుతం అరడజనుకు పైగా సినిమాలు చేస్తున్నాను. 'షష్టి పూర్తి' చిత్రంలో రాజేంద్రప్రసాద్‌గారి ఫ్రెండ్‌గా నటిస్తున్నాను. అలాగే నిఖిల్ సిద్ధార్థ్ 'స్వయంభూ'తో పాటు 'గాంధీ తాత చెట్టు, ఉరుకు పటేలా' తదితర చిత్రాల్లో నటిస్తున్నాను. 'గాంధీ తాత చెట్టు' చిత్రంలో నా పాత్రకి ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. అదే విధంగా మరికొన్ని సినిమాలకు చర్చలు జరుగుతున్నాయి.

సినిమా అంటే నేనొక్కడినే కాదు

- ఫర్హాన్ అక్తర్



హిందీలో 'దిల్ చాహతా హై' (2001), 'లక్ష్య' (2004), 'డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్' (2006), 'డాన్ 2: ది కింగ్ ఈజ్ బ్యాక్ (2011)' వంటి చిత్రాలతో దర్శకుడిగా ప్రతిభను నిరూపించుకున్నారు ఫర్హాన్ అక్తర్. కానీ 'డాన్: ది కింగ్ ఈజ్ బ్యాక్' తర్వాత ఫర్హాన్ దర్శకుడిగా మళ్లీ మెగాఫోన్ పట్టలేదు. అయితే దాదాపు మూడేళ్ల క్రితం ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్, ఆలియా భట్ లీడ్ రోల్స్‌లో 'జీ లే జరా' సినిమాకు దర్శకత్వం వహించనున్నట్లు ప్రకటించారు ఫర్హాన్. కానీ ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లకుండానే రణ్‌వీర్ సింగ్, కియారా అద్వానీ హీరో హీరోయిన్లుగా ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో 'డాన్ 3' ప్రకటన వచ్చింది. ఈ సినిమా కూడా ఇంకా సెట్స్‌పైకి వెళ్లలేదు. తాజాగా ఈ విషయాలపై స్పందించారు ఫర్హాన్. ''నేను దర్శకుడిగా సెట్స్‌లోకి వెళ్లక పదేళ్లకు పైనే అయింది. నటుడిగా బిజీగా ఉండటం వల్లే డైరెక్షన్‌కి టైమ్ కుదరలేదు. 'డాన్ 3' చిత్రీకరణ వచ్చే ఏడాది ఆరంభమవుతుంది. అలాగే 'జీ లే జరా' కూడా నా దర్శకత్వంలోనే ఉంటుంది. ఈ సినిమా ప్రకటన వచ్చి చాలా టైమ్ గడిచింది. సినిమా అంటే నేనొక్కడినే కాదు. నటీనటులు, సాంకేతిక నిపుణుల కాల్షీట్స్ అన్నీ కరెక్ట్‌గా కుదరాలి. నా దర్శకత్వంలో రాబోయే నెక్ట్స్ రెండు సినిమాలు 'డాన్ 3, జీ లే జరా'నే'' అన్నారు ఫర్హాన్ అక్తర్.

ఈసారి ప్రిపేరై వచ్చాను!



● ప్రభాస్

ప్రభాస్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ, శోభన, అన్నా బెన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. భైరవ పాత్రలో ప్రభాస్, సుమతి పాత్రలో దీపిక, అశ్వత్థామ పాత్రలో అమితాబ్, సుప్రీమ్ యాక్సిన్‌గా కమల్ కనిపిస్తారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి. అశ్వినీదత్ నిర్మించిన 'కల్కి 2898 ఏడీ' ఈ నెల 27న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా రిలీజ్ ట్రైలర్‌ను శుక్రవారం విడుదల చేశారు. 'సమయం వచ్చింది. భగవంతుడి లోపల సమస్త సృష్టి ఉంటుందంటారు. అలాంటిది మీ కడుపున భగవంతుడే ఉన్నాడు, నేను కాపాడతా..' (అమితాబ్), 'ఎన్ని యుగాలైనా... ఎన్ని అవకాశాలు ఇచ్చినా మనిషి మారడు... మారలేదు' (కమల్) 'ఒక పెద్ద బౌంటీ... వన్ షాట్... కాంప్లెక్స్‌కి వెళ్లిపోతా..., సరే... ఇంక చాలు, ఈసారి ప్రిపేరై వచ్చాను... దా' అనే డైలాగ్స్‌తో పాటు 'మాధవా...' అనే పాట కూడా ఈ ట్రైలర్‌లో వినిపిస్తుంది. ఈ సినిమాకు సంతోష్ నారాయణన్ స్వరకర్త.

పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో...



● సాయి దుర్గ తేజ్

'విరూపాక్ష' (2023) వంటి హిట్ మూవీ తర్వాత సాయి దుర్గ తేజ్ నటిస్తున్న తాజా పాన్ ఇండియా మూవీ 'ఎస్‌డీటీ 18' (వర్కింగ్ టైటిల్). ఈ చిత్రంతో రోహిత్ కేపీ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'హను–మాన్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ నిర్మించిన కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి 'ఎస్‌డీటీ 18' నిర్మిస్తున్నారు. ఈ చిత్రం అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ – ''పీరియాడికల్ హై యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న చిత్రం 'ఎస్‌డీటీ 18'. ఇందులో సాయి దుర్గ తేజ్ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. ఈ చిత్రం కోసం నిర్మించిన ఓ భారీ సెట్‌లో ప్రస్తుతం తొలి షెడ్యూల్ జరుగుతోంది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రం రూపొందుతోంది'' అని చిత్రబృందం పేర్కొంది.

మేమంతా శ్రామికులం



● 'వెన్నెల' కిశోర్

''మా ఊరు శ్రీకాకుళం... మేమంతా శ్రామికులం... స్వేదమే మూల ధనం... ఊరికీ మాకూ దూరం...' అనే పాట 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' చిత్రంలోనిది. 'వెన్నెల' కిశోర్, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ క్రైమ్ కామెడీ థ్రిల్లర్ మూవీకి రచయిత మోహన్ దర్శకుడు. శ్రీ గణపతి సినిమాస్ బ్యానర్ పై లాస్య రెడ్డి సమర్పణలో వెన్నపూస రమణా రెడ్డి ఈ సినిమాని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని 'మా ఊరు శ్రీకాకుళం...' అనే పాటను దర్శకుడు హరీష్ శంకర్ విడుదల చేసి మాట్లాడుతూ– ''వెన్నెల' కిశోర్‌గారి నుంచి ఓ డిఫరెంట్ మూవీని ఎక్స్‌పెక్ట్ చేస్తున్నాం. ఈ చిత్రం టైటిల్ ఫన్నీగా ఉంది. యూనిట్ అందరికీ ఆల్ ది బెస్ట్'' అన్నారు. ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ సునీల్ కశ్యప్ సంగీత సారథ్యంలో రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను మంగ్లీ పాడారు. సీయా గౌతమ్, స్నేహ గుప్తా, రవి తేజ మహాదాస్యం, బాహుబలి ప్రభాకర్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

బుజ్జి మేక



యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల జంటగా నటించిన చిత్రం 'పొట్టేల్'. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగె నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. శేఖర్ చంద్ర సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'బుజ్జి మేక...' అంటూ సాగే పాటని రిలీజ్ చేసింది యూనిట్. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటను కాలభైరవ పాడారు. ''రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో ఒక ఫ్రెష్ కాన్సెప్ట్‌తో రూపొందించిన చిత్రం 'పొట్టేల్'. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన 3 పాటలు చార్ట్ బస్టర్ హిట్స్‌గా అలరిస్తున్నాయి. 'బుజ్జి మేక..' పాట భావోద్వేగాలతో సాగుతుంది'' అన్నారు మేకర్స్. అజయ్, ప్రియాంకా శర్మ, తనస్వీ చౌదరి నటించిన ఈ చిత్రానికి కెమెరా: మోనిష్ భూపతి రాజు.

అలా పిలిస్తే సరదాగా తీసుకోలేం



● శ్రుతీ హాసన్

నోరు మూసుకుని వెళ్లు అని స్ట్రాంగ్‌గా రియాక్ట్ అయ్యారు హీరోయిన్ శ్రుతీహాసన్. ఈ బ్యూటీకి ఇంతలా కోపం రావడం వెనక ఓ కారణం ఉంది. వీలు కుదిరినప్పుడల్లా సోషల్ మీడియా మాధ్యమాల వేదికగా నెటిజన్లతో చాట్ సెషన్ నిర్వహిస్తుంటారు శ్రుతీహాసన్. తాజాగా శ్రుతి నిర్వహించిన చాట్ సెషన్‌లో 'సౌత్ ఇండియన్ యాసలో ఏదైనా చెప్పండి' అని ఓ నెటిజన్ అడిగాడు. ఈ ప్రశ్న శ్రుతికి కోపం తెప్పించింది. "ఈ రకమైన జాతి వివక్షను నేను అస్సలు సహించను. మమ్మల్ని ఉద్దేశించి మీరు ఇడ్లీ, సాంబార్, దోసె అని పిలిస్తే ఊరుకోం. ఎలా పడితే అలా పిలిస్తే సరదాగా తీసుకోలేం. అలాగే మమ్మల్ని అనుకరించాలని మీరు ప్రయత్నించవద్దు. ఎందుకంటే.. మీరు మాలా చేయలేరు. సరే.. మీరు సౌత్ ఇండియన్ యాసలో ఏదైనా చెప్పమని అడిగారు కాబట్టి చెబుతున్నాను. 'నోరు మూసుకుని వెళ్లు" అంటూ ఆ నెటిజన్‌కు రెస్పాండ్ అయ్యారు శ్రుతీహాసన్. ఇక సినిమాల విషయానికొస్తే... ప్రస్తుతం 'డెకాయిట్: ఏ లవ్ స్టోరీ, చెన్నై స్టోరీ' చిత్రాలతో బిజీగా ఉన్నారు శ్రుతీహాసన్.

ఇద్దరు స్నేహితుల కథ



● రామ్ యోగి

సూర్య శ్రీనివాస్, శివ బొడ్డు రాజు హీరోలుగా, జెన్నీఫర్ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ఈవీఓఎల్' (ఏ లవ్‌స్టోరీ ఇన్ రివర్స్). తేడా బ్యాచ్ సినిమా సమర్పణలో రామ్ యోగి వెలగపూడి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో రామ్ యోగి వెలగపూడి మాట్లాడుతూ– ''ఇద్దరు స్నేహితుల మధ్య అవగాహన నేపథ్యంలో సాగే కథే ఈ మూవీ. క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమా ఆద్యంతం ఉత్కంఠగా సాగుతుంది. హైదరాబాద్, వైజాగ్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: తేడా బ్యాచ్ సినిమా టీమ్.

సాక్షి బిజినెస్
శనివారం
22-6-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	269	77,210
నిఫ్టీ ▽	66	23,501

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	17,672	▽	49
డోజోన్స్	39,113	▽	21
ఎఫ్‌టీఎస్ఈ 100	8,238	△	35
డాక్స్	18,164	△	91
షాంఘై	2,998	▽	7
నికాయ్	38,596	▽	37

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
72,746	△	548
బంగారం (99.5 స్వచ్ఛత)		
72,455	△	582
వెండి (కిలో)		
90,666	△	688

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.19	84.21
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.69	107.24
€	యూరో	ఎస్‌బీఐ	88.51	90.89
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.10	53.24
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.83	56.77
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.33	64.02
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.38	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.86	23.64
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.46

జెప్టోకు నిధుల పంట

- రూ. 5,550 కోట్ల సమీకరణ
- రూ. 30,000 కోట్లకు కంపెనీ విలువ



న్యూఢిల్లీ: గ్రోసరీ డెలివరీ స్టార్టప్ జెప్టో భారీగా పెట్టుబడులను అందుకుంది. త్వరలో పబ్లిక్ ఇష్యూకి రానున్న కంపెనీ 66.5 కోట్ల డాలర్ల (రూ. 5,550 కోట్లు) నిధులను సమీకరించింది. దీంతో ఈ క్విక్ కామర్స్ సంస్థ విలువ 3.6 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 30,000 కోట్లు)కు ఎగసింది. వెరసి ఈకామర్స్ దిగ్గజాలు అమెజాన్, బ్లింకిట్ (జొమాటో), స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, బిగ్‌బాస్కెట్ (టాటా గ్రూప్)లతో పోటీ పడనుంది. గ్రోసరీ డెలివరీ విభాగంలో తీవ్ర పోటీ కారణంగా అధిక పెట్టుబడులు, తక్కువ మార్జిన్లు నమోదయ్యే సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జెప్టోలో తాజా పెట్టుబడులకు ప్రాధాన్యత ఏర్పడింది. 2021 ఏప్రిల్‌లో ప్రారంభమైన స్టార్టప్ జెప్టోలో కొత్త సంస్థలు ఎవెనీర్ గ్రోత్ క్యాపిటల్, లైట్‌స్పీడ్, అవ్రా క్యాపిటల్‌సహా ప్రస్తుత ఇన్వెస్టర్లు గ్లేడ్ బ్రూక్, నెక్సస్, స్టెప్‌స్టోన్ గ్రూప్ తాజా పెట్టుబడులను అందించాయి. కాగా.. జెప్టో నిర్వహణస్థాయిలో లాభాలు ఆర్జించేందుకు సిద్ధంగా ఉన్నదని, సమీప భవిష్యత్‌లో స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యే అవకాశముందని సంబంధిత వర్గాలు తెలిపాయి. గ్రోసరీస్‌ను 10 నిమిషాల్లో డెలివరీ చేసే సంస్థల్లో కంపెనీ 29% వాటాను ఆక్రమిస్తుండగా..40% వాటాతో బ్లింకిట్ టాప్‌లో ఉంది.

నాన్‌స్టాప్‌గా ఎగిరిపోదాం!


- డైరెక్ట్ ఫ్లయిట్స్ వైపు భారతీయ విమాన ప్రయాణికుల మొగ్గు
- 2023లో 3.72 కోట్ల మంది అంతర్జాతీయ ప్యాసింజర్లు

న్యూఢిల్లీ: అమెరికా, యూరప్ తదితర దేశాలకు వెళ్లే భారతీయ విమాన ప్రయాణికులు ఇన్‌డైరెక్ట్ ఫ్లయిట్ల కన్నా నాన్-స్టాప్, డైరెక్ట్ ఫ్లయిట్లకే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. అంతర్జాతీయ ట్రావెల్ డేటా సంస్థ ఓఏజీ గణాంకాల ప్రకారం గత కొన్నాళ్లుగా ఈ ధోరణి పెరుగుతోంది. 2023లో 3.72 కోట్ల మంది ప్యాసింజర్లు నాన్-స్టాప్ ఫ్లయిట్స్‌లో ప్రయాణించారు. కోవిడ్ పూర్వం 2019తో పోలిస్తే ఇది ఇరవై లక్షలు అధికం. ఇదే వ్యవధిలో ఒకటి లేదా అంతకు మించి స్టాప్స్‌లో ఆగుతూ వెళ్లే ఇన్‌డైరెక్ట్ ఫ్లయిట్స్‌లో ప్రయాణించిన వారి సంఖ్య 25 లక్షలు తగ్గి 2023లో 2.74 కోట్లకు పరిమితమైంది.

2023లో ప్రయాణించిన మొత్తం 6.46 కోట్ల మంది ప్యాసింజర్లలో 57 శాతం మంది నాన్-స్టాప్ ఫ్లయిట్స్‌నే ఎంచుకున్నారు. 2019లో ఇది 53 శాతంగా ఉంది.

పశ్చిమాసియా హబ్‌లకు తగ్గిన ప్రయాణికులు

అమెరికా, యూరప్‌లకు వెళ్లే ఫ్లయిట్స్ కోసం భారతీయులు ఎక్కువగా పశ్చిమాసియా హబ్‌ల వైపు మొగ్గు చూపే ధోరణి తగ్గింది. ఓఏజీ గణాంకాల ప్రకారం 2019–2023 మధ్య కాలంలో పశ్చిమాసియా హబ్‌లకు ప్యాసింజర్ల సంఖ్య 10 లక్షల మేర తగ్గింది. ఆ నాలుగేళ్ల వ్యవధిలో ప్రపంచవ్యాప్తంగా ఇతర హబ్‌లకు కూడా ప్రయాణికుల సంఖ్య 28 లక్షల మేర తగ్గింది. మరోవైపు, కొత్తగా 52 అంతర్జాతీయ రూట్లను జోడించడంతో ఇన్‌డైరెక్ట్ ఫ్లయిట్ ప్యాసింజర్లకు సంబంధించి దేశీ హబ్‌లలో ప్రయాణికుల సంఖ్య 10 లక్షల మేర పెరిగింది. ఓఏజీ విశ్లేషణ ప్రకారం గల్ఫ్ దేశాలకు వెళ్లే భారతీయుల సంఖ్య గణనీయంగా పెరిగింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో (యూఏఈ) 36 లక్షల మంది, సౌదీ అరేబియాలో 26 లక్షల మంది ఉన్నారు. ఇంటర్నేషనల్ రూట్లలో భారతీయులను గమ్యస్థానాలకు చేరవేయడంలో పశ్చిమాసియా దేశాల ఎయిర్‌లైన్స్ ఆధిపత్యం కొనసాగుతోంది. ఈ విషయంలో దశాబ్దం క్రితం గల్ఫ్ దేశాల ఎయిర్‌లైన్స్ వాటా 48 శాతంగా ఉండగా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇది 50 శాతానికి పెరిగింది.





పెట్టుబడి సాధనాలుగా యులిప్స్‌ను ప్రచారం చేయొద్దు

ఐఆర్‌డీఏఐ సర్క్యులర్

న్యూఢిల్లీ: యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ పాలసీలను (యులిప్స్) 'పెట్టుబడి సాధనాలు'గా ప్రచారం చేయొద్దని బీమా సంస్థలను ఆదేశిస్తూ బీమా రంగ నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ మాస్టర్ సర్క్యులర్ జారీ చేసింది. దీని ప్రకారం యులిప్‌లనేవి సంప్రదాయ ఎండోమెంట్ పాలసీలకు భిన్నమైనవని, ఇవి మార్కెట్ ఆధారిత బీమా పథకాలని, వీటిలో రిస్కులు ఉంటాయనేది బీమా సంస్థలు నిర్దిష్టంగా పేర్కొనాలి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
22-6-2024	
విశాఖ	515–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	505–00
విజయవాడ	510–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	515–00
వరంగల్	517–00
రిటైల్ ధర	5.75

చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్

- ఫార్మా సర్వీసెస్‌లో ఉజ్వల భవిష్యత్
- సప్తగిర్ గ్రూప్ ఎండీ శిల్పా రెడ్డి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా సర్వీసెస్ రంగంలో చైనాకు ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు భారత్‌కు అపార అవకాశాలు ఉన్నాయని సీఐఐ తెలంగాణ ఫార్మా, లైఫ్ సైన్సెస్ కన్వీనర్, సప్తగిర్ గ్రూప్ ఎండీ శిల్పా రెడ్డి శుక్రవారమిక్కడ తెలిపారు. చైనాతోపాటు మరో దేశంలోని కాంట్రాక్ట్ రిసర్చ్, కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలతో చేతులు కలపాలన్న అభివృద్ధి చెందిన దేశాల వ్యూహం భారత్‌కు కలిసి వస్తుందన్నారు. దేశంలో ఐటీ సేవలను మించి ఫార్మా సర్వీసెస్ రంగం దూసుకు వెళ్లేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఇదే జరిగితే కెమికల్ సైంటిస్టులకు డిమాండ్ ఉంటుందని శిల్పా రెడ్డి అన్నారు.



ప్రస్తుతం భారత ఫార్మా సర్వీసెస్ మార్కెట్ విలువ 2 బిలియన్ డాలర్లు ఉందని వివరించారు.

అసోసియేషన్‌కు కార్యరూపం..: ఫార్మా సర్వీసెస్ కంపెనీలను ఏకతాటిపైకి తీసుకువస్తూ సంఘం ఏర్పాటు చేయనున్నట్టు ఆరాజెన్ లైఫ్ సైన్సెస్ సీఈవో మణి కంటిపూడి వెల్లడించారు. దేశంలో సుమారు 25,000 మంది సైంటిస్టులు ఈ రంగంలో ఉన్నారని చెప్పారు. పదేళ్లలో ఈ సంఖ్య లక్షకు చేరుకుంటుందని, 10 బిలియన్ డాలర్లకు పరిశ్రమ వృద్ధి చెందుతుందని అంచనాగా చెప్పారు. ఫార్మా సర్వీసెస్ పరిశ్రమల కోసం ప్రత్యేక పార్క్/క్లస్టర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

బీ న్యూ స్టోర్లలో షావోమీ 14 సివి స్మార్ట్‌ఫోన్లు



హైదరాబాద్: మల్టీ బ్రాండ్ మొబైల్ రిటైల్ చైన్ బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ తన స్టోర్లలో షావోమి 14 సివి స్మార్ట్ ఫోన్లను అందుబాటులోకి తెచ్చింది. హైదరాబాద్ మాదాపూర్‌లోని బీన్యూ స్టోర్‌లో నటి అమ్రితా అయ్యర్ ఈ స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేశారు. ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ సీఎండీ బాలాజీ చౌదరి, సీఈఓ సాయి నితేష్‌తో పాటు ఎంఐ సంస్థ సీనియర్ డైరెక్టర్ కునాల్ అగర్వాల్, డిప్యూటీ హెడ్ చానెల్ సేల్స్ బీవీ మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

జేకే టైర్ నుంచి 4 ఉత్పత్తులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టైర్ల తయారీ దిగ్గజం జేకే టైర్ అండ్ ఇండస్ట్రీస్ కొత్తగా నాలుగు ఉత్పత్తులను ప్రవేశపెట్టింది. టిప్పర్లు, ట్రైలర్లు, బస్సులు మొదలైన వాహనాల కోసం ఇవి ఉపయోగపడతాయి. జెట్‌వే జేయూఎం ఎక్స్‌ఎం, జేయూసీ ఎక్స్‌ఎం, జెట్‌స్టీల్ జేడీసీ ఎక్స్‌డీతో పాటు ప్రత్యేకంగా ఎలక్ట్రిక్ బస్సుల కోసం జెట్‌వే జేయూఎక్స్ఈ పేరిట టైర్లను ప్రవేశపెట్టినట్లు కంపెనీ ప్రెసిడెంట్ (ఇండియా) అనుజ్ కథూరియా తెలిపారు. ఇన్‌ఫ్రా, మైనింగ్ రంగాల వాహనాలకు సంబంధించి ఇంధనం, నిర్వహణ ఖర్చులు ఆదా చేసే విధంగాను, దీర్ఘకాలం మన్నే విధంగాను వీటిని రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ రెండు రంగాలకు చెందిన పలు దిగ్గజ సంస్థలు తెలంగాణ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న నేపథ్యంలో ఇది తమకు అత్యంత కీలకమైన మార్కెట్లలో ఒకటిగా ఉంటోందని కథూరియా వివరించారు. రాష్ట్రంలో తమకు 380 మందికి పైగా డీలర్లు ఉన్నారని, 4–5% మార్కెట్ వాటా ఉందన్నారు.



బుల్ రికార్డులకు బ్రేక్

- గరిష్టాల వద్ద లాభాల స్వీకరణ
- ఇంట్రాడేలో నిఫ్టీ కొత్త రికార్డు



ముంబై: సెన్సెక్స్ ఆరు రోజుల రికార్డు ర్యాలీకి శుక్రవారం అడ్డుకట్ట పడింది. గరిష్ఠ స్థాయిల వద్ద ఆయిల్‌అండ్‌గ్యాస్, క్యాపిటల్ గూడ్స్, ఎఫ్ఎంసీజీ స్టాక్స్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 269 పాయింట్లు నష్టపోయి 77,210 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 677 పాయింట్లు క్షీణించి 76,802 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. ఇంట్రాడేలో నిఫ్టీ 100 పాయింట్లు పెరిగి 23,667 తాజా గరిష్టాన్ని నమోదు చేసింది. కానీ అద్యంతం అదే దూకుడును కొనసాగించలేకపోయింది. చివరకు 66 పాయింట్ల పతనంతో 23,501 వద్ద స్థిరపడింది. అధిక వెయిటేజీ భారతీ ఎయిర్ టెల్, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు (1%-0.50%) రాణించి నష్టాలను పరిమితం చేశాయి. ఐటీ, టెలికం, మెటల్, పవర్, విద్యుత్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.

- చివరి రోజు నాటికి డీఈఈ డెవలప్‌మెంట్ ఇంజినీర్స్ ఐపీఓ 99.56 రెట్లు సబ్‌స్క్రిప్షన్ సాధించింది. ఇష్యూలో భాగంగా కంపెనీ 1.49 కోట్ల ఈక్విటీలు జారీ చేయగా 148.78 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.
- ఆక్మే ఫిన్‌ట్రేడ్ పబ్లిక్ ఇష్యూ 55.12 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యింది. రూ.132 కోట్ల విలువైన 78.65 లక్షల షేర్లను అమ్మకానికి ఉంచగా, 43.35 కోట్ల షేర్లకు దరఖాస్తులు వచ్చాయి.
- విద్యా సంబంధ రుణాలందించే ఎన్‌బీఎఫ్‌సీ.. అవాన్స్ ఫైనాన్షియల్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. దీనికోసం క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. తద్వారా రూ. 3,500 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. కంపెనీలో అనుబంధ సంస్థ ఆలివ్ వైన్ ఇన్వెస్ట్‌మెంట్ ద్వారా పీఈ దిగ్గజం వార్‌బర్గ్ పింకస్ ఇన్వెస్ట్ చేసింది.

సాక్షి స్పోర్ట్స్



ఐటీఎఫ్ టోర్నీ సెమీస్‌లో సహజ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. అమెరికాలోని కన్సాస్ రాష్ట్రంలోని విచిటా సిటీలో ఈ టోర్నీ జరుగుతోంది. శుక్రవారం జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సహజ 6–1, 6–1తో ఒలీవియా లిన్సెర్ (పోలాండ్)పై విజయం సాధించింది. గంటా 44 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది.

బోపన్న జోడీ ఓటమి

సించ్ చాంపియన్‌షిప్ ఏటీపీ–500 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ రోహన్ బోపన్న (భారత్)–ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 6–7 (1/7), 6–7 (3/7)తో టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)–ఖచనోవ్ (రష్యా) జంట చేతిలో ఓడిపోయింది. బోపన్న–ఎబ్డెన్‌లకు 18,690 పౌండ్ల (రూ. 19 లక్షల 75 వేలు) ప్రైజ్‌మనీ, 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



సెల్ఫ్ గోల్‌తో ఓడిన ఇటలీ



గెల్‌సెన్‌కిర్చెన్ (జర్మనీ): యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ ఇటలీ జట్టుకు చుక్కెదురైంది. మాజీ విజేత స్పెయిన్‌తో శుక్రవారం జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో ఇటలీ 0–1 గోల్ తేడాతో ఓడిపోయింది. వరుసగా రెండో విజయంతో స్పెయిన్ జట్టు ప్రిక్వార్టర్ ఫైనల్ దశకు అర్హత సాధించింది. ఆట 55వ నిమిషంలో స్పెయిన్ ఫార్వర్డ్ అల్వారో మొరాటో హెడర్ షాట్‌ను ఇటలీ గోల్‌కీపర్ గియాన్లుగి డొనారుమా నిలువరించాడు. అయితే ఇటలీ గోల్‌కీపర్ నిలువరించిన బంతి ఇటలీ డిఫెండర్ రికార్డో కాలాఫియోరి కాలికి తగిలి తిరిగి గోల్‌పోస్ట్‌లోకి వెళ్లింది. దాంతో ఇటలీ సెల్ఫ్ గోల్‌తో స్పెయిన్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లి చివరిదాకా ఈ ఆధిక్యాన్ని కాపాడుకుంది. ఇతర మ్యాచ్‌ల్లో ఆస్ట్రియా 3–1తో పోలాండ్ జట్టుపై, ఉక్రెయిన్ 2–1తో స్లొవేకియాపై గెలిచాయి.

అర్జెంటీనా బోణీ


అల్వారెజ్

అట్లాంటా: కోపా అమెరికా కప్ ఫుట్‌బాల్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా జట్టు శుభారంభం చేసింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా శుక్రవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో మెస్సీ నాయకత్వంలోని అర్జెంటీనా 2–0 గోల్స్ తేడాతో కెనడా జట్టును ఓడించింది. అర్జెంటీనా తరఫున జూలియన్ అల్వారెజ్ (49వ ని.లో), లాటారో మార్టినెజ్ (88వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. మెస్సీ అందించిన పాస్‌లతో ఈ రెండు గోల్స్ నమోదయ్యాయి. ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగడం ద్వారా మెస్సీ వందేళ్లకంటే ఎక్కువ చరిత్ర ఉన్న కోపా అమెరికా కప్‌లో అత్యధికంగా 35 మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పాడు. ఇప్పటి వరకు ఈ రికార్డు చిలీకి చెందిన సెర్జియో లివింగ్‌స్టోన్ (1941 నుంచి 1953 వరకు; 34 మ్యాచ్‌లు) పేరిట ఉంది. ఈనెల 26న జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో మాజీ చాంపియన్ చిలీతో అర్జెంటీనా ఆడుతుంది.

సెమీఫైనల్ లక్ష్యంగా...

నేడు సూపర్-8లో భారత్ రెండో మ్యాచ్

- బంగ్లాదేశ్‌తో టీమిండియా పోరు
- రాత్రి గం.8 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం



నార్త్‌సౌండ్ (ఆంటిగ్వా): టి20 వరల్డ్ కప్‌లో ఓటమి లేకుండా అజేయంగా సాగుతున్న భారత్ సెమీఫైనల్ వేటలో మరో కీలక సమరానికి సిద్ధమైంది. సూపర్-8 దశలో భాగంగా గ్రూప్-1లో నేడు జరిగే పోరులో బంగ్లాదేశ్‌తో భారత్ తలపడుతుంది. తొలి మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్‌పై అలవోకగా నెగ్గిన టీమిండియా అమితోత్సాహంతో ఉండగా... తమ మొదటి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిన బంగ్లాదేశ్ తీవ్ర ఒత్తిడి మధ్య మరో మ్యాచ్ బరిలోకి దిగనుంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే సెమీఫైనల్‌కు చేరడం దాదాపు ఖాయమవుతుంది. మరోవైపు ఈ మ్యాచ్‌లోనూ ఓడితే బంగ్లాదేశ్ సెమీస్ ఆశలు గల్లంతవుతాయి. బలాబలాలు, ఫామ్‌ను బట్టి చూస్తే మరో సందేహం లేకుండా భారత జట్టే ఫేవరెట్‌గా కనిపిస్తోంది.

రోహిత్, కోహ్లి రాణిస్తే...

టోర్నీలో భారత్ ఆడిన నాలుగు మ్యాచ్‌లను బట్టి చూస్తే ఓపెనర్లు రోహిత్, కోహ్లిల బ్యాటింగ్‌పై మాత్రమే కాస్త ఆందోళన కనిపిస్తోంది. తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై రోహిత్ అర్ధ సెంచరీ చేసినా, తర్వాతి మూడు మ్యాచ్‌లలో విఫలమయ్యాడు. తొలి మూడు మ్యాచ్‌లలో విఫలమైన కోహ్లి...అఫ్గాన్‌పై 24 పరుగులు చేసినా అది అతని స్థాయికి తగిన ఇన్నింగ్స్ కాదు. ఈ నేపథ్యంలో బంగ్లాపై వీరిద్దరు చెలరేగాలని జట్టు కోరుకుంటోంది. శివమ్ దూబే కూడా ఆశించిన రీతిలో ఆడటం లేదు. మిడిలార్డర్‌లో లెఫ్ట్ హ్యాండర్‌గా ఏకైక ప్రత్యామ్నాయం కావడంతో అతనికి మరో అవకాశం దక్కవచ్చు. ఇది మినహా ఇతర అంశాల్లో జట్టు పటిష్టంగా ఉంది. సూర్యకుమార్, పంత్‌ల బ్యాటింగ్‌తో పాటు పాండ్యా కూడా దూకుడుగా ఆడటం భారత్‌కు సానుకూలాంశం. బౌలింగ్‌లో అఫ్గాన్‌పై కుల్దీప్ ఆకట్టుకున్న నేపథ్యంలో తుది జట్టులో ఎలాంటి మార్పు ఉండకపోవచ్చు.

అన్నింటా తడబాటు...

సూపర్-8కు చేరినా లీగ్ దశలోనూ బంగ్లాదేశ్ ఆట అంతంతమాత్రమే. ఆసీస్‌తో పోరులో కూడా అది కనిపించింది. టాపార్డర్‌లో ఒక్క దూకుడైన బ్యాటర్ కూడా లేకపోవడం జట్టు ప్రధాన బలహీనత. తౌహిద్ ఫర్వాలేదనిపించడం మినహా ప్రధాన బ్యాటర్లు తన్‌జీద్, దాస్, కెప్టెన్ నజ్ముల్ వరుసగా విఫలమయ్యారు. సీనియర్ మహ్ముదుల్లా కూడా ప్రభావం చూపలేదు. రికార్డు స్థాయిలో 9వ టి20 వరల్డ్ కప్ ఆడుతున్న షకీబ్ ఒక్క మ్యాచ్ మినహా బ్యాటింగ్‌లో పూర్తిగా విఫలమయ్యాడు. 4 ఇన్నింగ్స్‌లలో కలిపి 2 వికెట్లు తీశాడు. భారత్‌పై అతను ఏమైనా ఆకట్టుకోగలడా అనేది చూడాలి. బౌలర్లు ముస్తఫిజుర్, తన్‌జీమ్, తస్కీన్ నిలకడగా రాణించడం వల్లే బంగ్లా ఇక్కడి వరకు వచ్చింది. వీరు టీమిండియా స్టార్ బ్యాటర్లను ఎంత వరకు నిలువరిస్తారనేది ఆసక్తికరం.

టి20 ప్రపంచకప్‌లో నేడు
వెస్టిండీస్ X అమెరికా
వేదిక: బ్రిడ్జ్‌టౌన్; ఉదయం గం. 6 నుంచి
భారత్ X బంగ్లాదేశ్
వేదిక: నార్త్‌సౌండ్; రాత్రి గం. 8 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

దక్షిణాఫ్రికా సూపర్...

- ఇంగ్లండ్‌పై 7 పరుగులతో విజయం
- చెలరేగిన డికాక్, రాణించిన బౌలర్లు


డికాక్

గ్రాస్ ఐలెట్: టి20 వరల్డ్ కప్‌లో దక్షిణాఫ్రికా దాదాపు సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ తో శుక్రవారం చివరి వరకు ఆసక్తికరంగా సాగిన పోరులో దక్షిణాఫ్రికా 7 పరుగుల తేడాతో నెగ్గింది. తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఇప్పటికే అమెరికాను ఓడించింది. ఇంగ్లండ్‌పై విజయం సాధించింది. ముందుగా దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డికాక్ (38 బంతుల్లో 65; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేయగా, మిల్లర్ (28 బంతుల్లో 43; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. డికాక్ దూకుడుతో పవర్‌ప్లేలోనే 63 పరుగులు చేసిన సఫారీ టీమ్ ఆ తర్వాత తడబడింది. ఇంగ్లండ్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో తర్వాతి 84 బంతుల్లో 100 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆర్చర్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఇంగ్లండ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 156 పరుగులే చేయగలిగింది. హ్యారీ బ్రూక్ (37 బంతుల్లో 53; 7 ఫోర్లు), లివింగ్‌స్టోన్ (17 బంతుల్లో 33; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాడినా లాభం లేకపోయింది. వీరిద్దరు ఐదో వికెట్‌కు 42 బంతుల్లోనే 78 పరుగులు జోడించారు. 4 ఓవర్లలో ఇంగ్లండ్ 46 పరుగులు చేయాల్సి ఉండగా... బార్ట్‌మన్ ఓవర్లో ఏకంగా 21 పరుగులు వచ్చాయి. దాంతో సమీకరణం 18 బంతుల్లో 25గా మారింది. బ్రూక్, లివింగ్‌స్టోన్ క్రీజ్‌లో ఉండటంతో పాటు చేతిలో ఆరు వికెట్లు ఉండటంతో ఇంగ్లండ్ గెలిచే స్థితిలో నిలిచింది. అయితే దక్షిణాఫ్రికా బౌలర్లు రబాడ, జాన్సెన్, నోర్జే ఒక్కసారిగా ఆటను మార్చేశారు. తర్వాతి 3 ఓవర్లలో రెండు వికెట్లు తీసి 17 పరుగులే ఇచ్చారు. దాంతో ఇంగ్లండ్ ఓటమి ఖాయమైంది.

ఆసీస్ అదరహో

- 28 పరుగులతో బంగ్లాదేశ్‌పై గెలుపు
- ప్యాట్ కమిన్స్ 'హ్యాట్రిక్'


కమిన్స్

నార్త్ సౌండ్ (ఆంటిగ్వా): టి20 వరల్డ్ కప్ సూపర్-8 తొలి మ్యాచ్‌లో మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా చెలరేగింది. అన్ని విభాగాల్లో రాణించి బంగ్లాదేశ్‌ను ఓడించింది. శుక్రవారం జరిగిన గ్రూప్-2 పోరులో ఆసీస్ 28 పరుగుల తేడాతో (డక్‌వర్త్ లూయిస్ ప్రకారం) బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ (36 బంతుల్లో 41; 5 ఫోర్లు, 1 సిక్స్), తౌహిద్ హృదయ్ (28 బంతుల్లో 40; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. చివర్లో కమిన్స్ 'హ్యాట్రిక్'తో టీమ్ సాధారణ స్కోరుకు పరిమితమైంది. ఇన్నింగ్స్ 18వ ఓవర్లో ఐదో బంతికి మహ్ముదుల్లా (2), చివరి బంతికి మెహదీ హసన్ (0)లను అవుట్ చేసిన కమిన్స్... ఆ తర్వాత 20వ ఓవర్ తొలి బంతికి తౌహిద్‌ను వెనక్కి పంపి 'హ్యాట్రిక్' పూర్తి చేసుకున్నాడు. అనంతరం ఆస్ట్రేలియాకు వార్నర్ (35 బంతుల్లో 53 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), హెడ్ (21 బంతుల్లో 31; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడైన ఆరంభాన్నిచ్చారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 41 బంతుల్లోనే 65 పరుగులు జోడించారు. అనంతరం రిషాద్ తన వరుస ఓవర్లలో హెడ్, మార్ష్ (1)లను అవుట్ చేయగా...11.2 ఓవర్లు ముగిసేసరికి ఆసీస్ 2 వికెట్లు కోల్పోయి 100 పరుగులు సాధించింది. ఈ దశలో భారీ వర్షం కురిసింది. వాన ఆగకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను ఆ స్థితిలో ముగిస్తున్నట్లు ప్రకటించారు. డక్‌వర్త్ నిబంధనల ప్రకారం ఆ సమయానికి ఆసీస్ 72 పరుగులు చేస్తే సరిపోతుంది. కానీ అప్పటికే 28 పరుగులు ముందంజలో ఉన్న కంగారూ టీమ్ విజేతగా నిలిచింది.

7 టి20 ప్రపంచకప్ చరిత్రలో నమోదైన హ్యాట్రిక్‌ల సంఖ్య. బ్రెట్‌లీ (2007) తర్వాత ఈ ఘనత సాధించిన రెండో ఆస్ట్రేలియా బౌలర్‌గా కమిన్స్ నిలవగా... గతంలో కర్టిస్ కాంఫర్ (ఐర్లాండ్), హసరంగ (శ్రీలంక), రబాడ (దక్షిణాఫ్రికా), కార్తీక్ మెయప్పన్ (యూఏఈ), జోష్ లిటిల్ (ఐర్లాండ్) ఈ ఘనతను నమోదు చేశారు.

రెండు పతకాలపై ధీరజ్ గురి

వ్యక్తిగత, మిక్స్‌డ్ విభాగాల్లో ముందంజ



అంటాల్యా (టర్కీ): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-3 టోర్నీ పురుషుల రికర్వ్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్ రెండు పతకాల రేసులో నిలిచాడు. రికర్వ్ మిక్స్‌డ్ విభాగంలో భజన్ కౌర్‌తో కలిసి ధీరజ్ ఆదివారం కాంస్య పతకం కోసం పోటీపడనున్నాడు. దాంతోపాటు పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలోనూ ధీరజ్ సెమీఫైనల్ చేరుకున్నాడు. వ్యక్తిగత విభాగం క్వార్టర్ ఫైనల్లో ధీరజ్ 7–3 (28–29, 28–27, 29–29, 28–27, 30–27)తో వెటెర్ (జర్మనీ)పై గెలిచాడు. మిక్స్‌డ్ విభాగం సెమీఫైనల్లో ధీరజ్–భజన్ కౌర్ ద్వయం 3–5 (37–34, 36–38, 37–37, 36–38)తో జెన్ హన్‌యంగ్–లీ వూసియోక్ (కొరియా) జంట చేతిలో ఓడింది.

నవంబర్‌లో దక్షిణాఫ్రికాలో భారత్ పర్యటన

జొహన్నెస్‌బర్గ్: ఈ ఏడాది నవంబర్‌లో దక్షిణాఫ్రికాలో భారత పురుషుల క్రికెట్ జట్టు పర్యటించనుంది. ఈ పర్యటనలో భారత జట్టు దక్షిణాఫ్రికాతో నాలుగు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను ఆడుతుంది. నవంబర్ 8న డర్బన్‌లో జరిగే తొలి మ్యాచ్‌తో మొదలవుతుంది. ఆ తర్వాత పోర్ట్ ఎలిజబెత్‌లో 10న రెండో టి20, 13న సెంచూరియన్‌లో మూడో టి20, 15న జొహన్నెస్‌బర్గ్‌లో జరిగే చివరిదైన నాలుగో టి20తో పర్యటన ముగుస్తుంది.

డిఫాల్టర్ల జాబితాలో 157 వర్సిటీలు

ఏపీ నుంచి మూడు ప్రభుత్వ, రెండు ప్రైవేట్ వర్సిటీలు

సాక్షి, అమరావతి: విద్యార్థుల ఫిర్యాదులను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న విశ్వవిద్యాలయాలపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆగ్రహం వ్యక్తంచేసింది. దేశ వ్యాప్తంగా 157 వర్సిటీలను డిఫాల్టర్ల జాబితాలో చేర్చింది. యూజీసీ నిబంధనలను బేఖాతరు చేస్తూ అంబుడ్స్ పర్సన్లను నియమించడంలో విశ్వవిద్యాలయాలు విఫలమైనట్లు పేర్కొంది. ఇందులో 108 ప్రభుత్వ, రెండు డీమ్డ్, 47 ప్రైవేటు వర్సిటీలు ఉండటం గమనార్హం. గతంలో యూజీసీ–2023లో వర్సిటీల్లో అంబుడ్స్ పర్సన్‌ల నియామకాన్ని తప్పనిసరి చేసింది. ఆంధ్రప్రదేశ్ నుంచి మూడు ప్రభుత్వ, రెండు ప్రైవేట్ వర్సిటీలు డిఫాల్టర్లుగా ఉన్నాయి. ఏపీలో వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ విజయనగరం, శ్రీకృష్ణదేవరాయ వర్సిటీలతోపాటు మోహన్ బాబు వర్సిటీ, అపోలో వర్సిటీలున్నాయి.

రుషికొండ భవనాలు కొంటా

- అమ్మినా, లీజుకిచ్చినా పర్వాలేదు
- సీఎం చంద్రబాబుకు సుఖేశ్ చంద్రశేఖర్ లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖ రుషికొండలోని భవనాలు కొంటానంటూ మనీ లాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటూ జైలులో ఉన్న సుఖేశ్ చంద్రశేఖర్ ముందుకొచ్చారు. భవనాలు అమ్మినా, లీజుకిచ్చినా ఫర్వాలేదని చెప్పారు. మార్కెట్ విలువ కన్నా 20 శాతం అధికంగా ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. లేదంటే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరకైనా తాను సిద్ధమేనన్నారు. ఈ మేరకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు జైలు నుంచి సుఖేశ్ ఓ లేఖ రాశారు. లేఖలో ఏముందంటే.. ''నా అమ్మమ్మది విశాఖపట్నం. నా చిన్నతనంలో సెలవులకు వెళ్లినపుడు ఆమె బీచ్ తదితర ప్రాంతాలకు తీసుకెళ్లేవారు. ఆ సమయంలో కొండలతో ఎంతో ఆహ్లాదకరమైన దృశ్యాలు, పచ్చదనం కనువిందు చేసేది. అందువల్ల ఇప్పుడు ఆ ప్రాంతంలో నిర్మించిన భవనాలను అమ్మేందుకు లేదా లీజుకిచ్చేందుకు భవిష్యత్తులో ఏపీ ప్రభుత్వం ముందుకొస్తే దానికి నేను సిద్ధంగా ఉన్నా. ఆ ప్రాంతం నాకు, నా కుటుంబ సభ్యులకు ఎంతో ప్రత్యేకం. ప్రస్తుతం నేను పలు ఆరోపణలు ఎదుర్కొంటూ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నా. అయినప్పటికీ నా వ్యాపారాలు సజావుగానే సాగుతున్నాయి. చెన్నై, గోవా, దుబాయి, బార్సిలోనాలో హోటళ్లు విజయవంతంగా నడుస్తున్నాయి. మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చి, ఈ స్థాయికి చేరుకున్న నాకు రుషికొండలో భవనాలు కొనుక్కొనే అవకాశం వస్తే ఎంతో మంది యువతకు స్ఫూర్తి అవుతుంది. నా రాష్ట్రాభివృద్ధికి తోడ్పడే అవకాశం కల్పించాలని కోరుతున్నా'' అని సుఖేశ్ ఆ లేఖలో పేర్కొన్నారు.

రూ.8 కోట్ల విలువగల మాదకద్రవ్యాల పట్టివేత

సాక్షి, చెన్నై: తమిళనాడులోని తూత్తుకుడిలో రూ.8 కోట్ల విలువగల కెథమిటమైన్ అనే మాదకద్రవ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని, దంపతులను అరెస్టు చేశారు. తూత్తుకుడిలోని ఇనిగో నగర్‌లో ఉన్న ఓ ఇంట్లో మాదకద్రవ్యాలు ఉన్నట్టు అందిన సమాచారంతో శుక్రవారం పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో రూ.8 కోట్ల విలువగల మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుని, నిర్మల్‌రాజ్, శివానీ దంపతులను అరెస్ట్ చేశారు. వారిని విచారణ చేస్తున్నారు.

ఖరీదైన 'కల్యాణం'

దేశంలో పెరుగుతున్న కల్యాణం ఖర్చులు

- 2023లో సగటున రూ.28 లక్షలు వ్యయం
- ఒక్క ఏడాదిలోనే 12 శాతం పెరుగుదల
- ప్రపంచంలోనే రెండో అతిపెద్ద వివాహ పరిశ్రమగా భారత్
- అమెరికా, యూకేలతో పోలిస్తే ఎక్కువ మంది అతిథుల మధ్య వివాహాలు
- వెడ్డింగ్ వైర్ ఇండియా సర్వే-2024లో వెల్లడి
- భారతీయుల తలసరి ఆదాయం రూ.1.17 లక్షలు
- పెళ్లిళ్ల కోసం 12 సంవత్సరాల సంపాదన ఖర్చు
- దేశంలో తీసుకునే రుణాల్లో 20 శాతం పెళ్లిళ్ల కోసమే



సాక్షి, అమరావతి: భారత్‌లో వివాహాల ఖర్చు గణనీయంగా పెరుగుతోంది. అగ్ర ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే వివాహ పరిశ్రమ అతి పెద్దదిగా అవతరించింది. పెళ్లికి హాజరయ్యే అతిథుల సంఖ్యలోనూ భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. 2023లో ఒక పెళ్లి వేడుక నిర్వహించే సగటు ఖర్చు రూ.28 లక్షలకు చేరింది. ఇది 2022లో రూ.25 లక్షలు నుంచి గణనీయమైన పెరుగుదలను చూపిస్తోంది. కేవలం ఒక్క ఏడాదిలోనే 12 శాతం ఖర్చులు వృద్ధి చెందాయి. ది నాట్ వరల్డ్ వైడ్ అనుబంధ సంస్థ 'వెడ్డింగ్ వైర్ ఇండియా సర్వే-2024' ఈ విషయాల్ని వెల్లడించింది. ఈ క్రమంలోనే ప్రపంచవ్యాప్తంగా అమెరికా తర్వాత భారతీయ వివాహ పరిశ్రమ రెండో అతిపెద్ద మార్కెట్‌గా ఆవిర్భవించినట్టు పేర్కొంది. దేశంలో నాలుగో అతిపెద్ద పరిశ్రమగా గుర్తింపు పొందింది. వాస్తవానికి భారతీయుల తలసరి ఆదాయం రూ.1.17 లక్షలు. అంటే వారు దాదాపు 12 సంవత్సరాల సంపాదనను పెళ్లిళ్లకు ఖర్చు చేస్తున్నట్టు తెలుస్తోంది. భారతీయులు తీసుకునే రుణాల్లో 20 శాతం పెళ్లిళ్ల కోసమే కావడం గమనార్హం. 30 శాతం వివాహాలకు పూర్తిగా తల్లిదండ్రులు నిధులు సమకూరుస్తుండగా.. 70 శాతం తల్లిదండ్రులు, దంపతుల సహ నిధులతో నిర్వహిస్తున్నారు. ఐదింటిలో నాలుగు భారతీయ వివాహాలకు రుణాల ద్వారా నిధులు సమకూర్చుకుంటున్నట్టు ప్రభుత్వ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

పెళ్లి అతిథులూ ఎక్కువే

కోవిడ్–19 మహమ్మారి తర్వాత సన్నిహిత వేడుకలకు డిమాండ్ పెరిగింది. జంటలు వారి వ్యక్తిగత ప్రాధాన్యతలకు అనుగుణంగా సంప్రదాయాల్లో కొత్త హంగులు చేరుస్తున్నారు. 2023లో సగటు అతిథుల జాబితా పరిమాణం 326గా ఉంది. ఇది గతంతో పోలిస్తే 14 శాతం పెరగడం విశేషం. ఇదే అమెరికాలో అయితే 115, యూకేలో 80 మంది అతిథుల సమక్షంలో పెళ్లిళ్లు నిర్వహిస్తున్నారు. దేశంలో గడచిన ఏడాది 59 శాతం జంటలు భారీ అతిథుల మధ్య పెళ్లిళ్లు చేసుకోగా.. 12 శాతం మంది మాత్రమే కుటుంబ సభ్యుల మధ్య ఒక్కటయ్యారు. ముఖ్యంగా వివాహాలను శీతాకాలంలో నిశ్చయించుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఇందులో డిసెంబర్ అత్యంత ప్రజాదరణ పొందిన నెలగా కనిపిస్తోంది. ఆ తర్వాత స్థానంలో నవంబర్ నిలిచింది. హిందూ క్యాలెండర్ ప్రకారం గరిష్టంగా శుభప్రదమైన వివాహ తేదీలతోపాటు చాలా మెట్రోపాలిటన్ నగరాల్లో ఆహ్లాదకరమైన వాతావరణానికి నవంబర్‌ను ఎంపిక చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. టెక్ రంగంలో అభివృద్ధి సైతం ఈ విభిన్న సంస్కృతిలో వెడ్-టెక్ ప్లాట్‌ఫామ్ వివాహాల ఖర్చులను పెంచుతోంది.

వచ్చే 15 ఏళ్లలో 40 కోట్ల వివాహాలు

ప్రపంచంలో ప్రతి నాలుగు వివాహాల్లో ఒకటి భారత్‌లో జరుగుతోంది. గతేడాది వివాహ మార్కెట్ విలువ రూ.4.25 లక్షల కోట్లుగా నమోదైంది. అంటే 2022తో పోలిస్తే 13 శాతం ఆర్థిక భారం పెరిగింది. వచ్చే 15 ఏళ్లలో 40 కోట్ల వివాహాలు జరగనున్నట్టు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ సంఖ్య అమెరికాలోని జనాభా కంటే ఎక్కువగా ఉండటం విశేషం. పెళ్లిళ్లలో నగలు, దుస్తులు, ఇతర సామగ్రి కంటే ఎక్కువ మంది జంటలు ఆహారం, పానీయాలు సహా వైవిధ్య వంటకాలతో కూడిన మెనూలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. వీటికే పెళ్లిలో సగానికిపైగా ఖర్చు చేస్తుండటం గమనార్హం. ప్రత్యేక అలంకరణల మధ్య పెళ్లి వేడుకలు, సెలబ్రెటీలతో కార్యక్రమాలు వంటి కూడా ఎక్కువగా కనిపిస్తున్నాయి. హోటల్స్, వివిధ వ్యాపార వర్గాలకు పెళ్లి పరిశ్రమ ఊతం ఇస్తోంది.

10కోట్ల కొత్త ఇళ్లకు డిమాండ్

- వచ్చే పదేళ్లలో కొత్తగా రూ.75 లక్షల కోట్ల సంపద పెరుగుతుందని అంచనా
- ప్రపంచంలోనే ఇండియాలో అత్యధికంగా డిమాండ్
- కోవిడ్ తర్వాత 2023లో అత్యధికంగా 6 లక్షల ఇళ్ల నిర్మాణం

సాక్షి, అమరావతి: ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారతదేశంలో సొంతింటి నిర్మాణానికి భారీ డిమాండ్ ఏర్పడనుందని రియల్ ఎస్టేట్ సంస్థలు అంచనా వేస్తున్నాయి. వచ్చే పదేళ్లలో దేశవ్యాప్తంగా 10 కోట్లకు పైగా సొంత ఇంటి నిర్మాణాలకు డిమాండ్ ఏర్పడుతుందని అంచనా. దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతుండడం.. ఆ మేరకు కుటుంబ ఆదాయాలు భారీగా పెరగనుండడంతో సొంతింటి కల డిమాండ్ నెరవేరనుందని పేర్కొంటున్నాయి. వచ్చే 10 ఏళ్లలో 7 కోట్ల మంది ఆదాయం సొంతింటిని నిర్మించుకునే స్థాయికి చేరుకుంటుందని, మరో 3 కోట్ల మంది ప్రస్తుతం వారు నివాసముంటున్న అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్స్ నుంచి అప్‌గ్రేడ్ అవుతారని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ సంస్థ నైట్ ఫ్రాంక్ అంచనా వేసింది. వచ్చే పదేళ్ల కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థలో అదనంగా రూ.75 లక్షల కోట్ల సంపద సమకూరుతుందని, దీనికి అనుగుణంగా సొంతింటికి భారీ డిమాండ్ పెరుగుతుందని పేర్కొంది.

మరో దశాబ్దం పాటు డిమాండ్

కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న దక్షిణాసియా రియల్ ఎస్టేట్ మార్కెట్ కోవిడ్ సంక్షోభం తర్వాత పురోగమన దిశగా అడుగులు వేస్తోంది. గడచిన 15 ఏళ్లలో లేనంతగా 2023 సంవత్సరంలో 6,00,000 సొంతింటి నిర్మాణాలు జరిగాయని పేర్కొంది. రియల్ ఎస్టేట్ మార్కెట్ ఎప్పుడూ 15 సంవత్సరాలు వృద్ధిబాటలో మరో 15 ఏళ్లు సద్దుబాటు ధోరణిలో కొనసాగుతుందని, గడిచిన నాలుగేళ్ల నుంచి మార్కెట్ రికవరీ బాటలో ప్రయాణిస్తుండడంతో మరో 11 ఏళ్లపాటు రియల్ ఎస్టేట్ మార్కెట్ బాగుంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గడిచిన ఏడాది ఎన్ఎస్ఈ నిఫ్టీ రియల్టీ ఇండెక్స్ 40 శాతం పెరగడం, ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ డీఎల్ఎఫ్ షేరు 43 శాతం పెరగడం దీనికి నిదర్శనమంటున్నాయి. ఇప్పటికే వడ్డీ రేట్లు గరిష్ట స్థాయికి చేరుకున్నాయని, రానున్న కాలంలో వడ్డీరేట్లు తగ్గే అవకాశం ఉండడంతో సొంతింటి అమ్మకాలు పెరుగుతాయంటున్నారు.

ఫేస్ 'బుక్' అవుతున్నారు

స్టాక్ ఎక్స్ఛేంజ్ పెట్టుబడుల పేరుతో ఫేస్‌బుక్ నకిలీ యాడ్స్

సాక్షి, హైదరాబాద్: తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభాలు అంటూ ఊదరగొట్టే యాడ్స్‌ను చూసి చాలా మంది అమాయకులు సైబర్ నేరగాళ్ల వలకు చిక్కుతున్నారు. ఇటీవల కాలంలో ఈ ఫేస్‌బుక్ యాడ్స్‌లో ఉన్నవన్నీ నిజాలనుకుని మోసపోతున్న ఘటనలు పెరుగుతున్నాయని సైబర్ క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు. స్టాక్‌మారెక్ట్‌లో తక్కువ కాలంలోనే ఎన్నో రెట్ల లాభాలు పొందవచ్చని సైబర్ నేరగాళ్లు మోసపూరిత యాడ్స్‌ను పెడుతున్నట్లు తెలిపారు. ఈ ప్రకటనల్లోని నంబర్లు, లింక్‌లను నమ్మవద్దని వారు వారించారు. తమ ప్రకటనల్లో సైబర్ నేరగాళ్లు పెట్టుబడుల కోసం కొన్ని ఫేక్ యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచిస్తున్నారని, వాటిలో వర్చువల్‌గా లాభాలు చూపుతూ, సైబర్ నేరగాళ్లు డబ్బు కొల్లగొడుతున్నట్లు హెచ్చరించారు. సెబీ కూడా ఈ తరహా మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పెట్టుబడిదారులను ఇటీవల హెచ్చరించింది. సైబర్ నేరగాళ్లు కొందరు సెబీ అనుమతి ఉందంటూ తమ ప్రకటనల్లో చెబుతూ, నకిలీ నంబర్లు ఇస్తున్నారని తెలిపింది. బీఎస్ఈ వెబ్‌సైట్‌లోకి వెళ్లి రిజిస్టర్డ్ ట్రేడర్స్ నంబర్ అవునా? కాదా? అన్నది పరిశీలించిన తర్వాతే పెట్టుబడులు పెట్టాలని అధికారులు సూచించారు.

గిరిజన మహిళల ఆరోగ్యంపై నివేదిక

- జాతీయస్థాయి సదస్సులో సమర్పించిన ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి



జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మతో ఏపీ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి

సాక్షి, అమరావతి: గిరిజన ప్రాంతాల మహిళల సమస్యలపై 2024–2025 యాక్షన్ ప్లాన్‌లో భాగంగా జాతీయ మహిళా కమిషన్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ నివేదిక సమర్పించింది. మహిళల సంక్షేమం, భద్రత, ప్రభుత్వ విధానాలు, మహిళా కమిషన్ల కార్యాచరణపై జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో హరియాణలో నిర్వహించిన రెండ్రోజుల జాతీయస్థాయి సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. దేశ వ్యాప్తంగా 16 రాష్ట్రాల నుంచి మహిళా కమిషన్ చైర్ పర్సన్లు, సభ్యులు హాజరైన ఈ జాతీయస్థాయి సమావేశంలో ఏపీ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి నివేదికను సమర్పించారు. ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన ప్రాంత మహిళల హక్కులు, అక్షరాస్యత, ఆరోగ్యం, ఆర్థిక, సామాజిక అవగాహన కార్యక్రమాలు, అనాదిగా కొనసాగుతున్న అనాగరిక ఆచార పద్ధతులపై పలు అంశాలను ఆ నివేదికలో వివరించారు. వెంకటలక్ష్మి మాట్లాడుతూ వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల్లో మహిళలను లక్ష్యంగా చేసుకుని మాతంగి, బసివిని, జోగిని వంటి అనాగరిక ఆచారాలతో తలెత్తే సమస్యలే పెద్ద సవాల్‌గా మారాయన్నారు. ఈ నివేదికపై జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రేఖాశర్మ స్పందిస్తూ ఒక్క ఏపీలోనే కాకుండా అన్ని రాష్ట్రాల గిరిజన ప్రాంతాల్లో మహిళా కమిషన్ల సందర్శనతో పాటు అక్కడ మహిళా సమస్యలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇందుకు జాతీయ మహిళా కమిషన్ తరఫున కొంత నిధిని కేటాయించి రాష్ట్ర కమిషన్లతో ఉమ్మడి కార్యక్రమాలకు ప్రణాళిక సిద్ధం చేస్తామని తీర్మానం చేశారు. పనిప్రాంతం (వర్క్‌ప్లేస్)లో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం మరియు పరిష్కారం) చట్టం–2013 కింద ఏర్పాటు చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేసేలా అధికారులను ఆదేశించాలని చైర్‌పర్సన్ రేఖా శర్మ అన్ని రాష్ట్రాల మహిళా కమిషన్ల చైర్ పర్సన్‌లకు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు ఆదేశాలిచ్చారు. కమిషన్ కార్యదర్శి విద్యాపురపు వసంత బాల పాల్గొన్నారు.

శ్రీ సిటీని సందర్శించిన సీఐఐ సభ్యులు




శ్రీ సిటీలో సీఐఐ సభ్యుల బృందం

శ్రీ సిటీ (వరదయ్యపాళ్యం): ఆంధ్రప్రదేశ్ విజయవాడ జోన్‌కు చెందిన 16 మంది భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సభ్యుల బృందం 2 రోజులు (గురువారం, శుక్రవారం) శ్రీ సిటీని సందర్శించి, ఇక్కడ తయారీ పరిశ్రమల్లోని సాంకేతిక నైపుణ్యాలను అధ్యయనం చేసింది. శ్రీ సిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్ వారికి స్వాగతం పలికి, శ్రీ సిటీ ప్రగతి, ప్రత్యేకతలతో పాటు 'మేక్ ఇన్ ఇండియా' చొరవతో శ్రీ సిటీ దేశంలోని ప్రధాన పారిశ్రామిక పార్కుల్లో ఒకటిగా ఎలా మారిందో వివరించారు. శ్రీ సిటీలోని కొన్ని ముఖ్య పరిశ్రమలను అమలుచేసే ఉత్తమ పద్ధతులను, సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకోవడం, అధ్యయనం చేయడం, ప్రధాన లక్ష్యంగా సీఐఐ సభ్యుల బృందం పర్యటన సాగింది. హావెల్స్, ఆల్‌స్టమ్, డైకీ అల్యూమినియం, డానిలి పరిశ్రమల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక చర్చా కార్యక్రమాల్లో పాల్గొని కంపెనీల సాంకేతిక నైపుణ్యాల, తయారీ విధానాలను తెలుసుకున్నారు. ఈ బృందానికి సీఐఐ విజయవాడ జోన్ చైర్మన్ డీవీ రవీంద్రనాథ్, వైస్ చైర్మన్ డాక్టర్ వి.నాగలక్ష్మి, నాయకత్వం వహించారు. రాష్ట్రంలో సీఐఐ సభ్యత్వం కలిగిన తయారీ పరిశ్రమల అధికారులు పాల్గొన్నారు.

'పని'పెట్టే పది దేశాలు

రోజుకు ఎనిమిది గంటలు, వారానికి ఆరు రోజు లు.. ఉద్యోగాల్లో పని గంటలపై సాధారణ లెక్క ఇది. ఇందులో రోజుకు తొమ్మిది గంటలు, వారానికి ఐదు రోజులే పని.. మిగతా రెండ్రోజులు వీకాఫ్స్ అనే విధానం కూడా అమల్లోకి వచ్చి చాలా కాలమైంది. అసలు వారంలో నాలుగు రోజులే డ్యూటీ ఉంటే బాగుంటుందనే ట్రెండ్ ఈ మధ్య మొదలైంది. రోజుల లెక్క ఎలా ఉన్నా.. వారమంతా కలిపి ఎన్ని గంటల పాటు 'పని'చేయించుకుంటున్నారనే లెక్క మాత్రం పక్కా. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) ఇలా ఎక్కువ పని గంటలు ఉన్న దేశాల జాబితాను రూపొందించింది. వీకాఫ్‌లు, క్యాజువల్, సిక్ లీవులు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ లెక్క వేసింది. మరి ప్రపంచంలో సగటున ఎక్కువ పని గంటలు అమల్లో ఉన్న టాప్–10 దేశాలేవో చూద్దామా..



ధరలు ఘనం... దిగుబడి శూన్యం!

టమాటాల స్టాకు లేక వెలవెలబోతున్న మండీలు

- విభిన్న వాతావరణంతో తగ్గిన టమాటా సాగు
- మార్కెట్లో కిలో టమాటా రూ.80 నుంచి రూ.90
- ఈ ఏడాదిలో ఇవే అత్యధిక ధరలు



గుర్రంకొండ: ధరలు ఘనం దిగుబడి శూన్యంగా మారింది టామాట రైతుల పరిస్థితి. మొన్నటి వరకు దిగుబడి ఎక్కువగా ఉండగా ధరలు బాగున్నాయి. టమాట ధరలు ఘనంగా ఉన్నా ఓ వైపు ఎండలు మరో వైపు వర్షాభావంతో నెల కొన్న విభిన్న వాతావరణంతో తోటలు దెబ్బతిని దిగుబడి పూర్తిగా తగ్గిపోయిది. దీంతో మార్కెట్లో టమాటాల స్టాకు లేక మండీలు వెలవెలబోతున్నాయి. నెల రోజుల క్రితం వరకు అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా మార్కెట్ యార్డుల్లో స్టాకు ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం మార్కెట్లో ధరలు పుంజుకున్నా దిగుబడి మాత్రం పూర్తిగా తగ్గిపోయింది. మార్కెట్లో కిలో టమాటా ధరలు రూ.80 నుంచి రూ.90 వరకు పలుకుతున్నాయి. ఈ ఏడాదిలో ఈ ధరలే అత్యధికం కావడం గమనార్హం.

845 నుంచి 420కు పడిపోయిన దిగుబడి

జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా మండీలకు వస్తున్న టమాటాల స్టాకు సగానికి పైగా పడిపోయింది. వారంరోజుల క్రితం జిల్లా వ్యాప్తంగా 845 మెట్రిక్ టన్నుల టమాటాల స్టాకు మండీలకు వచ్చేది. ప్రస్తుతం 420 మెట్రిక్ టన్నుల టమాటాల స్టాకు మాత్రమే మండీలకు వస్తోంది. ఈ ఏడాది వరుసగా కురిసిన వర్షాలతో రైతులు భారీగా నష్టపోయారు. వర్షాలతో టమాటా తోటలు బాగా దెబ్బతిన్నాయి. దీంతో గతంలో ఎన్నడూ లేనంతగా టమాటా పంట దిగుబడి ఈనెలలో అత్యల్పంగా వస్తోంది. గత ఏడాది ఇదే సీజన్‌లో అత్యధికంగా 1250 టన్నుల టమాటా పంట దిగుబడి వచ్చింది. ఈ ఏడాది ఈ సీజన్‌లో అత్యల్పంగా కేవలం 420 టన్నుల టమాటా పంట దిగుబడి వస్తుండడం గమనార్హం.

ఈ ఏడాదిలో ఇవే అత్యధిక ధరలు

జిల్లాలో ఈ ఏడాది టమాటా ధరలు అత్యధికంగా పలుకుతుండడం ఇదే మొదటిసారి. ఈ ఏడాదిలో అత్యధికంగా ఇప్పటి వరకు రూ. 900లోపే టమాటా ధర మార్కెట్లో పలికింది. 15 రోజుల క్రితం 30 కేజీల టమాటా క్రేట్ ధరలు అత్యధికంగా రూ.800 లోపే ఉన్నాయి. అయితే గత వారం రోజులుగా టమటా ధరలు నిలకడగా ఉన్నాయి. ప్రస్తుతం ఒక క్రేట్ ధర రూ.1900 నుంచి రూ.2100 వరకు పలుకుతున్నాయి. కొన్ని రోజులుగా మార్కెట్లో టమాటా ధలు హెచ్చుతగ్గులు లేకుండా ఇవే ధరలు నిలకడగా ఉండడంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

విభిన్న వాతావరణంతో దెబ్బతిన్న తోటలు

ప్రస్తుతం గత నెల రోజులుగా జిల్లాలో విభిన్న వాతావరణం కారణంగా టమాటా తోటలు భారీగా దెబ్బతిన్నాయి. ఓ వైపు మండే ఎండలు, మరోవైపు భారీ వర్షాలతో ఎన్నడూ లేని విధంగా విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం నుంచి ఉక్కబోతతో కూడిన ఎండలు, మధ్యాహ్నం లేదా సాయంకాలం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో టమాటా తోటలు దెబ్బతిని పంట దిగుబడి దారుణంగా పడిపోయింది. తోటల్లో ఉన్న కాయలు దెబ్బతింటున్నాయి. ఎన్ని రసాయనిక, సేంద్రియ మందులు పంటలపై పిచికారీ చేస్తున్నా కాయల సైజు రావడం లేదు. దీంతో కాయల సైజు భారీగా దెబ్బతిని గోలీలుగా మారుతున్నాయి. కాగా తోటల్లో పంటకు ఉన్న పూత పిందెలు విచిత్ర వాతావరణ ప్రభావంతో రాలిపోయి తోటలు దెబ్బతింటున్నాయి.

నిలిచిపోయిన ఎగుమతులు

జిల్లాలోని అన్ని మార్కెట్ యార్డుల పరిధిలోని మండీల నుంచి గత నెల వరకు ప్రతిరోజు 185 నుంచి 225 లారీల టమాటాలు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అయ్యేవి. రాష్ట్రంలోని నరసరావుపేట, మార్కాపురం, గుంటూరు, బద్వేలు, ప్రొద్దుటూరుతోపాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఇక్కడి టమాటాలు ఎగుమతి అయ్యేవి. వీటితో పాటు ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, కలకత్తా, బీహార్ రాష్ట్రాలకు ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసి టమాటాలను తరలించేవారు. అయితే నేడు 74 నుంచి 85 వాహనాల్లో మాత్రమే టమాటాలు బయట ప్రాంతాలకు వెళుతున్నాయి. ముఖ్యంగా మన రాష్ట్రంతో పాటు తమిళనాడులోని కొన్ని ప్రాంతాలకు మాత్రమే ప్రస్తుతం టమాటాలను వాహనాల ద్వారా పంపిస్తున్నారు. వాతావరణం కారణంగా టమాటాల స్టాకు పూర్తిగా తగ్గిపోవడంతో బయట రాష్ట్రాలకు ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి.

మూతపడ్డ మండీలు

టమాటాల స్టాకు లేక జిల్లాలోని టమాటా మండీలు చాలావరకు మూతపడ్డాయి. జిల్లా వ్యాప్తంగా మార్కెట్ యార్డుల్లో మొత్తం 445 మండీలు ఉన్నాయి. గత నెల వరకు 345 మండీలను నిర్వహించేవారు. ప్రస్తుతం కేవలం 215 మండీలు మాత్రమే నిర్వహిస్తున్నారు. మిగిలిన మండీలన్ని మూతపడ్డాయి. పంట దిగుబడి లేకపోవడంతోపాటు మండీలకు స్టాకు రాకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి ఇంకా కొన్ని రోజులుగా ఇలాగే ఉండే అవకాశముందని వ్యాపార వర్గాలు అంటున్నాయి.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenahalli, Hoskote Taluk, Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22,Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా

అవినీతిలో నా పాత్ర శూన్యం



మాట్లాడుతున్న బసన గౌడ దద్దల్

రాయచూరు రూరల్: మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన రూ.187 కోట్ల అవినీతిలో తన పాత్ర ఏమీ లేదని గ్రామీణ శాసన సభ్యుడు బసనగౌడ దద్దల్ వెల్లడించారు. శుక్రవారం పాత్రికేయులతో ఆయన మాట్లాడారు. మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన నిధుల దుర్వినియోగంపై సిట్ అధికారులు సమగ్ర విచారణను జరుపుతున్నట్లు వివరించారు.

కేంద్ర మంత్రితో భేటీ



కేంద్ర మంత్రిని కలిసిన వెంకటరెడ్డి

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలో ఫుడ్ హబ్ పార్క్‌ను స్థాపించడానికి చర్యలు చేపట్టాలని లోక్ జనశక్తి పార్టీ రాష్ట్రాధ్యక్షుడు వెంకటరెడ్డి కేంద్ర ఆహార సంస్కరణల పరిశ్రమల శాఖా మంత్రి చిరాగ్ పాశ్వాన్‌కు విన్న వించారు. ఆయన న్యూఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి చర్చించారు. రాయచూరు, యాదగిరి జిల్లాల్లో ఫుడ్ పార్కును ప్రారంభిస్తే వలసలను నివారించవచ్చని తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడిని తొలగించాలని ధర్నా



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు

రాయచూరు రూరల్: జిల్లాలోని లింగసూగూరు తాలూకాలో ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించాలని గత రెండు రోజుల నుంచి పాఠశాల ముందు ధర్నా చేపట్టారు. శుక్రవారం ప్రభుత్వ హైస్కూలు ముందు ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేసిన కార్యక్రమంలో సంచాలకుడు రమేష్ మాట్లాడారు. యలగట్ట ప్రభుత్వ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు నాగనగౌడ పాఠశాలకు గైర్హాజరు అవుతున్నారని ఆరోపించారు. గత మూడు నెలల నుంచి విధులకు గైర్హాజరైన నాగనగౌడను సస్పెండ్ చేయాలని కోరుతూ జిల్లా, తాలుకా విద్యాశాఖాధికారులకు వినతిపత్రం సమర్పించారు.

ఘనంగా జన్మదిన వేడుక



గాలి సోమశేఖరరెడ్డి పుట్టిన రోజు వేడుక నిర్వహించిన దృశ్యం

సాక్షి,బళ్లారి: నగర మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి జన్మదిన వేడుక ఘనంగా జరిగింది. జూన్ 21న ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని నగరంలో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, బ్యానర్లు వేయడంతో పాటు వివిధ కాలనీల్లో కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. గాలి సోమశేఖరరెడ్డి ప్రతి ఏటా మాదిరిగానే ముందు రోజు గురువారం రాత్రి తన ఇష్టదైవమైన కసాపురం ఆంజనేయ స్వామి సన్నిధికి చేరుకుని అక్కడే బస చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, బళ్లారికి చేరుకున్న తర్వాత కనక దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం తన నివాస గృహం వద్ద అభిమానులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి ఆనందోత్సవాలతో సంబరాలు చేసుకున్నారు. నగర ప్రముఖులు, అన్ని రాజకీయ పార్టీల ప్రముఖులు, కార్పొరేటర్లు, పలువురు అధికారులు ఆయన నివాస గృహానికి చేరుకుని పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

పర్యావరణంతో మమేకం కావాలి

హుబ్లీ: 30 వేల సంవత్సరాల క్రితం నుంచే నాగరికత ప్రారంభమై దశల వారీగా వికసించిందని సీనియర్ పర్యావరణ వేత డాక్టర్ సంజీవ్ కులకర్ణి ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని అన్వేషణ కూటమి ఆధ్వర్యంలో సాధనకేరి చైత్ర మీటింగ్ హాల్‌లో నిర్వహించిన మట్టి నుంచి దూరం, ఆరోగ్యం నుంచి దూరం అనే విషయంపై ఆయన ప్రత్యేకంగా ప్రసంగించారు. పెంటతో నిర్మించుకున్న చిన్న చిన్న ఇళ్లలోనే సుఖమయమైన జీవితాన్ని అనుభవించిన నాటి మనుషులు ప్రస్తుతం మేమే టైల్స్, కాంక్రీట్‌లతో అంతస్తుల భవనాలను నిర్మించుకున్నా ఆనాటి సుఖ శాంతులు నేడు కరువయ్యాయన్నారు. మట్టితోనే అవినాభావ సంబంధాన్ని కోల్పోతున్నామన్నారు. ప్రస్తుతం అరికాళ్లకు కూడా మట్టి అంటకుండా బతుకు సాగిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆధ్వాన దశలో జీవనశైలిలో పర్యావరణంతో మమేకమై తగిన మార్పులతో మనుగడ సాగించడం మంచిదని మరో పర్యావరణవేత్త డాక్టర్ ప్రకాష్ భట్ తెలిపారు. కూటమి అధ్యక్షులు నరసింహా పరంజపే, వెంకటేష్ దేశాయి, అనిల్ కాకండకి, ప్రొఫెసర్ దుష్యంత్ నాడగౌడ, అనంతసిద్దేశ్వర, సత్య ధీరకట్టి, శ్రీధర్ గాంవకర్ పాల్గొన్నారు.



ప్రపంచ యోగా దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య



యోగా సాధనలో సీఎం సిద్దరామయ్య, స్వామీజీ తదితరులు



రాయచూరులో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

యోగా ..ఆరోగ్యానికి మంచిదేగా

- ఒత్తిడి నివారణకు యోగా అనివార్యం
- ప్రపంచ యోగా దినోత్సవంలో వక్తలు

సాక్షి,బళ్లారి: బళ్లారి జిల్లాలోని జిందాల్ స్టీల్ కర్మాగారం విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన యోగా శిబిరంలో సీఎం సిద్దరామయ్య పాల్గొని యోగా చేశారు. మంత్రి సంతోష్‌లాడ్, జిల్లాధికారి తదితరులు శిబిరంలో వివిధ ఆసనాలు, ప్రాణాయామాలు చేశారు. దైనందిన జీవితంలో యోగా తప్పనిసరని గురువులు సూచించారు.

రాయచూరు రూరల్ : యోగా, ధ్యానంతో మనిషికి ఆయు వృద్ధి చెందుతుందని, ప్రతి ఒక్కరూ నిరంతరం యోగా, ధ్యానం చేయాలని ఆర్టీఏ అధ్యక్షుడు రాజశేఖర్ రామస్వామి సూచించారు. శుక్రవారం మహాత్మా గాంధీ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ప్రపంచ యోగా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి రోజుల్లో పిల్లలు, పెద్దలు ఎండ, వానలోకి వెళ్లాలంటే భయపడుతున్నారన్నారు. గొడుగు పట్టడం, క్యాప్ ధరించడం లేదా వర్షం పడని చోటకు పరుగున వెళ్లి రక్షించుకోవడం చేస్తున్నారన్నారు. వర్షపు నీరు ఎంతో శ్రేష్టమైనవని, వాటి వల్ల శరీరంపై భాగంలో ఉన్న చర్మానికి మంచిదన్నారు. యోగాసనాలు చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండేందుకు వీలవుతుందన్నారు. శిబిరంలో అదనపు జిల్లాధికారి దురుగేష్, జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండే, జిల్లా ఆయుష్ అధికారి శంకర గౌడ పాటిల్, విద్యాశాఖాధికారులు బడిగేర్, చంద్రశేఖర్, తిమ్మప్పలున్నారు.

హొసపేటెలో..

హొసపేటె: టీబీ డ్యాం పీఎల్‌సీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు యోగాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యం బాగుంటే ఏదైనా సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి రోజూ యోగా సాధన చేయాలన్నారు. రోజూ యోగా, ధాన్యం, ప్రాణాయామం చేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

హుబ్లీ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జంట నగరాలతో పాటు జిల్లాలోని అన్ని తాలూకా కేంద్రాల్లో విద్యాసంస్థలు, సంఘ సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం వివిధ యోగాసనాల ద్వారా ఘనంగా ఆచరించారు. కార్పొరేషన్ పరిధిలో కొన్ని చోట్ల ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రధాని మోదీ పాల్గొనే కార్యక్రమాన్ని ప్రత్యేక ప్రసారంతో పాటు యోగాదినోత్సవాన్ని ఆచరించారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత యోగా గురువు, శిక్షకులు పాల్గొని యోగాభ్యాసాలను ప్రజలకు నేర్పించారు. స్థానిక నృపతుంగ బెట్ట తదితర చోట్ల ఉదయం 6.30 గంటలకు స్థానిక ఎమ్మెల్యే మహేష్ టెంగినకాయి నేతృత్వంలో దినోత్సవాన్ని ఆచరించారు. ఈ కార్యక్రమాల్లో మహిళలు, యువకులు, ప్రముఖులు యోగా శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు. నృపతుంగ బెట్ట వద్ద హుబ్లీ పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ఈ సాయంత్రం కూడా ఉచిత సామూహిక ధ్యానం, ప్రత్యేక వర్క్‌షాపును ఏర్పాటు చేశారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ విశాలాక్షి ఎస్.ఆకళవాడి నేతృత్వంలో సాయంత్రం ప్రత్యేక వర్క్‌షాపు నిర్వహించారు. మొత్తానికి జంట నగరాలలోనే కాకుండా తాలూకాలోని నవలగుంద, కుందగోళ, కలఘటిగి తదితర ప్రాంతాల్లో అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని ప్రజలు, ప్రముఖులు కలిసి ఘనంగా జరుపుకున్నారు.

కోలారులో...

కోలారు: యోగాతో ఉత్తమ ఆరోగ్యం కలుగుతుందని లోక్‌సభ సభ్యుడు ఎం.మల్లేష్‌బాబు తెలిపారు. ఆయన శుక్రవారం నగరంలోని విశ్వేశరయ్య స్టేడియంలో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ రాకతో నేడు యోగా విశ్వవ్యాప్తమైందన్నారు. నరేంద్ర మోదీ యోగాను దేశానికి మాత్రమే కాదు యావత్ ప్రపంచానికి పరిచయం చేశారన్నారు. యోగా మహత్యాన్ని తెలుసుకున్న ప్రపంచ దేశాలు అన్నీ నేడు యోగా వైపు మొగ్గు చూపుతున్నాయన్నారు. విద్యార్థి దశ నుంచే యోగాను పాటించడం ద్వారా మానవులు అనేక రోగాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. నిరంతర ఒత్తిడి మధ్య జీవిస్తున్న వారికి యోగా దివ్యౌషధం అన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం యోగా చేయడం ద్వారా ఒత్తిడి నుంచి దూరం కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇంచర గోవిందరాజులు, సమాజ సేవకుడు సీఎంఆర్ శ్రీనాథ్, తహసీల్దార్ హర్షవర్ధన్, నగరసభ కమిషనర్ శివానంద, జిల్లా ఆస్పత్రి సర్జన్ డాక్టర్ విజయకుమార్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.

మాలూరులో...

మాలూరు : యోగాతో రోగాలు దూరమై ఉత్తమ ఆరోగ్యం కలుగుతుందని ఎమ్మెల్యే కె వై నంజేగౌడ తెలిపారు. శుక్రవారం నగరంలోని హోండా స్టేడియంలో నిర్వహించిన విశ్వ యోగా దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. నిత్యం యోగా చేయడం ద్వారా మానవుడు ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. అందుకే నేడు యోగా విశ్వ వ్యాప్తమైందన్నారు. యోగా మనసు, దేహాన్ని సుస్థితిలో ఉంచుతుందన్నారు. ఈ మధ్య మానవుడు అనేక ఒత్తిళ్ల మధ్య జీవిస్తున్నాడన్నారు. ఒత్తిడి నుంచి దూరం కావడానికి యోగా ఒక్కటే మార్గమన్నారు. ప్రతినిత్యం యోగా చేయడం ద్వారా ఆరోగ్యవంతంగా జీవించవచ్చన్నారు. తహసీల్దార్ కె రమేష్, పురసభ ముఖ్యాధికారి ప్రదీప్ కుమార్, టీపీ ఈఓ కృష్ణప్ప, బీఈఓ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

కేజీఎఫ్‌లో...

కేజీఎఫ్: ఒత్తిడి నుంచి దూరం కావడానికి నేడు యోగా అనివార్యమని న్యాయమూర్తి గణపతి గురుసిద్ధ బాదామి తెలిపారు. శుక్రవారం విశ్వ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పతంజలి యోగా కేంద్రం ఆధ్వర్యంలో నగరంలోని మునిసిపల్ మైదానంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. యోగా మనసు, దేహాన్ని సుస్థితిలో ఉంచుతుందన్నారు. నేడు అనేక ఒత్తిళ్ల మధ్య జీవిస్తున్న మానవుడికి దీని నుంచి దూరం కావడానికి యోగా ఒక్కటే మార్గమన్నారు. ప్రతినిత్యం యోగా చేయడం ద్వారా ఆరోగ్యకర జీవితం అలవడుతుందన్నారు. ఈ సందర్భంగా కేజీఎఫ్ న్యాయమూర్తులు ముజఫర్ ఎ మాంజరి, వినోద్ కుమార్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రాజగోపాలగౌడ తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు సాధన చేస్తున్న విద్యార్థులు



హొసపేటెలో యోగా ప్రదర్శిస్తున్న విద్యార్థులు



రాయచూరులో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

రక్షిత నీటిని అందించండి



మాట్లాడుతున్న డాక్టర్ త్రిలోక్‌చంద్ర

బళ్లారిఅర్బన్: జిల్లాలోని అన్ని జీపీల పరిధిలో సమర్థవంతంగా క్లోరినేషన్‌తో కూడిన రక్షిత మంచినీటి సరఫరాకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి డాక్టర్ కేవీ త్రిలోక్‌చంద్ర టీపీ ఈఓలకు సూచించారు. నగరంలోని జెడ్పీ సభాంగణంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రగతి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే వర్షాలు ప్రారంభమైనందున అంటువ్యాధులను అరికట్టే దిశగా ప్రజలకు తాగునీటిని కాచి వడబోసి చల్లార్చుకుని తాగేలా అవగాహన కల్పించాలన్నారు. తరచుగా నీటి నిల్వ కేంద్రాలను పరిశుభ్రం చేయడం, నీటి నమూనాలను పరీక్షించడం చేసిన తర్వాతే సదరు నీటిని ప్రజలకు అందించాలన్నారు. జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జెడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప సంకనూరు, సంబంధిత అధికారులతో పాటు డిప్యూటీ, అటవీ సంరక్షణ అధికారి సందీప్ సూర్యవంశీ, ఏసీ హేమంత్‌తో పాటు టీపీ ఈఓ పాల్గొన్నారు.

పెట్రో ధరలు తగ్గించాలి

రాయచూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలంటూ బీజేపీ నేతలు ఆందోళన చేపట్టారు. గురువారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద చేపట్టిన ఆందోళనలో జిల్లాధ్యక్షుడు, నగర ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ మాట్లాడారు. రాస్తారోకో చేస్తున్న బీజేపీ నేతలను, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని కరవే కార్యకర్తలు శుక్రవారం అధ్యక్షుడు వీరేష్ నేతృత్వంలో సింధనూరు బస్టాండ్ వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

తరగతులు కేటాయించరూ

రాయచూరు రూరల్: రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను కేటాయించాలని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లాధ్యక్షురాలు పద్మ డిమాండ్ చేశారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి మాట్లాడారు. అనంతరం రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్‌కు వినతిపత్రం సమర్పించారు. మంత్రి పాటిల్ స్పందిస్తూ ఈనెల 24న సీఎం సిద్దరామయ్యతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మహిళ అదృశ్యం



కల్పన(ఫైల్)

బళ్లారిఅర్బన్: కురుగోడు తాలూకా జకనిహాళ్ గ్రామానికి చెందిన ఎం.కల్పన అనే 24 ఏళ్ల వయస్సుగల మహిళ ఈనెల 17వ తేదీ నుంచి కనిపించకుండా పోయినట్లు పోలీసులకు ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. సుమారు 5 అడుగుల ఎత్తు, గుండ్రటి ముఖం, గోధుమ రంగు శరీరఛాయ, సాధారణ శరీరాకృతి కలిగిన ఈమె ఆచూకీ తెలిసిన వారు సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో లేదా 9480803010 నెంబరుకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

నీట్‌పై సీబీఐ విచారణ జరపాలి



మాట్లాడుతున్న మంత్రి శరణ ప్రకాష్ పాటిల్

రాయచూరు రూరల్: దేశ వ్యాప్తంగా నీట్ పరీక్షలో అక్రమాలు జరిగాయని, ఇందులో బడా నేతల హస్తముందని, నిష్పక్షపాతంగా సీబీఐతో విచారణ జరపాలని రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయంలో విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. నీట్ కేసులో ఎవరినో రక్షించడానికి కేంద్ర ప్రభుత్వం రాజకీయం చేయడం తగదన్నారు. 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ దాగి ఉందన్నారు. దేశ వ్యాప్తంగా నీట్‌లో జరిగిన అక్రమాలపై ఆందోళనలు జరుగుతున్నందున కేంద్రం స్పష్టమైన వివరణ ఇవ్వాలన్నారు. చేసిన తప్పును సరిదిద్దుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించినా కేంద్ర ప్రభుత్వం స్పందించక పోవడాన్ని మంత్రి తప్పుబట్టారు.

పంట నష్ట పరిహారంపై నివేదిక ఇవ్వండి

జిల్లాలో పంట నష్టం, రైతులకు పరిహారం చెల్లింపుపై నివేదిక అందించాలని రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్ అధికారులకు సూచనలు జారీ చేశారు. శుక్రవారం నగరంలోని జెడ్పీ భవనంలో జరిగిన జిల్లా స్థాయి అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అతివృష్టి, తాగునీరు, ఇతర అంశాలపై చర్చించారు. తుంగభద్ర ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములకు నీరందకుండా జరిగిన పంట నష్టాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు సర్కార్ అప్పగించిన పనులను సక్రమంగా చేయడం లేదని ప్రతినిధులు మంత్రికి ఫిర్యాదు చేశారు. రైతులకు నేటికీ పంట నష్ట పరిహారం అందలేదన్నారు. సమావేశంలో లోక్‌సభ సభ్యుడు కుమార నాయక్, నగర శాసన సభ్యుడు శివరాజ్ పాటిల్, గ్రామీణ శాసన సభ్యులు బసనగౌడ, సింధనూరు ఎమ్మెల్యే హంపన గౌడ, ఎమ్మెల్సీ వసంత కుమార్, జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండే తదితరులున్నారు.

అక్రమ దుకాణాల తొలగింపు

హుబ్లీ: కిమ్స్ ఆస్పత్రి వెనుక భాగంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ వద్ద రోడ్డుకు ఇరువైపుల 15కు పైగా వెలిసిన అక్రమ అంగళ్లను పాలికె అధికారులు శుక్రవారం తొలగించారు. ఈ అంగళ్ల వల్ల వాహనదారులు, సామాన్య ప్రజలు రాకపోకలకు ఇబ్బందికి గురయ్యే వారు. స్వచ్ఛందంగా తమ అంగళ్లను తొలగించాలని పలుసార్లు సూచించినా స్పందించక పోవడంతో తొలగింపు అనివార్యమైందని ఆ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ గిరి తళవార్ తెలిపారు. ఈ ప్రాంతంలో అత్యధికంగా వాహనాలు, అంబులెన్స్, పాదచారులు సంచరిస్తారు. భారీ ట్రాఫిక్ సమస్య ఏర్పడేది. ప్రజలు ఈ విషయమై పలు సార్లు ఫిర్యాదు చేశారు. దీంతో సంబంధిత అంగళ్ల వారు పాలికె పట్ల నిర్లక్ష్యంగా నడుచుకోవడంతో సీనియర్ ఆరోగ్య ఇన్‌స్పెక్టర్ రాజు కోలగొండతో కూడిన సిబ్బంది ఈ తొలగింపు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.

రామేశ్వరం రైలు సేవలు పొడిగింపు

హుబ్లీ: హుబ్లీ–రామేశ్వరం మధ్య సంచరించే వీక్లీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సంచార సేవలను డిసెంబర్ వరకు పొడిగించాలని నైరుతి రైల్వే నిర్ణయించింది. ఈ మేరకు ప్రస్తుతం ఉన్న సమయం, నిలుపుదల ఎప్పటిలానే కొనసాగనుంది. ఈ సేవల కొనసాగింపు గురించి నైరుతి రైల్వే సమర్పించిన ప్రతిపాదనకు రైల్వే మండలి అనుమతి ఇచ్చింది.

ఎట్టకేలకు కొత్త కార్యవర్గం కొలువు

- సిటీ కార్పొరేషన్ హస్తగతం
- మేయర్‌గా ముల్లంగి నందీష్
- ఉపమేయర్‌గా సుకుం



విజయచిహ్నం చూపుతున్న నూతనంగా ఎంపికైన మేయర్ నందీష్, ఉపమేయర్ సుకుం

సాక్షి,బళ్లారి: ఎట్టకేలకు మేయర్ ఎంపికను కాంగ్రెస్ పార్టీ నాయకులలు ఏకాభిప్రాయంతో పూర్తి చేశారు. నగర మేయర్ జనరల్ స్థానానికి రిజర్వ్ కావడంతో ముల్లంగి నందీష్, ప్రభంజన్‌కుమార్, వివేక్(విక్కీ), గాదెప్ప తీవ్ర పోటీ పడ్డారు. మేయర్ పదవి కోసం తీవ్ర పోటీ నెలకొనడంతో రెండు రోజులుగా కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు రంగంలోకి దిగి ఎమ్మెల్యేలు నాగేంద్ర, నారాభరత్‌రెడ్డి, ఎంపీలు నాసిర్‌హుస్సేన్, తుకారాం తదితరుల సమక్షంలో మేయర్ పదవి రేసులో ఉన్న కార్పొరేటర్లతో చర్చలు జరిపారు. దీంతో శుక్రవారం సిటీ కార్పొరేషన్ కార్యాలయంలో ముందుగా కాంగ్రెస్ పార్టీ నుంచి ముల్లంగి నందీష్, ప్రభంజన్‌కుమార్, గాదెప్ప, వివేక్‌లతో పాటు బీజేపీ తరపున మోత్కూరు శ్రీనివాసరెడ్డి నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పార్టీలో ఏకాభిప్రాయం కుదరడంతో ముగ్గురు నామినేషన్లు వెనక్కి తీసుకున్నారు. ఇక పోటీలో కాంగ్రెస్ పార్టీ తరపున ముల్లంగి నందీష్, బీజేపీ తరపున మోత్కూరు శ్రీనివాసరెడ్డి మాత్రమే పోటీ పడటంతో ఓటింగ్ నిర్వహించారు.

నందీష్‌కు 30 మంది సభ్యుల మద్దతు

కలబుర్గి నుంచి విచ్చేసిన ఎన్నికల ప్రాంతీయ అధికారి ఆధ్వర్యంలో మేయర్ ఎన్నిక జరిగింది. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన ముల్లంగి నందీష్‌కు 26 మంది కార్పొరేటర్లతో పాటు ఇద్దరు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు ఓటు వేయగా 30 మంది మద్దతు లభించింది. బీజేపీ తరపున పోటీ చేసిన మోత్కూరు శ్రీనివాసరెడ్డికి బీజేపీ కార్పొరేటర్లు 13 మందితో పాటు విధాన పరిషత్ సభ్యుడు ఒకరితో కలిపి 14 ఓట్లు లభించాయి. దీంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన ముల్లంగి నందీష్ నగర మేయర్‌గా, ఉపమేయర్‌గా సుకుం ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం నూతన పాలక వర్గం విలేకరులతో మాట్లాడుతూ నగరంలో మంచినీటి సమస్య, అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీలు, రోడ్ల సమస్యలను పరిష్కరించి నగరాభివృద్ధికి శక్తివంచన లేకుండా శ్రమిస్తామని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి నాగేంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్‌లో ఎలాంటి గ్రూపులు లేవన్నారు. ఉన్నది ఒకే గ్రూపు అన్నారు. ఏకాభిప్రాయంతో మేయర్ ఎంపిక జరిగిందన్నారు.

వివాదరహితంగా ఎంపిక

బెంగళూరు నుంచి విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు మాట్లాడుతూ నగర మేయర్ ఎంపికపై రెండు రోజులుగా కసరత్తు చేశామన్నారు. తమ పార్టీలో ప్రతిభావంతులు ఎక్కువగా ఉన్నారని, సహజంగానే పోటీ ఉంటుందన్నారు. అందరితో చర్చలు జరిపి కాంగ్రెస్‌లో ఎలాంటి గ్రూపులు లేకుండా కార్పొరేటర్ల అభిప్రాయాలు తీసుకుని సీఎం, డీసీఎంలకు నివేదిక పంపామన్నారు. వారి సూచన మేరకు నడుచుకుంటామని మేయర్ రేసులో ఉన్న కార్పొరేటర్లు సూచించారన్నారు. హైకమాండ్ నుంచి మేయర్‌గా నందీష్, ఉపమేయర్‌గా సుకుం పేరు సూచించడంతో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా సజావుగా మేయర్, ఉపమేయర్ ఎంపిక పూర్తి చేశామన్నారు. నూతన పాలక వర్గాన్ని ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు కార్పొరేటర్లు, నగర ప్రముఖులు అభినందించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

హుబ్లీ: ద్విచక్ర వాహనం, మొబైల్ చోరీ చేసిన నిందితుడిని గోకుల్‌రోడ్డు పోలీసులు అరెస్ట్ చేశారు. సునీల్‌కుమార్ కర్జగి అరెస్ట్ అయిన నిందితుడు. దివ్యాంగులు వాడే బైక్, నాలుగు మొబైల్ ఫోన్లు చోరీ చేసి పరారవుతుండగా పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. అతడి నుంచి ద్విచక్ర వాహనం, మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ-ఖాతా సమస్యకు త్వరలో పరిష్కారం



మాట్లాడుతున్న మంత్రి రహీంఖాన్

కోలారు : నగరసభ ఈ-ఖాతా సమస్యను త్వరలో పరిష్కరిస్తామని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి రహీం ఖాన్ తెలిపారు. శుక్రవారం నగరంలోని కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తల నుంచి సన్మానం స్వీకరించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీబీఎంపీ మినహాయించి నగరపాలక, నగరసభ, పురసభ వ్యాప్తిలోని అక్రమ కాలనీల్లో ప్లాన్ మంజూరు కాకుండా భవనాలు నిర్మించి సౌకర్యాలు పొందుతున్న యజమానులకు నిర్వహణ శుల్కం విధించాలని కేబినెట్‌లో తీర్మానించారన్నారు. మూడు నెలల్లోగా అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. రాష్ట్రంలో కార్యకర్తల శ్రమ వల్లనే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. కార్యకర్తలను గుర్తించి వారికి సముచిత స్థానం ఇస్తామన్నారు. అన్ని సముదాయాలను కలుపుకుని పోవడం కేవలం కాంగ్రెస్ పార్టీ వల్లనే సాధ్యమవుతుందన్నారు. ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ మాట్లాడుతూ కోలారు జిల్లా బెంగళూరుకు సమీపంలో ఉన్నా ఇంకా సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదన్నారు. ఎంతో అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి ఉందన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఊరుబాగిలు శ్రీనివాస్, నగర బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రసాద్ బాబు, జయదేవ్, యల్లప్ప పాల్గొన్నారు.

ముంగారు సాంస్కృతిక ఉత్సవాలు షురూ



మాట్లాడుతున్న మంత్రి శరణ ప్రకాష్ పాటిల్



చర్నాకోలుతో ఎద్దులను తోలుతున్న ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్



పోటీల్లో రాతిదూలాన్ని లాగుతున్న కర్ణాటక ఎద్దులు

రాయచూరు రూరల్: గ్రామీణ సంస్కృతిని మరపించేలా ముంగారు ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్, నగర ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ పేర్కొన్నారు. వారు శుక్రవారం నగరంలోని ఏపీఎంసీ ఆవరణలో మున్నూరు కాపు సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముంగారు ఉత్సవాల్లో భాగంగా కర్ణాటక ఎద్దులకు ఏర్పాటు చేసిన ఒకటిన్నర టన్నుల బరువుగల రాతి దూలం లాగే పోటీలను ప్రారంభించి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే, మున్నూరు కాపు సమాజం అధ్యక్షుడు పాపారెడ్డి ఆధ్వర్యంలో ఏరువాక పున్నమి సందర్భంగా జరిగే పోటీలు ప్రజలకు కనువిందు చేయడం హర్షణీయమన్నారు. రైతులకు మొదటి పండుగ ఏరువాక పున్నమి అన్నారు. కార్యక్రమంలో వీరభద్ర శివాచార్య, అభినవ రాచోటి శివాచార్య, సోమ శంభునాథ శివాచార్య, శాసన సభ్యులు బసనగౌడ, హంపనగౌడ, ఎమ్మెల్సీ వసంత కుమార్, మాజీ ఎమ్మెల్యే అమరేగౌడ బయ్యాపూర్, కాపు సమాజ నేతలు నరసారెడ్డి, బసవరాజరెడ్డి, తిమ్మారెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, క్రీడా సహాయ కార్యదర్శి పుల్లా రాజేంద్రరెడ్డి, వెంకటరెడ్డిలున్నారు.

ఇకపై పుష్కలంగా తాగునీరు

మాలూరు: పట్టణంలోని ఓవర్ హెడ్ ట్యాంకుకు పైప్‌లైన్ ద్వారా యరగోళ తాగునీటి పథకం నుంచి నీరు వస్తున్నందున ఇకపై ప్రతినిత్యం పట్టణ ప్రజలకు 3.2 దశలక్ష లీటర్ల తాగునీటిని అందిస్తామని ఎమ్మెల్యే కేవై నంజేగౌడ తెలిపారు. శుక్రవారం మారుతీ కాలనీలో నగర నీటి సరఫరా మండలి నుంచి రక్షిత తాగునీటి సరఫరా కోసం నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకుకు తాగునీటి సరఫరా కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. పట్టణ ప్రజలకు ఇదొక ప్రత్యేకమైన రోజన్నారు. యరగోళ తాగునీరు ద్వారా పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. యరగోళ తాగునీటి ప్రాజెక్టును 6 నెలల క్రితం ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రారంభించారన్నారు. సోమవారం నుంచి పట్టణంలోని 12 వార్డులకు మొదటి దశలో తాగునీటిని అందిస్తామన్నారు. పైప్‌లైన్ శుభ్రం కావాల్సి ఉన్నందున పట్టణ ప్రజలు మొదటి 15 రోజుల పాటు ఈ నీటిని గృహ అవసరాలకు వినియోగించుకుని అనంతరం తాగడానికి ఉపయోగించుకోవాలన్నారు. తహసీల్దార్ కె రమేష్, పురసభ సభ్యుడు ఇంతియాజ్ ఖాన్, ఎ రాజప్ప, తదితరులు ఉన్నారు.